# Telugu Prabandhala pai Shaddarsanaprabhavam

(1425-1590)

A Thesis submitted to the University of Hyderabad in fullfilment of the requirements for the award of

Doctor of Philosophy

in Telugu

By

**Pathivada Dhananjaya Rao**

Regd No. 16HTPH10

Under supervision of

**Prof. Sarath jyothsna rani**

**Department of Telugu**

**School of Humanities**

**University of Hyderabad**

**Hyderabad - 500046**

# తెలుగు ప్రబంధాల పై షడ్దర్శన ప్రభావం

**(1425- 1590)**

(హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు సమర్పించిన పరిశోధన గ్రంథం)


## పరిశోధకుడు

## పతివాడ ధనంజయ రావు

## 16HTPH1

## పర్యవేక్షకులు

## ప్రొ, శరత్ జ్యోత్స్నరాణి

## తెలుగుశాఖ

## మానవీయశాస్త్రాల విభాగం

## హైదరాబాదు విశ్వవిద్యాలయం

## హైదరాబాదు – 500046

# CERTIFICATE

This is to certify the Thesis entitled **“ Telugu prabandhalapi Shaddarsana prabhaavam”**submitted by **Mr Pathivada Dhananjaya Rao** bearing Regd No **16HTPH10** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

1. **“ Rayalavari yoga darsana pandityam**”(ISSN NO 2456 – 4702)vol, 18, ,August 2021.BHAAVA VEENA UGC Approval No : 42500
2. **“ Pothna bhagavatam lo Shaddarsanamsalu**” (ISSN NO: 2277-7881), vol.8. issue no.5(7) june 2019. International journal of multi disciplinary educational research.

**B. Presented papers& participated in the following conferences:**

1. **“TELUGU SAHITYA PRAKRIYALU ADHUNIKA BODHANA MULYANKANAM”** by the department of telugu,loyala college, vijayawada.
2. **“TELUGU BHASHA DINOTSAVA VEDUKALU”** by the littele flower degree college, hyderabad
3. **“ Neti Samajamlo yoga darsana aavasyakatha”** ( National seminar) by the Department of yoga, RSVP, Deemed University, Tirupathi

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his Ph. D, program.

| **Course** | **Code Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1.TL700 | Reseach Methodology | 4.00 | PASS |
| 2.TL701 | History of Telugu Reseah | 4.00 | PASS |
| 3.TL702 | Studies in specialized Area | 4.00 | PASS |
| 4.TL703 | Broad Field | 4.00 | PASS |

**Research supervisor** **Head, Telugu** **Dean, Humanities**

# కృతజ్ఞతలు

- చిన్ననాటి నుండి తెలుగు పట్ల నాలో అభినివేశాన్ని పెంచి, పరిశోధన స్థాయి వరకూ రావడానికి కారణమైన నా తలిదండ్రులు పతివాడ రామారావురామలక్ష్మిగార్లకు.....
- శాస్త్రిగారు పదవీవిరమణ చేసిన తర్వాత నన్ను నమ్మి, నా పరిశోధనను స్వీకరించి, అడగడుగున నాకు సహాయసహకారాలందించి, నేను పరిశోధనా గ్రంథాన్ని సకాలంలో పూర్తి చేయడానికి ముఖ్యకారకులైన ఆచార్య యస్. శరత్ జ్యోత్స్నారాణిగారికి.......
- దర్శనాల పట్ల నాకు అవగాహన కల్పించి, సంస్కృత భాషాసాహిత్యాల పైన నాకున్న సంకుచిత దృక్పథాన్ని మార్చిన మాగురువుగారు ఆచార్య రేమిల్ల రామకృష్ణశాస్త్రిగారికి.....
- తెలుగు భాషాసాహిత్యాలను నిరంతరం కొత్త కోణంలో నుండి చూస్తూ, విద్యార్థులకు అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలో చెప్తూ, విద్యార్థుల అభివృద్ధికి దోహదం చేస్తున్న దార్శనికులు, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వేంకటేశ్వరరావుగారికి......
- భాషాసాహిత్యాలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తూ, అధ్యయన ఫలితాలను తత్త్వదృష్టితో, సమయావగాహనతో విద్యార్థులకు అందిస్తున్న ఆచార్య అరుణకుమారి గారికి....
- తెలుగు పద్యసాహిత్యాన్ని నేటి కాలానికి అనువర్తిస్తూ, ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక ఆలోచనలతో ముడివేస్తూ, విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేస్తున్న ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి....
- సమాజ అభ్యున్నతికి రచనలు, విద్యార్థుల అభ్యున్నతికి బోధనలు చేస్తున్న ఎండ్లూరి సుధాకర్ గారికి....
- పరిశోధనారంగంలో నిరంతరం కృషిచేస్తున్న ఆచార్య గోనానాయక్ గారికి....
- నా ఉన్నతిని కాంక్షించి, నిరంతరం కుశల ప్రశ్నలు వేస్తూ, పరిశోధనా పరంగా, స్వీయవిషయాలలోనూ సమస్యలెదురైనపుడు అమూల్యమైన సలహాలందించిన, పితృతుల్యులు, నిరంతర అధ్యయనశీలి ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి....
- జానపదసాహిత్యం పట్ల, ద్రవిడ భాషల పట్ల నాకుండే దృక్కోణాన్ని మార్చి, భాషాసాహితీసమాజాల గురించి తల్లి వలె బోధించిన ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మిగారికి....
- డా, బాణాల భుజంగరెడ్డిగారికి, డా, విజయకుమారి గారికి....
- పరిశోధనలో నాకు అన్ని రకాలుగా సహకరించిన శ్రీమతి మధుమతికి.....

- పరిశోధనలో సహకరించిన సీనియర్లు గరికిపాటి గురజాడగారికి, కందుకూరి శ్రీధర్ గారికి, చైతన్యగారికి, కంకిపాటిరాజగారికి, లింగరాజు గారికి.....
- నా మిత్రులు పుష్పిణి, రవికుమార్, దయానంద్, నాని, రమేశ్, హేమంత్ లకు........
- పరిశోధనకు సహకరించిన హైదరాబాదు విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికి, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠగ్రంథాలయ సిబ్బందికి, ఆంధ్ర విశ్వవిద్యాలయగ్రంథాలయ సిబ్బందికి....
- పరిశోధన పూర్తి చేయడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా ...

**కృతజ్ఞతలు**

# ముందుమాట

మానవుడు సత్యాన్వేషి. అజ్ఞానం నుండి జ్ఞానం వైపు అతని ప్రయాణం కొనసాగుతున్నది. ఈ మార్గంలో సుఖాలు, దుఃఖాలు మిలితమై ఉన్నాయి. అయితే ఏది సుఖము? ఏది దుఃఖము? అనే ప్రశ్న మాత్రం నిరంతరం అతడిని వెన్నాడుతూనే ఉన్నది. క్షణికమైన అనుభూతి సుఖమా? శాస్వతమైన ఆనందం సుఖమా? సుఖము ఈ లోకమునకు మాత్రమే పరిమితమైనదా? అసలు వేరు లోకం ఉన్నదా? లేదా? అక్కడ సుఖదుఃఖాలు ఉన్నవా? అనాదిగా ఈ ప్రశ్నలు మానవుని మెదడును తొలుస్తూనే ఉన్నవి. వీటికి తగు సమాధానాల కోసం అతడు అన్వేషిస్తూనే ఉన్నాడు. ఈ అన్వేషణలో భాగంగా అనేక ఆవిష్కరణలు చేసాడు. ఇహలోక సుఖాలన్నింటినీ పొందాడు. లోకంలోని ప్రతివస్తువును తనకనుకూలంగా మార్చుకున్నాడు. ప్రతిజీవిని తన స్వార్థం కోసం వినియోగించుకున్నాడు. మొత్తం విశ్వాన్నే తన కనుసన్నలలో ఉంచుకున్నాడు. ఇన్ని చేసినా, ఎన్ని సాధించినా, తెలియని వెలితి అతనిలో ఉంటూనే వస్తున్నది. కొన్నాళ్లకు అతనికి వాస్తవం బోధపడింది. ఈ సుఖాలు శాస్వతమైనవి కావని, శాస్వతమైనదీ, చెక్కు చెదరనిదీ ఇంకేదో ఉన్నదని అతనికి అనిపించింది. అదియే దైవత్వం అని అతని భావన. ఆ రోజు నుండి అతని దైవాన్వేషణ ప్రారంభమైనది. దైవదర్శనం కోసం అతడు ఎన్నో త్యాగాలు చేశాడు. తపించాడు. మార్గాలను వెతికాడు. భగవత్ తత్వాన్ని ఊహించాడు. ఆరాధించాడు. భజించాడు. ఆఖరికి ఆ దైవము ఎక్కడో లేదని, తనలోనే కొలువై ఉన్నాడని తెలుసుకున్నాడు. తాను తెలుసుకున్న " దేవుడు నేనే" అను భావన ఆ నాటికి అతనికి అర్థమైనది. ఇదియే "తత్వమసి". ఇదియే " అహం బ్రహ్మాస్మి". ఈ మార్గాన్ని కనుగొనడం కోసం అతను చేసిన ప్రయత్నాలే దర్శనాలు. బుడిబుడి అడుగులు వేసే పిల్లవాడు మొదటిలో తడబడినట్లుగా తానుకూడా సాంఖ్యం, యోగము, కర్మకాండలు మొదలయిన అనేక మార్గాలలో ప్రయాణం చేసాడు. తర్వాత అవి శాస్వతమైనవి కావని, వాటిద్వార సిద్ధులు కలుగుతాయి కానీ, భగవత్తత్వం సిద్ధించదనీ తెలుసుకున్నాడు. ఇలా పలు మార్గాలలో ప్రయాణించి, ఆఖరికి వేదాంతమార్గం ద్వార భగవంతుని తెలుసుకోగలిగాడు. తనను తాను ఎరగగలిగాడు. కొన్నాళ్ళకు అతనికి తను సాధించిన విజయాన్ని, పొందిన సాక్షాత్కారాన్ని అందరితో పంచుకోవాలనిపించింది. తద్వార లోకానికి మేలు చేకూర్చాలనిపించింది. అనుకున్నదే తడువుగా తన భావనలను గ్రంథస్తం చేసాడు. అవే దర్శనాలుగా పరిణమించాయి. అయితే ఉత్తరమీమాంస మాత్రం ఒకరి చేత రాయబడినది కాదు. అది అనాదిగా వస్తున్న ఒక సంప్రదాయం. వేదభాగం. దానికి వెలువడిన వ్యాఖ్యలు మాత్రం మానవకృతాలే. ఈ దర్శనాలు వట్టి భ్రమలనీ, అందలి విషయాలు కేవల

కల్పితాలనీ కొందరి అభిప్రాయం. ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నప్పటికీ మనపూర్వులు మాత్రం వీటినే ప్రమాణాలుగా స్వీకరించారు. దర్శనాలు చూపించిన మార్గంలోనే నడిచారు. విద్యాగంథం లేనివారు చదువు ఉన్న వారి దగ్గరి నుండి వీటిని విని తరించేవారు. ప్రాచీన కవులందరూ తమ గ్రంథాలలో దర్శన విషయాలను ప్రస్తావించారు. కాళిదాసు రఘువంశం, భారవి కిరాతార్జునీయం, మాఘుని శిషుపాలవధ, భాసుని నాటకాలు ఇలా సంస్కృతసాహిత్యమంతా దర్శన భూయిష్టమై ఉన్నది. తెలుగు సాహిత్యం కూడా ఇదే ఒరవడిలో నడిచింది. కవిత్రయం వారు అనేక చోట్ల భగవత్తత్వాన్ని దర్శనకోణంలో నుండి చూసారు. సభలోని వాదనలను ప్రస్తావించినపుడు, భగవంతుని వర్ణించునపుడు, యోగులను పరిచయం చేయునపుడు ఇలా అనేక తావులలో దర్శనాంశాలను వీరు ప్రస్తావించారు. శివకవుల సాహిత్యమంతా అద్వైతమతం తో నిండిపోయింది. పోతన తన భాగవతంలో కపిలుని సాంఖ్యాన్ని వివరించాడు. శ్రీనాథునికి దర్శనాలపైన విపరీతమైన పట్టు ఉన్నది. కాశీఖండం, భీమఖండం మొదలైన గ్రంథాలలో ఇది కనిపిస్తున్నది. అన్నమయ్య సాహిత్యమంతా విశిష్టాద్వైతమత సువాసనలతో పరిమళిస్తున్నది. రాయలవారి యుగంలో కవులు ఈ దర్శనాలకు పెద్దపీట వేశారు. రాయలవారి సభలలో జరిగే వాదోపవాదాలు, చర్చలు, స్వపక్షస్థాపనలు, పరపక్ష ఖండనలు ఇందుకు కారణం కావచ్చును. రాయలవారు యోగశాస్త్ర విషయాలను, న్యాయదర్శన విషయాలను తమ గ్రంథంలో కథకు ప్రాధాన్యతనిస్తూ చెప్పారు. సూరన పతంజలి యోగదర్శనాన్ని తనదైన శైలిలో చెప్పాడు. తెనాలి రామలింగడు అనేక సార్లు " షడ్దర్శనాలు" అనే పదాన్ని వినియోగించాడు. ధూర్జటి తనదైన కోణంలో ఖండన మండనలు చేశాడు. ఇలా ప్రబంధసాహిత్యమంతా దర్శనాలకు నిలయమై, సందర్భపరిపుష్టితో అలరారుతున్నది. అందుకే "రాయలయుగంలోని ప్రబంధాలపై దర్శన ప్రభావం" అనే అంశాన్ని నా పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను. కృతకృత్యత సాధించడానికి ఎంతగానో ప్రయత్నించాను. దర్శన విషయాలు గహనమైనవి. అంతు చిక్కనివి. లోతుగా అధ్యయనం చేస్తే గాని వంటపట్టనివి. అందుకే వీటి అధ్యయనానికి చాల కాలం పట్టింది. దర్శనాలకు సంబంధించిన గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉంటాయి. అదీ కొరుకుడు పడని సంస్కృతం. ఈ విషయంలో నాకు నా డిగ్రీ చదువు ఎంతగానో సహకరించింది. నేను 5 సంవత్సరాలు విద్యాపీఠంలో కేవలం సంస్కృతమే చదివాను. అందువల్లనే సంస్కృత గ్రంథాలను చదవగలిగాను. అర్థం చేసుకోగలిగాను. విషయాన్ని గ్రహించగలిగాను. సంస్కృతం రానివారు ఈ అంశంపై పట్టు సాధించడం గగనపుష్పమే అని నా నిశ్చితాభిప్రాయం. ఇక పరిశోధనగ్రంథ విషయానికొస్తే గ్రంథంలోని మొదటి అధ్యాయంలో దర్శన విషయాలను క్లుప్తంగా

చెప్పాను. ఏ విషయాలైతే ప్రబంధకవులు ప్రస్తావన చేసారో వాటిని మాత్రమే దర్శనాల పరిచయంలో చెప్పాను. దీనివల్ల పాఠకుడు తనకున్న నామమాత్ర పరిచయంతోనే గ్రంథాన్ని అర్థం చేసుకోగలడు. తర్వాత వరుసగా కాలానుగుణంగా ఒక్కోదర్శనాన్ని తీసుకుని, దానిపైన దర్శన ప్రభావాన్ని వివరించాను. మొదట దర్శనాల వారీగా ప్రభావాన్ని చూపించాలని భావించాను. కాని అది కలగాయి కూరలాగ కలగపులగంగా అవుతుందని అనిపించింది. అందుకే ప్రబంధాలవారీగా దర్శన ప్రభావాన్ని వివరించాను. ఇదే సమంజసమైనదనీ ఆచార్యులు కూడా వత్తాసు పలికారు. ప్రబంధాల విషయంలోనూ, రాయలవారి ఆస్థానంలోని కవుల విషయంలోనూ పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. అయితే చాల మంది పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయంతోనే ఏకీభవిస్తారు. నేను కూడా వారినే అనుసరించాను. కాలం విషయంలోనూ వారి గ్రంథమే నాకు ప్రమాణం. ప్రబంధాలెన్ని అనే విషయంలోనూ భిన్నాభిప్రాయాలుండడం వలన, వివాదాలకు తావుండకూడదని 9 ప్రబంధాలను స్వీకరించాను. వాటన్నింటినీ దర్శనాల కోణం లోనుండి చదివాను. దర్శనాంశాలను ఒక దగ్గర రాశాను. కవి ఏ ఉద్దేశంతో అక్కడ దర్శనాంశాలను ప్రస్తావించాడో, తద్వార సందర్భాన్ని ఎలా రక్తి కట్టించాడో వివరించాను. దర్శనముల మీద పట్టున్న పలువురికి నా రాతలను చూపించి, వారి విలువైన అభిప్రాయాలను కూడా తీసుకున్నాను. ఆ స్ఫూర్తితో చేయదగ్గ మార్పులు, చేర్పులు కూడా చేసాను.  ఇక్కడితో నా చేయదగ్గ పని పూర్తయిందని భావన చేస్తూ ఐదు పది చేస్తున్నాను

**ధన్యవాదాలు**

## విషయసూచిక


| | |
|---|---|
| **1. షడ్దర్శనములు – పరిచయం** | **18–23** |
| 1.1 వైశేషిక దర్శనం – పరిచయం | 24 |
| 1.2 సాంఖ్యం | 29 |
| 1.3 న్యాయదర్శనం | 35 |
| 1.4 యోగదర్శనం | 46 |
| 1.5 పూర్వమీమాంస | 51 |
| 1.6 ఉత్తరమీమాంసదర్శనం | 57 |
| **2. మనుచరిత్ర – దర్శన ప్రభావం** | **81** |
| 2.1 మంగళాది పద్యం – విశిష్టాద్వైత ప్రతిపాదన | 81 |
| 2.2 న్యాయదర్శనం – సమానధర్మోపపత్తి | 82 |
| 2.3 ఉపనిషత్ప్రస్తావన | 83 |
| 2.4 వర్ణవ్యవస్థ | 83 |
| 2.5 వివిధాధ్వరనిర్మలధర్మకర్మలు | 84 |
| 2.6 వైరాగ్యం | 85 |
| 2.7 షట్ సంపత్తులు | 85 |
| 2.8 సన్యాసాశ్రమం | 85 |
| 2.9 గృహస్థాశ్రమం | 87 |
| 2.10 ప్రవరుడు – అనుష్టానాలు | 88 |
| 2.11 మిథ్యాజ్ఞానబోధ | 89 |
| 2.12 బ్రహ్మవిద్య | 90 |
| 2.13 ఆనందోబ్రహ్మ – ఉపనిషద్వాక్యం | 90 |
| 2.14 యోగం – నియమం, తపస్సు | 91 |
| 2.15 వర్ణత్రయం | 92 |

2.16 జాతకర్మ 93

2.17 ధ్యానం, యోగితత్వం 94

2.18 యోగం, యమాలు 95

2.19 ప్రాణాయామం 95

2.20 భగవంతుడు – సర్వవ్యాపకత్వం 96

**3. కళాపూర్ణోదయం – దర్శన ప్రభావం 98–107**

3.1 వేదములు 98

3.2 విశిష్టాద్వైతమతస్థాపన 99

3.3 చాతుర్వర్ణవ్యవస్థ 99

3.4 త్రిగుణాలు 101

3.5 షట్ సంపత్తులు 101

3.6 యమము 101

3.7 తపస్సు 102

3.8 కపిలమహర్షి 102

3.9 కర్మవాసన 103

3.10 బ్రహ్మవిదులు 103

3.11 పరమతమును అంగీకరించకుండుట 104

3.12 కర్మసిద్ధాంతం 105

3.13 బ్రహ్మచర్యం, తపస్సు, వైరాగ్యం 105

3.14 పంచభూతాలు 106

3.15 సంయమం 107

3.16 నామసంకీర్తన 107

3.17 పద్మాసనం ` 108

3.18 మంత్రములు 108

3.19 యోగితత్వం 109

3.20 రాగం 110

3.21 జితేంద్రియత్వం 110

3.22 యమనియమాలు 110

3.23 దర్శనకారుల ప్రస్తావన 111

3.24 శృతులు, స్మృతులు 112

3.25 ప్రకృతి – పురుషులు 112

3.26 చతుర్వేదాలు 113

3.27 బ్రహ్మచర్యం, ఉదాత్తాది భేదాలు 114

3.28 వేదాంతశాస్త్రం, యోగశాస్త్రం 114

3.29 జితేంద్రియత్వం, అష్టాంగయోగములు 115

3.30 జీవాత్మ, పరమాత్మ 116

3.31 బ్రహ్మచర్యం 117

3.32 ప్రాణాయామం 118

3.33 ఆసనోపయోగములు 119

3.34 షట్కర్మలు 119

3.35 పంచభూతములు 120

3.36 ప్రణవం 120

3.37 ప్రత్యాహారం 121

3.38 ధారణ 122

3.39 ధ్యానం 122

3.40 సమాధి 123

3.41 ఓంకారం 123

3.42 పూర్వజన్మ 124

3.43 బ్రహ్మతత్వం 124

3.44 దర్శనములు – విమర్శ 125

**4. పాండురంగమాహాత్మ్యం – షడ్దర్శన ప్రభావం 127**

4.1 విశిష్టాద్వైతం 127

4.2 షడ్దర్శనములు 128

4.3 పంచ సంస్కారములు 128

4.4 శమసంపద 129

4.5 చాతుర్వర్ణాలు 129

4.6 తారకబ్రహ్మవిద్య 130

4.7 బ్రహ్మచర్యం 131

4.8 కణాదుడు 131

4.9 హోమధూమం 131

4.10 సత్వగుణం 132

4.11 తాపత్రయాలు 132

4.12 తపము 133

4.13 యోగరహస్యాలు 133

4.14 కుండలినీయోగము 134

4.15 హఠయోగము, రాజయోగము 134

4.16 నాస్తికుడు 135

4.17 యోగీంద్రుడు 135

4.18 సమాధి 136

4.19 పితౄణం 136

4.20 యోగసిద్ధులు 137

4.21 ఉత్పత్తి, స్థితి, విలయం 137

4.22 అధ్యాత్మవాసన 138

4.23 హ్రీంకారం 138

4.24 ఇహపరాలు 139

4.25 పురుషార్థాలు 139

4.26 తపస్సు 139

4.27 క్లేశాలు 140

4.28 బ్రహ్మవిద్య 140

4.29 దమనిధి 141

4.30 త్రిగుణాలు 141

4.31 సంధ్య, హోమం 142

4.32 పూర్వజన్మ 142

4.33 కైవల్యం 142

4.34 ప్రణవం 143

4.35 పదార్థానుమానము 143

4.36 వైశేషికం – పరమాణుతత్వం 144

4.37 ఆసనాలు 144

4.38 సహస్రారం 145

4.39 వైరాగ్యం 145

4.40 గోచరబ్రహ్మము 146

4.41 బ్రహ్మచర్యం 146

4.42 గృహస్థాశ్రమం 147

4.43 షడ్దర్శనాలు 148

**5. రామాభ్యుదయం – షడ్దర్శనాల ప్రభావం 149**

5.1 విశిష్టాద్వైతం 149

5.2 వాదములు 150

5.3 జగత్రయం 150

5.4 తపస్సు 151

5.5 ధ్యానం 151

5.6 చాతుర్వర్ణవ్యవస్థ 152

5.7 యత్ర ధూమస్తత్రాగ్ని 153

5.8 యోగిచందం 154

5.9 ఆత్మవిద్య 154

5.10 కర్మసిద్ధాంతం 155

5.11 అహింస 156

5.12 అగ్నిసంస్కారం 156

5.13 పున్నామనరకం 157

5.14 శృతియోగ్యశబ్దములు 157

5.15 ఆసనం – సమాధి 158

5.16 సంయమం 159

5.17 యజ్ఞం, హోమాగ్ని 160

5.18 తాపత్రయాలు 161

5.19 పూర్వజన్మ 161

5.20 గుణత్రయం 162

5.21 జాతకర్మ, సంస్కారాలు 163

5.22 వేదాంతవేద్యుడు 163

5.23 శమదమాలు 163

**6. పారిజాతాపహరణం – షడ్దర్శన ప్రభావం 164**

6.1 విశిష్టాద్వైతం 164

6.2 మాయ 164

6.3 సంయమం 166

6.4 జగత్రయం 166

6.5 పూర్వజన్మ 166

6.6 స్వర్గలోకం 167

6.7 కామరూపధారులు 167

6.8 వేదములు 168

6.9 ఉపనిషత్తులు 169

**7. ఆముక్తమాల్యద – షడ్దర్శన ప్రభావం** 171

7.1 సమన్వయం 171

**7.2** విశిష్టాద్వైతం వడగలై – తెంగలై శాఖలు 176

7.3 ఆముక్తమాల్యద – యోగదర్శన ప్రభావం 176

7.4 న్యాయశాస్త్రం – తద్దూషణ, పరమత స్థాపనములు 180

7.5 దర్శనఖండన 181

7.6 అవిద్య 182

**8. శ్రీకాళహస్తిమాహాత్మ్యం – షడ్దర్శన ప్రభావం** 184

8.1 బ్రహ్మవిద్య 184

8.2 సన్యాసిభేధములు 185

8.3 సృష్టి, స్థితి, లయలు 186

8.4 అద్వైతం 186

8.5 నాదబిందుకళలు 187

8.6 త్రిగుణాలు 187

8.7 మాయ 188

8.8 యోగాసనాలు 188

8.9 బ్రహ్మార్పణం 189

8.10 రాజయోగములు 191

8.11 ఓంకారం 191

8.12 జీవన్ముక్తి 192

8.13 బ్రహ్మతేజం 192

8.14 పంచావయవములు 193

8.15 24 తత్త్వాలు 193

8.16 అహంబ్రహ్మాస్మి 195

8.17 అష్టసిద్ధులు 196

8.18 సమాధి 196

8.19 తపము 197

8.20 పంచక్లేశాలు 197

8.21 సంయమం 198

8.22 దండకం – భగవత్తత్వం 198

8.23 నామకరణం 200

8.24 పూర్వజన్మ 200

8.25 దర్శనముల ప్రస్తావన 201

8.26 యోగం – హఠయోగం, రాజయోగం, కుండలనీయోగం 202

8.27 ఉపనిషత్తులు 202

8.28 త్రిపుండ్రములు 203

8.29 జగన్మిథ్య 204

8.30 జీవాత్మ – పరమాత్మ 205

8.31 ముక్తిబేధాలు 205

8.32 ఉభయకర్మలు 206

8.33 షడ్దర్శనములు 206

8,34 ద్వైతమతఖండన 207

8.35 తాపత్రయాలు 207

9. ప్రభావతీప్రద్యుమ్నం – షడ్దర్శన ప్రభావం 209

9.1 గౌతముడు 209

9.2 యజ్ఞం 210

9.3 భూతపంచకం 212

9.4 వేదాలు 213

9.5 శ్రౌతస్మార్తకర్మలు 213

9.6 షడ్దర్శనాలు 214

9.7 ప్రాణవాయువులు 214

9.8 గర్భాదానం 215

**10. వసుచరిత్ర – షడ్దర్శనప్రభావం** **216**

10.1 విశిష్టాద్వైతం 216

10.2 రామానుజత్వం 216

10.3 చాతుర్వర్ణాలు 218

10.4 తపస్సు 220

10.5 ఆనందోబ్రహ్మ 220

10.6 అద్వైతం 221

10.7. కావ్యములపై దర్శన ప్రభావం అధ్యయన ప్రయోజనాలు 222

10.8. ఉపసంహారం 224

10.9 ఉపయుక్త గ్రంథసూచి 226

## 1.0 పరిచయం

ప్రపంచంలో మనుషులు సుఖమును ఆశిస్తూ, దుఃఖాన్ని ద్వేషిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ జీవనవిధానం అత్యంత పురాతన కాలం నుండి కొనసాగుతుంది. కాబట్టి అందరూ దుఃఖాన్ని నివృత్తి చేసుకోవాలని ప్రయత్నం చేస్తారు. దుఃఖనివృత్తి రెండు విధములు. 1. వచ్చిన దుఃఖము పోగొట్టుకొనుట. 2. దుఃఖం రాకుండ చూసుకొనుట. ప్రాప్తించిన దుఃఖము అనుభవం చేతనే నశించును. కాబట్టి దుఃఖం రాకుండ చూసుకోవడమే వేత్తల ముఖ్యకర్తవ్యం. దుఃఖకారణమేదో బాగా తెలుసుకొని దానిని నశింపచేసినచో దుఃఖం రానేరదు. అందువలన ముందుగ దుఃఖానికి కారణమేదో తెలుసుకోవలసి ఉన్నది. పరిశీలించి చూస్తే సుఖదాయినిగా కనిపించే సంసారమే దుఃఖకారణం. కొన్ని పదార్థాలు తొలుత సుఖస్థానాలుగా కనిపిస్తాయి. పరికించినచో అవే దుఃఖకారణాలవుతున్నాయి. భార్య పుత్రాదులు సుఖసాధనాలని అందరూ అనుకుంటారు. ఆలోచించి చూస్తే అవే దుఃఖకారణములు. ఎలా అంటే కుటుంబంలో ఎవరికైన బాధ కలిగినపుడు లేదా హానికలిగినపుడు యజమానికి దుర్భరమగు దుఃఖము కలుగును. అది అనుభవైకవేద్యము. భోజనసమయం లో రుచికరమైన ఆహార పదార్థాలు సుఖకారణములుగా కనబడుతున్నవి. కాని అవే పరిణామదశలో విషపరిణామాన్ని పొంది రోగకారణములయి దీర్ఘకాలం దుఃఖకరములవుతున్నాయి. కాబట్టి ఈ ప్రపంచమంతా దుఃఖకారణమని తేలినది. అందుకే వేత్తలయినవారు ప్రపంచాన్ని తొలగించుటకయి విశేష ప్రయత్నాన్ని చేస్తున్నారు. కాగ ఈ ప్రపంచమే బంధమని, తన్నివృత్తియే మోక్షమని సామాన్యంగా చెప్పవచ్చును. వివేకులు తమ బంధమోక్షములను తొలగించుకునే క్రమంలో, సాగించిన సాధనలో లోకానికి మేలు చేసే కొన్ని నియమాలను, సిద్ధాంతాలను చెప్పారు. అవే దర్శనాలుగా తర్వాతి కాలంలో ప్రచారం పొందాయి.

### దర్శన స్వరూపము

ధర్మార్థకామమోక్షములలో మోక్షము ఉన్నతమైన పురుషార్థము. మోక్షాన్ని పొందడానికి మునులు వేరు వేరు మార్గాలను సూచించారు. వారు సూచించిన మార్గములే దర్శనములు గాను, వారినే దర్శనకర్తలగాను చెప్తారు. కాబట్టి సంసార మూలకారణనాశకజ్ఞానసాధనము దర్శనమనబడును. ఆ విద్యను ప్రతిపాదించు గ్రంథము కూడ దర్శనమనబడుతున్నది.

## దర్శన విభాగము

దర్శనకర్తల్లో కొందరు బుద్ధిబలంతో తమంతట తామే సంసారమూలాన్ని గ్రహించగలమని నమ్మారు. వారే నాస్తికులనబడుతున్నారు. వారిచేత రాయబడిన గ్రంథములే నాస్తికదర్శనములు. మరి కొందరు పురుషుని బుద్ధి సరైనది కాదని, అది ప్రమదాదిదోషభూయిష్టమని, అలాంటి బుద్ధితో ఊహించేది సత్యం కానేరదని తేల్చారు. వారే ఆస్తికులు. వీరు అత్యంత ప్రాచీనమూ, ప్రామాణికమూ ఐన వేదములను ప్రమాణములుగా అంగీకరిస్తారు. నాస్తికులు వేదాన్ని ప్రమాణంగా అంగీకరించరు. కొందరు ఈశ్వరుడు లేడు అన్నవారిని నాస్తికులుగాను, ఈశ్వరుడు ఉన్నాడు అన్నవారిని ఆస్తికులుగాని ఎంచుతున్నారు. ఇది సరైన వ్యవహారము కాదు. జైనులు మొదలైన వారు ఈశ్వరుడున్నట్లు అంగీకరిస్తారు. అంత మాత్రం చేత వారిని ఆస్తికులుగా పరిగణింపరు. కపిల, కణాద, జైమిని దర్శనములు ఈశ్వరుని అంగీకరించవు. ఐనప్పటికీ వాటిని ఆస్తిక దర్శనాలుగానే ఆర్యులు పరిగణిస్తున్నారు. కనుక వేదప్రామాణ్యాన్ని అంగీకరించడమే ఆస్తికత్వం. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించకపోవడమే నాస్తికత్వం. వేదప్రామాణ్యాన్ని అంగీకరించని వారిచే రచింపబడ్డవి నాస్తికదర్శనములు.

### దర్శన విభాగములు

దర్శనములు రెండు విధములు

అవి నాస్తిక దర్శనములు,ఆస్తిక దర్శనములు

### ఆస్తికదర్శనములు

1. వైశేషికము
2. న్యాయము
3. సాంఖ్యము
4. యోగము
5. పూర్వమీమాంస
6. ఉత్తరమీమాంస

**నాస్తిక దర్శనములు**

1. చార్వాకదర్శనము

2. బౌద్ధదర్శనము

3. జైనదర్శనము

4. అర్హతదర్శనము

5. దిగంబరదర్శనము

6. సౌమదర్శనం

ఈ ఆరు వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని వారితో రాయబడ్డాయి. నాస్తికదర్శనాన్ని గురించి కొంత తర్కిద్దాం. చార్వాక బౌద్ధములు దేహమే ఆత్మ అని నిరూపిస్తున్నాయి. దేహాతిరిక్తమయిన ఆత్మ వీరిమతములో లేదు. పురుషునికి పుణ్యపాప సంబంధం లేదు. జన్మాంతరం లేదు. కనుకనే పరలోకం లేదు. అని ఈ దర్శనాలు బోధిస్తాయి.

"ప్రత్యక్షమేకం ప్రమాణం" అని చార్వాకం చెప్తున్నది. కాబట్టి జ్ఞానాతిరిక్తంగా బాహ్యాంతర ప్రపంచాలు లేవు. పరిపాలకుడే ఈశ్వరుడు. కష్టపడుటయే నరకం. ఇబ్బంది పడకుండా సుఖంగా జీవించడమే స్వర్గం అని భావిస్తారు వీరు. పంచభూతాలలో ఆకాశాన్ని వీరు అంతగా పరిగణించరు. అంగనాలింగనాజన్యమైన సుఖము ఇక్కడ పురుషార్థము. ఇది చార్వాక సిద్ధాంతం. బౌద్ధులు ప్రత్యక్షం, అనుమానం, అను రెండు ప్రమాణాలను అంగీకరిస్తారు. బుద్ధుడు "స్వర్గం క్షణికం క్షణికం" సర్వం శూన్యం శూన్యం" "సర్వం దుఃఖం దుఃఖం" "సర్వం స్వలక్షణమ్ స్వలక్షణమ్"అని ఉపదేశించెను. బౌద్ధులు నాలుగు విధాలుగా పరిగణింపబడుతున్నారు.

1 మాధ్యమికుడు – సర్వ శూన్యత్వవాది

2 యోగాచార్యుడు – బాహ్య శూన్యత్వవాది

3 సౌత్రాంతికుడు – బాహ్యార్థానుమేయత్వవాది

4 వైభాషికుడు – బాహ్యార్థ ప్రత్యక్షవాది

జైనులు ఇలా చెప్తారు. ఆత్మ దేహాతిరిక్తము. కాని దేహమాత్ర పరిమిత కర్మ పాశబద్ధమై ఆత్మసంసారమగ్నమై యుండును. జినదేవుని ఉపాసించినట్లయితే క్రమంగా కర్మబంధం తొలగి ఆత్మ ఈ లోకాన్ని విడచి, ఊర్ధ్వదేశమునకు పోవును. ఇలా పోవడమే ముక్తి. ఆర్హత దిగంబరులు కూడా ఇలాగే చెప్తారు. ప్రపంచతత్వనిరూపణమున "స్యాద్యనము" మొదలయిన పద్ధతులతో కొన్ని అవాంతరబేధములు కలవు. సౌమదర్శనం ఇలా చెప్తున్నది. భైరవపూజకంగా జంతుబలి సమర్పణం చేయాలి. మద్యమాంసాలు సేవించాలి. ఇలా హింసకు సంబంధించిన కృత్యములాచరించుట వలన జన్మాంతరంలో శివ సారూప్యమైన ముక్తి కలుగును. నాస్తిక దర్శనాలలో ఈ దర్శనం తప్ప మిగిలిన ఐదు దర్శనాలు కూడా అహింసయే పరమధర్మమని బోధించినవి. ఇది నాస్తిక దర్శనాలకు సంబంధించిన విహంగ వీక్షణం.

## దర్శనాల సాజాత్యం

న్యాయవైశేషికాలు ఒక తెగకు చెందిన దర్శనాలు. ఈ రెండును ఆరంభవాదమును బోధిస్తున్నాయి. ఆయా పరమాణువులచే ద్వ్యనుకాది క్రమంలో అంతకుముందు లేని ఘటాదికం కొత్తగా ఆరంభింపబడుతున్నదని వీటి ఆశయము. దీనినే అసత్కార్యవాదమంటారు. అంటే కారణ వ్యాపారానికి పూర్వం కార్యం అసత్తే. అంటే ఈ రెండు దర్శనాలకు మధ్య అవాంతర బేధాలున్నాయి. కాని పయివిధంగా చెప్పినట్లు ఆరంభవాదాన్ని మాత్రం అంగీకరిస్తున్నాయి. సాంఖ్యయోగాలు రెండు ఒక తెగకు చెందిన దర్శనాలు. ఈ దర్శనాలు పరిణామవాదాన్ని తెలుపుతున్నాయి. క్షీరం దధిరూపంగా పరిణమించినట్లు మృత్తు ఘటరూపంగా పరిణమిస్తుంది. దీనినే అసత్కార్యవాదం అంటారు. అంటే కారణవ్యాపారానికి పూర్వం కార్యం సత్తే. ఉత్తరమీమాంస దర్శనంలో అద్వైతం చెప్పబడింది. దీనిని అంగీకరించువారు వివర్తవాదులు. వీరు కూడా అసత్కార్యవాదులే. పూర్వోత్తరమీమాంసలు సాక్షాత్తుగా వేదార్థాలను విమర్శించి నిశ్చయిస్తున్నాయి. ఈయారు ఆస్తికదర్శనాలలో వైశేషిక, సాంఖ్య, పూర్వమీమాంస దర్శనాలు నిరీశ్వరములు. న్యాయయోగోత్తరమీమాంస దర్శనాలు సేశ్వరాలు. వీటిలో న్యాయయోగాలు ఈశ్వరుడు నిమిత్త కారణం అని చెపుతున్నాయి. ఈ వాదాన్ని ఉత్తరమీమాంస దర్శనం ఖండిస్తున్నది. ఈశ్వరుడుపాదాన కారణము నిమిత్తకారణం గూడనగునని ఈ దర్శనం చెపుతున్నది. కణాద, గోతమ, కపిల, పతంజలి, జైమిని దర్శనాలు ఆత్మ బహుత్వాన్ని ప్రతిపాదిస్తుండగా, జగత్తుకు సత్యత్వాన్ని అంగీకరిస్తుండగా ఒక్క వ్యాసదర్శనం మాత్రం ఆత్మైకత్వాన్ని, జగన్మిథ్యతత్వాన్ని చెపుతున్నది.

## దర్శనాలు సూత్రరూపాలు

కణాదాది మునుల చేత ఈ దర్శనాలు సూత్రరూపంలో రాయబడినాయి. వారు లోకానుగ్రహంచేత తాము గ్రహించిన తత్త్వాలకు గ్రంథరూపాన్ని ఇచ్చారు. విపులమైన పదార్థజాతాన్ని సంగ్రహంగా చూపినట్లయితే అది ధారణయోగ్యం అవుతున్నది. ఇలాంటి వాటిని సూత్రాలు అంటారు.

**"అల్పాక్షరమసందిగ్ధం సారవద్విశ్వతోముఖం**

**అస్తోబమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః" ల సి కౌ 1-17**

అని సూత్ర లక్షణాన్ని ఈశ్వరచంద్రులు చెప్పారు.

### భాష్యాలు

సూత్రరూపంలో ఉన్న దర్శనాలకు ప్రశస్తపాద, వాత్స్యాయన, వ్యాస, శబర, శంకరాచార్య ప్రభృతులు భాష్యములను రాశారు. భాష్యాలు లేకపోతే సూత్రార్థము తెలియదు. సూత్రకర్తల ఆశయాలను మరింత స్పష్టంగా భాష్యకారులు చెప్తారు. సూత్రస్థమైన పదాన్ని తీసుకుని సూత్రానుసారంగా వాక్యజాతాన్ని చూపి వ్యాఖ్యానిస్తారు. ఆ సమయంలో తాము ప్రయోగించిన పదాలకు కూడా అర్థవిచారం చేస్తారు. మల్లినాథాదుల వ్యాఖ్యానాలు ఇలాంటివి కావు. అవి మూలానికి అర్థనిర్ణయం చేయవు. అందు తాము ప్రయోగించిన పదాలకు అర్థనిర్ణయం చేస్తాయి.

## వార్తికములు

భాష్యాలు గంభీరమైన శైలిలో ఉంటాయి. అవి సులభగ్రాహ్యాలు కావు. అందుచేత పై భాష్యాలకు జగధీశ, ఉద్యోతన, విజ్ఞానభిక్షు, కుమారిలభట్టు, భట్టనారయణసరస్వతి ప్రభృతులు వార్తిక గ్రంథాలను రాశారు. విజ్ఞానభిక్షువు సాంఖ్యయోగభాష్య ద్వయానికి వార్తికాన్ని వ్రాసెను. మూలమునందు ఉక్తానుక్తదురుక్తములను వ్యక్తీకరించు గ్రంథము వార్తికమనబడును. మూలం యొక్క అర్థాన్ని వ్యక్తపరుస్తూ మూలంలో చెప్పబడిన అర్థాన్ని కూడ వార్తికం చెప్తుంది. మూలంలో దోషాన్ని కూడా చెపుతుంది. మూడంశాలు సర్వత్ర ఉండాలనే నియమం లేదు.

**"ఉక్తానుక్త దురుక్త చిన్తాకారితు వార్తికం" కా 4-1**

| దర్శనములు | సూత్రకర్త | భాష్యకర్త | వార్తికకర్త |
|---|---|---|---|
| 1. వైశేషికము | కణాదుడు | ప్రసస్తపాదుడు | జగదీశుడు |
| 2. న్యాయము | గోతముడు | వాత్సాయనుడు | ఉద్యోతనుడు |
| 3. సాంఖ్యం | ఈశ్వరక్రుష్ణుడు | గౌడపాదుడు | విజ్ఞానభిక్షువు |
| 4. యోగం | పతంజలి | వ్యాసుడు | విజ్ఞానభిక్షువు |
| 5. పూర్వమీమాంస | జైమిని | శబరస్వామి | కుమారిలభట్టు |
| 6. ఉత్తరమీమాంస | వ్యాసుడు | శంకరాచార్యులు | నారాయణ సరస్వతి |
| 7. వ్యాకరణము | పాణిని | పతంజలి | కాత్యాయనుడు |

పైరీతిని సూత్రగ్రంథములపై భాష్యములు, వాటిపై వార్తికములు, రాయబడ్డాయి. వ్యాకరణ శాస్త్రమున గూడ ఈ సూత్ర భాష్యవార్తికాలున్నాయి. సూత్రకర్త పాణిని. భాష్యకర్త పతంజలి. వార్తికకర్త కాత్యాయనుడు. కాత్యాయనుని వార్తికం పాణిని వ్యాకరణ సూత్రములపై బయలుదేరినది. కొన్ని వార్తికములు సూత్రార్థానువర్తకములు. కొన్ని సూత్రాలచే లభించని అర్థాలను ప్రతిపాదించేవి. కొన్ని సూత్రాలను ఆక్షేపించేవి. ఈ విధంగా వార్తికాలు సూత్రాలకు సంబంధించే ఉన్నాయి. సూత్రానికి ఉండే బలం వార్తికానికి కూడా ఉంటుంది. పాణిని సూత్రాన్ని అనుసరించి శబ్దసాధుత్వాన్ని చూపునట్లు కాత్యాయన వార్తికాన్ని వినియోగించి శబ్దసాధుత్వాన్ని చూపవచ్చు. పాణిని కాత్యాయనుల సూత్రవార్తికాలకు పతంజలి భాష్యాన్ని రాసాడు. ఇతర వార్తికాల లాగానే భాష్యవార్తికముల క్రమం వ్యత్యస్తమైనది. ముందు సూత్రం, తర్వాత వార్తికం, తర్వాత భాష్యం రాయబడినది. కాత్యాయన వార్తికం సూత్రలక్షణ క్రాంతమైనది. పాణిని, కాత్యాయన, పతంజలులకు అభిప్రాయ బేధములున్నపుడు "యథొత్తరం మునీనాం ప్రామాణ్యమ్" అను నియమమాశ్రయింపదగినది.

పై విధంగా దర్శన కర్తలను, సూత్రకర్తలను, భాష్యకారులను గుర్తించవలెను. ఈనాడు సాంఖ్యదర్శనం ఈశ్వరక్రిష్ణుని కారికా గ్రంథం చేతనే తెలియబడుతున్నది. కపిలుని ఆశయము శిష్యపరంపరగా ఇతనికి లభించినది. ఇతడు ఆ మతాన్ని గ్రంథస్థం చేసాడు. ఈ కారికా గ్రంథంపై కావ్యవార్తికాలు బయలుదేరాయి. కపిలునిచే రచించబడిన సూత్రాలు ఆరు అధ్యాయాలుగా

కనిపిస్తున్నాయి. ఇవికాక ఇరవై ఆరు కపిల సూత్రాలు వేరుగా కనిపిస్తున్నాయి. వీటికి వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. కాని ఇవి సాక్షాత్తు కపిలుని చేత రచించబడినవనడానికి సాక్ష్యం కానరాదు.

## 1.1 వైశేషికదర్శన పరిచయం

ఈ దర్శనకర్త కణాదుడు. భాష్యకర్త ప్రశస్తపాదుడు. ఇందులో మొత్తము 370 సూత్రాలు, 10 అధ్యాయాలు, 20 ఆహ్నికాలు, 2 ప్రమాణాలు, 7 పదార్థాలు కలవు. వైశేషిక దర్శనకర్త ఐన కణాదుడు కశ్యప మహర్షి గోత్రం లో జన్మించాడు. త్రికాండ కోశంలో " కాణాదః కశ్యపస్సమౌ" అని ఉన్నది. ఉలూక మహర్షి కుమారుడు కావడం వల్ల ఔలక్యుడనే మరొక పేరు ఇతనికి ఉన్నది. కణములను భక్షించి మహేశ్వరుని సంతోషింప చేయడం వల్ల ఇతనికి కణాద అనే పౌరుషనామం కలిగింది. శంకర భగవత్పాదులు **కణాద, కణభుక్** అనే నామాలతో ఇతనిని వ్యవహరించారు. శ్రీహర్షుడు తన నైషధ కావ్యం లో వైశేషిక దర్శనాన్ని ఔలుక్య దర్శనం అని చెప్పాడు. దమయంతిని గురించి నలుని వాక్యం ఇది. " చీకటిని విచారించునపుడు సుందరమైన వైశేషికమతం నాకు చాల ఇష్టం. ఎందుకంటే తమస్సు అను పదార్థం యొక్క తత్వనిరూపణమునకు ఆ దర్శనం చాల సమర్థమైనది. దానిని లోకంలో ఔలుక్య దర్శనమని వ్యవహరిస్తారు." తమస్సు అతిరిక్త పదార్థం కాదు. "తేజోభావమే తమస్సు" అని తమస్సు గురించి వైశేషికంలో చెప్పబడింది. ఆ వాదాన్ని శ్రీహర్ష మహాకవి తన కావ్యంలో చిత్రించాడు. వెలుతురులో అందరు పదార్థ విశేషణాన్ని గుర్తిస్తారు. అనగా ఇది పలానా వస్తువు అనే తెలివి వెలుతురులో అందరికీ ఉంటుంది. కానీ ఎవరైతే చీకటిలో కూడా పదార్థజ్ఞానం కలిగి ఉంటారో వారు ప్రత్యేకమైనవారు. అలాంటిది గుడ్లగూబ మాత్రమే. అది చీకట్లో పదార్థవిశేష గ్రహణమున సమర్థమైనది. పై రీతిగా శ్రీహర్షుడు ప్రకృతి శోభను శ్లేష అధారంగా వర్ణించాడు. దేవీభాగవతంలో, శ్రీమద్భాగవతంలో కూడా అక్కడక్కడ కణాద మహర్షి ప్రశక్తి ఉన్నది.

## వైశేషిక భాష్యం

కణాదుని వైశేషిక సూత్రములకు ప్రశస్తపాదుడు భాష్యాన్ని రాశాడు. భాష్యకర్తకు ప్రశస్త అనేదే ముఖ్యమైన నామధేయం. గౌరవార్థం పాద శబ్దం కలిపి లోకులు వ్యవహరించారు. ప్రశస్తపాద లాగే అతనికి ప్రశస్తదేవ అనే నామధేయం కూడా ఉంది.

## వైశేషిక వార్తికం

ప్రశస్తపాదుని వైశేషిక భాష్యాన్ని శ్రీజగదీశ భట్టాచార్యులు వివరించారు. వారు వారి వార్తికమునకు భాష్యముక్తి అని పేరు పెట్టారు. శంకరమిశ్రుడు అనే పండితుడు కణాదరహస్యం అనే పేరుతో భాష్యానికి వ్యాఖ్య రాశాడు. అలాగే శ్రీ ధరాచార్యుడు న్యాయకందళి అనే బృహత్తర వ్యాఖ్య భాష్యానికి రాశాడు. ఇలాగే ఉదయనాచార్యులు కిరణావళి అనే విపులమైన వ్యాఖ్య రాశాడు. శంకరమిశ్రుడు సూత్రాలకు ఉపస్కారము అను వివరణము రాశాడు. ఇవి కాక ప్రసిద్ధమైన వ్యాఖ్యానాలు ఇంకా చాలా ఉన్నాయి.

## వైశేషికశాస్త్రం

కణాదమునిచే రచింపబడిన ఈ శాస్త్రంలో 7 పదార్థాలు, 2 ప్రమాణాలు అంగీకరింపబడ్డాయి. అవి ద్రవ్యం, గుణం, కర్మం, సామాన్యం, విశేషం, సమవాయం, అభావములు. అలాగే ప్రత్యక్షం, అనుమానం అనేవి ప్రమాణములు. శబ్దోపమానములు అనుమానంతర్భూతములే. స్వతంత్ర ప్రమాణాలు కావు. ఆత్మ, మనస్సు కూడా ద్రవ్యములు. రెండు ద్రవ్యములు కలిసి సుఖ, దుఃఖ, ఇచ్ఛ, ద్వేష, ప్రయత్న, ధర్మ, అధర్మ సంస్కారములనెడి 9 గుణములు కలుగును. అదే సంసారం. ఆ స్థితిలో దుఃఖములను భరింపజాలక ఆత్మ ధర్మములను ఆచరించి, 9 గుణములను వదిలించుకుని మోక్షమును పొందును. అదే ఆత్మకు స్వస్వరూపస్థితి. ఈ దర్శనంలో ఆత్మ శబ్దం ప్రయుక్తం అయింది. కాని జీవ, ఈశ్వర పదాల వ్యవహారం లేదు. కాబట్టి ఈ దర్శనం ఈశ్వరుని అంగీకరించదు. కాని వేదప్రామాణ్యాన్ని అంగీకరిస్తున్నది. అందువల్ల ఇది ఆస్తికదర్శనం. కణాద మహర్షి మూడు నియమాలతో ఈ శాస్త్రాన్ని ప్రవర్తింపచేసాడు. అవి ఉద్దేశ్య, లక్షణ, పరీక్షలు. ఏ పదార్థాలను మనం శాస్త్రంలో నిరూపించదలిచామో అది ఉద్దేశ్యం. ఆ పదార్థాలకు లక్షణాన్ని చూపడం లక్షణం. మరల వాటిని పరీక్షించడం పరీక్ష.

## ద్రవ్యవిభాగం

ఇది సప్తపదార్థాలలో మొదటిది. సంఖ్యాపరంగా ఇవి తొమ్మిది. పంచభూతములు, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సులు. తమస్సు కూడా ద్రవ్యమని భాట్టుల వేదాంతం. కాని తమస్సు అనేది వేరుగా లేదు. వెలుతురు లేకపోవడమే తమస్సుగా పరిగణింపబడుతున్నది. "నీలంతమశ్చలతి" చీకటి నల్లగా

ఉన్నది. కదులుతున్నది. అని లోకులంటారు. కాని అది భ్రమరూపమే. వెలుతురు ఉష్ణస్పర్శ కలదై మనకు ప్రత్యక్ష సిద్ధమగును. కనుక ద్రవ్యములు తొమ్మిదే. గుణక్రియాశ్రయం ద్రవ్యం. ఈ ద్రవ్యాలలోని పంచభూతములు నిత్యములని, అనిత్యములని రెండు రకములు.

## గుణవిభాగం

గుణముల సంఖ్య 24. అవి రూపం, రసం. గంథము, స్పర్శ, సంఖ్య, పరిమాణము, పృథక్త్వము, సంయోగము, విభాగము, పరత్వము, అపరత్వము, బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నము, గురుత్వము, ద్రవత్వం, స్నేహం, సంస్కారం, ధర్మం, అధర్మము, శబ్దములు. కణాదుడు గుణములను విభజించునపుడు గురుత్వ, స్నేహ, సంస్కార ధర్మాధర్మములను చెప్పలేదు. ఈ గుణాలు లోక ప్రసిద్ధములే కాబట్టి మరల చెప్పపనిలేదని అతని అభిప్రాయం. గుణవిభాగంలో "ప్రయత్నాశ్చ గుణాః" అని వివరించెను. చ ప్రయోగం చేయడం వల్ల గురుత్వాదులు గ్రహించబడును. పంచభూతములు వాటి గుణములను క్రింది పట్టికలో గమణింపవచ్చు.

| పంచభూతములు | గుణములు |
|---|---|
| **వాయువు** | స్పర్శ, సంఖ్య, పరిమాణ, పృధక్త్వము, సంయోగం, విభాగం, పరత్వం, అపరత్వం, వేగం, సంస్కారం |
| **అగ్ని** | స్పర్శ, సంఖ్య, పరిమాణ, పృధక్త్వము, సంయోగం, విభాగం, పరత్వం, అపరత్వం, రూపం, వేగం, ద్రవత్వం |
| **ఉదకం** | స్పర్శ, సంఖ్య, పరిమాణం, పృధక్త్వము, సంయోగం, విభాగం, పరత్వం, అపరత్వం, రూపం, రసం, స్నేహం, వేగం, ద్రవత్వం, గురుత్వం |
| **పృధివి** | స్పర్శ, సంఖ్య, పరిమాణం, పృధక్త్వము, సంయోగం, విభాగం, పరత్వం, అపరత్వం, |

| | |
|---|---|
| | రూపం, రసం, స్నేహం, వేగం, ద్రవత్వం, గురుత్వం |
| **ఆకాశం** | సంఖ్య, పరిమాణం, పృథక్త్వం, సంయోగం, విభాగం |

**కర్మ**

కర్మలు ప్రధానంగా 5 విధములు. అవి

1. **ఉత్ క్షేపణము (పైకి ఎత్తుట)**
2. **అవ క్షేపణము (లాగుకొనుట)**
3. **ఆకుంచనము (ముడుచుకొనుట)**
4. **ప్రచారణము (చాచుట)**
5. **గమనము (నడుచుట)**

## సామాన్యం

పరం, అపరం అని సామాన్యం రెండు విధములు. ఇది ద్రవ్య గుణ కర్మలయందు ఉండును. "సమానానామ్ భావః సామాన్యం" ఏకాకారమగు వ్యక్తులందుడెడిది సామాన్యం. అన్ని ఘటములలో ఉండే భావం సమాన అభావం. " **నిత్యత్వేసతి అనేక సమవేతత్వం**" అనే లక్షణాన్ని తార్కికులు చెప్పుచున్నారు. ఈ లక్షణం ప్రకారం ఆకాశత్వం సామాన్యం కానేరదు. ఈ సామాన్యమే జాతి అనబడును.

## విశేషం

లోకంలోని నిత్యద్రవ్యముల యందు ఇది ఉండును. ఇవి అనంతాలు. ఈ నిత్యద్రవ్యములలోని భేదాన్ని విశేషాల ఆధారంగా చెప్తున్నది గనుక ఇది వైశేషికం.( "విశేషాయ ప్రభవతి వైశేషికం")

## సమవాయం

అవయవావయవులకు, క్రియా క్రియావత్తులకు, జాతి వ్యక్తులకు, గుణ గుణులకు నిత్యద్రవ్యవిశేషములకు గల సంబంధం సమవాయ సంబంధం. (నిత్య సంబంధత్వం సమవాయత్వం) అని తార్కికులు చెప్పుదురు. చరకమున పతంజలి సమవాయ లక్షణమును ఈ క్రింది విధంగా చెప్పెను.

**"సమవాయో పృథగ్భావో ద్రవ్యాదీనాం గుణైర్మతః**

**స నిత్యో యత్ర హి ద్రవ్యం న తత్రా నియతో గుణః"** చ, స 3-2

కాబట్టి ద్రవ్యాదులకు ఆధేయముతో గల సంబంధము సమవాయమనబడును. ఆధారాధేయభావము కలవాటికే సమవాయ సంబంధముండును.

## అభావం

వైశేషికమున అభావమనునది ప్రత్యేకమైన పదార్థంగా చెప్పబడింది. ఇది రెండు విధములు 1. సంసర్గాభావం 2. అన్యోన్యాభావం

సంసర్గాభావం మరల మూడు విధములు. అవి

1. ప్రాగభావం :-"ఇహ ఘటో భవిష్యతి" ఇక్కడ ఘటము ఇంకా నిష్పన్నం కాగలదు. నిష్పన్నం కాక ముందు ఉండే అభావాన్ని ప్రాగభావం అంటారు.
2. ధ్వంసాభావం :- ఏ క్షణం నుండి ఘటం ధ్వంశం ఐపోయినదో ఆ క్షణం నుండి ఉండే అభావాన్ని ప్రాగభావం అంటారు.
3. అత్యంతాభావం :- ":ఘటోనాస్తి పటోనాస్తి" ఇట్టి వ్యవహారములను బట్టి అత్యంతాభావమును అంగీకరించవలెను.

**అన్యోన్యాభావం** :- దీనినే బేధమందురు. "ఘటః పటోన" అను ప్రతీతి యిందు ప్రమాణం.

### పీలుపాకపాదం

వైశేషికం లో ప్రసిద్ధమైన వాదం ఇది. కుండను తయారు చేసేటప్పుడు దాని తయారీ లో భాగంగా అగ్నిలో కాలుస్తారు. అగ్ని సంయోగం చేత పరమాణు పర్యంతం ఘటం శిథిలమవుతుంది. పరమాణువులకే అగ్ని సంయోగం కలుగుతుంది. వాటికే నలుపురంగు పోయి, ఎరుపు రంగు లభిస్తుంది. అదృష్టం వల్ల మరల పరమాణువులు ఘటాకారంలోకి మారుతున్నాయి. ఇది వైశేషికులవాదం. దీనినే పీలుపాకవాదం అంటారు.

## 1.2 సాంఖ్యం

సాంఖ్య దర్శనకర్త కపిల మహర్షి. వీరు సాంఖ్యానికి సంబంధించిన 25 సూత్రాలను రచించారు. ఈ సూత్రాలకు విజ్ఞానభిక్షువు భాష్యాన్ని రచించారు. కపిల మహర్షి రచించిన సూత్రాలు సాంఖ్య తత్వాన్ని సంక్షిప్తంగా చెప్తాయి.

### సాంఖ్యకారికలు

సాంఖ్య కారికలను రచించినవారు ఈశ్వరకృష్ణులు. ఇతనికి పంచశిఖాచార్యుడు సాంఖ్య మతాన్ని ఉపదేశించాడు. పంచశిఖునికి ఆసురి గురువు. ఆసురికి ఈ మతాన్ని కపిలుడు ఉపదేశించాడు. ఇలా ఈ మతం శిష్యపరంపరగా వ్యాపించింది.

### సాంఖ్యప్రమాణాలు

సాంఖ్యదర్శనంలో మూడు ప్రమాణాలు అంగీకరింపబడ్డాయి. అవి ప్రత్యక్ష అనుమాన శబ్దములు.

### సాంఖ్యభాష్యం

ఈశ్వరకృష్ణుని కారికలకు శ్రీగౌడపాదాచార్యుడు భాష్యాన్ని రచించాడు.

### సాంఖ్యవార్తికం

శ్రీగౌడపాదుని కారికాభాష్యానికి విజ్ఞానభిక్షువు సాంఖ్యసారం అనే భాష్యాన్ని రచించాడు. ఇందులో సాంఖ్య పదార్థములు చక్కగా నిరూపింపబడ్డాయి. ఇతడు యోగదర్శనానికి కూడా భాష్యాన్ని రచించాడు.

## సాంఖ్యతత్వాలు

సాంఖ్యంలో 25 తత్వాలు నిరూపించబడ్డాయి.

1. మూలప్రకృతి
2. మహత్తత్వము
3. అహంకారం
4. శబ్దము
5. రూపం
6. రసం
7. గంధం
8. స్పర్శం
9. నాశిక
10. కర్ణం
11. అక్షి
12. త్వక్కు
13. ఆస్యము
14. వాక్కు
15. పాణి
16. పాదం
17. పాయువు
18. ఉపస్థ
19. మనస్సు

20. పృథివి

21. ఆపః

22. తేజం

23. వాయువు

24. ఆకాశం

25. పురుషుడు

ఈ తత్వాలను నాలుగు రకాలుగా విభజించవచ్చు.

**మూలప్రకృతి:–** ఇది మరొక దానివల్ల పుట్టేదికాదు. దీని వలనే మిగతావి పుడతాయి. సాంఖ్య మతంలో వ్యుత్పత్తి అంటే అభివ్యక్తి రూపమైన పరిణామం.

**మహదహంకార పంచతన్మాత్రలు:–** ప్రకృతి వలన మహత్తు దాని వలన అహంకారం దాని వలన పంచ తన్మాత్రలు పుడతాయి. వాటి నుండి భూతపంచకం పుడతాయి. కాగా ఈ సప్తకం మరొక దాని నుండి పుడతాయి.

**షోడశకం:–** ఇది మరొక దాని వల్ల పుట్టేదే. మరొక తత్వాన్ని పుట్టించేదే. మహదాది సప్తకం ఇతర తత్వం వలన పుట్టునవే.

**పురుషుడు:–** ఇది తత్వాంతరాన్ని పుట్టించదు. ఇతర తత్వం వలన పుట్టదు. ఈ 25 తత్వాలను మూడు రకాలుగా విభజించవచ్చు.

**1.అవ్యక్తం;–** అస్పష్టంగా ఉండును. అనగా కారణంగా ఉండును. ఇదే ప్రకృతి. ఇందులో సత్వరజస్తమో గుణాలు సమానంగా ఉంటాయి. ఇది జడం.

**2.పురుషుడు:–** జ్ఞానరూపుడు. అపరిణామి.

**3.వ్యక్తం:–** అవ్యక్త పురుషుల సంయోగంవల్ల ఇది ఆవిర్భవించినది. ఇదే జగద్రూపంగా కనిపిస్తున్నది. ఈ వ్యక్తమునందు ఆరు ధర్మాలు కలవు. త్రైగుణ్యం, అవివేకత్వం, విషయత్వం, సామాన్యత్వం, అచేతనత్వం, ప్రసవధర్మిత్వం పై ఆరు ధర్మాలు అవ్యక్తమునందు కూడ గలవు. అవ్యక్తమునందు 8

ధర్మాలు కలవు. ఈ ఎనిమిది పురుషుని యందు కూడా కలవు. పురుషునియందు అనేకత్వం కూడా కలదు. ఇది వ్యక్తం అందు కూడా కలదు. ఈ రీతిగా వ్యక్తావ్యక్త పురుషులకు కొన్ని సమాన ధర్మములు కొన్ని విజాతీయ ధర్మములు కూడా కలవు. ఈ 25 తత్వాలను 2 గుణాలుగా చూడవచ్చును. చేతనం – పురుషతత్వం, అచేతనం – ప్రకృతి మొదలైన 24 తత్వాలు.

**ప్రధానము:–** సత్వరజస్తమో గుణాల కలయిక ప్రకృతి. ఇదియే మాయ, అచేతనం, అవ్యక్తం ప్రధానమని వ్యవహరింపబడుతున్నది. పురుషుని భోగాపవర్గాలకై ఈ ప్రధానం మహదాదిరూపమున పరిణమిస్తున్నది. ఈ ప్రకృతే సృష్టికర్త. ఇదే మూలప్రకృతి.

**పురుషుడు:–** అవ్యక్తం మొదలుగాగల 24 తత్వాలు సుఖదుఃఖ మోహాత్మకాలు. ఇవి సంఘాతరూపాలు. లోకంలో శయనాసనాదులు జీవి భోగం కోసం కల్పింపబడి ఉన్నాయి. అది మనకు ప్రత్యక్షసిద్ధం. అలాగే అవ్యక్తాది సంఘాతమును అనుభవించు వాడున్నట్లు మనం అంగీకరించాలి. ఈ సంఘాతంలో మరే వస్తువును కూడా భోక్తగా కల్పించుటకు శక్యం కానేరదు. ఆ భోక్తయే పురుషుడు. రథాదులు చేతనాధిష్టములుగా కన్పిస్తున్నాయి. అలాగే సుఖదుఃఖ మోహాత్మకమైన బుధ్యాదులన్ని చేతనాధిష్టములు కావలెను. ఆ చేతనుడే పురుషుడు. అతడే ఆత్మ. దృష్యమైన బుధ్యాదికమంతా భోగ్యం. భోక్త లేనిది వీటికి భోగ్యత్వం సిద్ధింపదు. ఆభోక్తయే ఆత్మ.

## పురుషబహుత్వం:–

ఉపాధి భేదంచేత పురుష భేదాన్ని తప్పక అంగీకరించాలి. పురుషైకత్వం యుక్తం కాదు. ఒకడే పురుషుడని అంగీకరించినచో జననం, మరణం అందరికీ ఒకేసారి కలగవలెను. అంటే ఒకడు జన్మిస్తే అందరూ జన్మించాలి. ఒకడు మరణిస్తే అందరూ మరణించాలి. అతడు గుడ్డి వాడైతే అందరూ గుడ్డివారు కావలెను. కాని లోకంలో ఇలా లేదు. కొందరు సాత్వికులు, కొందరు రాజసులు, కొందరు తామసులు. ఇలాంటి త్రైవిధ్యము పురుషబహుత్వం వలన సిద్ధిస్తున్నది.

## ప్రధానపురుష సంయోగం:-

ప్రకృతికే ప్రధానం, అవ్యక్తం, అప్రధానమని నామాంతరాలున్నాయి. ఇది త్రిగుణాత్మకం. ఇది పరిణమించు స్వభావం కలది. కాని అచేతనం. పురుషుడు చేతనుడే కాని నిష్క్రియుడు. ఇలాంటి ప్రధాన పురుషులకు సంయోగం ఎలా కలుగుతుందని ప్రశ్నించవచ్చును. ఈ ప్రశ్నకు సమాధానం శాస్త్రంలో ఈ విధంగా చెప్పబడింది. లోకమున ఒక స్థలంలో ఒక గుడ్డివాడు ఒక కుంటివాడు ఒక చోట తటస్థపడ్డారు. గుడ్డివాడికి శరీరబలమున్నను కళ్ళు కానరావు. కుంటివాడికి కళ్ళున్నను నడవలేడు. కుంటివాడిని గుడ్డివాడు తన వీపుపై నుంచుకుని ఇరువురు గమ్యస్థానాన్ని చేరగలరు. ఇట్లే ప్రధానపురుషులకు సంయోగం కలుగుతుంది. ఇందుకు మరొక దృష్టాంతం కలదు. ఇద్దరు రాజులు వేరు వేరు రథములపై ప్రయాణం చేస్తున్నారు. అందొకని గుర్రం నష్టమైనది. రెండవవాని రథం దగ్ధమాయెను. మొదటివాని రథమునకు రెండవవాని గుర్రమును సంబంధింపచేసినచో వారిరువురును గమ్యస్థాణాన్ని చేరగలరు. ఈ విధంగా ప్రధానపురుషుల సంయోగం వలన ప్రకృతి నుండి మహత్తు, దాని వలన అహంకారం, దాని వలన పంచతన్మాత్రలు దాని వలన షోడశవికారం కలుగును.

## మహత్తత్వం

ప్రకృతి పురుషుల సంయోగం వలన మహత్తత్వం ముందావిర్భవించినది. దీని స్వరూపమధ్యవసాయము అనగా నిశ్చయము. మనుష్యుడు ఇంద్రియాలతో శరీరాన్ని గ్రహించి, సంకల్ప వికల్పాలతో ఒక సంశయానికి వస్తాడు. ఆ నిశ్చయమే బుద్ధి. సత్వబుద్ధి వలన ధర్మం, జ్ఞానము, ఆశ్చర్యం కలుగుతాయి. తమస్సంబంధం వలన అధర్మం, అజ్ఞానం, అనైశ్వర్యం, అవైరాగ్యం కలుగుతాయి. రజస్సు వలన ఇచ్ఛద్వేషప్రయత్నాదులు కలుగుతాయి. వీటిలో సాత్వికధర్మాలు ఉపధేయాలు. తామస ధర్మాలు పరిహరణీయములు. యాగాదుల వలన కలిగిన ధర్మం స్వర్గాభ్యుదయానికి సాధనం. అష్టాంగయోగం వలన కలిగిన ధర్మం మోక్షానికి దారి తీస్తుంది.

## అహంకారం

వర్ణాలు అరవైనాలుగు. వీటిలో అ కారం మొదటిది. హ కారం చివరిది. ఈ రెంటిని కలిపితే అ – హ అని ఏర్పడుతుంది. ఇది ఒక ప్రత్యాహారం. ఇది అన్ని వర్ణాలను బోధిస్తున్నది. అ – హ అను దాని తర్వాత బిందువు చేరిస్తే అది అహం అవుతుంది. దీని తర్వాత " **వర్ణాత్కారః** " అను కాత్యాయన వార్తికాన్ని వినియోగించి, కార అను కృత్ప్రత్యాన్ని చేర్చి అహంకార అను శబ్దాన్ని ఏర్పర్చవచ్చు. ఈ వర్ణమాలను యోగులు కూడా పర, పశ్యంతి, వైఖరి, మధ్యమ అని వ్యవహరిస్తారు. ఈ అహంకారం నుండి పంచభూతములు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు మనస్సు మొత్తం పదహారు పదార్థాలు పుడతాయి. తాత్వికులు అహంకారాన్ని జ్ఞానరూపంగ గుర్తిస్తారు.

## షష్టితంత్రం

కపిల దర్శనానికే షష్టితంత్రం అని పేరు. అనగా 60 పదార్థాలను బోధించు శాస్త్రమని పేరు. సాంఖ్యంలో సాధారణంగా 25 తత్వాలను మాత్రమె చెప్తారు. ఇరవైఐదు  తత్వాలను విస్తరించి చెప్పినట్లైతే అవి అరవై పదార్థాలుగా లెక్కింపబడతాయి.

## బంధమోక్షములు

పురుషుడు సంఘచిద్రూపుడు. సత్వరజస్తమోగుణాత్మకమైన ప్రకృతి పురుషునకు బంధమోక్షములను కలిగించును. పకృతి యొక్క పరిణామం బుద్ధి. జ్ఞానమను బుద్ధిగుణం వలన ప్రకృతిపురుష జ్ఞానం కలుగును. అజ్ఞానం మొదలగు ఏడు బుద్ధి గుణములచే బంధం కలుగుతుంది. నిజానికి పురుషునికి బంధమోక్షాలు లేవు. సంసారం లేదు. ఇన్నిటిని ప్రకృతియే చేస్తున్నది. పురుషుడు నిర్గుణుడు. ప్రకృతి గుణవతి. పురుషుడు అనుపకారి. ప్రకృతి అనుపకారిణి. తత్వజ్ఞానం వలన మనిషికి అస్మి, అహమిదం, " **ఇదం మమ** " అనే జ్ఞానం నశించి **నాస్మి, నాహం, నమే** అనే కేవల జ్ఞానం కలుగును. ఏ పురుషుడికి తత్వజ్ఞానం కలుగునో ఆ పురుషుడే ముక్తుడగును. వివేకజ్ఞానం లేని పురుషుడు బద్ధుడగును. ఈ అభిప్రాయం తోనే శ్రుతులందు చాలచోట్ల బద్ధముక్తులగు పురుషులగురించి చెప్పబడింది.

### పరిణామవాదం

ఈ వాదాన్ని ప్రధానంగా సాంఖ్యులంగీకరించారు. ప్రపంచమంతా సుఖదుఃఖమోహాత్మకం కావడం వల్ల దీనికి మూలకారణమొకటి సుఖదుఃఖమోహరూపంగా ఉండును. సుఖదుఃఖమోహరూపములు సత్వరజస్తమోగుణములు. కావున సత్వరజస్తమోగుణాత్మకమగు వస్తువు ప్రపంచానికి మూలకారణమని తేలినది. అదే ప్రకృతి అని, ప్రధానమని వ్యవహరింపబడుతున్నది. ఇది జడము. ఈ జడం లోనే సుఖదుఃఖమోహాత్మకమగు ప్రపంచమంతయు అనభివ్యక్తమై సూక్ష్మరూపంగానున్నది.

## 1.3 న్యాయదర్శనం

న్యాయదర్శనకర్త గోతమముని. లోకంలో ఇతని పేరు గౌతమునిగా ప్రసిద్ధం. న్యాయ సూత్రవృత్తి లోనూ, మాధవాచార్యుల సర్వదర్శన సంగ్రహం లోనూ గోతమ అనే వ్యవహరించారు.

### అక్షపాదుడు

గోతమ మహర్షికి అక్షపాద అను నామాంతరం ఉన్నది. వాచస్పత్యంలో గోతమునికి సంబంధించిన ఐతిహ్యం ఒకటి ఉన్నది. వ్యాసుడు గోతముని శిష్యుడు. అతడు తన గురువు యొక్క మతమునకు విరుద్ధముగా బ్రహ్మైక్యమును, అనగా అద్వైతమును నిరూపించాడు. అందుకు గోతముడు కోపించి, నీ ముఖమును నేను కన్నులతో చూడను. అని నిరాకరించాడు. వ్యాసుడు పలు విధాలుగ వేడుకొనగా ఎట్టకేలకు గోతముడాతని అనుగ్రహించాడు. కాని తన ప్రతినకు భంగం లేకుండా శిష్యుని చూడ తలచి, తన తపోమహిమచే పాదమునందొక నేత్రమును సృష్టించి, దానితో వ్యాసుని చూసాడు. అప్పటి నుండి గురువుకు అక్షపాద అను పేరు కలిగెను. గోతముడు రాహుగణ మహర్షి కుమారుడని, విదేహ రాజైన జనకుని వద్ద పురోహితుడని, శథపథ బ్రాహ్మణంలో ఉన్నది. శ్రీమద్వాల్మీకి రామాయణంలో బాలకాండలో గోతమ ఆశ్రమము వర్ణింపబడినది. అతడే ఈ దర్శనకర్త అని అనవచ్చును. బౌద్ధమత ప్రవర్తకుడైన గోతముడు న్యాయదర్శనకర్త కంటే భిన్నుడు. ఇలాగే జైన మతానుయాయి ఐన గోతముడు కూడా భిన్నుడే. న్యాయదర్శనకర్త వేదప్రామాణ్యాన్ని అంగీకరించినవాడు.

## న్యాయసూత్రములు

న్యాయసూత్రాలు 5 అధ్యాయాలుగా విభజించబడినవి. ప్రత్యధ్యాయమున రెండు ఆహ్నికములు కలవు. కాగా 5 అధ్యాయములు, 10 ఆహ్నికములు, 528 సూత్రాలు, 84 ప్రకరణాలు, 196 పదములు, 8385 అక్షరములు న్యాయ సూత్రముల విధానమున చూడబడును.

## న్యాయనామకరణం

పదార్థానుమానమునకు ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణం, ఉపనయం, నిగమనం అను ఐదవయవములు ఆవశ్యకములు. ఈ పంచావయవములకు న్యాయమని పేరు. ఇట్టి న్యాయమును ప్రధానంగా తీసుకుని ఈ శాస్త్రము నిర్మింపబడినందువల్ల దీనికి న్యాయమని పేరు కలిగినది. ఈశ్వరుని అనుమాన ప్రమాణం చేత ఈ శాస్త్రం అంగీకరిస్తున్నది. ఇందుకు న్యాయం చాల సహకరిస్తున్నది. అనుమాన మూలంగా ఈశ్వరసిద్ధి కలిగిన తర్వాత దానికి ఆగమము తోడవుతుంది. ఈశ్వరుడు వేదాలను సృష్టించెను. వేదాలను సృష్టించిన పరమేశ్వరుని బుద్ధిలో రాగాది దోషములు లేనందున వేదమంతా ప్రమాణంగా భావించపడుతున్నది. వేదము శబ్దరూపము. ఇచట శబ్దమనగా వర్ణరూపం. వేదములకు గల జన్యత్వం జనకత్వం ను అపేక్షించుచున్నది. ఆ జనకత్వం ఈశ్వరునికి మాత్రమే చెల్లుతుంది. లోకానుగ్రహం చే ఈశ్వరుడు వేదములను సృష్టించెను.

## న్యాయభాష్యం

న్యాయసూత్రాలకు వాత్సాయన మహర్షి భాష్యమును రాసెను. ఈ భాష్యం చాల గంభీరమైనది. సూత్రములకు అనుగుణమైన భాష ఇందులో ఉన్నది. కామసూత్రములను రాసిన వాత్సాయనుడు ఇతనేనని కొందరు, ఇతడు వేరని కొందరు భావిస్తున్నారు. న్యాయభాష్యమునకు మహామహోపాధ్యాయ విద్యాసాగర గంగానాథశర్మ ఖద్యోతమను వ్యాఖ్యను, రఘోత్తముడు “భాష్యచంద్ర” అను టీకను రాసెను.

## న్యాయవార్తికములు

వాత్సాయన భాష్యానికి భారద్వాజ, పాశుపతాచార్య, ఉద్యోతకరుడు వ్యాఖ్యలను రాసిరి. ఇవి విపులమైన వ్యాఖ్యలు. కాలాంతరంలో అన్ని కలిసిపోయి ఏది భాష్యమో, ఏది వ్యాఖ్యో, ఏది వార్తికమో

తెలియకుండా పోయినది. అలాంటి స్థితిలో వాచస్పతి మిశ్రులు సూత్రభాష్యవార్తికములను విభజించి "న్యాయ వార్తిక తాత్పర్యటీక" అను బృహత్తర గ్రంథమును రాసారు.

## న్యాయపదార్థములు

వైశేషికంవలె ఇందులో కూడా ఉద్దేశ్య – లక్షణ – పరీక్షల పద్ధతిలోనే పదార్థ నిరూపణం గావించబడింది. న్యాయంలో పదార్థములు 16. ఇవి ఇందు ప్రధానమైనవి. అవి 1.ప్రమాణం, 2.ప్రమేయం,3.సంశయం,4.ప్రయోజనం,5.దృష్టాంతం,6.సిద్ధాంతం,7.అవయవం,8.తర్కం,9.నిర్ణయం,10.వాదం,11.జల్పం,12.వితండం,13.హెత్వాభాసం,14.ఛలం,15.జాతి,16.నిగ్రహస్థానం

## ప్రమాణములు

ప్రమాణములు 4.అవి

1. ప్రత్యక్షం
2. అనుమానం
3. ఉపమానం
4. శబ్దం

ఈ నాలుగు ప్రమాణములు న్యాయమున అంగీకరింపబడినవి. వైశేషికంలో ప్రత్యక్షానుమానములు రెండు మాత్రమే ప్రమాణములని, శబ్దోపమానములు రెండు అనుమానాంతర్భూతములని చెప్పబడింది. శబ్దోపమానాలను అనుమానంలో కలిపి చూడడం సరి కాదు. వ్యాప్తి లేకపోయిన శాబ్దబోధ కలుగుతున్నది కనుక శబ్దము స్వతంత్రప్రమానము.

## ప్రమేయములు

ఇవి సంఖ్యాపరంగా 12.

1. ఆత్మ
2. శరీరం
3. ఇంద్రియం

4. అర్థం
5. బుద్ధి
6. మనస్సు
7. ప్రవృత్తి
8. దోషం
9. ప్రేత్యభావం
10. ఫలం
11. దుఃఖం
12. అపవర్గం

గోతముడీ పన్నెండింటినీ ప్రమేయ పదార్థాలుగా చూపెను. ప్రత్యక్షం మొదలైన ప్రమాణాలచేత ఇది తెలియదగినది. ఈ ప్రమేయాలలో దుఃఖం చెప్పబడింది. సాంసారిక సుఖం కూడా దుఃఖమే అని భావించడంవల్ల, దానిని సాధించడానికి ఉపకరించు వస్తువులయందును మనుష్యునకనాదర బుద్ధి కలుగును. దాని వల్ల వైరాగ్యం కలుగును. దాని వల్ల జనన మరణ ప్రవాహం విచ్ఛిన్నమగును. దాని వలన ఆత్యంతిక దుఃఖనివృత్తి రూపమైన మోక్షం లభించును. కణాదుడు ద్రవ్యగుణ కర్మ సామాన్య విశేష సమవాయములను చెప్పాడు. గోతముడు వాటిని చెప్పక ఈ పన్నెండింటినే చెప్పడానికి ప్రయత్నించాడు. ఇందుకు ప్రత్యేకమైన కారణమున్నది. ఏ పదార్థముల ఎరుక వల్ల మోక్షం సిద్ధిస్తుందో వాటినే ఇక్కడ నిరూపించవలెను. అసంఖ్యాకలైన ద్రవ్యగుణాదులను తెలుసుకోవడం వల్ల కలిగే ప్రయోజనం శూన్యం అని గోతముని అభిప్రాయం.

## సంశయం

మనుష్యుడు ఏదో ఒక వస్తువును చూసి, దాని స్వరూపాన్ని నిర్ణయించలేని అవస్థలో కలిగే అనిశ్చయాత్మకమైన ఎరుక సంశయం అనబడుతున్నది. ఇది 5 విధములు

**1.సమానధర్మోపపత్తి** :- అనేక వస్తువుల మధ్య సమానమైన ధర్మం కనబడినపుడు సంశయం కలుగుతుంది. రాతికి పురుషునికి ఔన్నత్యం మొదలైనవి సమాన ధర్మములు. దూరం నుండి మనం

చూచునపడు స్థాణు పురుషులలో ఏదో మనం నిర్ణయించలేము. ఇది సమాన ధర్మోపపత్తి వలన కలిగే సంశయం.

**2.అనేకధర్మోపపత్తి** :- రెండు వస్తువుల మధ్య ఉన్న అసాధారణ ధర్మాన్ని బట్టి సంశయం కలుగవచ్చును. స్థాణుపురుషులకు ఔన్నత్యమను ధర్మం కలదు. ఇది రెంటికీ సాధారణమే. కాని ఇది ఘటాదులకు లేనందున ఈ ధర్మం స్థాణు పురుషులకు అసాధారణమవుతున్నది. దూరం నుండి స్థాణుపురుషులను చూసినపుడు రెండింటియందు ఉండే ఉన్నతత్వం ఇతర వస్తువులయందు లేదని అవగతమవుతున్నది. అది అనేకధర్మోపపత్తి.

**3.విప్రతిపత్తి** :- ఆత్మ కలదని  కొందరు లేదని కొందరు పరస్పరం వాదించుకోవడం లోకంలో రివాజు. ఆత్మ కలదనో లేదనో నిర్ణయించడానికి తగిన హేతువు తెలియనట్లయితే పై వాక్యద్వయాన్ని బట్టి  ఆత్మ కలదా? లేదా? అని మనుష్యునికి సందేహం కలుగును. ఇది విప్రతిపత్తి వలన కలిగెడి సంశయం. విరుద్ధార్థబోధకములైన వాక్యద్వయం విప్రతిపత్తి అనబడును.

**4.ఉపలబ్ధవ్యవస్థ** :- మానవుని నేత్రము చెరువులో ఉండే నీటిని, ఎండమావిలో ఉండే నీటిని గ్రహిస్తుంది. చెరువులో ఉండే నీరు సత్యం. ఎండమావిలో ఉండే నీరు అసత్యం. కాగా ఇంద్రియం సత్ – అసత్పదార్థములు రెండింటినీ గ్రహించును. ఈ కారణం వలన దూరం నుండి నీటిని చూసిన మనిషి ఇంద్రియం వలన కలిగిన ఎరుక సరైనది కాదని భావించి, కనబడుతున్న నీటిని విశ్వసింపక సత్యమో? అసత్యమో? అనే సంశయానికి లోనవుతాడు. ఇదే ఉపలబ్ధవ్యవస్థ.

**5.అనుపలబ్ధవ్యవస్థ** :- నేలపై జలంలేనపుడు అది మనకు కనపడదు. నేలపై ఉన్నప్పటికీ నాచు మొదలైనవి కప్పివేయడం వల్ల అది కానరాదు. నీరు లేనప్పుడు కానరాకపోవడం సత్యరూపం. నీరు ఉన్నప్పుడు మనకు గోచరించే జలాభావం అసత్యరూపం. మన ఇంద్రియం రెండింటినీ గ్రహించును. ఇక్కడ నీటిమీద గడ్డి, మొక్కలు మెదలైనవి ఉండడంవల్ల నీరు కనిపించలేదా? నీరు లేక కనపడలేదా? అన్నది సంశయం. అదే అనుపలబ్ధవ్యవస్థ.

## ప్రయోజనం

లోకంలో మనుష్యుడొక వస్తువును పొందవలెనని ప్రయత్నించును. లేక మరొక వస్తువును విడిచి పెట్టాలని ప్రయత్నించును. అలా పొందవలసిన దానిని పొందటాన్ని, విడువవలిసిన దానిని విడిచిపెట్టడాన్ని ప్రయోజనం అంటారు.

## దృష్టాంతం

లోకంలో ఏ వస్తువును పామరులు, పండితులు ఒకే విధంగా గ్రహిస్తారో అది దృష్టాంతం. పుణ్యపాపాలు కాలక్రమంలో నశిస్తాయా? నశించవా? అని మనిషి సందేహం. పుణ్యపాపాలు సదసత్ప్రవర్తన వల్ల జనించడం వలన అవి నశించునని నిరూపించవచ్చును. దానికి శరీరాన్ని దృష్టాంతంగా చెప్పవచ్చును. శరీరం పుడుతున్నదని, నశించుచున్నదని అందరికీ తెలుసు. ఇందు పామరులకు, విమర్శకులకు అభిప్రాయభేదం ఎన్నడు ఉండదు. కాగా ఈ శరీర దృష్టాంతం జన్యమగు వస్తువులన్ని నశిస్తాయని సాధించవచ్చు. దృష్టాంతవిరోధముచే ప్రతివాది యొక్క పక్షం నిరాకరించబడును. దృష్టాంతం యొక్క ఆనుకూల్యముచేత తన పక్షం సాధించబడును. కనుక న్యాయావయవములలో ఒక అవయవంగా ఈ దృష్టాంతం స్వీకరించబడుతున్నది.

## సిద్ధాంతం

ప్రమాణభూతమయిన శాస్త్రంలో తత్త్వాన్ని విమర్శించి, నిర్ణయించుట సిద్ధాంతమనబడును. ఇది 4 విధాలుగా ఉంటుంది.

**1.సర్వతంత్ర సిద్ధాంతం** :- తంత్రమనగా ప్రమాణమైన శాస్త్రం. ఒక శాస్త్రమున నిరూపితమైన సిద్ధాంతం అన్ని శాస్త్రములకు అవిరుద్ధంగా ఉంటే అది సర్వతంత్ర సిద్ధాంతం. న్యాయశాస్త్రంలో నాలుక మొదలైనవి ఇంద్రియాలుగా చెప్పబడ్డాయి. ఈ విషయంలో ఇతర శాస్త్రాలకు వైరుధ్యం లేదు. కనుక ఇది సర్వతంత్ర సిద్ధాంతం.

**2.ప్రతితంత్ర సిద్ధాంతం** :- ఒక శాస్త్రమున నిరూపితమైన సిద్ధాంతం ఆశాస్త్రానికే పరిమితమైతే అది పరతంత్రసిద్ధాంతం. ఉదాహరణకు కర్తృత్వమాత్మ ధర్మముకాదని సాంఖ్యుల సిద్ధాంతం. కర్తృత్వమాత్మ ధర్మమేనని నైయాయకుల వాదం. శబ్దం నిత్యమని వైయాకరుణుల వాదం.

శబ్దమనిత్యమని నైయాయకుల వాదం. మనస్సు అనువని న్యాయసిద్ధాంతం. విభువని యోగసిద్ధాంతం. ఇలాంటివి పరతంత్ర సిద్ధాంతములు.

**3.అధికరణ సిద్ధాంతం** :- మనం ఒక దానిని సాధించేటప్పుడు దానితో పాటు అప్రయత్నంగా మరికొన్ని సిద్ధించును. మరికొన్ని అలా సిద్ధించకపోతే మొదటి అంశమే సిద్ధించనేరదు. దీనినే అధికరణ సిద్ధాంతం అంటారు.

**4.అభ్యుపగమ సిద్ధాంతం** :- శాస్త్రమున ఒక అంశమును సాక్షాత్తు నిరూపించక పోయినను దానికి సంబంధించిన మరికొన్ని అంశములను నిరూపించుటవలన ఆ అంశం ఆ శాస్త్రమునకు సమ్మతమే అని గ్రహింపబడుతున్నది. దీనినే అభ్యుపగమ సిద్ధాంతం అంటారు. న్యాయసూత్రాలలో మనస్సు ఇంద్రియమని సాక్షాత్తు నిరూపింపబడలేదు. కాని మనస్సు ఎరుకకు సాధనమని అక్కడక్కడ నిరూపింపబడినది. కాబట్టి ఇక్కడ మనస్సు కూడా ఇంద్రియమే అని తేలుతున్నది.

## అవయవము

అవయవములు మొత్తము ఐదు. అవి

1. ప్రతిజ్ఞ
2. హేతువు
3. ఉదాహరణ
4. ఉపనయం
5. నిగమనం

ఈ ఐదింటి సముదాయమే న్యాయమనబడుతున్నది. ఈ అనుమానం రెండు విధములు

**1. స్వార్థానుమానం 2. పదార్థానుమానము**

హేతువును బట్టి పదార్థాన్ని స్వయంగా తెలిసికొనుటకు తగిన అనుమానం స్వార్థానుమానం. ఇందుకు పైన చూపబడిన 5 అవయవములు అవసరం లేదు. తనకు తెలిసిన దానిని ఇతరులకు బోధించుటకు ఉపయోగించెడి న్యాయమును బట్టి పరునకు కలుగు అనుమాన ప్రమాణము

పదార్థానుమానమనబడును. ఇద్దరు మనుషులు షికారు నిమిత్తం బయటకు వెళ్ళారు. వారిలో ఒకడు ఎదురుగా ఉన్న పర్వతం పై అగ్నిని చూసి, దాని మూలంగా పర్వతంపై అగ్ని ఉన్నట్లు గ్రహించాడు. తాను గ్రహించిన దానిని రెండవ వాడికి చెప్పాడు. రెండవవాడికి పూర్తిగా ఎరుక కలుగుటకు ఈ అవయవములైదింటిని ఉపయోగించాడు.

**రెండవవాడు** :- పర్వతం అగ్నిని కలిగిఉన్నది.(ప్రతిన)

**మొదటివాడు** :- నీవెలా చెప్పగలుగుతున్నావు?

**రెండవవాడు** :- పొగ ఉండుటవలన(హేతువు)

**మొదటివాడు**:- అగ్ని లేకపోతే పొగ ఉండదు. కనుక పొగ ఉన్నట్లయితే అగ్ని తప్పక ఉండితీరుతుంది. ప్రతిరోజు ఈ అంశాన్ని వంటింట్లో మనం గ్రహిస్తూనే ఉన్నాం(ఉదాహరణ)

**రెండవవాడు** :- నీవు పర్వతంపై పొగను చూసావా?

**మొదటివాడు** :- వంటింట్లో లాగానె పర్వతంపై కూడా పొగ ఉండటం నేను చూసాను.(ఉపనయం)

**రెండవవాడు** :- ఆ ఎగురుతున్నది పొగ అవునా? కాదా? అది పొగ అయినప్పటికీ అగ్ని ఉన్నదో? లేదో?

**మొదటివాడు** :- అది పొగయే. నేను కన్నులార చూసాను.(నిగమనం)

## తర్కం

మనిషి తనకు స్పష్టంగా తెలియని వస్తుతత్వమును స్పష్టంగా తెలుసుకోవాలనుకుంటాడు. ఆ కోరికతో తను తెలుసుకోదలచిన వస్తువును పరిపరివిధాల ప్రశ్నిస్తాడు. ఆత్మ నిత్యమా? అనిత్యమా? అని సంశయం గల పురుషుడు వస్తుతత్వ పరిశీలనం చేస్తాడు. ఆత్మ శరీరంతో పుట్టి శరీరం తోనే నశించినట్లయితే, దీనికి పూర్వజన్మ, ఉత్తరజన్మ అనేవి వుండవుకదా? అలా అయితే ఈ జన్మలో పూర్వజన్మలో చేసిన కర్మలకు ఫలం అనుభవించడం, ఉత్తర జన్మలో సుఖం కోరుకునేవాడు ఇప్పుడు

సత్కర్మలనాచరించడం జరగవు కదా? కనుక ఆత్మ నిత్యం అనడమే యుక్తం అని మనుష్యులూహిస్తారు. దీనికే తర్కమని పేరు.

## నిర్ణయం

ఆత్మ నిత్యమా? అనిత్యమా? అని సంశయించి, తత్వాన్ని తెలుసుకోవాలనుకునే ఒక పురుషుడు తన సంశయాన్ని పండితులకు చెప్పాడు. అప్పుడు ఆత్మ నిత్యమని కొందరు, అనిత్యమని కొందరు వేరు వేరు హేతువులను చూపారు. ఒక హేతువును పక్షంగా స్వీకరిస్తే రెండవది ప్రతిపక్షమవుతుంది. పరస్పర విరుద్ధాలైన రెండును తత్వనిర్ణయం లో చాల ఉపకరిస్తాయి. సాధకహేతువు పక్షమని, బాధక హేతువు ప్రతిపక్షమని శాస్త్రకారులు వ్యవహరిస్తారు. పక్షప్రతిపక్ష సంశయాల మూలంగా కలిగిన తత్వ నిర్ణయానికి నిర్ణయమనిపేరు. ఆ నిర్ణయాలు మూడు రకాలు. తత్వనిర్ణయం లో ఏదో ఒకటే తేలితే అది ఒకరకమైన నిర్ణయం. రెండు సరైనవే అని తేల్చడం ఒకరకమైన నిర్ణయం. ఒకే ద్రవ్యానికి కాలబేధాన్ని బట్టి కలిగె నిర్ణయం మరొక రకం.

## వాదం

వాదం, జల్పం, వితండం అని కథ మూడు విధములు. స్వపక్ష స్థాపనకుగాని, పరపక్ష ఖండనానికి గాని వాదిప్రతివాదులు ఉపయోగించు వాక్య సందర్భానికి కథ అని పేరు. ఒకే వస్తువునందు పక్షప్రతిపక్షాలు, విరుద్ధధర్మాలు ఎలా ఉంటాయి. ఉదాహరణకు లోకంలో ఆత్మకలదని కొందరు లేదని కొందరు వాదిస్తారు. ఆత్మయందు విరుద్ధాలైన అస్తిత్వనాస్తిత్వాలు పక్షప్రతిపక్షాలు. ఇలాంటి పక్షప్రతిపక్షాలను స్వీకరించి, ప్రయోగించుట వాదమనబడును. ఇందు ఒక పక్షం వారు ప్రమాణాలను తర్కాన్ని ఆత్మ కలదని సాధిస్తారు. ఇంకొక పక్షం వారు ప్రమాణాన్ని తర్కాన్ని అనుసరించే వేరొక పక్షాన్ని దూషిస్తారు. ఇలా కొంత వరకు సాధన ధూషణలు సాగిన తర్వాత అస్తిత్వ నాస్తిత్వ పక్షాలలో ఏదో ఒక పక్షం స్థిరపడుతుంది. అదే తత్వమని పక్షద్వయం వారు నిర్ణయిస్తారు. ఈ వాదం సిద్ధాంతానికి సరిపోయేదిగా ఉండాలి. అనగా  సిద్ధాంతానికి ఉపకరించెడి ప్రసంగాలతో కూడి ఉండాలి. ఇందులో పంచావయవాల వినియోగం ఉండాలి.

## జల్పం

ప్రమాణం, తర్కం,ఛలం, జాతి, నిగ్రహస్థానం వీటిని పురస్కరించుకుని, ఒక అర్థాన్ని సాధిస్తూ మరొక అర్థాన్ని ధూషిస్తూ పక్షప్రతిపక్షాలను స్వీకరించుట జల్పమనబడును. వాదంలో అందరూ తత్వాన్ని తెలుసుకోవాలనే కోరికతో ఉంటారు. జల్పమున పరస్పర జిగీషతో ప్రవర్తిస్తారు. వాదంలో ప్రమాణ తర్కములను పురస్కరించుకొనియే సాధన ఉపాలంబనలు ప్రవర్తిల్లుతాయి. జల్పమున ఒక యథార్థాన్ని సాధించడానికి ఛల, జాతి, నిగ్రహస్థాయిని కూడా ఉపయోగిస్తారు.

## వితండం

ఇది కథలో మూడోది. స్వపక్షాన్ని స్థాపించకుండా పరపక్షాన్ని ఖండించడం వితండం. “శ్రీహర్ష పండితుడు తన పక్షాన్ని స్థాపించకుండా పరపక్షాన్ని ఖండించడమే వితండం” అని తన కావ్యంలో చెప్పాడు.

## హేత్వభాసం

హేతువు వలె భాషించునది హేత్వభాసం. అనగా హేతువు కాకపోయిన హేతువు వలె భాసించునది. దుష్టహేతువు అని భావం. ఇది ఐదు విధాలు.

1. సవ్యభిచారం

2. విరుద్ధం

3. ప్రకరణసమం

4. సాధ్యసమం

5. కాలాతీతం

**సవ్యభిచారం**:- ఒకదానితో కలిసి ఉండకపోవుట వ్యభిచారం అనబడును. వ్యభిచారం అనగా అవ్యవస్థ. అవ్యవస్థితమైన హేతువు సవ్యభిచారం. దీనినే అనైకాంతికం అని కూడా అంటారు.

**విరుద్ధం**:- తనశాస్త్రంలో అంగీకరింపబడిన సిద్ధాంతానికి ఏ హేతువు ప్రతికూలమవునో అదే విరుద్ధం.

**ప్రకరణసమం**:- సంశయం కలిగినది మొదలు నిర్ణయం కలిగే వరకు మనుష్యునకు కలుగు సమాలోచనం చింత అనబడుతున్నది. దానినే కుతూహలం అంటారు. ఇలాంటి కుతూహలం దేనివలన కలుగుతుందో దానినే హేతువుగా స్వీకరించినచో ప్రకరణసమం అంటారు.

**సాధ్యసమం**:- మనిషి సంశయగ్రస్తమైన విషయాలను పరిశీలించి ఒక నిర్ణయానికి రావాలని ప్రయత్నిస్తాడు. ఆ నిర్ణయానికి హేతువు అవసరం. సిద్ధమైన దానినే హేతువుగా స్వీకరించడం అవసరం. అసిద్ధమైన హేతువుచే ఆ నిర్ణయం సిద్ధింపదు. నిర్ణయానికి పరిగ్రహింపబడిన హేతువు సిద్ధం కాక సాధ్యమైనట్లైతే దానిని సాధ్యసమం అంటారు.

**కాలాతీతం**:- ఒక యుద్ధాన్ని సాధించడానికి హేతువును చూపిస్తారు. హేతువులో రెండు భాగాలుండేటప్పుడు అందులో మొదటి భాగం రెండవదాని కాలం వరకు అనువర్తింపక పోయినట్లయితే ఆహేతువు కాలాతీతమవుతున్నది.

## ఛలం

విజయాన్ని కోరే వాదిప్రతివాదులు ప్రసంగించేటప్పుడు, ప్రతిపక్షంలో ఉండే వారి వాక్యం ఆక్షేపించదిగినది ఐతే ఆ వాక్యానికి అర్థాంతర కల్పన చేసి ప్రతివాదిని ఆక్షేపించడం ఛలం. ఈ ఛలం మూడు రకాలు అవి

**వాక్ఛలం**:- వాది "నవకమ్బలోయం మానవకః" అని ప్రయోగించునపుడు నూతనమైన కంబలం కలవాడీ బ్రహ్మచారి అని అర్థం. నవ శబ్దానికి తొమ్మిది అను అర్థం కూడా ఉన్నది. వాది నూతనం అనే అర్థంలో ప్రయోగించాడు. వాదికి ఇష్టంకాని తొమ్మిది కంబలములు కలవాడీ మానవుడు అనే అర్థాన్ని తీసుకుని ప్రతివాది వాదిని ఆక్షేపించడం వాక్ఛలం.

**సామాన్యఛలం**:- బ్రాహ్మణుడు విద్యాచార సంపన్నుడు అని వాది ప్రయోగించునపుడు, అందరు బ్రాహ్మణులు విద్యాచార సంపన్నులు కారని వ్యతిరేకించడం సామాన్యఛలం.

**ఉపచారఛలం** :– వాక్యంలో అభిద, లక్షణ, వ్యంజన అను మూడు విధాలైన శబ్దవృత్తులుంటాయి. వీటిని బట్టి వాది ప్రతివాదులు వాదన గావించడం ఉపచారఛలం.

**జాతి**

వాది ఒక అర్థాన్ని నిరూపించునపుడు ప్రతివాది కొన్ని యుక్తులనుపయోగించి దానినాక్షేపించును. అపుడు వాదికి ఉచితాలైన ప్రతియుక్తులు తనకు స్ఫురించనట్లైతే సామ్యాన్ని బట్టి, వైషమ్యాన్ని బట్టి ప్రతివాది చూపిన యుక్తులను ఖండించడానికి ఉపయోగించే ధూషణాభాసం జాతి అనబడును.

## పిఠరపాకవాదం

వైశషికులు చెప్పిన పీలుపాకవాదం అయుక్తం. ఘటాన్ని తయారుచేసి ఆవం లో పెడతారు. కుండపైన రకరకాలైన బొమ్మలు వేస్తారు. ఈ బొమ్మలు తర్వాత కూడా అలాగే ఉంటాయి. కాబట్టి ఘటంలో పరమాణువులన్ని శిథిలమవడం సాధ్యపడదు. కాబట్టి పిఠరం లోనే పాకం కలుగుననుట యుక్తం. దీనినే పిఠరపాకవాదం అంటారు.

# 1.4 యోగదర్శనం

యోగదర్శనకర్త పతంజలి. భాష్యకర్త వ్యాసమహర్షి. వార్తికకారుడు విజ్ఞానభిక్షువు. ఇందులో నాలుగు పాదములు, 194 సూత్రాలు కలవు. అధ్యాయాలు లేవు. బుద్ధి సత్వపురుషులకు భేదం గ్రహించకపోవడం వలన బంధం కలుగుతుంది. వాటి బేధజ్ఞానం వలన కైవల్యం కలుగుతుంది. ఇందులో పురుషుడు అసంగ చిద్రూపుడు. బుద్ధి సత్వము. త్రిగుణాత్మకము. అయస్కాంతం వలె అది పురుషుని ఆకర్షిస్తుంది. బుద్ధి సంబంధం విడిపోయి మరల తత్సంబంధం పురుషునికి కలగకపోవడమె మోక్షం. అదే కైవల్యం. అష్టాంగయోగం వలన సమాధి సిద్ధించును. ఈశ్వర ప్రణిధానం వలన కూడా సమాధి సిద్ధించును. దాని వలన సత్వపురుషబేధం కలుగుతుంది. సాంఖ్యదర్శనంలో ఈశ్వరుడంగీకరింపబడలేదు. పతంజలి యోగదర్శనంలో ఈశ్వరుని

అంగీకరించారు. ఈ దర్శనంలో మూడు ప్రమాణాలు, 25 తత్వాలు, ఈశ్వరుడు అంగీకరింపబడ్డారు. అవిద్యమూలమున బంధం కలుగునని వివేకజ్ఞానం వలన కైవల్యం సిద్ధించునని ఈ దర్శనం చెపుతున్నది. బంధమోక్షాలు నిజంగా బుద్ధిధర్మాలు. అవి పురుషునియందు ఆరోపితములైనవి.

## పతంజలి

భగవత్పతంజలి ముని యోగదర్శనమును రచించెను. పతంజలి ఆదిశేషుని అవతారం.

**"ఆబాహు పురుషాకారం**

**శంఖచక్రశి ధారిణం**

**సహస్రశీర్షం దేవం**

**పతంజలిం ప్రణమామ్యహం"** ప 1-1

అనురీతిని పతంజలి వేయిపాముపడగలే శిరస్సులుగా కలవాడని తెలియబడుతున్నది. ఇక్కడ ఒక ఐతిహ్యం చెప్పవలసి ఉన్నది. గోనర్ద దేశమున గోణిక అను సూర్యోపాసుకురాలు ప్రాతస్సమయమున సూర్యునకర్ఘ్యమిచ్చునపుడు ఆమె దోసిలి నుండి వేయిపడగలతో ఒక వ్యక్తి బయటకు తుల్లెను. ఆమె చెకితురాలై తొందరలో "**కోర్భవాన్**" అన్నది. "**సపోహం**" అని సమాధానం వచ్చినది. "**క్వగతో రేఫః**" అని మరల ఆమె అడిగెను. "**త్వయాపహృతః**" అని ఆవ్యక్తి పలికినాడు. మరల ఆమెకు యోగమార్గాన్ని బోధించి ఆ వ్యక్తి తనమార్గమున తాను పోయినాడు. అంజలి నుండి బయట పడ్డవాడు కనుక అతడు పతంజలి. ఇది ఐతిహ్యం.

## పతంజలి గ్రంథములు

పతంజలి మహర్షి యోగసూత్రములు, వ్యాకరణభాష్యం, చరకసంహిత, పరమార్థసారం అను నాలుగు గ్రంథాలు రచించాడు. ఇందులో మహాభాష్యం జగత్ప్రసిద్ధము. చరకసంహిత పతంజలిచే రచింపబడినదని లోకంలో చాల మందికి తెలియదు.

## యోగసూత్రాలు

ఇవి నాలుగు పాదాలుగా ఉన్నవి. మొదటిపాదమైన సమాధిపాదంలో 51 సూత్రాలు, రెండవపాదమైన సాధనానిర్దేశపాదంలో 55 సూత్రాలు, మూడవపాదమైన విభూతిపాదంలో 54 సూత్రాలు, నాల్గవపాదమైన కైవల్యపాదంలో 34 సూత్రాలు ఉన్నవి. ఈ శాస్త్రం కపిలదర్శనాన్ని అనుసరించి ఉన్నది. కపిలదర్శనం వలె 25 తత్వాలను అంగీకరించి పురుషునికంటే అధికునిగా ఈశ్వరుని ఈ దర్శనం అంగీకరిస్తున్నది. కపిల సాంఖ్యం నిరీశ్వరం కాగా ఈశ్వరుని అంగీకరించినందున ఈ శాస్త్రాన్ని సేశ్వరసాంఖ్యం అనవచ్చును.

## యోగనామకరణం

**"యుజసమాధౌ"** అను సమాధ్యర్థకం నుండి యోగశబ్దం నిష్పన్నమవుతున్నది. యుజిర్ యోగే అనుధాతువు నుండి కూడా యోగశబ్దం పుడుతుంది. ప్రాకృతమున సమాధ్యర్థకమే యోగశబ్దం.

## యోగభాష్యం

పతంజలి యోగసూత్రాలకు వ్యాసభగవానుడు భాష్యాన్ని రచించాడు. వ్యాసముని బ్రహ్మసూత్రాలను రచించాడు. "ఏతేన యోగః ప్రత్యుక్తః" అను సూత్రం చేత యోగాన్ని అంగీకరించాడు. అతడే యోగసూత్రాలకు భాష్యాన్ని రచించాడు.

## యోగవార్తికం

వ్యాసుని యోగసూత్ర భాష్యానికి విజ్ఞానభిక్షువు వార్తికాన్ని రచించాడు. ఇది విపులమైన టీక. భాష్యానికి కావలిసిన అంశాలన్నింటినీ చూపి ఈ వార్తికాన్ని రచించెను. విజ్ఞానభిక్షువు సాంఖ్య కారికలకుగల గౌడపాదుని భాష్యానికి కూడా భాష్యాన్ని రచించాడు. యోగభాష్యానికి శ్రీ శంకరభగవత్పాదులు కూడా చక్కని భాష్యాన్ని రచించారు. అలాగే ఈ భాష్యానికి వాచస్పతి మిశ్రుడు వ్యాఖ్య రాసాడు. పతంజలి యోగసూత్రాలకు భోజదేవుని వృత్తి కలదు. ఇలాగె అనంతదేవుడు కూడా యోగసూత్రాలకు వృత్తిని రాసాడు. ఈ రీతిగా యోగసూత్రాలకు సంబంధించిన ప్రకరణ గ్రంథాలను పండితులు రాసారు. వైయాకరణ నాగేశుడు యోగసూత్రభాష్యాన్ని రచించాడు.

## యోగంగాలు

ఉన్నత స్థితికి రావాలనుకునె వాడికి ఏకాగ్రత అవసరం. ఈ ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి ఎనిమిది యోగాంగాలు చూపించబడినవి. యోగాంగానుష్టానం వలన అశుద్ధరూపమైన విపర్యయం నశించును. అది నశింపగా సమ్యగ్ జ్ఞానమభివ్యక్తమవుతుంది. విపర్యయమెంత క్షీణిస్తుందో అంత జ్ఞానదీప్తి వర్ధిల్లుతుంది. కనుక యోగాంగాలు ఆవశ్యకాలు. యోగాంగాలు ఎనిమిది అవి

**1.యమము**:- ఇది మొదటి యోగాంగం. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం అని ఇది ఐదు విధాలుగా ఉన్నది. అహింస వలన శాస్వత శత్రుత్వం ఉన్న జంతువులు కూడా మిత్రులగును. ఎలుక, పిల్లి సైతం కలిసి జీవిస్తాయి. అంటే అహింసను పాటిస్తున్న మనిషి దగ్గరకు ఇతర జంతువులు చేరినపుడు హింసాత్మక ప్రవృత్తిని వీడి ప్రవర్తిస్తాయి. సత్యం వలన క్రియాఫలాలు సిద్ధిస్తాయి. సత్యమాడు వాని వాక్కు శుద్ధమవుతుంది. ఎవరినైన అతడు దీవిస్తే ఆ దీవెన నిజమవుతుంది. ఆస్తేయం వలన సర్వదిక్కులకు కీర్తి వ్యాపిస్తుంది. బ్రహ్మచర్యం వలన వీర్యం లభించును. అపరిగ్రహం వలన చాల ప్రయోజనాలు కలుగుతాయి. పూర్వం ఏ జన్మలు తానెత్తాడో అవి తెలియబడును. అలాగే ఈ జన్మలో జరగబోవు విశేషాలన్ని తెలియబడును. రాబోవు పరిస్థితులు గోచరించును.

**2.నియమము**:- ఇది శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానం అని ఐదు విధాలుగా ఉన్నది. ఇందు శౌచం రెండు విధములు.1. శరీరం, 2. అంతరం. శరీర సౌచం వలన శరీరం నిర్మలమగుచున్నది. ఒక వేళ శరీరం శుద్ధపరచని యడల దుర్గంధం వచ్చును. ఈ స్థితిని గుర్తించనివాడు మట్టి, జలం మొదలైనవాటి చేత శరీరాన్ని శుభ్రపరచినప్పటికీ దాన్ని శుభ్రతగా గుర్తింపడు. ఈ రీతిగా తన శరీరం పైనే తనకి జుగుప్స కలుగుతుంది. క్రమంగా అతడు తన శరీరంపైన అభిమానం విడిచి యతి అవుతాడు. ఇలాంటి స్థితిలో శుద్ధిలేని పరుని శరీరాన్ని స్పృశింపడు. అంతర శుద్ధి వలన సత్వశుద్ధి, సామరస్యం, ఏకాగ్రత, ఇంద్రియజయం లభిస్తాయి. ఆత్మదర్శనయోగ్యత్వం కూడా కలుగుతుంది. సంతోషం వలన సర్వోత్తమమైన సుఖం లభిస్తుంది.

తపస్సు వలన అశుద్ధి నశించును. దాని వలన అణిమాది కాయసిద్ధి లభిస్తుంది. స్వాధ్యాయం వలన తన చేత కోరబడే దేవతల దర్శనం కలుగుతుంది.

**3.ఆసనము** :- నిశ్చలంగా, సుఖంగా కూర్చోవడమే ఆసనం. ఇది పలు విధాలుగా ఉంటుంది. పద్మాసనం, వీరాసనం, భద్రాసనం, దండాసనం, క్రౌంచాసనం మొదలైన ఆసనాలు ప్రసిద్ధమైనవి.

**4.ప్రాణాయామం** :- ఆసనజయం కలుగగా ఉచ్వాసనిచ్వాసాల గతినిరోధం కలుగుతుంది. అది ప్రాణాయామం అనబడుతుంది. ప్రాణాయామం వల్ల పాపం క్షీణిస్తుంది. ఆ పాపం నశిస్తే వివేకజ్ఞానం వృద్ధి చెందుతుంది.

**5.ప్రత్యాహారం** :- ఇంద్రియాలను విషయాలవైపు ప్రవర్తింపజేయక, చిత్తం యొక్క స్వరూపాన్ని అనుసరింపజేయుట ప్రత్యాహారం అనబడుతుంది. చిత్తం స్థిరతను పొందినపుడు ఇంద్రియాలు అది చెప్పినట్లుగానే నడుస్తాయి.

**6.ధారణం** :- చిత్తాన్ని నాభిచక్రం మీదగాని, హృదయపద్మం మీద గాని, మూర్ధయందుగాని, జ్యోతిస్సుయందు గాని, నాశికాగ్రం మీదగాని, జిహ్వాగ్రం మీదగాని బంధించడం ధారణ అనబడును. బాహ్యావిషయాలపైన చిత్తాన్ని జ్ఞానరూపంగా బంధించడాన్ని ధారణ అంటారు.

**7.ధ్యానం** :- ఇలాంటి ధారణ మూలంగా ధ్యానం సిద్ధిస్తుంది. ధారణ యొక్క ఏకాగ్రతలో పరమాత్మను సాధించడమే జ్ఞానం అనబడుతుంది.

**8.సమాధి** :- ఆ ధ్యానమే ధ్యేయవస్తువు యొక్క ఆకార రూపమై ప్రత్యయాత్మకమైన స్వరూపంతో శూన్యమైనది వలె ఉన్నట్లయితే అది సమాధి అనబడుతుంది.

## సంయమం

అంతరంగ సాధనాలైన ధారణధ్యాన సమాధులు మూడింటిని కలిపి సంయమం అనే పేరుతో పిలుస్తారు. ఇది ఒక యోగశాస్త్రపరిభాష. యమనియమాదులకి ఒక క్రమం ఉన్నది. ఇవన్ని వరుస ప్రకారం సాధించదగ్గవి. అంతేగాని ఒక దానిని విడిచి వేరేదాన్ని చేర వీలులేదు.

## క్రియాయోగం

పైన చూపబడిన వాటిలో తపస్సు స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం అనేవి క్రియాయోగాలు. తపస్సు చేయనిదే యోగం సిద్ధించదు. అనాది సిద్ధమైన క్లేశవాసన తపస్సు వలనే క్షీణిస్తుంది. ఓంకారం మొదలైన మంత్రముల జపము, మోక్షశాస్త్రాధ్యయనం స్వాధ్యాయమనబడును. ఈ క్రియాయోగం వల్ల సమాధి భావితమౌతుంది. క్లేశాలు తగ్గుతాయి. ఈ క్రియాయోగమె లేకపోయినట్లయితే యోగం అంటదు.

## యోగం

చిత్తవృత్తుల నిరోధమే యోగం(" **యోగశ్చిత్తవృత్తి నిరోధ**") అని చెప్పబడుతున్నది. చిత్త వృత్తులైదు. అవి ప్రమాణవిపర్యయవికల్పనిద్రాస్మృతులు. ఇందు ప్రత్యక్షం అనుమానం ఆగమమని ప్రమాణాలు మూడు. విపర్యయమే మిథ్యాజ్ఞానమనబడును. మనిషిలో అస్మిత రాగ ద్వేష అభినివేసాలుగా కనపడేది అవిద్య. వికల్పమనేది విచిత్రమైన చిత్తవృత్తి. "శబ్దజ్ఞానానుపాతి వస్తుశూన్యో వికల్పః" అని పతంజలి సూత్రం. శబ్దంవల్ల కలిగే జ్ఞానాన్ని అనుసరించి కలిగె వస్తుశూన్యమైన చిత్తవృత్తి వికల్పం అనబడుతుంది. అనుభూతమైన విషయాలకు సంప్రమోషణం లేని చిత్తవృత్తి నిద్ర అనబడును. పై ఐదింటిని నిరోధించడమే యోగం అనబడుతుంది.

# 1.5 పూర్వమీమాంస దర్శనం

ఈ దర్శనకర్త జైమిని. భాష్యకర్త శబరస్వామి. కుమారిలభట్టు వార్తికుడు. జైమిని మహర్షి తన శాస్త్రాన్ని పదహారు అధ్యాయాలుగా రాశాడు. అధికరణ పద్ధతిలో ఈ శాస్త్రం విషయాన్ని చూపిస్తుంది. వేదవిహితమైన కర్మలనాచరించడం వల్ల ధర్మం వృద్ధి చెందుతుంది. నిషిద్ధకర్మలను, కామ్యకర్మలను ఆచరింపక నిత్యకర్మలనాచరించినచో పాపమంతా నశిస్తుంది. దాని మూలంగా ధర్మాధర్మాలు కూడా నశిస్తాయి. కర్మఫలానుభవం కాగ ఈ శరీరం నశిస్తుంది. ధర్మాధర్మములు లేనందువల్ల మరొక శరీరం ఆత్మకు సంక్రమించదు. ఈ రీతిగా ఆత్యంతిక శరీర సంబంధ రాహిత్యాన్ని పొందడమే మోక్షము. ఇది నివృత్తి ధర్మం వల్ల సిద్ధిస్తుంది. ప్రవృత్తి ధర్మం వల్ల స్వర్గాద్యభ్యుదయం లభిస్తుంది. ఈ

దర్శనం నిరీశ్వరదర్శనం అయినప్పటికీ వేదప్రామాణ్యాన్ని అంగీకరించడం వల్ల ఇది కూడా ఆస్తిక దర్శనమే. ఈ దర్శనం ప్రకారం ఆత్మ జ్ఞానాశ్రయం. జ్ఞానరూపం కాదు. ఆత్మకు మనస్సుతో ఉండే సంబంధం వల్ల బుద్ధిఇచ్ఛాద్వేషాదులనే తొమ్మిది గుణములు ఆత్మకు కలుగుతాయి. ఆ గుణములు మోక్షదశయందు మనస్సుతో సంబంధం లేనందువల్ల నశిస్తాయి. మోక్ష దశయందు ఆత్మ కూడా జడరూపమె. ఇందు ఆరు ప్రమాణములు అంగీకరింపబడినవి.

## పదార్థ నిరూపణము

ఈ శాస్త్రమున ఆరు పదార్థములు అంగీకరించబడినవి. అవి ద్రవ్యము, గుణము, కర్మము, సామాన్యము, శక్తి, అభావము. ఇందు ద్రవ్యం 11 విధాలుగా ఉన్నది. అవి పంచభూతములు, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సు, శబ్దము, తమస్సు

### గుణములు

ఇందు 21 గుణములంగీకరింపబడినవి.

1. రూపము

2. రసము

3. గంధము

4. స్పర్శ

5. సంఖ్య

6. పరిణామము

7. సంయోగము

8. విభాగము

9. పరత్వము

10. అపరత్వము

11. గురుత్వము

12. ద్రవత్వము

13. స్నేహము

14. బుద్ధి

15. సుఖము

16. దుఃఖము

17. ఇచ్ఛ

18. ద్వేషము

19. ప్రాకట్యము

20. ధ్వని

21. సంస్కారం

## కర్మ

ఇది ప్రత్యక్షముగనె కనబడును.

## సామాన్యము

దీనినే ఆకృతి అని అంటారు. ఇది రెండు విధాలు. ఒకటి మహా సామాన్యం. రెండు అవాంతరసామాన్యం. ద్రవ్య, గుణ, కర్మ, సామాన్యములు నాలుగింటియందు ఉండేది మహా సామాన్యం. ద్రవ్యాదులందుండేది అవాంతర సామాన్యం.

### శక్తి

ఇది ప్రత్యేక పదార్థం. రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి లౌకికము. రెండు అలౌకికము. అగ్న్యాదులందుండే దాహకత్వాది శక్తి లౌకికము. యాగాదులందుండే స్వర్గాది సాధనత్వశక్తి అలౌకికము.

### అభావము

ఇది నాలుగు విధాలుగా ఉంటుంది. ఒకటి ప్రాగభావము. రెండు ధ్వంసాభావం. మూడు అత్యంతాభావం. నాలుగు అన్యోన్యాభావం

## జైమిని సూత్రములు

జైమిని మొత్తం 2745 సూత్రాలను రచించాడు. ఇవి 12 అధ్యాయాలుగా విభజింపబడినవి. ప్రత్యధ్యాయమున నాలుగు పాదాలు కలవు. మూడు, ఆరు, పది అధ్యాయాలలో మాత్రము ఎనిమిదేసి పాదములు కలవు. అందుచేత వాటిని శరభాధ్యాయములు అని వ్యవహరిస్తారు. న్యాయ వైశేషిక సాంఖ్య యోగ వ్యాకరణ శాస్త్రముల కంటే విలక్షణమైన మార్గమున ఈశాస్త్రమున పదార్థనిర్ణయం చేయబడినది. అధికరణ మూలమున శాస్త్రీయ ప్రక్రియ నడపబడినది. అధికరణమనగా విచారస్థానము. ఇందు ఐదు అంశములుండును. అవి విషయము, సంశయము, పరపక్షము, సిద్ధాంతం, సంగతి. ప్రత్యధికరణమునకు ఏదో ఒక వేదవాక్యము విషయము. ఆ వాక్యము ఏ అర్థమును బోధించుచున్నదో అది సంశయము. నిరాకరింపతగినదానిని సంయుక్తముగా ప్రతిపాదించుట పూర్వపక్షము. పూర్వ పక్షకోటిని నిరాకరిస్తూ స్వీకరించదగిన పక్షమును నిర్దేశించుట సిద్ధాంతం. సంగతి అనగా సందర్భము. పూర్వమీమాంస శాస్త్రానికి జిజ్ఞాసాధికరణం మొదటిది.

### విషయం

ఈ అధికరణమునకు " **స్వాధ్యాయోధ్యేతవ్యః** " అనునది విషయము. స్వాధ్యయము అధ్యయనం చేయతగినది. అనగా వేదము చదువుకొనతగినది అని అర్థము. ఇది విధి వాక్యం.

## సంశయం

ఈ వాక్యం వేదం వల్లించవలెనని చెప్పుచున్నది. అయితే వేదమును వల్లించుట దేనికొరకు స్వర్గమును పొందుటకా? లేక వేదము యొక్క అర్థమును తెలుసుకొనుటకా? అయితే వేదము యొక్క అర్థాన్ని కూడా తెలిసికొనవలెనని వేదము చెప్పుచున్నది. ఫలితార్థమేమనగా వేదాధ్యయనము స్వర్గము కొరకు అన్నచో వేదార్థ విచారము వేదవిహితం కానేరదు. వేదాధ్యయనం వేదార్థాన్ని తెలుసుకోవడం కోసం అన్నచో విచారణ చేయనిదే అర్థం తెలియరాదు. కనుక విచారణ కూడ వేద బోధితమగుచున్నది.

## పూర్వపక్షం

వేదాధ్యయనం స్వర్గార్థమే. అర్థము తెలిసికొనుటకు కాదు. ఎలా అంటే వేదం వల్లించిన తరువాత అర్థం తెలిసికొనవలెనని వేరుగా చెప్పనక్కరలేదు. భారతం చదువుతున్నవాడు అర్థాన్ని తెలుసుకొంటున్నాడు కదా! కనుక అర్థము తెలిసికొనవలెనని వేరుగా చెప్పనక్కరలేదు.

## సిద్ధాంతం

భారతానికి అర్థాన్ని రాసుకొని వల్లించవచ్చును. లేక భాషాంతరీకరణ చేసుకుని అర్థం తెలుసుకొనవచ్చును. మరొక విధంగా అయిన భారతార్థం తెలుసుకోవచ్చు. వేదార్థము అలాంటిదికాదు. వేదమును ముందు వల్లించి దాని మూలముననే అర్థమును తెలుసుకొనవలెను. భాషాంతరీకరణాదులచే సంపాదించరాదు. కనుక వేదాధ్యయనము వలె వేదార్థము కూడ తెలుసుకొనవలెనని చెప్పుటకు విధివాక్యం అత్యావశ్యకము. కాబట్టి వేదాధ్యయనం వేదార్థం తెలుసుకోవడానికి మాత్రమే మరొకదానికి కాదు. వేదము చదవడం వల్ల కలిగే అర్థం అనే ఫలము నేరుగా సిద్ధిస్తున్నది. దీనిని విడిచి మరొకదాని వెంబడి పడటం అవివేకమే అవుతున్నది.

## సంగతి

శాస్త్రసంగతి, అధ్యాయసంగతి, పాదసంగతి, అధికరణ సంగతి అని ఇది నాలుగు విధములు. పయిరీతిని జైమిని యొక్క ద్వాదశలక్షిణి లోకవ్యాప్తమాయెను. మరియు అతడు తన పన్నెండు

అధ్యాయముల శాస్త్రమునకు పరిశిష్టముగా నాల్గు అధ్యాయాలను రాసాడు. దానిని సంకర్షకాండ అని వ్యవహరిస్తారు. ఇందులో ప్రత్యధ్యాయమున నాల్గు పాదములు కలవు.

## మీమాంస భాష్యం

జైమిని యొక్క సూత్రములకు శబరస్వామి భాష్యమును రచించెను. శబరస్వామికి ఆదిత్యదేవుడు అను పేరు కలదు. ఇతడు జైనమతస్థులతో విరోధించి వారివలన అపాయాన్ని తప్పించుకోవడానికి అరణ్యమున ప్రవేశించి శబరులతో సఖ్యం చేసెను. అందువలన ఇతనికి శబరస్వామి అను నామం కలిగినది. శంకరభగవత్పాదులు శబరస్వామి భాష్యమును అనేకచోట్ల ప్రస్తావించి ఉన్నారు. శబరస్వామి సూత్రాలలో లేని చాల విషయాలను భాష్యమున చర్చించి ఉన్నారు. మీమాంస సూత్రాలలో దేహాతిరిక్తమగు ఆత్మ ఉన్నదని చెప్పబడలేదు. కాని శంకరులు దీనిని ప్రస్తావించారు.

## మీమాంస వార్తికము

శబర భాష్యానికి కుమారిలభట్టు వార్తికాన్ని రాశారు. ఇది తంత్రవార్తికము అను ప్రసిద్ధితో అలరారుచున్నది. ఇది చాల ప్రౌఢమైన వ్యాఖ్యానం.

## మీమాంస శాస్త్రసారం

విధి, మంత్ర, నామధేయ, నిషేధ, అర్థవాద అనురీతిని వేదం ఐదు విధాలుగా ఉంటుంది. వేదరాశి అంతా పురుషునకు శ్రేయస్సును సాధించుటకే ఉపకరిస్తున్నది. ఎలా అంటే **"స్వాధ్యాయోధ్యేతవ్యః"** అని వేదము చెప్పుచున్నది. వంశపరంపరగా వస్తున్న ఏదో ఒక వేదశాఖను గురువు నుండి నేర్చుకొనవలెను. అధ్యయనమనునది వేదము యొక్క సంస్కారము. అనుపయుక్తమగుదానికి సంస్కారము నిరర్థకమె యగును. కనుక అధ్యయనము చేసే స్వాధ్యయమునకు ఉపయోగముండవలెను. వేదము కేవలము వల్లించుటకు మాత్రమేకాదు. ప్రయోజనవంతమైన అర్థబోధ కలగవలెను. అర్థము తెలుసుకొని విధితమైన తరి యాగాదులను ఆచరింపవలెను. ఆచరించనట్లైతే స్వర్గపుత్రపశుభృత్యాది సంపద కలుగుతుంది. ఇవి అన్ని అశాస్వతములని తెలిసిన పిమ్మట నివృత్తిబోధ కలిగి మోక్షము సిద్ధించును.

### అపూర్వము

విధి పదములచే బోధింపబడు యాగ, దాన, హోమాదులు క్రియారూపాలు. యాగములను ఆచరించుటవలన స్వర్గాదిఫలములు లభించునని వేదమున చెప్పబడినది. స్వర్గాది ఫలములు శరీరమును విడిచిన పిమ్మట కలుగును. యాగాదులు క్రియారూపములు కావడం వల్ల అవి క్షణికములు. క్షణికములైన వాటివల్ల స్వర్గాది సుఖములు ఎలా కలుగుతాయని సందేహం కలగవచ్చును. ఈ రెండింటికి సంధి కుదుర్చునదే అపూర్వము. దీని వలననే స్వర్గాది ఫలములు పొందగలుగుతున్నాము.

### ఆత్మ

ద్రవ్యము తొమ్మిది విధాలుగా విభజింపబడినది. అందు ఆత్మ ఒకటి. చైతన్యాశ్రయము ఆత్మ. అది దేహేంద్రియ సుఖములకంటే భిన్నమైనది. దీని విషయంలో సాంఖ్యవేదాంతుల మతాలు కూడా అయుక్తాలే.

## 1.6 ఉత్తరమీమాంస

వేదం నాలుగుభాగాలుగా వేదవ్యాసునిచే విభక్తమయినది. అవి సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు

1. **సంహితలు** – మంత్రభాగం, స్తోత్రాలు, ఆవాహనలు
2. **బ్రాహ్మణాలు** – సంహితలోని మంత్రమును గాని, శాస్త్రవిధినిగాని వివరించేది బ్రాహ్మణం. యజ్ఞయాగాదులలోవాడే మంత్రాల వివరణను కూడా ఇదే తెలియపరుస్తుంది.
3. **అరణ్యకాలు** – వివిధ కర్మ యజ్ఞకార్యముల అంతరార్థాలను వివరించేవి అరణ్యకాలు. ఇవి బ్రాహ్మణాలకు ఉపనిషత్తులకు మధ్యస్థాయిలో ఉంటాయి. ఇవి కూడా బ్రాహ్మణాల లాగానే కర్మవిధులను ప్రస్తావిస్తాయి.
4. **ఉపనిషత్తులు** – ఇవి పూర్తిగా జ్ఞానమును ప్రబోధించునవి. వీటికే బ్రహ్మవిద్య అని పేరు. ఇది జీవాత్మ పరమాత్మల గురించి, మోక్షము, పరబ్రహ్మస్వరూపము తదితర విషయాలను గురించి ప్రస్తావిస్తుంది. నాలుగు వేదాలకు కలిపి మొత్తం 1180 ఉపనిషత్తులున్నాయి. వేదాల శాఖలు అనేకంగా ఉండడమే ఈ సంఖ్యకు కారణం. వీటిలో 108 ఉపనిషత్తులు

ముఖ్యమైనవి. వాటిలోనూ దశోపనిషత్తులు ఉన్నతమైనవి. ఈ ఉపనిషత్తులకే వేదాంతమని, పూర్వమీమాంసయని పేరు కలదు.

## ఉపనిషత్తు – పదతాత్పర్యం

ఉపనిషత్తు అను పదాన్ని ఆదిశంకరులు ఇలా నిర్వచించారు. " **కేన పునరర్థ యోగేన ఉపనిషత్ శబ్దేన విద్యా ఉచ్యతే, ఇత్యుచ్యతే యే మముక్షవో దృష్టానుశ్రవిక విషయ వితృష్ణాః సంతః ఉపనిషత్, శబ్దవాచ్యం వక్ష్యమాణలక్షణాం విద్యాం ఉపసద్యః ఉపగమ్య, తన్నిష్టతయా నిశ్చయేన శీలయంతి , తేషాం అవిద్యాదేః సంసార బీజస్య విశరణాత్, హింసనాత్, వినాశానాత్ ఇత్యనేన అర్థయోగేన విద్యా ఉపనిషదిత్యుచ్యతే**" అనగా ఏ వ్యుత్పత్తి లక్షణంద్వార ఉపనిషత్తు పదానికి విద్య అనే అర్థం వచ్చినది? అది ఇక్కడ వివరించబడినది. చూసిన, వినిన విషయ వస్తువులందు వైరాగ్యభావం కలిగి ఏ మముక్షువులు ఇప్పుడు చెప్పబోయే ఉపనిషత్తు అనే విద్యను నేర్చుకుని తదేకనిష్టతో దానిని పరిశీలిస్తారో, వారిలో సంసారమూలహేతువైన అవిద్య తొలగింపబడుతుంది. ఆ వ్యుత్పత్త్యర్థాలచే ఉపనిషత్తుకు విద్య అనే అన్వయం కలిగింది. శిష్యుడు గురువుకు దగ్గరగా కూర్చుని అభ్యసించే గ్రంథం కనుక అది ఉపనిషత్తు అయింది. ఇది గురుశిష్యుల అత్యంత సన్నిహిత సహవాసానికి ప్రతీక. అభిలషించే విద్య మరింత శ్రేష్టతమమవుతున్న కొద్దీ వారి సహవాసం మరింత హెచ్చుతుంది. అవగాహన పెరుగుతుంది.

## ఉపనిషత్తులు – విభాగాలు

ఉపనిషత్తులు వేదముల సారమని, వేదరహస్యమని అనేకులు వర్ణన చేసారు. ఒకప్పుడు వెయ్యిన్నీ ఎనిమిదిగా ఉండే వీటి సంఖ్య ఇప్పుడు నూట ఎనిమిదిగా మార్పు చెందింది. వాటిలోను పదింటిని మాత్రమే ప్రత్యేకమైనవిగా చెపుతారు. అవి ఈశోపనిషత్తు, కేనోపవ్నిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, తైత్తరీయోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తులు. శైవులు తమవని భావన చేసే ఉపనిషత్తులు పదిహేనున్నాయి అవి అక్షమాలికోపనిషత్తు, అథర్వశిరోపనిషత్తు, అథర్వశిఖోపనిషత్తు, కాలాగ్ని రుద్రోపనిషత్తు, కైవల్యోపనిషత్తు, గణపతి ఉపనిషత్తు, జాబాలోపనిషత్తు, దక్షిణామూర్తి ఉపనిషత్తు, పంచ బ్రహ్మోపనిషత్తు, బృహజ్జాబాలోపనిషత్తు, భస్మజాబాలోపనిషత్తు, రుద్రహృదయోపనిషత్తు, రుద్రాక్షజాబాలోపనిషత్తు, శరభోపనిషత్తు, శ్వేతాశ్వతరోపనిషత్తులు. వైష్ణవులు తమవిగా భావించే

పద్నాలుగు ఉపనిషత్తులున్నాయి. అవ్యక్తోపనిషత్తు, కలిసంతరణోపనిషత్తు, కృష్ణోపనిషత్తు, గారుడోపనిషత్తు, గోపాలతాపసోపనిషత్తు, తారసోపనిషత్తు, త్రిసాద్విభూతిఉపనిషత్తు, దత్తాత్రేయోపనిషత్తు, నారాయణోపనిషత్తు, నృసింహతాపసీయోపనిషత్తు, రామతాపసఉపనిషత్తు, రామరహస్యోపనిషత్తు, వాసుదేవోపనిషత్తు, హయగ్రీవోపనిషత్తులు.

సన్యాసానికి సంబంధించిన లక్షణాలను విధివిధానాలను తెలియజేసే ఉపనిషత్తులు కొన్ని ఉనాయి అవి అరుణికోపనిషత్తు, అవధూతోపనిషత్తు, కఠశ్రుత్యోపనిషత్తు, కుండినోపనిషత్తు, జాబాలోపనిషత్తు, తురియాతీతోపనిషత్తు, అవధూతోపనిషత్తు, నారద పరివ్రాజకోపనిషత్తు, నిర్వాణోపనిషత్తు, పరబ్రహ్మోపనిషత్తు, పరమహంస పరివ్రాజకోపనిషత్తు, పరమహంసోపనిషత్తు, బ్రహ్మోపనిషత్తు, భిక్షుకోపనిషత్తు, మైత్రేయోపనిషత్తు, యాజ్ఞవాల్క్యోపనిషత్తు, శాత్యాయన ఉపనిషత్తు, సన్యాసోపనిషత్తులు. పై విధముగా ఉపనిషత్తులు విభక్తమయినవి.

## ప్రధాన ఉపనిషత్తులు – విహంగ వీక్షణం

### ఈశోపనిషత్తు

ఉపనిషత్తులన్నింటిలో అగ్రగణ్యంగా భావింపబడే ఈశోపనిషత్తుకు ఒక విశేష ప్రాముఖ్యత ఉన్నది. దీని మొట్టమొదటి మంత్రాన్ని ప్రామాణికంగా తీసుకుని, మిగతా ఉపనిషత్తులన్ని దానిని సమర్థించడానికి ప్రయత్నిస్తాయి. అంతే కాక, ఈ గొప్ప ప్రతిపాదనలోని తత్వాన్ని ఆధారంగా చేసుకుని భగవద్గీతలో యోగసిద్ధాంతం చిత్రీకరింపబడింది. ఈశోపనిషత్తు, భగవద్గీతల మధ్య అతి సన్నిహిత ఆధ్యాత్మిక బాంధవ్యం ఉన్నది. శంకరాచార్యులు గీతాభాష్యం ఉపోద్ఘాతంలోఉపనిషత్తులను సకల వేదాల సారసంగ్రహంగా వర్ణించారు. భగవద్గీత ప్రతి అధ్యాయం చివర ఉండే ఆశ్వాసాంతవాక్యం ఉపనిషత్తుల గంభీరత్వంలోని నైతిక ఆధ్యాత్మిక గూఢార్థాలను తెలియజెప్పుతున్నట్లు స్వయంగా ప్రకటిస్తుంది. ప్రాచీన భారతీయ చింతనాశీలురందరూ ఈశోపనిషత్తు నుండే స్ఫూర్తిని పొందారు. గీతాపారాయణానికి ముందు ఈశ, కేన, కఠోపనిషత్తులను ఈ క్రమంలో అధ్యయనం చేస్తాం. కాని మనం ముఖ్యంగా అధ్యయనం చేయవలిసింది భగవద్గీతనే. స్వామి వివేకానంద చెప్పినట్లు దానిలో ఈ కాలానికి చెందిన తత్వమున్నది. అది ఒక ప్రత్యేక వాదాన్నిగాని, మతాన్నిగాని ప్రతిపాదించదు. దానికి సంకుచిత వర్గీయ దృష్టి లేదు. మానవుడి జీవితంలోని అనుభవావస్థలన్నింటిలోకి అది తొంగి చూడగలుగుతుంది. భగవద్గీత యొక్క మూలం ఈశోపనిషత్తులో ఉన్నదన్న మాట సత్యం. ఈశోపనిషత్తులో ఉదయించిన ప్రశ్న " ఈ జగత్తు

ఏమిటి?". ఈ ప్రశ్న సమస్త జ్ఞానానికి నాంది. ప్రతి పసికందుకు ఈ ప్రపంచం రణగొణ ధ్వనులతో కూడిన గందరగోళంగా తోస్తుంది తర్వాత శిశువు మెల్లమెల్లగా ఈ ధ్వనులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. సఫలమనోరథుడవుతాడు. యువకులు, వయోజనులు దీనిని సయుక్తిక , వైజ్ఞానిక విశ్లేషణాను సంధానాలతో ఇంకా స్పష్టంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు. అలాగే జీవుడు కూడా మొదట తన గురించే ఆలోచన చేశాడు. తర్వాత్తర్వాత ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. పాశ్చాత్యులు కూడా ఈ ప్రశ్నకు సమాధానాన్ని అన్వేషించారు. అయితే భారతీయులు ఈ ప్రశ్నకు సమాధానాన్ని అధ్యాత్మిక పరంగా అన్వేషించి కృతకృత్యులయ్యారు. ఈశోపనిషత్తులోని రెండవ మంత్రం ఇలా ఉన్నది.

**" కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిశేత్ శతగ్ం సమాః**
**ఏవం త్వయి నాన్యథేతః అస్తి న కర్మ లిప్యతే నరే" ఈ 1-1**

పై శ్లోకం శాస్త్రకర్మలకు సంబంధించింది. ఉపనిషత్తులు భౌతిక ప్రపంచాన్ని గురించి సంభావన చేయవని కొందరు భావిస్తారు. ఆ మాటలో సత్యం లేదని ఈ ఉపనిషద్వాక్యం చెపుతున్నది.

## కేనోపనిషత్తు

ఈ ఉపనిషత్తు సామవేద సంబంధితమై శ్రీ శంకర భగవత్పాదులచే భాష్యం వ్రాయబడింది. దశోపనిషత్తులలో ఒకటిగా ఇది పరిగణింపబడింది. ఈ ఉపనిషత్తు తల్వకార్ బ్రాహ్మణములోని తొమ్మిదవ అధ్యాయములో ఉన్నది. అందుకే దీన్ని తల్వకార్ ఉపనిషత్తు అని, బ్రాహ్మణోపనిషత్తు అని కూడా అంటారు. ఈ జీవితం ఎవరి చేత ప్రేరేపింపబడింది? అనే ప్రశ్నచే ఇది ప్రారంభింపబడింది. కావున దీనికి కేనోపనిషత్తు అని పేరు కలిగింది. సర్వప్రేరకుడైన ఆ పరబ్రహ్మ యొక్క మహిమ, అతని స్వరూపం గురించి ఈ ఉపనిషత్తు తెలియజేస్తుంది. చెప్పడానికి వినడానికి బ్రహ్మతత్వం ఎంత తేలికో ఆచరణకు మాత్రం బ్రహ్మతత్వం అంత దుర్లభమై ఉన్నది. ఇందులోని ప్రథమ, ద్వితీయ ఖండములలో గురుశిష్యుల సంవాద రూపములో అత్యంత మనోహరంగా పరబ్రహ్మం గురించి పేర్కొనబడింది. సర్వశక్తివంతుడైన పరబ్రహ్మం గురించి అనివార్యంగా తెలుసుకోవలసిన విషయాలు అనుభూతులు రమ్యంగా వర్ణింపబడ్డాయి. మూడవ, నాల్గవ ఖండాలలో దేవతల యొక్క గర్వం ఏ విధంగా అణచబడిందో విపులముగా చెప్పబడింది. పరబ్రహ్మము యొక్క చేతనత్వం యక్షుని రూపంలో ప్రత్యక్షం కావటం, దేవతల గర్వమనచడం ఈ ఉపాఖ్యానంలో అగుపిస్తుంది. పిదప ఉమాదేవి రూపంలో ప్రకటితమై దేవతలకు బ్రహ్మతత్వమును బోధించుట జరిగినది. చివరకు పరబ్రహ్మను

ఉపాసించు విధానము మరియు ఫలప్రాప్తి గురించి పేర్కొనబడింది. అలాగే బ్రహ్మవిద్య యొక్క రహస్యమును కనుక్కొను మహిమ తెలుపబడింది. కేనోపనిషత్తు శాంతి మంత్రం ఇలా ఉన్నది.

**" ఓం ఆప్యాయంతు మామాంగాని వాక్ ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి సర్వం బ్రహ్మోపణిషదం మహం బ్రహ్మ నిరాకుర్యాం మామా బ్రహ్మ నిరాకరోద నిరాకరణ మస్త్వ నిరాకరణం మేస్తు తదాత్మణి నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సంతు తే మయి సంతు"**

ఓ పరమాత్మ! మా అవయవములన్నియు పుష్టికరముగా ఉండుగాక. మా వాణి, ప్రాణములు, నేత్రములు, చెవులు, బలము మరియు సంపూర్ణ ఇంద్రియములు పుష్టివంతంగా ఉండుగాక. ఈ ఉపనిషత్తులో ప్రతిపాదిత జ్ఞానం బ్రహ్మమై ఉన్నది. మనము దీనిని అస్వీకారం చేయరాదు. ఈ బ్రహ్మము కూడ మనలను పరిత్యజించరాదు. మనకు దీనితో దీనికి మనతో అవినాభావ సంబంధం అవిచ్ఛిన్నముగా ఉన్నదని శాంతిమంత్ర భావం.

**" కేనేషితం పతతి ప్రేషితం మనః కేన ప్రాణః ప్రథమః పైతి యుక్తః కేనేషితం వాచామిమాం వదంతి చక్షుః శ్రోతం క ఉ దేవో యునక్తి"** అను మొదటి మంత్రము వలన ఈ ఉపనిషత్తుకు ఆ పేరొచ్చినది.

## కఠోపనిషత్తు

కృష్ణయజుర్వేదాంతర్గతంగా ముప్పది రెండు ఉపనిషత్తులున్నవి. ఇందులో నుండి రెండు ఉపనిషత్తులకు శ్రీశంకర భగవత్పాదుల వారు భాష్యం రాశారు. అవే కఠతైత్తరీయోపనిషత్తులు. ఇందులో వాజశ్రవస్తుడను ముని యొక్క కుమారుడైన నచికేతుడు యమధర్మరాజు నుండి ఆత్మవిద్యను పొందు ఉదంతం వర్ణింపబడింది. ఈ ఉపనిషత్తు యొక్క శాంతి పాఠము అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

**" ఓం సహనావవతు**
**సహ నౌ భునక్తు**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు మావిద్విషావ హై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః"**

ఓ పరమాత్మ! గురుశిష్యులమైన మమ్ములను రక్షింపుము. నేర్చుకున్న విద్యలతో మమ్ములను ప్రకాశింపజేయుము. త్రివిధ తాపముల నుండి రక్షింపుము.

## కఠోపనిషత్తు – కథ

చాల రోజులకు పూర్వము వాజశ్రవసుడు అనే ముని వాజ గ్రామమున నివాసము చేయుచుండెడివాడు. అతనికొక చురుకైన పుత్రుడుండేవాడు. ఆ పుత్రుని పేరు నచికేతుడు. వాజశ్రవసుడు విశ్వజిత్తు అను యజ్ఞము చేసి తన సంపదనంతటినీ దానం చేశాడు. దక్షిణ రూపంలో తన తండ్రి చేయుచున్న దానాలను పరికించిన నచికేతుడు ఆలోచించసాగాడు. వాజశ్రవసుడు చేస్తున్న దానాలలో అతిముఖ్యమైనవి ఆవులు. దానం చేయుచున్న ఆవులు మిక్కిలి క్రుంగి, క్రుశించి నీరసించి గ్రహీతకు ఉపయోగపడని రీతిలోఉన్నవి. ఆ ఆవులు నీరుత్రాగలేని స్థితిలో మేత మేయలేని స్థితిలో ఉన్నవి. అవి ప్రస్తుతము సంతానోత్పత్తి శక్తిని కూడా కోల్పోయి జీవచ్చవములై ఉన్నవి. వీటిని నచికేతుడు పరిపరి విధాల వీక్షించసాగెను. విశ్వజిత్తు యజ్ఞము చేసి, ఇలాంటి దానాలు ఇచ్చి స్వర్గలోకమునకు వెళ్ళడం సాధ్యం అవుతుందా? అను సందేహం అప్పుడతనికి కలిగినది. కావున తనను దానమిచ్చిన యెడల ఏదైన పుణ్యము తండ్రికి కలుగునేమోయని ఆలోకించి, తండ్రి వద్దకు పోయి తండ్రిగారు నన్నెవరికి దానమిచ్చెదరని యడిగెను. తండ్రి నుండి సమాధానం రాలేదు. కావున రెండవసారి కూడా నన్నెవరికి దానమిచ్చెదరని సవినయంగా అడిగెను. కాని తండ్రి నుండి సమాధానం రాలేదు. నచికేతుడు ప్రయత్నం మానలేదు. తన తండ్రిని ఈ విషమ పరిస్థితినుండి గట్టెక్కించుటకు కంకణబద్ధుడై మూడవసారి కూడా అలాగే అడిగినాడు. తండ్రి మిక్కిలి విసుగుచెంది, నిన్ను సూర్యుని కుమారుడైన మృత్యువుకు దానమిచ్చెదనని పలికినాడు. ఈ మాటలు విన్న నచకేతుడు శాంతముగా, అన్యాలోచన లేక ఉండెను. ఈ రకంగా ఆలోచించిన వాడై తండ్రి మాట ప్రకారం యముని దగ్గరకు వెళ్ళుటకు ధృఢచిత్తుడైనాడు. తనకు మరల జన్మము పొలము లోని పంట వలె కలుగునని యోచన చేసినాడు. కావున తండ్రి దగ్గరకు నిర్భయంగా వెళ్ళి నాన్నగారు! నన్ను యమునికి దానమిచ్చినారు. కావున యమపురికి పంపండి అని నిర్భయంగా అనెను. వాజశ్రవసుడు కుడితిలో పడ్డ ఎలుకవోలె కొట్టుమిట్టాడి, చివరకు సత్యవాక్పరిపాలనాదక్షుడై కొడుకుని యమపురికి పంపాడు. నచికేతుడు యమపురికి చేరి మూడు రాత్రులు అన్నపాణాదులు లేకుండా గడిపెను. యముడు దేశాటనమునకు వెళ్ళియుండెను. కావున నచికేతునికి దైవదర్శనం కాలేదు. అంతట యమధర్మరాజు నచకేతుని చేరుకుని, ఓ బ్రాహ్మణ కుమారా! నీకు నమస్కారం, నీకు కళ్యాణమగు గాక. నీవు నమస్కార యోగ్యమైన అతిథివై యుండి కూడా మా సదనములో మూడు రాత్రులు ఉపవాసముంటివి. అందుకని రాత్రికి ఒకటి చప్పున మూడు రాత్రులకు మూడు వరములు ఇవ్వదలచితిని. ఏ వరము కావలెనో కోరుకొనుము అనెను. ఓ యమధర్మరాజ! మొదటి వరం

అడుగుతున్నాను వినండి. మా తండ్రి వాజశ్రవసుడు మీరు నన్ను ఇక్కడి నుండి పంపిన పిదప నాతో ప్రేమగా , కోపరహితుడై మెలగాలి. యమధర్మరాజు తథాస్తు అనెను. రెండవ వరముగా నాకు అగ్నివిద్యను ఉపదేశించుమని యముని నచికేతుడడిగెను. అప్పుడు యముడు నచికేతునితో " ఓ నచికేతా! స్వర్గతుల్యమైన ఈ అగ్ని సంస్కారం గురించి నాకు తెలిసినదంతా చక్కగా నీకు ఉపదేశించెదను. వినుము. ఈ అగ్ని అనంతలోకాలను ప్రాప్తింపజేయునదై ఉన్నది. స్వర్గలోక రూపఫలప్రాప్తికి సాధనమైన మరియు విరాట్ రూపజగత్తుకు నిలయమైన అగ్నిని బుద్ధిమంతులైనవారు ఉపాసన చేయుదురు. లోకముల యొక్క ఆది కారణభూతమైన అగ్నిని సంగ్రహించుట ఎట్లో వివరంగా చెప్పెను. మృత్యుదేవత చెప్పినదంతా శ్రద్ధగా విన్న నచికేతుడు తిరిగి ఉన్నదున్నట్లు చెప్పెను. దానికి ప్రసన్నుడైన యముడు ఇలా పలికినాడు. ఓ నచికేతా! ఈ అగ్ని నీ పేరుతోనే చరితార్థమగునట్లు వరమిచ్చుచున్నానని అనేక రూపములు మహిమలు గల మాలను ఇచ్చెను. ఈ మాల వలన నచికేతుడు జీవన్ముక్తుడయినాడు. అంతట నచికేతుడు యమధర్మరాజుతో ఓ ధర్మరాజా! చాలమంది చనిపోయిన వ్యక్తి యొక్క ఆత్మ ఉంటుందని, ఉండదని జనులు వాదులాడుతున్నారు. ఈ విషయమై నాకు సందేహమున్నది. నా సందేహాన్ని మాపి పుణీతుణ్ణి చేయమని ప్రార్థన చేశాడు. అప్పుడు యముడు ఓ నచికేతా! పూర్వము ఈ విషయమై దేవతలకు కూడా సందేహం కలిగినది. ఈ సూక్ష్మధర్మాన్ని సుగమతా పూర్వకముగా ఆర్జించ యోగ్యము కానిదని తెలుసుకొనుము. ఏదేని మరొక వరము కోరుకొమ్ము" అని అనెను. అయిన నచికేతుడు పట్టు వదలకుండా ఆత్మవిద్యనే ప్రబోధించమని అడిగాడు. "ఓ నచికేతా! నీవు ఇష్టమొచ్చినంత కాలము బ్రతకటానికి నీ సంతానానికి, నీ మనుమలకు వంద సంవత్సరాలు ఆయువే కాకుండా వలసినన్ని పశువులు, ఏనుగులు, బంగారము, అశ్వములు ఇచ్చెదను. ఎంత భూమిని కోరుకున్నా ఇచ్చెదను. ఏదేని మరొక వరము కోరుకున్నా ఇచ్చెదను. నీ కోరికలన్నీ ఈడేరునట్లు, భోగములు అనుభవించునట్లు చేసెదను. మానవలోకంలో నీకు తీరని కోరికలు తీరునట్లు, అప్సరసల చెలిమి, పొందు దొరుకునట్లు వారి సేవలు నీకందునట్లు చేసెదను. దయచేసి ఈ ఆత్మవిద్యను విడువుము" అనెను. అంతట నచికేతుడు ఈ భోగములతో నాకు నిమిత్తం లేదు. ఈ విషయవాంఛలతో సంపూర్ణ ఇంద్రియములు జీర్ణదశకు చేరుకుంటాయి. మీరు ప్రలోభ పెట్టినవి ఏవీ నేను స్వీకరించలేను. మనిషిని ధనముతో లోబరుచుకోవచ్చునేమో గాని తృప్తి పరచలేము. అందుకని నాకు కూడా భోగలాలసలేదు. నాకు కేవలం ఆత్మవిద్య యొక్క రహస్యం వరంగా ప్రసాదించండి. నచికేతుని

యొక్క యోగ్యతను గమనించిన యముడు ఆత్మవిద్యను ప్రబోధించాడు. యోగవిద్యనుకూడా ఉపదేశించాడు.

## ప్రశ్నోపనిషత్తు

ఈ ఉపనిషత్తు అధర్వణ వేద సంబంధితమైనది. శంకరభగవత్పాదులు దీనికి భాష్యం రాశారు. తలమాణికమైన దశ ఉపనిషత్తులలో ఇది ఒకటిగా పరిగణింపబడుతున్నది. ఈ ఉపనిషత్తు యొక్క శాంతి మంత్రం ఇలా ఉన్నది.

**" ఓం భద్రం కర్ణేభిః శృణుయాదు దేవా భద్రం పశ్యే**
**మాక్షభిర్యజత్రాః స్థిరై రంగైస్తు ష్టువాగ్ం స్తనూభిః వ్యశేమ దేవ**
**హితం యదాయుః స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి**
**నః పూషా విశ్వవేదాః స్వస్తి నస్తాక్షరో అరిష్టనేమిః**
**స్వస్తి నో బృహస్పతిర్దదాతు ఓం శాంతిఃశాంతిః శాంతిః"**

ఓ దేవా మేము కర్ణములద్వార కళ్యాణమయ వచనములను విందుముగాక. మా నేత్రముల ద్వార శుభకరమైన విషయములను చూడటమే కాకుండా శరీరావయములన్నియు దైవహితములై యుండునుగాక. ఇంద్రుడు, సూర్యుడు, గరుడుడు, బృహస్పతి అందరూ శుభములు కలుగుజేయుదురు గాక. అలాగే త్రివిధతాపములు నశించుగాక!

**కథ** – భరద్వాజ పుత్రుడు సుకేశుడు, శిబి పుత్రుడు సత్యకాముడు, గర్గసుతుడు, అశ్వల పుత్రుడు కౌశల్యుడు, విదర్భవాసి భార్గవుడు, కాత్య వంశీయుడైన కాత్యాయన కబంధి మున్నగు పరబ్రహ్మ ఉపాసకులైన ఆరుగురు ఋషులు పరబ్రహ్మ గురించి మిక్కిలిగా తెలిసికొను నిమిత్తము చేతుల్లోకి సమిధలు తీసుకుని, మహర్షియైన పిప్పలాదుని కడకు వెళ్ళిరి. మహర్షి పిప్పలాదుడు అగంతక ఋషులను సమాదరించి, ఇట్లు చెప్పెను. **"మీరు బ్రహ్మచర్య పూర్వకంగా, శ్రద్ధాపూర్వకంగా తపమాచరిస్తూ ఒక సంవత్సరకాలము ఇక్కడే ఉండండి. పిదప మీ ఇచ్ఛ వచ్చిన ప్రశ్నలడగండి. అప్పుడు నేను నాకు తెలిసిన మేరకు ప్రత్యుత్తరమిచ్చెదను"**. ఒక సంవత్సరకాలము గడిచిన తర్వాత కాత్యాయన కబంధుడు పిప్పలాది మహర్షి చెంతకు చేరి ఇలా అడిగెను." ఈ ప్రజలు ఎక్కడి నుండి జన్మించుచున్నారు?"

మహర్షి పిప్పలాదుడు ఇలా చెప్పెను.

" ప్రజల వృద్ధిని కోరిన ప్రజాపతి తపమాచరించి, తదనంతరము జలమును ప్రాణమును సృష్టించెను. తద్వార ప్రజలను సృష్టించవచ్చని తలచెను. ఆదిత్యుడే ప్రాణస్వరూపుడై, చంద్రుడు ప్రకృతియై కనిపించుచున్నాడు. సూర్యదేవుడే వైశ్వానర అగ్నిరూపుడై, విశ్వరూపుడై, ప్రాణరూపుడై ప్రకటితమగుచున్నాడు. ఈ విషయం వేదమంత్రాల ద్వార ఋజువైనది. అన్నమే ప్రజాపతియై ఉన్నాడు. దాని ద్వారానే వీర్యం ఉత్పన్నమవుతున్నది. ఆ పిదప విదర్భదేశీయుడైన భార్గవుడు పిప్పలాదుని ఇలా అడిగాడు. " ఓ దేవా! ప్రజలను ధరించు దేవతల యొక్క సంఖ్య ఎంత? అందులో నుండి ఏ దేవత ప్రకాశింప చేయుచున్నది మరియు వరిష్ట దేవత ఎవరు? మహర్షి పిప్పలాదుడు భార్గవఋషికి ఇలా ప్రత్యుత్తర మిచ్చెను. నిశ్చయముగా ఆకాశము, అగ్ని, వాయువు, జలము, పృధ్వి, మరియు మనస్సు వాక్కు నేత్రములు మరియు చెవులు మున్నగునవన్నియును దేవతలే అనబడుతున్నవి. ఈ సమస్తదేవగణము ప్రకటితమై " మేమే ఈ శరీరమును ధరించుచున్నాము మరియు మేమే ఆశ్రయదాతలమై యున్నాము. ఈ అన్ని దేవతలలో సర్వశ్రేష్ఠమైన ప్రాణము ఇలా అనెను. "మీరంతా మోహమును త్యజించండి. అయిదు విభాగములలో మీకు ఆశ్రయం కల్పించి ధరించుచున్నాను. ప్రాణము చెప్పిన ఈ మాటలను మిగతా దేవతలు విశ్వశించలేదు. అప్పుడు ప్రాణము తన శ్రేష్టత్వమును ఋజువు చేయుటకు శరీరంలో నుండి బయటకు వెళ్ళదొడగెను. వెను వెంటనే వాక్కు, నేత్రములు, మనస్సు, కర్ణేంద్రియములాదిగా గల ఇంద్రియములు తమతమ ఆశ్రయములను కోల్పో సాగెను. ఎప్పుడైతే ప్రాణము తనను తాను నిలువరించుకొనెనో అప్పుడు ఇంద్రియములన్నియు తమతమ స్థావరములయందు నిలువదొక్కుకొనెను. ఏ రకంగా తేనెటీగలు తేనెపట్టును చుట్టుకొనియుండి రాణి తేనెటీగ లేవగానే లేవడం కూర్చోగానే కూర్చోవడం చేస్తాయో అదే రకంగా ప్రాణం యొక్క శ్రేష్టత్వం నిరూపింపబడినందున వాక్కు మున్నగు దేవతలు ప్రాణం యొక్క శ్రేష్టత్వమును గుర్తించి స్తుతింతురు. ఆ పిదప కౌశల్య అశ్వలాయణుడు పిప్పలాద మహర్షిని ఇలా అడిగెను. ఓ దేవా! ప్రాణము యొక్క ఉత్పత్తి ఎచ్చట నుండి జరిగింది? అది శరీరంలోకి ఎలా వస్తుంది? బయటకు ఎలా వెళ్ళిపోతుంది? లోపట, బయట ఎలాంటి శరీరాన్ని ధరిస్తుంది?"చాలా జటిలమైన ప్రశ్నలని, అయినను మీరు బ్రహ్మ నిష్ఠాపరులు కావున చెప్తున్నానని పిప్పలాద మహర్షి చెప్పదొడగెను. ఈ ప్రాణం యొక్క ఉత్పత్తి ఆత్మనుండి జరుగును. దేహమును అంటి పెట్టుకున్న నీడవలె ప్రాణము ఆత్మను అంటి పెట్టుకుని యుండును. ఈ ప్రాణం మనస్సు యొక్క సంకల్పం చేత శరీరంలోనికి ప్రవేశించును. విజ్ఞులైన జనులు ప్రాణ తత్వమును తెలుసుకొని అమృతత్వమును ప్రాప్తించుకొందురు. ఆ పిదప సూర్యుని మనుమడయిన గార్గ్యుడు పిప్పలాదమహర్షిని ఇలా అడిగెను.

" ఓ దేవా! మానవుడు తన జీవిత పర్యంతం ఓంకారోపాసన చేసిన యొడల ఏ లోకమును ప్రాప్తించుకొనగలడు? అప్పుడు పిప్పలాద మహర్షి ఇలా చెప్పెను " ఓ సత్యకామా! ఈ ఓంకారమే నిశ్చయముగా పరబ్రహ్మమై, అపరబ్రహ్మమై ఉన్నది. ఒక వేళ సాధకుడు ఒక్క మాత్ర ఓంకారమును ధ్యానించిన యొడల అతడు శీఘ్రముగా జగత్తును ప్రాప్తించుకొనును. అచ్చట అతడు బ్రహ్మచర్యముతో, తపముతో, శ్రద్ధతో సంపన్నుడై మహిమాన్వితుడగును. ఒకవేళ సాధకుడు రెండు మాత్రల ఓంకారమును ధ్యానించిన యొడల అతనికి యజుర్వేద మంత్రములు తోడ్పడి అంతరిక్షములో స్థితమై యున్న సోమలోకమునకు తీసుకెల్లును. ఆ సోమలోకంలో అమృత తుల్య అనుభూతులను పొంది తిరిగివచ్చును. ఏ సాధకుడైతే మూడు మాత్రల ఓంకారమును ధ్యానించునో అతడు తేజోమయ సూర్యలోకమును ప్రాప్తించుకొనును. ఆ పిదప సుకేనుడు ఇలా అడిగెను" ఓ దేవా! పదుహారు కళల సంపన్న యుక్తుడైన పురుషుడు ఎవరు?" పిప్పలాదుడు ఈ విధంగా ఉత్తరమిచ్చెను " శరీరంలోనే షోడశకళలు ఉత్పన్నమై యుండును. అవి వరుసగా ప్రాణము, శ్రద్ధ, ఆకాశము, వాయువు, జ్యోతి, జలము, పృధ్వి ఇంద్రియములు, మనస్సు,అన్నము, వీర్యము, తపము, మంత్రము, కర్మ, లోకము, మరియు పేరు. ఋషులెల్లరు పరబ్రహ్మమును తెలుసుకొని పిప్పలాది మహర్షికి నమస్కరించి వెడలిపోయిరి.

## ముండకోపనిషత్తు

ఈ ఉపనిషత్తు అధర్వ వేద సంబంధమైనది. శ్రీ శంకర భగవత్పాదులచే దీనికి భాష్యం రాయబడింది. దశోపనిషత్తులలో ఒకటిగా చెప్పబడుతుంది. ఈ ఉపనిషత్తు యొక్క శాంతిమంత్రము ఇలా ఉన్నది.

**" ఓం బ్రహ్మ దేవానాం ప్రథమః సంబభూవ విశ్వస్వ**
**కర్తా భువనస్య గోప్తా**
**స బ్రహ్మవిద్యాం సర్వవిద్యా ప్రతిష్ఠామథర్వాయ**
**జ్యేష్ఠ పుత్రాయ ప్రాహ"**

దేవదేవుడైన బ్రహ్మం అందరు దేవతల కంటే ముందుగా ఉత్పన్న మాయెను. అతడు విశ్వమును నిర్మించాలనుకొనెను. మరియు పదునాలుగు భువనముల రక్షకుడాయెను. అతడు తన జ్యేష్ఠ పుత్రుడైన అథర్వునునికి సమస్త విద్యలకు ఆధారభూతమైన బ్రహ్మవిద్యను ఉపదేశించెను.
కథ – సత్ గృహస్థుడైన శౌనకుడు, అంగీరసుని వద్దకు శిక్షార్థియై వచ్చి ఇలా అనెను.

**" ఓ దేవా! ఏది తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లవుతుందో అది బోధించండి"**

అంగీరస ఋషి శౌనకునికి ఇలా చెప్పెను.

" బ్రహ్మవేత్తలు చెప్పిన ప్రకారము బ్రహ్మవిద్యలో పరావిద్య మరియు అపరావిద్య అని రెండు కలవు. పరా విద్య అనగా ఓంకార విద్య. అపరావిద్య లో ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం, శిక్ష, కల్పము, వ్యాకరణం, నిరుక్తము, ఛందస్సు మరియు జ్యోతిషము గురించిన జ్ఞానముండును. ఎవరినైతే చూడలేమో, ఎవరినైతే పట్టుకోలేమో, ఎవరికైతే గోత్రములేదో, ఎవరికైతే వర్ణము లేదో , ఎవరికైతే నేత్రములు మరియు కర్ణేంద్రియముల యొక్క అవసరము లేదో, ఎవరైతే సర్వకాల సర్వావస్థల యందు నిత్యమై, వ్యాపకమై, సర్వత్ర వ్యాప్తి చెందినవాడై, సూక్ష్మమై, నాశనము లేనివాడై, సంపూర్ణుడైనవాడో ఆ పరబ్రహ్మమును తెలుసుకున్నవాడు ఇతరమును తెలుసుకోవలసిన అవసరం లేదు. సాలె పురుగునుండియే దారము, గూడు ఉత్పన్నమయినట్లుగా పరమాత్మ నుండే సర్వము ఉత్పన్నమాయెను. దేవతల వరకు హవ్యము చేరుటకు అగ్ని మాధ్యమముగా నుండును. అగ్నికి గల సప్త నాలుకలలో మొదటిది కాలీ, రెండవది కరాలీ, మూడవది మనోజవా, నాలుగొవది ఎరుపురంగు కలిగినది. అయిదవది ధూమ్ర వర్ణము కలిగినది. ఆరవది మిరమిట్లు గొలుపునది. ఏడవది దేదీప్యమానమైన విశ్వరుచి గలదియై ఉన్నది. ఏ పురుషుడైతే దేదీప్యమానమైన అగ్నిజ్వాలలు ఎగసిపడునప్పుడు ఆహుతులు ఇస్తాడో వాడు ఇంద్రునితో సమానుడగును. ఆ బ్రహ్మం మరియు ఈ జగత్తు సత్యమైనవి. ప్రదీప్తమైనవి. అగ్ని నుండి వేలాది నిప్పుకణికలు ఉత్పన్నమైనట్లు బ్రహ్మం నుండి అనేక రకాల భావప్రకటనలు వెలువడి మళ్ళీ అందులోనే లీనమవుతున్నవి. ప్రకాశమానమైన, అమూర్త రూప బ్రహ్మం నుండి అనేక రకాల భావప్రకటన వెలువడి మళ్ళీ అందులోనే విలీనమై పోవును. ప్రకాశమానమైన అమూర్త రూపబ్రహ్మంలోపల, బయట సర్వత్ర విద్యమానమై ఉన్నది. ఆ బ్రహ్మం జన్మము లేనివాడై, ప్రాణరహితుడై, మనస్సు లేనివాడై, ఉజ్వలుడై, అవినాశియై పంచభూతములు అతడే అయి ఉన్నాడు. అగ్ని ఆ బ్రహ్మం యొక్క మస్తకమై ఉన్నది. సూర్యచంద్రులు అతని నేత్రములై ఉన్నారు. దిశలు అనగా వేదవాణులు అతని వర్ణములై ఉన్నవి. వాయువు అతని ప్రాణమై ఉన్నది. సంపూర్ణ విశ్వం అతని హృదయమై ఉన్నది. అతని పాదముల యొక్క ఉత్పత్తి పృథ్వియై ఉన్నది. నిశ్చయంగా ఆ బ్రహ్మం సంపూర్ణ ప్రాణులలో అంతరాత్మగా ప్రతిష్టింపబడి ఉన్నది. బ్రహ్మమే అమృతరూప జ్ఞానమై యున్నది. ముందు వెనుక బ్రహ్మమే ఉన్నది. కుడి ఎడమలలో బ్రహ్మమే ఉన్నది. ఈ సంపూర్ణ జగత్తు సర్వశ్రేష్ఠ బ్రహ్మమై ఉన్నది. తోడు నీడగా సఖ్యభావముతో నుండు పక్షులు రెండు ఒకే చెట్టుపై ఉండెను. ఒక పక్షి కర్మఫలమును ఆస్వాదిస్తూ, ఆరగిస్తూ ఉన్నది.

రెండవ పక్షి నిరాహారముగా యుండి కేవలము చూస్తూ ఉండును. దేహంలో ఉన్న జీవాత్మ హోమంలో పడి, అసమర్థతతో, శోకసంతప్తములో పడి యుండును. ఎప్పుడైతే యోగులచే సేవింపబడిన పరమాత్మ యొక్క మహిమను ప్రాప్తించుకొనునో అప్పుడు ముక్తి పొందును.

## మాండూక్యోపనిషత్తు

ఈ ఉపనిషత్తు అథర్వ వేద సంబంధితమై శ్రీ శంకరభగవత్పాదులచే భాష్యం రాయబడింది. తలమానికమైన పది ఉపనిషత్తులలో ఇది ఒకటిగా చెప్పబడుతుంది.

**" ఓమిత్యే తదక్షరమిదం సర్వం తస్యోపవ్యాఖ్యాన భూతం**

**భవద్భవిష్యదితి సర్వమోంకార ఏవ**

**యాచ్చాన్య త్రికాలాతీతం తదప్యోంకార ఏవ"**

"ఓం" అను ఈ అక్షరం అవినాశియైన బ్రహ్మమునకు ప్రతీకగా ఉన్నది. దాని మహిమను ప్రకటించునది. ఈ బ్రహ్మాండమైన విశ్వమై ఉన్నది. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల ఈ ప్రపంచం కూడా ఓంకారమై ఉన్నది. ఈ మూడు కాలాలు కాకుండా ఇతర తత్త్వములు కూడా ఓంకారమై ఉన్నవి. ఈ సంపూర్ణ జగత్తు బ్రహ్మ రూపమై ఉన్నది. ఈ బ్రహ్మము మరియు ఆత్మ నాలుగు చరణములు కలిగిన స్థూల, సూక్ష్మ, కారణ మరియు అవ్యక్త రూపములతో ప్రభావితమై ఉన్నది. ప్రథమ చరణము స్థూలమై, వైశ్వానరాగ్నియై ఉన్నది. ఈ ఆత్మ కూడా బ్రహ్మ స్వరూపమై ఉన్నది. ద్వితీయ చరణం స్వప్నము వలె అదృశ్య లోక జ్ఞానమును అందించునదై ఉన్నది. ఇది జ్యోతిర్మయమై బ్రహ్మం యొక్క ద్వితీయచరణమనబడుతున్నది. సుషుప్తావస్థలో మానవుడు భోగం కోసం వెంపర్లాడడు. స్వప్నములు కూడ చూడలేదు. అతని ముఖము తేజోమయ చైతన్యరూపమై బ్రహ్మం యొక్క నాలుగవ చరణమై ఉన్నది. ఆ బ్రహ్మం ఆత్మాక్షర రూప ఓంకారమై ఉన్నది. ఇది అకార, ఉకార, మకార, మాత్రలు కలిగి ఉన్నది.

## తైత్తరీయోపనిషత్తు

ఈ ఉపనిషత్తు కృష్ణయజుర్వేద సంబంధితమైనది. దీనికి శంకరభగవత్పాదులు భాష్యం రాశారు. ముఖ్యమైన దశోపనిషత్తులలో ఇది ఒకటి. ఇందులో శిక్షావల్లీ, బ్రహ్మానందవల్లీ, భృగువల్లీ అను మూడు భాగములుంటాయి. ప్రతిభాగములో అనేక వేదభాగములు చెప్పబడ్డాయి.

కృష్ణయజుర్వేదాంతర్గత శాంతి పాఠమునకు తోడుగా ఈ తైత్తరీయోపనిషత్తుకు ప్రత్యేకంగా శాంతి పాఠం చెప్పబడింది.

**"ఓం సహనావవతు**

**సహనౌ భునక్తు**

**సహవీర్యం కరవావహై**

**తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై**

**ఓం శాంతిః శాంతిః శాంతిః"**

ఆ పిదప ప్రత్యేకముగా తైత్తరీయోపనిషత్తుకు శాంతి పాఠం ఇలా చెప్పబడింది.

**" ఓం శం నో మిత్ర శం వరుణః**

**శం నో విష్ణు రురుక్రమః**

**శం నో భవత్వర్యమా**

**శం నో ఇంద్రో బృహస్పతిః**

**నమో బ్రహ్మణే**

**నమస్తే వాయో**

**త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి**

**త్వమేవ ప్రత్యక్ష్యం బ్రహ్మ వదిష్యామి**

**ఋతం వదిష్యామి**

**సత్యం వదిష్యామి**

**తన్మామవతు తద్వక్తారమవతు**

**అవతు మామ్**

**అవతు వక్తారమ్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః "**

## శిక్షావల్లీ

వేదములలో ప్రధానమైనది, శ్రేష్టమైనది, సర్వరూపమైనది వృషభము. అలాగే వేదరూప అమృతములో ఓలలాడి ఆవిర్భవించిన ఆ ఓంకార రూప ఇంద్రుడు నన్ను మేధావంతుడుగా, బలయుక్తుడుగా చేయుగాక. ఓ దేవా! నేను అమృతత్వమునకు హేతుభూతమైన బ్రహ్మజ్ఞానమును

ధరింతును గాక. నా శరీరం యోగ్యమైనదిగా ఉండి జిహ్వ, చెవులు, బుద్ధి రక్షింపబడు గాక. నా కొరకు వస్త్రములు, అన్నపాణాదులు, వీటిని విస్తారము చేయు మేకలు మరియు ఉన్ని కలిగిన పశువులు మున్నగు వాటికి క్రమశిక్షణ అలవడచేసి నా దగ్గరకు తీసుకురమ్ము. బ్రహ్మచారులు నా దగ్గరకు వచ్చెదరు గాక. నాయొడల బ్రహ్మచారులు నిష్కపటులుగా ఉండుదురు గాక. బ్రహ్మచారులు జ్ఞానవంతులు అగుదురు గాక. బ్రహ్మచారులు ఇంద్రియ దమనము చేయుదురు గాక. బ్రహ్మచారులు మనోనిగ్రహం చేయుదురు గాక. హృదయ మధ్యములో స్థితమై యున్న ఆకాశములో మనోమయ అమృత స్వరూపుడైన హిరణ్మయ పురుషుడుంటాడు. " భూర్భువః సువః స్వరూపా మహః " అంటూ ఉపాసన చేసిన యెడల మనస్సు యొక్క పతిని పొందవచ్చును. వేదాధ్యయనం పూర్తయినాక ఆచార్యుడు శిష్యులను ఉపదేశించి ఇలా బోధించును. సత్యమును పలుకవలెను. ధర్మమును ఆచరించవలెను. స్వాధ్యాయలో పొరపాటు చేయకుము. ఆచార్యునకు కావలిసిన ధనమును చేకూర్చుము. సంతాన పరంపరను ఒమ్ము చేయకుము. సత్యములో పొరపాటు రానీయకుము. ధర్మములో పొరపాటు రానీయకుము. ఆత్మరక్షణ చేసుకొనుము. ప్రవచనములో పొరపాటు రానీయకుము. వేదకార్యములో మరియు పితృకార్యములో పొరపాటు రానీయకుము. మాతృ పితృ ఆచార్య మరియు అతిథి దేవులను స్మరింపుము. నిందనీయ పనులకు దూరముగా నుండవలెను. గురుజనులను ఉపాశించవలెను. ఆచార్యాదులను స్థాయిని బట్టి గౌరవించవలెను. మీ స్థాయిని బట్టి దానం చేయవలెను. శ్రద్ధాపూర్వకంగా ఒదిగి దానం చేయవలెను. మైత్రీపూర్వకంగా ఉండవలెను. ఆచార వ్యవహారములలో మీకు సందేహం వచ్చిన యెడల పెద్దలను కనుక్కొని వ్యవహరించవలెను. సరళ హృదయులైన ధర్మాభిలాషులను అనుకరించవలెను. ఇది మీకిచ్చే ఆదేశమై ఉన్నది. ఆచరించుట మీ విధి. ఇదియే నా ఉపదేశము. ఇదియే వేదరహస్యము మీరెల్లరు జాగురూకతతో ఉపాసన చేయండి.

## బ్రహ్మానందవల్లీ

బ్రహ్మవేత్తయైనవాడు పరమాత్మను ప్రాప్తించుకొనగలడు. " బ్రహ్మ సత్యమైనది, జ్ఞానము అనంతమైనది" ఏ పురుషుడైతే బుద్ధిరూప పరమ ఆకాశములో బ్రహ్మను వీక్షిస్తాడో ఆ సర్వజ్ఞుడు బ్రహ్మరూపంలో ఒకేమారు సంపూర్ణ భోగములను కైవశం చేసుకోగలడు. ఆత్మతోనే ఆకాశముత్పన్నమైనది. ఆకాశముతో వాయువు, వాయువుచే అగ్ని, అగ్నిచే జలము జలముతో భూమి, భూమితో ఓషధులు, ఓషధులతో అన్నము, అన్నముతో పురుషుడు ఉద్భవించెను. ఆ పురుషుడికి తల,

బాహువులు, శరీర మధ్య భాగములో ఆత్మ, ఆ పిదప దిగువ భాగమున్నది. బాహ్య విషయములను ఆశక్తిగా గమనించేవారు తమను తాము మర్చిపోయే అవకాశమున్నది. ఈ విషయమును స్థిరీకరించుటకు ఒక దృష్టాంతం ప్రసిద్ధమైనది. ఒక మారు పదిమంది కలసి యాత్ర చేయుచుండిరి. మధ్య దారిలో ఒకనది ఉండెను. అతి ప్రయాసతో వారు ఆ నదిని దాటి ఆవలి ఒడ్డుకు చేరిరి. ఎవరైన నదిలో కొట్టుకుపోలేదు కదా అని వారు తమను తాము లెక్కపెట్టుకో సాగిరి. ఎవరు లెక్కపెట్టినా తనను మాత్రం వదలి మిగతా తొమ్మండుగురిని లెక్కించి, ఒకరు కొట్టుకుపోయారని తలంచి, అందరికి అందరూ ఖిన్నులయిరి. ఈ లోపు ఒక బుద్ధిమంతుడైన పురుషుడు అటుగా వెళ్ళెను. విషయమంతా అవగాహన చేసుకుని, వారందరినీ ఒక వరుసలో నిలబెట్టెను. వారందరినీ తానే లెక్కించి, పదిమంది ఉన్నారని లెక్కతేల్చెను. తనను తాను గణించడనుట కథాసారము. అన్నము చేతనే ప్రజలుత్పన్నమగుచున్నారు. అన్నము చేతనే పోషింపబడుచున్నారు. చివరకు అందులోనే లీనమవుతున్నారు. అన్నమనునది సర్వప్రాణులకు జ్యేష్ఠమై ఉన్నది. అన్నము ఔషధం వంటిది. అన్నమే బ్రహ్మమై ఉన్నది. ఎవరైతే అన్నమును ఉపాసించెదరో వారు సంపూర్ణ అన్నమును పొందెదరు. అన్నము ప్రాణుల ద్వార తినబడుతున్నది. అలాగే ప్రాణులను అన్నము తింటున్నది. అన్నమయ పిండము లోపల ఉండునది ప్రాణమయమనబడును. అన్నము మనోమయ అను ఈ రెండింటి చేత మనిషి పరిపూర్ణుడగును. ప్రాణమే ప్రాణుల యొక్క ఆయువై ఉన్నది. అందుకే మనిషి సర్వాయుష్మంతుడగుచున్నాడు. అన్నమందు కోశము యొక్క దేహస్థితి ఆత్మయై ఉన్నది. దీనిలో అంతర్భాగమై ఉండునది మనోమయ ఆత్మ అనబడుతున్నది. యజుర్వేదము శిరస్సుగా, ఋగ్వేదము దక్షిణ పక్షముగా, సామవేదము ఉత్తర పక్షముగా మరియు అథర్వాంగిరసము ప్రతిష్ఠయై ఉన్నది. మనోమయంలోని అంతరాత్మ విజ్ఞానమయమై ఉన్నది. దానిలో ఇది పూర్ణత చెందుచున్నది. విజ్ఞానవంతుడైన పురుషుడు యజ్ఞములను విస్తరింపజేయును. సాధకుడు విజ్ఞాన బ్రహ్మ ఐనచో పాపములన్నియు పరిత్యజించి, సమస్త సుఖములను ప్రాప్తించుకొనును. ఈ విజ్ఞానమయమనునది మనోమయ యొక్క ఆత్మయై ఉన్నది. విజ్ఞానమయము యొక్క అంతర్గత ఆత్మ ఆనందమయమై ఉన్నది. దీనితో అది పూర్ణత్వమును సిద్ధించుకొన్నది. జ్ఞాని గాని, అజ్ఞాని గాని శరీర త్యాగం చేశాక బ్రహ్మను చేరువారెవరు అను ప్రశ్నకు సమాధానంగా ఆచార్యులు వివరణ ఇచ్చి ఉన్నారు. పరమాత్మ స్వయంగా బహు రూపములు ధరించుటకు గానూ, ఉత్పన్నమగుటకుగాను తపమాచరించెను. ఈ యావత్ సృష్టికి మూలకారకుడయ్యెను. సృష్టిని రచించిన పరమాత్మ జీవులలో, నిర్జీవులలో దేశకాలమాన పరిస్థితులకు అనుకూలంగా మరియు ప్రతికూలముగా యోగ్యముగా, అయోగ్యముగా,

అశ్రయముగా అనాశ్రయముగా సత్యాసత్యములో స్థితమై ఉన్నాడు. బ్రహ్మవేత్తలు దీనిని సత్యమని పిలిచెదరు. అంతఃకరణము అంధకారమును పారద్రోలి ప్రకాశమును వ్యాపింపజేయును. మార్గ విజ్ఞానము కేవలము మార్గమునే ఉపదేశించును. బ్రహ్మవిజ్ఞానము" నీవే బ్రహ్మవు" అని ఉపదేశిస్తుంది.

## భృగువల్లీ

వరుణుని యొక్క సుప్రసిద్ధమైన కుమారుడు భృగు తన తండ్రియైన వరుణుని సమీపించి నాన్నగారూ! నాకు బ్రహ్మవిద్యను బోధించుమని కోరెను. సరేయని వరుణుడు చెప్పుట మొదలిడెను. అన్నము, ప్రాణము, నేత్రములు, చెవులు, మనస్సు మరియు వాక్కు అనునవి మనకు భగవదనుగ్రహము వల్లనే లభించినవి. వీటి ద్వారానే మనము బ్రహ్మను చేరుకోగలము. ఎవరి ద్వారా మనకు పైన చెప్పినవన్నియును సమకూరినవో, ఎవరి ఆశ్రయముతో అవి వ్యవహరిస్తూ చివరకు నశించి ఎవరిలో లీనమగుచున్నవో అట్టి వానిని విశేషముగా తెలుసుకొనుటకు ప్రయత్నం చేయాలి అతడే బ్రహ్మయని తెలుసికొనుము. భృగు తపమాచరించుటకు వెళ్ళెను. తపమాచరించి వచ్చిన భృగు అన్నమే బ్రహ్మయని తెలుసుకొనెను. అన్నము తోడనే జీవకోటి ఉత్పన్నమగుచున్నది. జీవించుచున్నది. చివరకు అందులోనే లీనమగుతున్నది. ఈ విషయము తెలుసుకున్నవాడై తండ్రియైన వరుణుని దగ్గరకు తిరిగి వచ్చి బ్రహ్మోపదేశము చేయమని కోరెను. అంతట వరుణుడిట్లనియెను. బ్రహ్మను తపస్సు చేయుట ద్వార తెలిసికొనవలయును. నీవు తపస్సే బ్రహ్మయని గుర్తించుము. సత్యము తెలిసికొన్న భృగువు తపమాచరించుటకు వెళ్ళెను.

## ఐతరేయోపనిషత్తు

తలమానికమైన పది ఉపనిషత్తులలో ఇది ఒకటి. శంకర భగవత్పాదులు దీనికి భాష్యం రాశారు. బ్రహ్మవిద్యను గురించి ఈ ఉపనిషత్తు వివరిస్తుంది. పరబ్రహ్మ అయిన పరమాత్ముడు ఒక క్రమపద్ధతిలో ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. హిరణ్యగర్భుడు అయిన పరమాత్మ తన నుండే జీవరాశిని, దేవతలను సృష్టించి రక్షించుచున్నాడు. అతడు మానవశరీరంలోనే దేవతలు వశించునట్లు చేసి, ఆకలిదప్పులు కలుగునట్లు చేసెను. మానవ శరీరంలో శ్వాసయందు మృత్యువు, కపాలము నందు పరమాత్మ స్థితమై ఉన్నది. మానవుడి జీవిత చక్రమును వామదేవ ఋషి ఇలా చెప్పెను. తల్లి గర్భములో శిశువు ఉండి ఏర్పడుట మొదటి జన్మముగాను, శిశువు జన్మించటం రెండవ జన్మగాను,

మిగతా జీవన కాలమంతా మూడవజన్మగా పేర్కొన్నారు. ఏది ఏమైనను పరమాత్మను కొలవటం వలన మాత్రమే సిద్ధిని పొందగలము. జీవితానికి చివరి పరిణామము మృత్యువు అని తెలియుచున్నది. చనిపోయాక మాత్రమే పరమాత్మలో లీనమవడం జరుగుతుంది. ఈ ఉపనిషత్తుకు సంబంధించిన శాంతిపాఠం ఇలా ఉన్నది.

**" వాణ్మే మనసి ప్రతిష్టితా మనో మేరాచి**
**ప్రతిష్ఠీతమ్ ఆవిరావిర్మ ఏధి**
**వేదస్యుదు ఆజీస్థః శ్రుతం మే**
**హో రా త్రాన్ సంధదామి. ఋతం వదిష్యామి**
**సత్యం వదిష్యామి. తన్మామవతు తద్వక్తారమవతు**
**అవతు మా మవతు**
**వక్తార మవతు వక్తారమ్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః"**

వాక్కు మనస్సులోను, మనస్సు వాక్కులోను స్థితమగుగాక. నా మనస్సు మరియు వాక్కు పరస్పరము కనిష్ట సంబంధము కలిగి యుండవలెను. ఓం స్వయం ప్రకాశకుడైన పరమత్మా! నాకు ప్రత్యక్షమై నా అజ్ఞానమును తొలగించుము. అమూల్యమైన వేదములను నాకు అనుగ్రహింపుము. నేను చదివినవి మరిచిపోకుండా చిరస్మరణీయముగా ఉండునట్లు ఆశీర్వదింపుము. రాత్రింబవల్లు, అహర్నిశలు అధ్యయనం లో లీనమగునట్లు చూడుము. సతతము సత్యము పలుకునట్లు చూడుము. నన్ను మరియు వక్తయైన గురువును బ్రహ్మవైన నీవు రక్షింపుము. అధిదైవిక, అధిభౌతిక, మరియు ఆధ్యాత్మిక అను త్రివిధ తాపములు నన్ను హింసించకుండునట్లు మీదు మిక్కిలి శాంతిని ప్రసాదించునట్లు అనుగ్రహింపుము.

**" ఓం ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్**
**నాన్యత్కించన్ మిషన్**
**స ఈక్షత్ లోకాన్ను సృజా ఇతి" ఐ 4-2**

మొదట కేవలము ఆత్మ మాత్రమే ఉండెను. సక్రియ రూపములో ఉన్నదేదియును లేకుండెను. ఆ ఆత్మ లోకమును సృష్టించెననెను. ఆత్మ యొక్క పేరు, రూపము, కర్మబేధముననుసరించి వివిధ రూపాలలో అగుపించటము వలన దానిని ప్రపంచము అన్నాము. ప్రపంచ సృష్టికి పూర్వము సర్వ శ్రేష్ఠుడైన, సర్వజ్ఞుడైన, సర్వ శక్తివంతుడైన, ఆకలి దప్పులు లేని, నిత్య – శుద్ధ – బుద్ధ – ముక్త స్వభావము

కలిగి, జన్మరహితుడై, అజరుడై, అమరుడై, అమృతతుల్యుడై, అభయమిచ్చువాడై ఉన్నవాడు కేవలము బ్రహ్మ మాత్రమే యని తెలియుచున్నది.

సృష్టికి పూర్వము మరియు సృష్టి తర్వాత ఆత్మ యొక్క ఉనికి ఏమిటి? అనే ప్రశ్న ఉదయించినప్పటి సముద్రమును ఉదాహరణగా తీసికోవచ్చును. సముద్రము జలమయమైనది. అందులో నుండి నురుగు ఉద్భవించినది. మనం సముద్రాన్ని నురుగును, వేరువేరుగా దర్శించవచ్చును. ఆ పిదప నురుగు సముద్రజలములో కలసిపోయినది. మళ్ళీ తాత్కాలికముగా దాని ఉనికి అగుపించును. అలాగే ఆత్మ గుర్తింపబడుతుంది. కణాదుడు మొదలైన మతావలంబకుల అభిప్రాయం మేరకు అన్నింటికి మూలకారణమైనది పరమాణువు. అలాగే ఉపనిషత్తుల అభిప్రాయం మేరకు కేవలం ఆత్మ అనియే తెలియుచున్నది. ఆత్మకు కాళ్ళు చేతులు లేనప్పటికినీ వేగవంతమై, సులభ గ్రహణ శక్తి గలదై ఉన్నదనుటకు అనేక మంత్రాలు పేర్కొనబడ్డాయి. శ్రుతిలో సమస్త ప్రాణులు కర్మఫలమును అనుభవించుటకుగాను వాటికి ఆశ్రయభూతముగా నుండుటకు స్వర్గలోకము మొదలగు లోకములను సృష్టింతునని ఉన్నది.

ద్యులోకమును స్వర్గలోకమనియు అంభోలోకమనియు వ్యవహరించెదము. మరీచి లోకమును భువర్లోకమనియు మరియు అంతరిక్షలోకమనియు పిలిచెదరు. మర్త్యలోకమనగా భూలోకం. ఈ లోకములన్నింటినీ బ్రహ్మయే సృష్టించెను. బుద్ధిమంతుడైన శిల్పకారుడు చక్కని ఆలోచన మొదట చేసి, ఆ పిదప బ్రహ్మాండమైన కట్టడములు కొనసాగించునట్లుగానే బ్రహ్మ మొదట ఆలోచన చేసి, పిమ్మట లోకములను రచించెను. బుద్ధి యుక్తుడైన మాయావి తాను కోరుకున్న రీతిలో నడయాడినట్లు సర్వశక్తివంతుడైన, మహామాయావియైన, సర్వజ్ఞుడైన బ్రహ్మ తన నుండియే కార్యకారణాలను సృష్టించెను. శ్రుతి ప్రకారము పురుషాకారమును సంపూర్ణ మొనర్చుటకు గాను బ్రహ్మ జ్ఞానమయమైన తపమాచరింపదొడగెను. ఆ సంకల్ప బలం చేత పక్షి గుడ్డునుండి పిల్ల పక్షి వెలువడినట్లు మనిషి. మనిషి యొక్క చిద్రములు గల ముఖము వెలువడెను. లోకపాలకుడైన అగ్ని దేవత మానవాకారము యొక్క నోటియందు ప్రవేశించెను. నాశికా రంధ్రములలో వాయుదేవుడు ప్రవేశించి, ప్రాణప్రతిష్ట చేసెను. ఆయా దేవతలు కన్నులలో చెవులలో మరియు చర్మమునందు ప్రవేశించిరి. హృదయం అంతఃకరణం యొక్క అధిష్టాతయై ఉన్నది. అలాగే మనస్సు అంతఃకరణమై ఉన్నది. నాభి ఆయువు పట్టై ఉన్నది. వాయు యుక్తమైన పాయువు మృత్యువై ఉన్నది. ఉత్పత్తి కారకమైన జననేంద్రియం రేతస్సుతో కూడుకుని ఉన్నది. ఆ రేతస్సు వలననే జలములు పుట్టినవి. ఆ రకంగా విరాట్ పురుషుడు ఆయన అవయవముల నుండి ఆయాదేవతలు జన్మించిరి. బ్రహ్మద్వార

లోకపాలురెల్లరు సృష్టించబడి సంసారమనే సముద్రము వంటి భూమిపైకి వచ్చిపడిరి. అవిద్యతో, కోరికలతో కర్మద్వారా ఉత్పన్నమయ్యే దుఃఖములతో, తీవ్రరోగములతో ముసలి తనముతో, మృత్యువుతో నిండియున్న లోకములో కేవలము కలయికతో ఉత్పన్నమయిన క్షణిక స్సుఖముతో మరియు సత్యము, సరళత్వము, దానశీలత, దయ, అహింస, శమదమాదులు, ధైర్యము మొదలైన ఆధ్యాత్మిక జ్ఞానరూప నావ కూడా కలదు. ఈ సంసారమనే సాగరంలో నున్నతీరమే మోక్షమనబడుతుంది. అలాంటి మహాసాగరంలో శాంతిని మరియు మోక్షప్రాప్తిని పొందటానికి శ్రుతి ఇలా చెపుతున్నది. " పరబ్రహ్మ యొక్క ఆత్మస్వరూప జ్ఞానమును తెలుసుకోవలసి ఉన్నది. అదియే ఏకైక మార్గమై ఉన్నది. అదియే కర్మయై ఉన్నది. అదియే బ్రహ్మయై యున్నది. అదియే సత్యమై యున్నది. ఇంద్రియాభిమానులైన దేవతలు కూడా మానవుల వలె క్షుధా పీడితులై బ్రహ్మ వద్ద మొర పెట్టుకొనిరి. మేము ఆశ్రయించి స్థితమై ఉన్న స్థలముల వద్ద మాకు ఆహారము ఏర్పాటు చేయండి. లేకున్న మేము ఆయా స్థలములలో సక్రియ రూపములో పనులు నిర్వర్తించుటలో సమర్థులము కాలేము. వారి ప్రార్థనను ఆలకించిన బ్రహ్మదేవుడు సరేనని వారికి అభయమిచ్చెను. ఈ విధంగా వారి కోరిక నెరవేరెను.

దేవతల ఆకలి తీర్చే నిమిత్తము బ్రహ్మ వారికి గోవును తెచ్చి యిచ్చెను. కాని వారు కుదరదని చెప్పిరి. పిదప అశ్వమును తెచ్చి చూపెను. మేము ఆశ్రయం పొందుటకు ఇది తగినది కాదని చెప్పిరి. చివరకు పరమాత్మ యోని స్వరూపుడైన సుందర పురుషుని నీటి నుండి ఆవిర్భవింపజేసి, వారి ముందు నిలిపెను. వారు ఆనందాతిరేకముతో తమ తృప్తిని తెలియజేసిరి. అప్పుడు పరమాత్మ ఆ దేవతలెల్లరిని తమతమ స్థానములకు వెళ్ళి స్థిరపడుడని ఆదేశించెను. పరమాత్మ యొక్క ఆదేశానుసారం దేవతలెల్లరు వారి వారి నియమిత స్థానములలో ప్రవేశించిరి. అగ్ని దేవుడు వాక్కుగా మారి నోటిలో ప్రవేశించెను. సూర్యుడు దృష్టిగా మారి కన్నులలో ప్రవేశించెను. దిశలన్నియును వినికిడిగా మారి చెవులలో ప్రవేశించెను. ఓషధులన్నియును రోమములుగా మారి చర్మమున ప్రవేశించును. చంద్రుడు మనస్సుగా మారి హృదయంలో ప్రవేశించును. మృత్యువు అపానవాయువుగా మారి నాభి యందు ప్రవేశించినది. జలము వీర్యముగా మారి లింగమున ప్రవేశించినది. ఆకలిదప్పులు కూడ ఆశ్రయమును కోరగా పరమాత్మ వాటికి కూడా దిశానిర్దేశం చేసెను. దేవతలెల్లరికి అర్పించే హవిస్సులో మీరు కూడా భాగస్వాములే అని చెప్పెను. లోకములోనున్న లోకపాలుర కొరకు, అన్నమును సృష్టించుకొరకై పరమాత్మ యోచన చేసెను. ఏలుబడి చేయువారు తమ అధీనములోనున్నవారి యోగక్షేమములు చూడవలెను గదా!.

సర్వాంతర్యామి అన్నము కొరకై జలమునుద్దేశించి తపమాచరించెను. ఎట్టకేలకు జలముల నుండి ఒక మూర్తి ఆవిర్భవించెను. అది మూర్తి రూపములో ఉన్న అన్నమే అయి ఉన్నది.  అన్నము భక్షించువారు తన మృత్యువని అన్నము భావించింది. అందుకని పిల్లిని చూసి ఎలుక పారిపోయినట్లు భక్షింపనెంచిన వారికి దొరక్కుండా అన్నము పారిపోయింది. సర్వాంతర్యామి దానిని వాక్కుచేత పట్టుకొన యత్నించెను. కాని సాధ్యం కాలేదు. ఒకవేళ వాక్కు చేత అది పట్టుబడినట్లయితే, అన్నము అని అన్నంత మాత్రం చేతనే కడుపు నిండిపోయేది. ఆ పిదప అన్నమును ప్రాణము తో పట్టుకొన ప్రయత్నించి విఫలుడయ్యెను. ఒక వేళ అది వాసన చూసిన చేతనే కడుపు నిండినట్లయితే, వాసన చూసిన చేతనే తృప్తి పొందెడివాడు.

అదే రకంగా నేత్రములతో చూసినతోడనే, చర్మముతో స్పర్శించిన మాత్రమునే, మనస్సుతో ధ్యానించిన మాత్రమునే అన్నము లభించునది కాదు. చివరిగా అపానవాయువుతో ప్రయత్నించగానే అన్నము పట్టుబడినది. పట్టుకొనినది వాయువు. వాయువే అన్నము చేత ప్రాణధారణ చేయగలుగుతున్నది. ఆ పిదప పరమాత్మ ఇట్లు ఆలోచింప తొడగెను. ఈ మానవ శరీరమను పురములో అన్నీ సమకూరినవి కాని నేను యజమానినై ఆ శరీరములో ప్రవేశించవలసి ఉన్నది. లోనికి వెళ్ళడానికి రెండు మార్గములున్నవి. ఒకటి పాదాలచెంత నుండి, రెండవది బ్రహ్మకపాలం నుండి చేరుకొనవచ్చును. తుదకు తల నుండి చేరుకొనుటకు నిశ్చయించి ప్రవేశించెను. దీనినే ఆనందో బ్రహ్మ అని అంటాము.

తన రాజ్యమును రక్షించు రాజువలె మానవ శరీరమును తీర్చిదిద్దెను. మానవుడికి ప్రధానముగా మూడు అవస్థల నిచ్చెను. జాగృత కాలములో ఇంద్రియములన్నియు కన్నులను ఆశ్రయించుకొని ఉండును. స్వప్నకాలములో మనసును ఆశ్రయించుకొని ఉండును. సుషుప్తావస్థలో హృదయాకాశమున ఉండును. పై కారణం వలన సృష్టి విషయమగు పరమార్థమును తెలుపుటయే గాక " నేనే బ్రహ్మము" అను విషయం తేటతెల్లమవుతుంది. జీవుడు యజ్ఞాది కర్మలను ఆచరిస్తూ, ధూమం చంద్ర లోకం చేరుకుని, వర్షాలు కురవడానికి కారణభూతుడు కావలెను. పాడిపంటలతో తులతూగుతూ, అన్నముతో శరీరమును పుష్టివంతమొనర్చవలెను. ఆ విధంగా శుక్రరూపమైన ఆత్మను తనలో ధరించుచున్నాడు. భార్య ఋతుమతి అయినప్పుడు భర్త తన సర్వాంగముల నుండి వెలువడిన తేజస్సును భార్య యోనిలో ప్రవేశపెట్టినపుడే జీవుడి మొదటి జన్మ అనబడుతుంది. ప్రసవకాలంలో భూమి మీద పడటం రెండవ జన్మగానూ, మరణం వరకూ మూడవ జన్మగాను పరిగణిస్తాము. స్త్రీకి స్తనాదులు మొదలగు తన అవయవములు భారం కానట్లే గర్భస్థశిశువు ఏ

మాత్రం భారం కాదు. కాని తగిన జాగ్రత్తలు తీసుకోవటం ముఖ్యం. గర్భస్థ శిశువును స్త్రీయే కాకుండా భర్త కూడా అపురూపంగా చూసుకోవటం జరుగుతుంది. ఆ రకంగా ప్రజాభివృద్ధి జరుగుతుంది. మనం ఏ ఆత్మను ఉపాసిస్తామో ఆ ఆత్మ ఎవరు అనే ప్రశ్న ఉదయించునపుడు జవాబుగా వేటిని చూస్తున్నామో, దేనితో విశ్లేషణ చేస్తున్నామో, దేనితో రుచి చూస్తున్నామో వాటిలో నుండి ఆత్మ ఎవరు అనే అనుమానం వస్తుంది. శ్రుతి చెప్పిన ప్రకారం అసలు ఆత్మ ఎవరు? ఈ ఆత్మయే పరబ్రహ్మ. అతనిని తెలుసుకోవడమే మోక్షం.

## ఛాందోగ్యోపనిషత్తు

ఈ ఉపనిషత్తు సామవేద సంబంధితమై శ్రీ శంకర భగవత్పాదులచే భాష్యం వ్రాయబడింది. తలమానికమైన పది ఉపనిషత్తులలో ఈ ఛాందోగ్యోపనిషత్తు ఒకటిగా పరిగణించబడుచున్నది. సామవేదములోని తల్వకార్ అంతర్గత శాఖకు చెందిన ఛాందోగ్య బ్రాహ్మణమునకు ఉపనిషత్తు యొక్క మాన్యత ఇవ్వబడింది. ఈ బ్రాహ్మణములో పది అధ్యాయాలు ఉన్నవి. చివరి ఎనిమిది అధ్యాయాలు ఉపనిషత్తుల రూపంలో తీసుకోబడినవి. ఈ ఛాందోగ్యోపనిషత్తు విస్తీర్ణత ఎక్కువగా కలిగిన ఉపనిషత్తులలో ఒకటి.

దీని పేరునుబట్టి ఇది ఛందస్సును తెలుపు ఉపనిషత్తు అని తెలియుచున్నది. కాని ఇది సాహిత్యమునకు మాత్రమే పరిమితమైన అర్థం కాదు. ఛందస్సు అనగా అచ్ఛాదించునది అని అర్థం. కవి ఏ సత్యాన్ని సాక్షాత్కరింపజేయాలను కుంటాడో ఆ సత్యమును, ఆ భావమును హృదయంగమం చేయుటకు సాహిత్య పరమైన ఛందస్సును ప్రయోగం చేయవచ్చును. ఆ సత్యమును, ఆ భావమును హృదయంగమము చేయుటకు సాహిత్యపరమైన ఛందస్సు యొక్క అంగోపాంగములని తెలియబడుచున్నది. అదే రకంగా ఋషులు ఈ సృష్టిలో ఉన్న మూల సత్యమును విభిన్న మాధ్యమముల ద్వారా వ్యక్తమగుటను, ప్రకృతి యొక్క విభిన్న పార్శ్వములలో మూల సత్యము ఆచ్ఛాదింపబడుటను గమనిస్తూ ఉంటారు. వాటన్నింటిని ఋషులు ఛందస్సులో, సామవేదం లో ఉద్గీథలో వ్యక్త పరిచారు. ప్రథమాధ్యాయంలో ఋగ్వేదం మరియు సామవేదం యొక్కసార రూప ఓంకారం గురించి చెప్పబడింది. ఇందులో వ్యక్త పరచబడిన దేవాసుర ఉపాఖ్యానములో ఓంకారము మరియు ఉద్గీథకు కేవలము స్వర, శ్వాస సంబంధమునకు పరిమితము చేయకుండా ముఖ్యమైన ప్రాణస్పందన రహస్యం తెలుపబడినది. ఆ పిదప ఓంకారములో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక, అధిదైవిక ఉపాసనల గూర్చి తెలియజేస్తూ విభిన్న స్వరూపములను స్పష్టం చేయుట జరిగింది.

## బృహదారణ్యకోపనిషత్తు

ఈ ఉపనిషత్తు శుక్లయజుర్వేద సంబంధితమై శ్రీ శంకర భగవత్పాదులచే భాష్యం వ్రాయబడింది. ఈ ఉపనిషత్తు బృహత్తరమై అరణ్యములో వికసించినది కావున దీనిని బృహదారణ్యకమని పిలుస్తున్నాము. ఇందులో మొత్తం ఆరు అధ్యాయములున్నవి. ప్రతి అధ్యాయము కొన్ని బ్రాహ్మణములను కలిగియున్నది. ప్రథమ అధ్యాయములో సృష్టి రూప యజ్ఞమును ఒక విరాట రూప అశ్వముతో పోల్చటం జరిగింది. ఆ పిదప ప్రళయం తర్వాత సృష్టి ఆవిర్భావం, బ్రహ్మ స్వరూపం వర్ణింపబడినవి. రెండవ అధ్యాయంలో గొప్పలు చెప్పుకునే గార్గ్యబాలాకికి మరియు రాజైన అజాత శత్రువుకు మధ్య బ్రహ్మ మరియు ఆత్మతత్త్వము గురించి సంవాదం జరిగింది. మూడవ అధ్యాయంలో జనకునికి, యజ్ఞవాల్క్యునికి, తత్త్వవేత్తలకు మధ్య సంవాదం జరిగింది. నాల్గవ అధ్యాయంలో యజ్ఞవాల్క్యునికి మైత్రేయికి మధ్య సంవాదం జరిగింది. అయిదవ అధ్యాయంలో బ్రహ్మకు చేయు ఉపాసనల గురించి, ఆరవ అధ్యాయంలో ప్రాణం యొక్క శ్రేష్టత గురించి వివరించబడింది.

**" ఉషా వా అశ్వస్య మేధ్యస్య శిరః**
**సూర్యశ్చక్షుర్వాతః ప్రాణో వ్యాత్తమగ్నిర్వైశ్వానరః**
**సంవత్సర ఆత్మాశ్వస్య**
**దౌః పృష్ఠమంతరిక్షముదరం పృథివీ పాజస్యమ్**
**దిశః పార్శ్వే అవాంతర దిశః పర్శవ ఋతువోంగాని**
**మాశాశ్చార్ధ మాసాశ్చర్థమాసాశ్చ పర్వాణ్యహో రాత్రాని ప్రతిష్టా**
**నక్షత్రాణ్యస్థీని నభోమాంసాని**
**ఊవధ్యం సికతాః సింధవో గుదా యకృచ్చ క్లోమానశ్చ**
**పర్వతా ఓషధయశ్చ వనస్పతయశ్చ లోమాని ఉద్యన్**
**పూర్వార్థో నిమ్లోచం జగనార్ధో యద్విజృంభతే యద్వి**
**దోద్యతే యద్విధూనతే తత్పస్తనయతి యన్మేహతి**
**తద్వర్షతి వాగేవాస్య వాక్" బృ 5-2**

ఇందులో పవిత్రమైన అశ్వము యొక్క వర్ణన చేయబడింది. ఈ అశ్వం యొక్క అవయవములన్నియు ముల్లోకములలో పరివ్యాప్తమై ఉన్నవి. ఇక్కడ ఒక అలంకారిక వ్యాఖ్య చేయబడింది. అశ్వమనే శబ్దము వేగమును స్ఫురింపజేయునదై యున్నది. ఇది ఒక బ్రహ్మాండమైన

గతిశీలమును కలిగి ఉన్నది. ఏ శక్తి దీనిని గతిశీలము చేస్తున్నదో దానిని అశ్వం అని అంటున్నాము. "అశ్వమేధ" లోని ఈ మేధ అను శబ్దము పవిత్రమైన యజ్ఞముకు పర్యాయపదమై ఉన్నది. ఈ యజ్ఞ సంబంధిత అశ్వం విశ్వవ్యాప్తమై శక్తి ప్రవాహం యొక్క శిరోభాగము ఉషఃకాలమై ఉన్నది. ఆదిత్యుడే నేత్రములై, వాయువే ప్రాణమై, సంవత్సరమే ఆత్మయై ఉన్నది. స్వర్గము ఆ యజ్ఞాశ్వం యొక్క పృష్ఠభాగమై, అంతరిక్షము ఉదరమై, పృథివి కాళ్ళూనుకోవటానికి స్థలమై, దిశలు పార్శ్వాలై, దివారాత్రములు పాదములై నక్షత్రములు ఎముకలై, ఆకాశం మాంసమై ఉన్నది. నదులు నాడీ సమూహములై, పర్వతాలు హృదయగత మాంసమై, వనస్పతులు రోమములై, ఉదయిస్తున్న సూర్యుడు పైభాగమై, అస్తమిస్తున్న సూర్యుడు దిగువభాగమై ఉన్నది. ఈ ఉపనిషత్తులోని రెండవ అధ్యాయంలో గార్గ్యగోత్రీయుడైన బాలాకి కథ రమ్యంగా, బ్రహ్మవిద్యను ఉపదేశించునదిగా చెప్పబడినది. మూడవ అధ్యాయంలో విదేహరాజైన జనకుని యజ్ఞము, అతని యజ్ఞములో జరిగిన విశేషములు వివరింపబడినవి. నాల్గవ అధ్యాయంలో రాజుకు, యజ్ఞవాల్క్యునకు మధ్య జరిగిన సంభాషణ వర్ణితమైనది. మిగిలిన ఐదు, ఆరు అధ్యాయములలో బ్రహ్మవిద్య నేరుగా ఉపదేశితమైనది. రెండవ అధ్యాయములో సామవేదం యొక్క సాధుత్వమును దాని యొక్క శ్రేష్ఠత్వమును అన్వయిస్తూ విభిన్నరీతుల ఉపాసనలను వర్ణించడమైనది. మూడవ అధ్యాయంలో ఆదిత్యుడు దేవతల యొక్క మధువుగా చెప్తూ విభిన్న దిశలలో విభిన్నరీతుల అమృతోపమానమైన మధువు లభ్యమవడం గురించి వర్ణించడమైనది. మధు విద్యను పొందు అర్హత గలవారి గురించి చెప్తూ, గాయత్రి యొక్క సర్వ వ్యాప్తమును ఋజువు చేస్తూ ఆదిత్యుణ్ణి బ్రహ్మ రూపంలో ఉపాసించవలెనని నిర్దేశించినది. నాలగవ అధ్యాయంలో సత్యకామ జాబాలుని యొక్క వృషభం, అగ్ని, హంస, మృదంగముల ద్వారా బ్రహ్మబోధ చేయుటము జరిగింది. ఇంకను విభిన్న అగ్నుల ద్వారా సునిశుతులుగా చేయుట గురించి చెప్పటం జరిగింది. ఐదవ అధ్యాయంలో ప్రాణవిద్య గురించి చెప్పబడింది. శ్వేతకేతు మరియు ప్రవాహుణుడి సంవాదము అంతేకాకుండా అశ్వపతి మరియు ఋషుల సంవాదముతో ప్రాణము యొక్క విభిన్న ప్రకృతులను ఉల్లేఖించడమైనది. ఆరవ అధ్యాయంలో సర్వాంతర్యామి మరియు ఆత్మ యొక్క విభిన్న రూపాలను విభిన్న దృష్టాంతాలతో స్పష్టము చేయడమైనది. ఏడవ అధ్యాయంలో బ్రహ్మం యొక్క విభిన్న రూపాలను ఉపాసన చేయు పద్ధతులను తెలియజేయడమైనది. ఎనిమిదవ అధ్యాయంలో ఇంద్రుడు మరియు విరోచనుడి ఉదంతములో ఆత్మతత్వము మరియు బ్రహ్మతత్వము సాక్షాత్కరించుటకు మార్గము సుగమమైంది. ఆత్మతత్వము తపము ద్వార పొందవచ్చునని

తేటతెల్లమైంది. చివరకు ఆత్మజ్ఞానం పొందుట గురించి మరియు దాని ఫలితము గురించి వివరించడమైనది.

## 2. మనుచరిత్ర – దర్శన ప్రభావం

మనుచరిత్ర శృంగార రస ప్రధానమైన ప్రాచీనాంధ్ర ప్రబంధం. తెలుగు సాహిత్యంలో దీనికొక విశిష్ట స్థానముందనడంలో సందేహం లేదు. రాయలవారి మన్నన మేరకు వారే కృతిభర్తగా రచింపబడిన కావ్యం ఇది. ఆముక్తమాల్యదకు, ఈ ప్రబంధానికి చాల విషయాలలో సారూప్యత ఉన్నది. పలు పండితులచేత ఇది నైరూప్యతకు కూడా నోచుకున్నది. అయితే దర్శనాల విషయంలో మాత్రం ఆ సారూప్యత లెక్కకు రాకున్నది. రాయలవారు చాల చోట్ల ఉపనిషద్వాక్యాలను, దర్శన సిద్ధాంతాలను, న్యాయశాస్త్ర రహస్యాలను యథాతథంగా ఉటంకించారు. మనుచరిత్ర రాయలవారి కావ్యంవలెకాక, పూర్వోత్తరమీమాంసల విషయాలను మాత్రమే కలిగి ఉన్నది. కొన్నిచోట్ల ఇతర దర్శన విషయాలు కనపడుతున్నా, అవి  రాయలవారి కావ్యంలో వలె ప్రత్యక్షాలు కాక, పరోక్షాలై ఉన్నవి. దీనికి నిమిత్తము లేకపోలేదు. ఆముక్తమాల్యదలోని వస్తువు దర్శన సిద్ధాంత ప్రతిపాదనకు సానుకూలమైనది. మనుచరిత్రలోని వస్తువు, కథాగమనం ఆముక్తమాల్యద కంటే భిన్నమైనవి. ఇందులో వాదప్రతివాదములు జరగలేదు. తత్వనిరూపణకు ప్రయత్నాలు చేయలేదు. మునీశ్వరుల ప్రస్తావనలు కూడా నామమాత్రముగనే ఉన్నవి. ప్రవరుని పుణ్యమా అని కొన్ని కర్మకాండల విషయాలు చెప్పబడ్డాయి. వెరసి మనుచరిత్ర పైగల దర్శన ప్రభావం ఆముక్తమాల్యదతో పోలిస్తే తక్కువనే చెప్పాలి.

### 2.1 మంగళాది పద్యం – విశిష్టాద్వైత ప్రతిపాదన

మనుచరిత్ర కావ్యం రాయలవారికి అంకితంగా రాసినది. కావున మంగళాది పద్యం వారి ఇష్టానుగుణంగా సాగింది. విశిష్టాద్వైతం ప్రకారం నారాయణోపాసన శ్రీదేవి సమేతమై ఉండాలి. తదనంతరం విష్ణుమూర్త్యనుయాయులను, శంఖము, చక్రము, గద మొదలైన పంచాయుధాలను స్మరించాలి. రాయలవారు వారి ఆముక్తమాల్యదలో కూడా ఇదే సంప్రదాయాన్ని పాటించారు. మనుచరిత్ర లోని మంగళపద్యం కూడా ఇదే పద్ధతిని పాటించింది.

**"శ్రీ వక్షోజకురంగనాభి యెదపై జెన్నొంద విశ్వంభరా**
**దేవిం దత్కమలాసమీపమున బ్రీతిన్ నిల్పినాడో యనం**
**గా వందారు సనందనాది నిజభక్తశ్రేణికిం దోచు రా**
**జీవాక్షుండు గృతార్థు జేయు శుభదృష్టిం గృష్ణరాయాధిపున్"** మ 1–1

పై పద్యంలో కవి కేవలం లక్ష్మీదేవితో ఆగకుండా ఆమెకు అబేధరూపియైన

భూదేవిని,నిజభక్తశ్రేణిని కలిపి నారాయణుని స్తుతించాడు. అందుకే రాయలవారి ప్రేమకు పాత్రుడైనాడు పెద్దన. తర్వాత వేదాలకు అధిదేవుడైన బ్రహ్మను కవి ఇలా స్తుతించాడు.

**“నాలుగు మోములన్ నిగమ నాదము లుప్పతిలం బ్రచండ వా**
**తూలహతిం జనించు రొదతోడి గుహావళి నొప్పు మేరువుం**
**బోలె బయోజపీఠి మునిముఖ్యులు గొల్వగవాణి గూడి పేరో**
**రోలగమున్న ధాత విభవోజ్వలు సేయు గృష్ణరాయాధిపునిన్ ”** మ 1-2

వేదాలకు అపౌరుషేయములు అని పేరు. అవి ఒకరు రాయగా పుట్టినవి కావు. మొదట బ్రహ్మ తన నాలుగు ముఖముల ద్వార నాలుగు వేదాలను ఉచ్చరించాడు. దానిని విని గ్రహించిన మునులు ధారణ చేసి తమ శిష్యులకు అందించారు. శిష్యులు కూడా వేదాలను వినియే నేర్చుకున్నారు. అందుకే అవి శృతులు అనిచెప్పబడ్డాయి. ఇదే విషయాన్ని పెద్దనగారు ఒక పద్యరూపంలో ఇక్కడ ప్రస్తావించారు. వేదాలు ఉదాత్త అనుదాత్త స్వరిత భేదాలతో పలుకబడతాయి. కావున వినికిడి దోషం వీటికి అంటదు. పైగా ఇలా పలకడం వల్ల నాదత చేకూరుతుంది. ఈ నాదాన్ని తెలుపడం కోసమే పెద్దనగారు నిగమనాదములుప్పతిలన్ అనే ప్రయోగం చేసారు. పనిలో పనిగా పక్కనే ఉండే మునిముఖ్యులను కూడా వర్ణించారు.

## 2.2 న్యాయదర్శనం – సమానధర్మోపపత్తి

పెద్దనగారు వినాయక స్తుతి చేస్తూ భ్రాంతిమదలంకారాన్ని ఈ క్రింది విధంగా ప్రయోగించారు.

**" అంకము జేరి శైలతనయాస్తన దుగ్ధములాను వేళ బా**
**ల్యాంక విచేష్ట దొండమున నవ్వలి చన్గబళింపబోయి యా**
**వంక గుచంబు గాన కహివల్లభు హారము గాంచి వేమృణా**
**ళాంకుర శంకనంటెడు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికిన్"** ఆ 1-4

ఇందులో భ్రాంతిమదలంకారంతో పాటు న్యాయశాస్త్రవిషయమొక్కటి ప్రస్తుతింపబడింది. అనేకవస్తువులందు ఒకే లక్షణం ఉండటం వలన ఒక వస్తువును చూసి, వేరొక వస్తువుగా భావించే అవకాశమున్నది. దీనినే న్యాయదర్శనంలో సమానధర్మోపపత్తి అంటారు. విఘ్ననాయకుడు మృణాలాంకురానికి, పాముకు గల సమానధర్మోపపత్తికి భ్రాంతి చెందాడు. అందుకే పామును మృణాలాంకురంగా భావించాడు.

## 2.3 ఉపనిషత్ప్రస్తావన

తర్వాతి పద్యంలో ఉత్తరమీమాంస దర్శనాంశమైన ఉపనిషత్తులను గురించి ఇలాప్రస్తావించాడు.

**" చేర్చుక్కగానుండు చిన్ని జాబిల్లిచే సింధూర తిలకంబు**
**చెమ్మగిల్ల నవతంసకుసుమంబు నందున్న యలదేటి రుతికించిదంచితశ్రుతులనీన**
**ఘనమైన రారాపు చనుదోయి రాయిడి దుంభీఫలంబు తుందుడుకు జెంద**
**దరుణాంగుళిచ్ఛాయ దంతపు సిరికట్టు లింగిలీకపు వింత రంగులీన**
**ఉపనిషత్తులు బోటులై యోలగింప**
**బుండ రీకాసనమున గూర్చుండి మదికి**
**నించువేడుక వీణ వాయించు చెలువ,**
**నలువరాణి మదాత్మలో నిలుచుగాత" మ 1-5**

పై పద్యంలో ఉపనిషత్తుల ప్రస్తావన ఉన్నది. ఉపనిషత్తులు మొత్తం 108. వీటినే ఉత్తరమీమాంస దర్శనంగా పేర్కొంటారు. ఈ ఉపనిషత్తులు సరస్వతిని చెలికత్తెలవలె ఆరాధిస్తున్నాయని కవి భావం. ఇది రాయలవారికిష్టమైన వడగళుల సంప్రదాయం. ప్రాచీనాంధ్రకవులందరూ పాటించిన మరొక వేదవిదిత సంప్రదాయం.

## 2.4 వర్ణవ్యవస్థ

వేదం వర్ణవ్యవస్థను చెప్పింది. తర్వాతి కాలంలో వచ్చిన అన్ని గ్రంథాలు వర్ణవ్యవస్థను ప్రోత్సహించాయి. పెద్దన కూడా ప్రవరపురవర్ణన చేస్తూ నాలుగు వర్ణాలను ఇలా వర్ణించాడు.

**"అచటి విప్రులు మెచ్చరఖిల విద్యా ప్రౌఢి ముదిమది దప్పిన మొదటివేల్పు**
**నచటిరాజులు బంటునంపి భార్గవునైన బింకాన బిలిపింతురంకమునకు**
**నచటిమేటుకిరాటు లలకాధిపతినైన మును సంచి మొదలిచ్చి మనుపదక్షు**
**లచటి నాలవజాతి హలముఖాత్త విభూతి, నాదిభిక్షువు భైక్షమైన మాన్చు**
**నచటి వెలయాండ్రు రంభాదులైననౌరయ**
**గాసెకొంగునవారించి కడవగలరు**
**నాట్యరేఖాకళాదురంధరనిరూఢి**
**నచటబుట్టిన చివురు కొమ్మైనచేవ" మ 1-50**

## 2.5 వివిధాధ్వరనిర్మలధర్మకర్మలు

పెద్దన ప్రవరుని పరిచయం చేసే సందర్భంలో అతని గుణగణాలను పొగుడుతూ అతడు నిత్యం వేదవిదితమైన కర్మలనాచరిస్తాడని, విద్యార్థులకు నిత్యం వేదబోధ చేస్తాడని ఇలా చెప్పాడు.

**" ఆ పురి బాయకుండు మకరాంత శశాంక మనోజ్ఞమూర్తి భా**

**షా పరశేషభోగి వివి ధాధ్వరనిర్మల ధర్మ కర్మ దీ**

**క్షాపరతంత్రదక్షు డంబురుహ గర్భ కులాభరణం బనారతా**

**ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యు డలేఖ్యతనూ విలాసుడై" ఆ 1-51**

పై పద్యంలో ప్రవరుని గుణాలు వర్ణించాడు కవి. పెద్దన ప్రకారం అతడు బ్రాహ్మణ వంశమునకు ఆభరణం వంటివాడు. పైగా గృహస్థుడు. అయితే గృహస్థు ఆచరించ వలిసిన కర్మలనేకం ఉన్నాయి. సంధ్యావందనం, అతిథి మర్యాద, పురుషార్థ సాధన మొదలైనవి. వీటన్నింటినీ అతడు వేదం చెప్పినట్లుగా చేస్తున్నాడు. అందుకే పెద్దన ప్రవరుడుని వివిధాధ్వరధర్మకర్మదీక్షాపరతంత్రదక్షుడు అని సంబోధించాడు. ఇది మాత్రమే కాక నిరంతర ధ్యాన తత్పరుడు అని కూడా సూచించాడు. ఈ ధ్యానము యోగశాస్త్ర విషయము. అష్టాంగములలో ధ్యానము ఏడవది. ధ్యానాన్ని గురించి పతంజలి ఈ క్రింది విధంగా చెప్పారు.

**" తత్ర ప్రత్యైకతానతా ధ్యానమ్" ప 3-2**

చిత్తాన్ని భ్రూమధ్యమునందుగాని, హృదయమునందు గాని నిలిపి సాధన చేయడాన్నే ధ్యానం అంటారు. ఇట్టి ధ్యానమగ్నుడు ప్రవరాఖ్యుడు. ధ్యానము అష్టాంగాలలో ఏడవది. మిగిలిన ఏడు అంగాలను ప్రస్తావించకుండా ఏడవదాన్ని మాత్రమే ప్రస్తావించడంలో అంతరార్థమున్నది. ఈ అష్టాంగములు సోపానములు. ఒక దాని తర్వాత ఒకటి అనుసరించదగినవి. కవి మిగిలిన ఆరు సోపానములను ప్రస్తావించకుండా ఏడవదాన్ని ప్రస్తావించడం వల్ల ప్రవరుడు వాటన్నింటినీ అధిరోహించినాడని భావం. ఎనిమిదో పాదమైన సమాధిని చేరుకుంటే ఇక సంసారముండదు. అందుకే ప్రవరుని కవి ఏడో పాదం వద్ద మాత్రమే నిలిపినాడు.

## 2.6 వైరాగ్యం

తర్వాతి పద్యంలో కవి ప్రవరుని చక్కదనాన్ని, వైరాగ్యాన్ని చూసి ఇంతులు అతనిని కోరుకుంటున్నారని కవి వర్ణించాడు.

**" వానిచక్కదనము వైరాగ్యమున జేసి**
**కాంక్షసేయు జార కామినులకు**
**భోగబాహ్యమయ్యె బూచిన సంపెంగ**
**పొలొపు మధుకరాంగనకు బోలె". మ 1–52**

ఇక్కడ కవి ప్రయోగించిన వైరాగ్యం వేదాంత సంబంధమైనది. క్లేశములలో ఒకటిగా చెప్పబడిన రాగము లేకుండడమే వైరాగ్యం. వైరాగ్యం సామాన్యం, ప్రచండం, స్మశానం అని మూడు రకాలు. ఇందులో ప్రచండ వైరాగ్యం ప్రముఖమైనది. ఇదే ప్రవరుడికి కలిగినది.

## 2.7 యోగము – షట్ సంపత్తులు

కవి ప్రవరాఖ్యుని గుణగణాలను ప్రథమాశ్వాసంలో వర్ణిస్తూ యోగశాస్త్ర సంబంధమైన షట్ సంపత్తులను గురించి ప్రస్తావించాడు.

**"శీలంబుం గులమున్ శమంబు దమముం జెల్వంబు లే బ్రాయముం**
**బోలం జూచి యితండు పాత్రుడని యే భూపాలు రీ వచ్చినన్**
**సాలగ్రావము మున్నుగా గొనడు మాన్యక్షేత్రముల్ పెక్కు చం**
**దాలం బందు నొకప్పుడుం దరుగ దిం టం బాడియుం ఒంటయున్" ఆ 1–55**

యోగశాస్త్రంలో శమము, దమము, ఉపరతి, తీతీక్ష, శ్రద్ధ, సమాధానం అనేవి షట్ సంపత్తులు. వీటిని ప్రవరుడు కలిగియున్నాడని కవి భావం. ఇది మాత్రమేగాక ఆముక్తమాల్యదలో విప్రులకుండే అపరిగ్రహమనే ఉత్తమలక్షణం ఇతనికి కూడ ఉన్నది. ఇది పతంజలి చే రచించబడిన యోగశాస్త్రంలోని యమాలలో నాలగవది. ఈ యమాదులను అతడు తప్పక పాటిస్తాడు. అందుకే అతడు ఇతరుల దగ్గర నుండి కనీసం సాలగ్రామమైన స్వీకరించడు.

## 2.8 సన్యాసాశ్రమం

తర్వాతి పద్యంలో కవి వర్ణాశ్రమాల్లో ఒకటైన సన్యాసాశ్రమాన్ని గురించి వర్ణించాడు.

**" ముడిచిన యొంటికెంజె డమూయు ముప్పన్నె మొగముతోలు కిరీటముగ ధరించి**

కకపాలకేదార కటకముద్రితపాణి గురుచ లాతముతోడ గూర్చి పట్టి
యైణేయమైన యొడ్డాణంబులవణిచే, నక్కళించినపొట్ట మక్కళించి
యారకూటచ్ఛాయ నఘళింపగజాలు,బడుగు దేహంబున భస్మమలది
మిట్టయమునిడుయోగ పట్టెమెరయ
జెవులరుద్రాక్షపోగులు చవుకళింప
గావికుబుసంబు జలకుండి కయును బూని
చేరెద్దేహమౌషధ సిద్ధుడొకడు" మ 1-59

వేదం ప్రకారం బ్రహ్మచర్యం తర్వాత సంసార లంపటంలో దిగకుండా, భగవద్భక్తితో మాతాపితరుల అనుగ్రహంతో స్వీకరించునది సన్యాసం. పురుషుడు దండ కమండలధారుడై, పులి తోలు ధరించి, ఇతరములైన సుఖాల వైపు మనసును పోనీయకుండా భగవంతుని చింతనలో ఉండటమే సన్యాసం. అలాంటి సన్యాసి ఆహార్యాన్ని కవి ఈ పద్యంలో వర్ణించాడు.

## 2.9 గృహస్థాశ్రమం

ఆశ్రమాలలోకెల్ల అత్యంత ఉన్నతమైనది గృహస్థాశ్రమం. వేదం కూడా ఈ ఆశ్రమమే గొప్పదిగా చెప్పింది. అలాంటి గృహస్థాశ్రమ విశేషాన్ని కవి సిద్ధుని ముఖంగా ఇలా వివరించాడు.

**"కెలకుల నున్న తంగెటిజున్ను గృహమేధి, యజుమానుడంకస్థితార్థ పేటి**
**పండిన పెరటికల్పకము వాస్తవ్యుండు దొడ్డిబెట్టిన వేల్పు గిడ్డి కాపు**
**కడలేని యమృతంపు నడభావి సంసారి సవిధమేరునగంబు భవనభర్త**
**మరుదేశ పథమధ్య మప్రప కులపతి యాకటి కొదవు సస్యముకుటుంబి**
**బధిర పంగ్వంధ భిక్షుర బ్రహ్మచారి**
**జటి పరివ్రాజ కాతిథి క్షపణ కావ**
**ధూత కాపాలికాద్యనాథులకు నెల్ల**
**భుసురోత్తమ!గార్హస్థ్యమునకు సరియే" మ 1-66**

పురుషుడు తన బ్రహ్మచర్యకాలం గడిపిన తర్వాత అతనికి సమావర్తన సంస్కారం చేయబడుతుంది. ఆ తర్వాత స్త్రీ పురుషులిద్దరూ అగ్నిసాక్షిగా గృహస్థాశ్రమంలోకి ప్రవేశిస్తారు. గృహస్థాశ్రమంలో ఉన్నవారు నిరంతరం బ్రహ్మయజ్ఞము, దేవయజ్ఞము, బలవైశ్వదేవము, పితృయజ్ఞము, అతిథి యజ్ఞము అనబడే ఐదు యజ్ఞాలు చేయాలి. ప్రవరుడు వీటిని నిరంతరం పాటించేవాడు. అందుకే వివిదాధ్వరనిర్మల ధర్మకర్మదీక్షాపరతంత్రదక్షుడయ్యాడు. గృహస్థాశ్రమం ఇన్ని నియమనిష్టలతో కూడుకొని ఉన్నది. మిగిలిన మూడాశ్రమాలు గృహస్థాశ్రమం మీదే భుక్తి కొరకు ఆధారపడి ఉన్నాయి. అందుకే సిద్ధుడు గృహస్థాశ్రమమే మిగిలిన ఆశ్రమాలన్నింటికీ ఆధారమని చెప్పాడు. మనువు తన ధర్మశాస్త్రమున

**" యస్మాత్త్ర్య యోప్యాశ్రమిణో**
**జ్ఞానే నాన్నేనచాన్వహమ్**
**గృహస్థేనైవధార్యన్తే**
**తస్మాజ్జ్యేష్టాశ్రమో గృహీ" మ 1-21** అని గృహస్థాశ్రమాన్ని కొనియాడారు.

## 2.10 ప్రవరుడు – అనుష్టానాలు

ప్రవరుడికి అనునిత్యం అనుసరించవలిసిన వేదోక్త అనుష్టానాలంటే ప్రాణం. అందుకే సిద్ధుడిచ్చిన పాదలేపనం కరిగిపోయిన తర్వాత ప్రవరుడికి తన గురించిన చింత కంటే కర్మకాండలకు సంబంధించిన చింత ఎక్కువైంది. ఆ సందర్భంలో పెద్దన చెప్పిన పద్యం ఇది.

**" నను నిముసంబు గానక యున్న నూరెల్ల**
**నరయు మజ్జనకుడెంతడలు నొక్కొ**
**యొపుడు సంధ్యలయందు నిలువెళ్ళనీక న**
**న్నోమెడు తల్లి యొంతొరలు నొక్కొ**
**యనుకూలగతి నాదు మనసులో వర్తించు**
**కులకాంత మదినెంత కుందునొక్కొ**
**గెడదోడు నీడలై క్రీడించు సచ్ఛాత్రు**
**లింతకు నెంత చింతింతు రొక్కొ**
**యతిధి సంతర్పణంబులే మయ్యె నొక్కొ**
**యగ్నులేమయ్యెనొక్కొనిత్యంబులైన**
**కృత్యముల బాపి దైవంబ కినుక నిట్లు**
**పారవైచితే మిన్నేరు పడ్డచోట"  మ 3-43**

కర్మానుష్టానము  గురించి, ఛాందోగ్యోపనిషత్తు ఈ విధంగా చెప్పింది.

**"బ్రహ్మవాదినో వదన్తి యద్వసూనాం ప్రాతస్సవగ్ం రుద్రాణాం మాధ్యన్దినగ్ం సవనమాదిత్యానాం చ విశ్వేషాం చ్చ దేవానాం తృతీయసవనమ్" ఛా 2-24**

బ్రాహ్మణుడు మూడు అగ్నులను సమాచరించాలి. పొద్దున్న, మధ్యాహ్నం, సాయంత్రం చేయాల్సిన  కర్మలివి. ఛాందోగ్యోపనిషత్తు లో అగ్నుల గురించి, వాటి అధిష్టాన దేవతల గురించి, ఆ అగ్నులను ఆచరించడం వలన కలిగే ఫలితాలను గురించి ఇలా చెప్పబడింది.

| సమయం | అగ్ని | అధిష్టానదేవత | ప్రార్థన | ఫలం |
|---|---|---|---|---|
| ఉదయం | గార్హపత్యాగ్ని | వసువు | పృథివిలోకద్వారం | భూలోకప్రాప్తి |
| మధ్యాహ్నం | దక్షణాగ్ని | రుద్రుడు | అంతరిక్షలోకద్వారం | భువర్లొకప్రాప్తి |
| సాయంత్రం | ఆహవనీయాగ్ని | ఆదిత్యుడు | స్వర్గలోకద్వారం | సువర్లోకప్రాప్తి |

పైన చెప్పబడిన అగ్నుల గురించే ప్రవరుడు చింతించాడు. అందుకే "అగ్నులేమయ్యెనొక్కొ" అని బాధపడ్డాడు.

## 2.11 మిథ్యాజ్ఞానబోధ

ప్రవరుడు ఎప్పటికీ తనకు లొంగక పోయేటప్పటికీ వరూధిని అతడికి మిథ్యాజ్ఞానాన్ని బోధించే ప్రయత్నం చేసింది. ఆ క్రమంలో భాగంగా వైదికకర్మలను గురించి యజ్ఞాలను గురించి ప్రస్తావించింది.

**" నావుడు విన్న బాటు వదనంబున నించుకదోప బల్కె నో**
**భావజరూప! యిట్టి యెల ప్రాయము వైదిక కర్మనిష్టలం**
**బోవగనింక భోగముల బొందుట యెన్నడు? యజ్ఞకోటులం**
**బావను లౌటకున్ ఫలమా మా కవుగిళ్ళ సుఖించుటే కదా!" మ 1-54**

యజ్ఞాలు చేయడం వల్ల చివరకు లభించేది రంభాధుల కూటమియే అని చెప్పచూసింది వరూధిని. నిజానికి ఉపనిషత్తులు మనిషి జీవితాన్నే యజ్ఞంగా పరికల్పన చేసాయి. ఛాంధోగ్యోపనిషత్తు షోడశఖండం ఇలా చెప్తున్నది.

**" పురుషో వావ యజ్ఞః , తస్య యాని చతిర్వింశతి వర్షాణి తత్ప్రవాస్సవణం చతుర్వింశత్యక్షరా గాయత్రీ గాయత్రం ప్రాతస్సవనం తదస్య వసవో న్వాయత్తాః, ప్రాణా నావ వసవ ఏతే హీదగ్ం సర్వం వాసయన్తి" చా 1-16**

ఈ ఖండం మొత్తం జీవితాన్ని ఒక యజ్ఞం లాగ ఎలా చూడాలో చెప్తున్నది. ఇందులో జీవితం మూడు భాగాలుగా విభజించబడింది. ఎందుకంటే వైదిక జీవితాన్ని గడిపే ప్రతి వ్యక్తి నిత్యపూజలు మూడు సార్లు చెయ్యాలి. మూడు సంధ్యల్లో మూడు ప్రార్థనలు చేయాలి. వాటిని ప్రాతః సంధ్య, మాధ్యందిన సంధ్య, సాయం సంధ్య అంటారు. ఆయా సంధ్యలలో చేసే ప్రార్థనను సవనం అంటారు. అంటే ప్రాతః సవనం , మాధ్యాందిన సవనం, సాయం సవనం అన్నమాట. సంధ్యావందనం చేసేముందు చేసే స్నానాన్ని త్రిషవణ అంటారు. ఉపనిషత్తు జీవితాన్ని మూడు సవనాలతో పోల్చి వాటిని ఒక్కొక్క ఛందస్సుతో పోల్చింది. ఆ ఛందస్సుకు ఉన్న అక్షరాల సంఖ్య సవనాల సంఖ్య అవుతుంది. ఒక్కొక్క ఛందస్సుకు ఒక్కొ అధిష్టానదేవత ఉంటుంది. ఈ మూడు ఛందస్సులు సంధ్యావందనం లో వస్తాయి.

**పురుష యజ్ఞకల్పన**

| జీవితకాలం | సం,, | సవనం | ఛందస్సు | సంఖ్యలు | దేవత |
|---|---|---|---|---|---|
| 1 - 24 | 24 | ప్రాతఃసవనం | గాయత్రి | 24 | వసువు |
| 25 – 68 | 44 | మాధ్యాందినసవనం | త్రిష్టుప్ | 44 | రుద్రుడు |
| 69 - 116 | 48 | సాయం సవనం | జగతీ | 48 | ఆదిత్యుడు |

ఇలా జీవితాన్నే ఒక మహాయజ్ఞంగా భావించాయి ఉపనిషత్తులు.

## 2.12 బ్రహ్మవిద్య

తర్వాతి పద్యంలో ఉపనిషత్తులకు ఆధారభూతమైన బ్రహ్మవిద్యను ఇలా ప్రతిపాదించాడు కవి.

**"బ్రాహ్మణుడింద్రియవశగతి**

**జిహ్మచరణైకనిపుణ చిత్తజ నిశితా**

**జిహ్మగములపాలై చెడు**

**బ్రహ్మానందాదిరాజ్య పదవీచ్యుతుడు" "** మ 3-22

బ్రాహ్మణుడు ఇంద్రియాలను అదుపులో ఉంచుకోకపోతే చివరికి బ్రహ్మానందమును కోల్పోతాడని కవి వివరిస్తున్నాడు. "బ్రహ్మమును తెలుసుకొని అతనిలో ఐక్యంకావడమే బ్రహ్మానందం" అని ఉపనిషత్తులు చెప్తున్నాయి. జీవుడు పుట్టినది మొదలు ఇహ లోకమే వాస్తవమని, అందుగల సుఖదుఃఖాదులే శాస్వతమనే అవిద్యలో బ్రతుకుతున్నాడు. కొన్నాళ్ళకు ఈ సుఖదుఃఖాలపైన వైరాగ్యాన్ని పొంది, నిజమైన బ్రహ్మాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం గావిస్తాడు. దీర్ఘసాధన తర్వాత బ్రహ్మమనగా వేరుగాలేదని, నేనే బ్రహ్మమనే సత్యాన్ని తెలుసుకుని, శాస్వతమైన ఆనందాన్ని పొందుతాడు. ఈ స్థితిలో జీవునకు సుఖదుఃఖాలుండవు. రాగద్వేషాలుండవు. ద్వంద్వ భావన ఉండదు. దీనినే బ్రహ్మానందం అంటారు. దీన్నే కవి ఇక్కడ ప్రస్తావించాడు.

## 2.13 ఆనందోబ్రహ్మ – ఉపనిషద్వాక్యం

తర్వాతి పద్యంలో కవి " ఆనందోబ్రహ్మ " అనే తైత్తరీయోపనిషద్వాక్యాన్ని యథా తథంగా ఉటంకించాడు.

**" ఎందే డెందము గందళింపం రహిచే "నేకాంతతన్ నిర్వృత్తిం**

**జెందు గుంభగత ప్రదీపకళికా శ్రీదోప నందిందు బో**

**కెందే నింద్రియముల్ సుఖింపగను నాయింపే పరబ్రహ్మ మా**

**నందో బ్రహ్మ యటన్న ప్రాజదువు నాంతర్థ మూహింపుమా!" మ 1-62**

**" ఆనందో బ్రహ్మేతి విజానాత్, ఆనందాదేవ ఖిల్విమాని భూతాని జాయన్తే, ఆనందేన జాతాని జీవంతి, ఆనందం ప్రయస్త్యభిసంవిశంతీతి" తై 5-3**

ఇది తైత్తరీయ ఉపనిషద్వాక్యం. దీన్ని యథాతథంగా కవి రాశాడు. ఆనందమే బ్రహ్మమని దీని భావం. ఆనందం నిజానికి మూడు రకాలు.1.భజనానందం 2. ఆత్మానందం 3. విషయానందం కవి యిక్కడ బ్రహ్మానందాన్ని ఉద్దేశించి చెప్పాడు. మనుచరిత్ర లో వరూధిని విషయానందాన్ని గురించి చెప్తున్నది. ఉపనిషత్తులను , పురాణాలను తనకనుకూలంగా మార్చుకుని ప్రవరుని వశపరుచుకోవలని వరూధిని ప్రయత్నిస్తున్నది. వరూధిని ఎన్ని రకాలుగా వేదవిషయాలకు లౌకిక విషయాలకు సంబంధం కల్పించి, చెప్పాలని ప్రయత్నం చేసినప్పటికి ప్రవరుడు ఆమెను అంగీకరించలేదు. పైగా ఈ క్రింది విధంగా ఆమెను చీదరించుకున్నాడు కూడా.

**" ఈ పాండిత్యము నీకు దక్క యెందే గంటిమే? కామశా**

**స్త్రోపాధ్యాయవి నా వచించెదవు మే లోహో! త్రయీధర్మము**

**ల్పాపంబుల్ రతి పుణ్యమంచు నిక నేలా తర్కముల్ మోక్షల**

**క్ష్మీ పాత్యాగమసూత్ర పంక్తి "కివి పో మీ సంప్రదాయార్థముల్!" మ 2-64**

ఈ పద్యంలో తర్కము అను మాట ప్రయుక్తమైనది. ఇది న్యాయశాస్త్ర సంబంధమైనది. నిజానికి న్యాయశాస్త్రాన్ని చాల సందర్భాలలో తర్క శాస్త్రము అనే పేరుతో పిలుస్తారు. న్యాయశాస్త్రంలో ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనం అనే ఐదు అవయవాలు కలవు. ఈ అవయవాల ద్వార సత్యాసత్యవివేచన జరుగుతున్నది. అందుకే ఈ శాస్త్రాన్ని తర్కశాస్త్రమని కూడా పిలుస్తారు. ప్రవరుడు కూడా ఈ అర్థంలోనే తర్కమనే పదాన్ని ప్రయోగించాడు.

## 2.14 యోగం – నియమం, తపస్సు

పెద్దన ద్వితీయాశ్వాసంలో నియమములో ఒకటైన అహింసను గురించి ఇలా ప్రస్తావించాడు.

**" చేసితి జన్నముల్ దపము చేసితి నంటి దయావిహీనతం**

**చేసిన పుణ్యముల్ ఫలము సెందునె? పుణ్యము లెన్ని యేనియుం**

**జేసినవాని సద్గతియె చేకురు భూతదయార్ద్రబుద్ధి కో**

**భూసురవంద్య యింత దలపోయవు నీ చదువేల చెప్పుమా!" మ 2– 72**

పై పద్యంలో కవి అహింసను అంతర్గతంగా చెప్తూ, బహిర్గతంగా తపస్సును కూడా చెప్పాడు. తపస్సును పతంజలి ఈ క్రింది విధంగా వివరించాడు.

**"కాయేన్ద్రియసిద్ధరశుద్ధి క్షయాత్తపసః" ప 3–43**

తపస్సు చేయడం వల్ల మనసులోని మాలిన్యము తొలగిపోతుంది. దాని వలన జ్ఞానేంద్రియాలకు కర్మేంద్రియాలకు అద్భుతమైన శక్తి కలుగుతుంది. అని దీని అర్థము. ఇది యమనియమాదుల తర్వాత చేయవలిసింది. యమనియమాలలో ఒకటి అహింస.

**" అహింసా ప్రతిష్టాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" ప 2–35**

అని పతంజలి అహింసను నిర్వచించాడు. అహింసను పాటించడంవల్ల ఆతని చుట్టు పక్కల ఉండే గజసింహాలు కూడా తమ స్వాభావికమైన గుణాన్ని విడిచి ప్రశాంతంగా ఉంటాయని భావం. అంత తపస్సు చేశానని  చెప్పిన నువ్వు అహింసను సాధన చేయలేద? అని వరూధిని ప్రవరుని అడుగుతున్నది.

## 2.15 వర్ణత్రయము

తర్వాతి పద్యంలో కవి వర్ణత్రయములకు విధింపబడిన విధిని గూర్చి, వేదమును ఉచ్చరించే ఉదాత్త అనుదాత్త స్వరితాలను గురించి ఇలా వివరించాడు.

**" సకళాశాగతి నర్మకోపవిరతి శ్రౌతక్రియారంభణా**

**త్మక వర్ణత్రయికిన్ మదుచ్చరిత శబ్దజ్ఞానమే మూల మిం**

**తకు బోలన్ విను డంచు దెల్పుగతి జెంతం గొండపై పల్లెలం**

**గృకవాకుల్ మెరసెన్ గృహోపరి ద్రిభంగిన్ భుగ్నకంఠధ్వనిన్" మ 3–55**

ఇందులో వర్ణత్రయములనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులని అర్థము. వేదం ఈ మూడు వర్ణాలకు మాత్రమే సంధ్యావందనాచరణను నిర్దేశించింది. ఈ పద్యంలో కవిభావన అద్భుతం. కోడికూత కవికి మూడు విధాలుగా పలుకబడే వేదం లాగ వినిపించింది. ఉదాత్త, అనుదాత్త, స్వరితములనే మూడు బేధాలతో వేదం ఒప్పారుతున్నది. వ్యాకరణం ఈ మూడింటి  గురించి ఇలా చెప్తున్నది.

**ఉదాత్తః** – ఉచ్చైరుదాత్తః

తల్వాదిషు సభాగేషు స్థానేషూర్ధ్వభాగే నిష్పన్నోஉజుదాత్త సంజ్ఞాస్యాత్

( తాలవ్యములు మొదలైనవి పైన పలకబడటమే ఉదాత్తము)

**అనుదాత్తః** – నీచైరనుదాత్తః

తాల్వాదిషు సభాగేషు అధోభాగే నిష్పన్నో సంజ్ఞేషామ్

(తాలవ్యములు మొదలైనవి క్రింద పలకడమే అనుదాత్తము)

**స్వరితః** – సమాహరః స్వరితః

ఉదాత్తనుదాత్తత్వేవర్ణధర్మోసమాహ్నియేతేయస్మిన్సోస్వరితసంజ్ఞాస్యాత్

(ఉదాత్త అనుదాత్తముల మధ్య గలది స్వరితము)

ఈ మూడు కవికి కోడి కూతలో వినిపించడం ఇక్కడ విశేషం.

## 2.16 జాతకర్మ

కవి చతుర్థాశ్వాసంలో పూర్వమీమాంస దర్శన సంబంధమైన జాతకర్మను గురించి, ఉపనయము గురించి ఇలా వివరించాడు.

**" మరియు నతండు సంయమి సమాజ వినిర్మిత జాతకర్ముడై**

**నెరి బరివర్ధి తుండు నుపవీతుడునై వివిధాయుధంబులం**

**గరికరి యై రణస్థలుల గద్దరియై నిగమార్థవేదియై**

**నెరతనకాడునై మెరసె నిర్మలకాంతి విలాస రేఖలన్" మ 4-7**

మనిషి పుట్టిన దగ్గరనుండి చనిపోయిన వరకు వేదం అతనికి 16 సంస్కారములు విధించింది. వీటిని విధిగా నిర్వర్తించాలని కూడా చెప్పింది. అవి

1 గర్భాధానము

2. ప్రంసవనము

3. సీమంతోన్నయనం

4. జాతకర్మ

5. నామకరణం

6. నిష్క్రమణము

7. అన్నప్రాసనం

8. చూడాకర్మ

9. కర్ణవేధ

10. ఉపనయము

11. వేదారంభము

12. సమావర్తనం

13. వివాహం

14. వానప్రస్థం

15. సన్యాసం

16. అన్త్యేష్టి

ఈ సంస్కారములలో నాల్గవది జాతకర్మ. పదవది ఉపనయము. జాతకర్మ సంతానముత్పన్నమైన తర్వాత చేయవలసినది. ఈ కర్మలో తండ్రి శిశువును ఒడిలో కూర్చుండబెట్టుకొని, హోమం చేస్తూ నాయీ శిశువు నశించకుండుగాక అని మంత్రాలద్వార చెప్తాడు. అలాగే శిశువు చెవిలో "వేధోసి" అని చెప్తాడు. నీవు వేదజ్ఞుడవగుదువు గాక అని దీని భావం. అలాగే నెయ్యిని, తేనెను కలిపి శిశువు నాలుకపై "ఓం" అని రాస్తాడు. వైద్యశాస్త్రం ప్రకారం ఘృతము, తేనె వాతపిత్తకఫ రోగాలను దూరం చేస్తాయి. అలాగే ఉపనయ సంస్కారం ముఖ్యమైన విదులలో ఒకటి. పురుషునికి ఐదు సంవత్సరాలు వచ్చిన తర్వాత జంధ్యము వేసి, అతనికి గాయత్రి మంత్రాన్ని ఉపదేశిస్తాడు తండ్రి. ఆ రోజు నుండి ఆ శిశువు వేదము నేర్చుకోవడానికి, సంధ్యావందనం నేర్చుకోవడానికి అర్హుడని అర్థము. పై పద్యములో ఈ రెండు సంస్కారములు చెప్పబడినవి.

## 2.17 ధ్యానము, యోగితత్వం

కవి కింది పద్యంలో ధ్యానము, యోగితత్వం గురించి ఇలా చెప్పాడు.

**"ధ్యాన స్తిమితుండగు న.**
**మ్మౌని మదీయాంగుళీ విమర్శనములచే**
**మే నెరిగి తొంటియనుసం**
**ధానము చెడి కన్ను దెరిచి దారుణఫణితిన్"** మ 4-81

కవి ఈ పద్యంలో ధ్యానమును గురించి చెప్పాడు. ధ్యానమును గురించి పతంజలి ఈ విధంగా చెప్పాడు.

**" తత్ర పత్యైకతానతా ధ్యానమ్"** ప 3-2

శిరస్సు పై భాగంలో గానీ, హృదయం మొదలైన వాటిలో గాని ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, శరీరంలోని మరేతర భాగం నుండి గాక, ఆ లక్ష్యభాగం నుండే స్పర్శానుభవాన్ని పొందగలిగితే ఆ

స్థితి ధారణ అంటారు. అలా కొంతకాలం వరకూ చిత్తం నిలువగలిగితే అది ధ్యానమవుతుందని పతంజలి సూత్రార్థం.

## 2.18 యోగం – యమాలు

ఈ కింది పద్యంలో కవి పతంజలి అష్టాంగములలో రెండవదైన యమముల గురించి ఇలా చెప్పాడు.

**" నా యజ్ఞానము సైచి సంయమివరేణ్యా! కావవే! రాక్షసుం**

**డై యే నెట్లు భజించువాడ దురితం బయ్యో నృమాంసంబు కూ**

**డై యే నెట్లు భజించువాడ నుదరం బార్ద్రాంత రుంగుండవై**

**యో యయ్యా! దయ సేయవే యవధి యే నోపంగదే హింసకున్" మ 4–20**

పతంజలి యమాల గురించి సాధన పాదంలో ఇలా చెప్పాడు.

**"అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహా యమాః" ప 2–30**

ఇక్కడి ముని యమములన్నింటిని కలిగి ఉన్నాడని కవిభావం. తర్వాత వచనంలో కవి పూర్వమీమాంస మత స్థాపకుడైన జైమిని గురించి ఇలా ప్రస్తావిస్తున్నాడు.

**" అనినవిని జైమినిమునీంద్రుడు మీదటి వృత్తాంతం బానతీవలయు ననియడుగుటయును." 5–104**

పూర్వమీమాంస మతాన్ని ప్రతిపాదించిన సిద్ధాంతకారుడు జైమిని. జైమిని వ్యాసుని శిష్యకోటిలో ఒకడు. ఇతడు కర్మసిద్ధాంతవాది. కర్మయే ప్రధానమని ఇతని భావన. మనిషి తను చేసిన కర్మ వల్లనే ఇహపర సుఖాలను అనుభవిస్తున్నాడు. మరొకటి కాదు. ఉత్తరమీమాంస వ్యాఖ్యాతలు కర్మసిద్ధాంతాన్ని ఖండించారు. కర్మ వలన మాత్రమే గతులు లభిస్తే, భగవంతుని వల్ల ప్రయోజనమేమిటని వారు ప్రశ్నించారు. ఈ సిద్ధాంతం ప్రకారం భగవంతుడు ఉండి లేనివాడే అవుతున్నాడు. అందుకే పూర్వమీమాంసవాదులు జైమినిమతాన్ని ఖండించారు.

## 2.19 ప్రాణాయామ

తర్వాతి పద్యంలో యోగదర్శన సంబంధమైన ప్రాణాయామాన్ని గురించి కవి ఇలా చెప్తున్నాడు.

**" ఫల మూల చ్ఛదనాంబు భుక్తి బవనాభ్యాసక్రియాయుక్తిని**

**ర్దళితాంతర్గతశాత్ర ప్రకరరజాగ్రద్గద్వసర్వసుడై**

**చలికిన్ వానకు నెండకున్ మన మనుత్సాహంబు గానీక కం**

**దళితానందమునన్ ముకుందచరణ ధ్యానానధానంబునన్" మ 5–20**

పైన చెప్పబడిన బవనాభ్యాసక్రియనే పతంజలి ప్రాణాయమం అన్నాడు. పతంజలి అష్టాంగములలో దీన్ని నాల్గవదిగా చెప్పాడు. పతంజలి ప్రాణాయమమును ఈ క్రింది విధంగా నిర్వచించాడు.

**" తస్మిన్ సతి శ్వాసప్రశాసయోర్గతి విచ్చేదః ప్రాణాయామః" ప 2-49**

ఆసనం తర్వాత ఉచ్వాస నిశ్వాసాలగతి నిరోధమైన ప్రాణాయమం సిద్ధిస్తుంది. ఆసనసిద్ధి కలిగిన వెంటనే ప్రాణ చలనాన్ని నిరోధించాలి. శరీరంలోని ప్రాణశక్తుల్ని వసం చేసుకోవటం అనే ప్రాణాయామాన్ని గూర్చి మనం విచారణ చేయాల్సి ఉంది. సాధారణంగా ప్రాణ**ము**ను శ్వాస అని అనువదిస్తారు. అయితే ప్రాణమంటే శ్వాస కాదు. సమస్త విశ్వంలోకి సాముదాయికశక్తే ప్రాణం. ఇదే ప్రతి శరీరంలోని శక్తియై ఊపిరితిత్తుల చలనంలో మనకు స్పష్టంగా గోచరిస్తుంది. ప్రాణం, శ్వాసను లోనికి లాగుకోవటం వల్ల చలనం ఏర్పడుతుంది. ప్రాణాయామంలో మనం నిరోధించేది ఈ ప్రాణమే. ప్రాణాన్ని అతిసులభంగా వశం చేసుకోవటానికి ముందుగా మనం శ్వాసను వశం చేసుకునే ప్రయత్నం చేయాలి.

## 2.20 భగవంతుడు – సర్వవ్యాపకత్వం

తర్వాతి పద్యంలో కవి భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని గురించి ఇలా చెప్తున్నాడు.

**" అవ్యయానంత! విశ్వాత్మక! విశ్వేశ! బ్రహ్మవు నీవ: కపర్థి వీవ**
**యింద్రుడవీవ: వహ్నివి యనిలుడ వీవ :వరుణుడ వీవ: భాస్కరుడ వీవ**
**యముడవీవ: వసూత్కారము నీవ: రుద్రులు,నీవ : యాదిత్యులు నీవ: విశ్వు**
**లీవ: మరుత్తులు నీవ: మంత్రములు నోం కృతి పషట్కృతి శృతిస్మృతులు వీవ**
**వేద్యమీవ: యీా వచ్చిన విబుధగణము**
**సర్వమును వీవ: యెట్లన్న సర్వగతుడ**
**వగుట మరి నీవు గానివాడనగ నెవ్వ?**
**దరయగను శేషభూతసమస్త! శేషి!" మ 6-104**

కవి ఈ పద్యంలో బ్రహ్మ సర్వవ్యాపకత్వాన్ని వర్ణిస్తున్నాడు. అంతయు నీవే హరిపుండరీకాక్ష అనే అన్నమయ్య తత్వాన్ని ప్రతిపాదించే ప్రయత్నం చేస్తున్నాడు కవి. అయితే ఒకే పద్యంలో సర్వదేవతలను, పంచభూతులను, ద్వాదశాదిత్యులను, శ్రుతులను, స్మృతులను, ఓంకారాన్ని కలగలిపి చెప్పడం పెద్దనకు దక్క వేరొకరికి సాధ్యం కాని పని. ఇన్ని చెప్పిన విశిష్టాద్వైత తత్వాన్ని మాత్రం కవి విడిచి పెట్టలేదు. అందుకే అన్నీ నీవే అంటున్నాడు గాని నేను కూడా నీవే అని మాత్రం

అనడం లేదు. అందుకే ఈ స్తుతి అంతా విశిష్టాద్వైత మతానుగుణంగా సాగిందని చెప్పాలి. ఈ విధంగా పెద్దన తన మనుచరిత్రలో న్యాయ, యోగశాస్త్రఅంశాలను చూచాయగాను, పుర్వోత్తర్తమీమాంసలను లోతుగాను స్పృశియించాడు. అయితే పూర్వోత్తరమీమాంశాంశాలన్నింటినీ కేవలం విశిష్టాద్వైత దృష్టితోనే చూసాడనడం సమంజసం.

## 3. కళాపూర్ణోదయం పై షడ్దర్శన ప్రభావం

కళాపూర్ణోదయం ఒక విజ్ఞాన సర్వస్వంలాంటి ప్రబంధం. అన్ని శాస్త్రాలకు సంబంధించిన అంశాలు ఇందులో భాగములై ఉన్నవి. షడ్దర్శనాలకు కళాపూర్ణోదయం ఆలవాలమై ఉన్నది. ఈ ప్రబంధంలో ఆరు దర్శనముల ప్రస్తావన చాల చోట్ల కనబడుతుంది. కొన్నిచోట్ల దర్శనఖండన కనబడుతున్నది. మరికొన్ని చోట్ల సందర్భపరిపుష్టి కోసం వీటిని వినియోగించుకున్నారు. యోగముపైన సూరనకున్నంత అధికారము మరే ఇతర కవికి లేదని నిక్కముగా చెప్పవచ్చును. తన కావ్యంలో సూరన ఎన్నో యోగశాస్త్ర రహస్యాలను తేటతెల్లం చేసాడు. ఇతడు విశిష్టాద్వైతి. అందుకే అద్వైతమతఖండన చాల చోట్ల గావించాడు. స్వమత స్థాపనమునకు పలుమార్లు ప్రయత్నం చేసాడు. మొత్తం మీద మిగిలిన ప్రబంధాలన్నింటికంటే కళాపూర్ణోదయం పై దర్శనప్రభావం అధికంగా ఉందని చెప్పవచ్చును.

### 3.1 వేదములు

కవి తన ప్రథమాశ్వాసంలో వేదముల ప్రస్తావన ఈ క్రింది విధంగా తీసుకువచ్చాడు.

**" అనయము బ్రేమ సంధిలగ నాస్యచతుష్టయయౌగపద్యమం**
**బన ఘనకాంక్షబోలె నిగమంబుల పేరిల నాల్గురూపులం**
**దనరెడు భార్యమాట జవదాటక సృష్టి యొనర్చు వారిజా**
**సనుడు నృసింహ కృష్ణవిభుజాల జిరాయురుపేతు జేయుతన్" క 1-4**

వేదములకు అపౌరుషేయములని పేరు. అవి ఒకరు రాసినవి కావు. వేదములు ఈశ్వరుని సృష్టి. వాటిని గురించి ముండకోపనిషత్తు ఇలా చెప్పినది.

**" తస్మాదృచః సామ యజూంషి దీక్షా**
**యజ్ఞాశ్చ సర్వే కృతవో దక్షిణాశ్చః**
**సంవత్సరశ్చ యజమానశ్చ లోకాః**
**సోమో యత్ర పవతే యత్ర సూర్యః" ము 2-6**

నాలుగువేదాలు, విధులు, యజ్ఞాలు, క్రతువులు, బ్రహ్మలోకం లాంటివన్ని ఈశ్వరుడినుండే ఉద్భవించాయని దీని భావం

## 3.2 విశిష్టాద్వైతమత స్థాపన

విశిష్టాద్వైతం విష్ణువునే సర్వాంతర్యామిగా భావిస్తుంది. అతడు దక్క మిగిలిన దేవతలంతా కేవల జీవులే. సూరన విశిష్టాద్వైతి. అందుకే సకల విద్యలు విష్ణుభక్తి ద్వారానె ప్రాప్తమవుతున్నాయని సూరన ఇలా చెప్పాడు.

**" శ్రీ విష్ణుపదభక్తిచే ధర్మ సంపత్తి**
**ధర్మ సంపత్తి చేతను జయంబు**
**జయసిద్ధి చేత నుజ్జ్వల బాహుసౌర్యంబు**
**శౌర్యగౌరవముచే చతురనీతి**
**నీతి పెంపున మహనీయ సామ్రాజ్యంబు**
**సామ్రాజ్య మహిమచే శాంతిగుణము**
**శాంతిచే వేదాది సకల సద్విద్యలు**
**విద్యలచే బుద్ధి విలసనంబు**
**దాన బాత్రవివేకంబు దాననీగి**
**దానక్రమలకీర్తియు దానగుణమ**
**ప్రేమనత్యంతము నలంకరించుకొనియె**
**బళిర! నంద్యాలనార భూపాలకుండు.” క 1-18**

పై పద్యం ప్రకారం విష్ణుభక్తి వలన ధర్మసంపత్తి కలుగును, దాని వలన జయము. జయము వలన శౌర్యము. శౌర్యము వలన నీతి, నీతి వలన సామ్రాజ్యము, సామ్రాజ్యము వలన శాంతి. శాంతి వలన సకల సద్విద్యలు లభిస్తాయని కవి అభిప్రాయం. సూరన చాల చోట్ల స్వమతస్థాపనమునకు ఇలాంటి ప్రయత్నములు పెక్కులు చేసి ఉన్నాడు. అందుకే విష్ణుభక్తి కలవానికి మాత్రమే వేదవిద్యలు తద్వార విహితమైన మోక్షము లభిస్తున్నాయని కవి భావించాడు.

## 3.3 చాతుర్వర్ణవ్యవస్థ

పెద్దనాదులు విధిగా చాతుర్వర్ణవ్యవస్థను వర్ణించారు. దీనికి సూరన కూడ లోబడి ఉన్నాడు. ఈ చాతుర్వర్ణ వ్యవస్థ మొదట వేదాలలో చేయబడింది. వేదం నాలుగు వర్ణాలు ఎలా పుట్టాయనే విషయాన్ని గురించి ఇలా చెపుతున్నది.

**" బ్రహ్మణస్య ముఖమాసీత్**

**బాహూ రాజన్య కృతః**

**ఊరూ తదస్య యద్వైశ్యః**

**పద్భ్యామ్ సూద్రోరజాయత" ఋ 10-12**

బ్రాహ్మణుడు భగవంతుని ముఖం నుండి, క్షత్రియుడు బాహువుల నుండి, ఊరువుల నుండి వైశ్యుడు, పదముల నుండి శూద్రుడు పుట్టారని దీని భావం. ఈ వర్ణవ్యవస్థను తర్వాత వచ్చిన ఆర్యులు, ద్రవిడులు అంగీకరించారు. సూరన కూడా ఈ క్రింది విధంగా నాలుగు వర్ణాలను వర్ణించాడు.

**" చాతుర్యాధి గతాఖిల శ్రుతిచయముల్ షడ్దర్శనీపారగుల్**

**శ్రౌత స్మార్త విధి ప్రసిద్ధ పదవి సంచార లీలాధ్వగుల్**

**చేతో నామవిలోచనాచరిత లక్ష్మీ నాథ సంజ్ఞాది మ**

**జ్యోతిర్నిత్యనిరీక్షు లప్పురములో నున్నట్టి యుర్వీసురుల్" క 1-13**

ఈ పద్యంలో కవి పురధరణీసురులను వర్ణిస్తూ " షడ్దర్శనీపారగుల్" అని కొనియాడాడు. ఆ పురములో ఉండే భూసురులందరూ న్యాయవైశేషికములు, సాంఖ్యయోగములు, పూర్వోత్తర మీమాంసలు అని చెప్పబడే షడ్దర్శనములపైన అధికారం కలిగినవారు. పూర్వం బ్రాహ్మణులందరూ వేదాలను విధిగా చదివేవారు. వేదాలను ఆధారంగా చేసుకుని ఈ ఆరుదర్శనాలు తత్వచర్చలు కొనసాగించినవి. అందుకే వీటిని ఆస్తిక దర్శనాలు అని పిలుస్తారు. ఈ దర్శనములు ఒక్కొక్కటి భగవంతుని చేరుకోవడానికి ఒక్కో మార్గాన్ని సూచించాయి. నాటి బ్రాహ్మణులు ఈ దర్శనాలపైన చర్చోపచర్చలు చేసేవారు. అందుకే కవి వారిని షడ్దర్శనీపారగుల్" అని పొగిడాడు.

**" నానాయుద్ధవిహార శూరులు గుణానందజ్జయ శ్రీ నఖాం**

**కానూన భ్రమదాయుధవ్రణ కిణోదంచచ్ఛరీరుల్ సదా**

**దానప్రౌఢి యశో విశేష జితమందారుల్ గభీరుల్ మహా**

**మానాధారులు రాకుమారులతి భూమన్ మింతు రవ్వీటిలోన్ " క 1-14**

**తమ తమ పెద్దవారు మును దాచినద్రవ్యము లున్నయట్ల యుం**

**డ మితములేక యొప్పెడు ధనంబులదారు గడించి యుర్వి ని**

**త్యము నమితంబుగా నవధానము లస్పుచు నప్పురంబులో**

**నమరెడు కోమటుల్ నగదు రల్లకుభేరు నిధీశ్వరత్వమున్" క 1-15**

**ద్విజులను శాస్త్రనియుక్తిని**

**భజియించుచు నిండ్ల సకలభాగ్యవిభవమ**

క్కజమైనతర సుఖింతురు

సుజనులు తత్పురములోని శూద్రులు నెమ్మిన్" క 1-16

పై మూడు పద్యాలలో వరుసగా క్షత్రియ, వైశ్య, శూద్రులు వర్ణింపబడినారు.

## 3.4 త్రిగుణాలు

తర్వాతి పద్యంలో కవి త్రిగుణాలలో ఒకటైన సత్వగుణాన్ని ఇలా వర్ణించాడు.

**" అందును వీరు వారనక యందరు ధర్మ ధురీణులైనవా**

**రందరు శుద్ధభాగవతు లందరు వేదనిరూఢి నున్నవా**

**రందరు సాత్విక ప్రవరులందరు తత్వమెరింగినట్టివా**

**రందరు సత్కృపానిరతులందరు పావనులెన్ని చూడగన్" క 1-21**

పై పద్యంలో కవి పురప్రజలను వర్ణిస్తున్నాడు. ఆ పురంలో ఉన్నవారందరూ వేదము చూపిన మార్గంలో పయనించేవారట. సాత్విక గుణము కలిగినవారట. ఈ గుణము త్రిగుణములలో ఒకటి. సత్వరజస్తమములు త్రిగుణాలు. ఈ మూడు సాంఖ్యమతం ఉపదేశించిన 25 తత్వాలలో ఉన్నవి.

## 3.5 షట్ సంపత్తులు

తర్వాతి పద్యంలో కవి యోగశాస్త్రంలో ప్రధానమన దగిన షట్ సంపత్తులను గూర్చి ఇలా చెప్పాడు.

**"హృదయము వ్రేగొకింత శమియించెను. జెల్వపు గ్రొవ్వు పెంపునం**

**బొదలెడు రంభకున్ సవతిపోరు ఘటించుట కంకురార్పణం**

**బిది యిటు గొంతచేసితి నపేక్షితమంత యువైనయట్ల యీ**

**సుదయతి చాలు దీనికి నసూయము నున్నది మాటలారయన్"క 2-3**

శమము, దమము, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానములనునవి షట్ సంపత్తులు. శమమనగా ఇంద్రియాలను మనసును అదుపులో ఉంచుకొనుట. నారదున్ని ఉద్దేశించి ఈ పదప్రయోగం చేసాడు కవి.

## 3.6 యమము

తర్వాత కవి అష్టాంగములలో ఒకటైన యమాన్ని గురించి ఇలా చెప్తున్నాడు.

**" అంతగ్రమంబునం బ్రియుని యాజ్ఞను సత్యయు భోజకన్యయున్**

**సంతస మొప్ప నప్పరమసంయమి నొక్కొక్క యేడు దిద్దిర**

**త్యంత మనోజ్ఞగానపటి మాతిశయోన్నతు గాగ నవ్విభుం**

**దంతట దాను దిద్దెనొక యబ్దము పూర్ణముగాగ నాతనిన్" క 2–36**

ఇక్కడ వినియోగించిన సంయమ పదము యోగశాస్త్ర సంబంధమైనది. ధారణ, ధ్యానం, సమాధి ఈ మూడింటిని ఒక విషయముపైనుంచుటయే సంయమమనబడుతున్నది, దీనివలన అణిమాది సిద్ధులు లభిస్తాయని పతంజలి తన యోగశాస్త్రంలో వివరించాడు.

## 3.7 తపస్సు

తర్వాతి పద్యంలో కవి యోగశాస్త్ర సంబంధమైన పదాన్ని ఇలా ప్రయోగించాడు.

**" నీదు కృతార్థతామహిమ నెమ్మది నెన్నగ నంతయినా**

**రాదు తపంబుల గనగ నానిజ గత్పతి కృష్ణు డెట్టి భా**

**గ్యోదయ శాలికిం దొరకు నుల్లమునం బరికించు చూడు మా**

**శ్రీదయితుండు నీకు గృపచేసె గురుండయి గానసత్కళల్" క 2– 64**

చాలవరకూ వ్యవహారంలో తపస్సు, ధ్యానం, ప్రాణాయామం వీటన్నింటినీ ఒకే అర్థాన్నిచ్చే పదాలుగా చాల మంది భావిస్తారు. వీటి మధ్య చాల అంతరాయం ఉన్నది. పతంజలి తన యోగదర్శనంలో తపస్సును గూర్చి ఇలా చెప్పాడు.

**" కాయేన్ద్రియసిద్ధరశుద్ధక్షయాత్తపసః" ప 3–43**

తపస్సు మనస్సులోని మాలిన్యమును తొలగిస్తుంది. దాని వలన జ్ఞానేంద్రియాలకు కర్మేంద్రియాలకు అద్భుతమైన శక్తి కలుగుతుంది. అని పతంజలి భావం.

## 3.8 కపిలమహర్షి

సాంఖ్య దర్శనకర్త అయిన కపిలుని కవి ఈ క్రింది విధంగా స్మరించాడు.

**" ఓ యనఘ! దేవుడవొ యో**

**గాయత కపిలాది సిద్ధులందు నొకడవొ?**

**నీయనుభావం బద్భుత**

**మై యున్నది నామ మెద్ది యానతియీవే!" క 2–56**

కపిల మహర్షి కృతయుగారంభంలో అవతరించినట్లుగా మన పురాణాలు చెప్తున్నాయి. కపిల మహర్షిని " ఆది విద్వాంసుడు" అని పండితులు కీర్తిస్తారు. భగవద్గీతలో కూడా “సిద్ధానాం

కపిలోముని" అంటూ కపిలుని గొప్పతనం చెప్పబడింది. ఇలాంటి యోగపురుషుడైన కపిలుని ప్రస్తావన పై పద్యమున కలదు.

## 3.9 కర్మవాసన

కర్మవాసన అను పదం యోగపూర్వోత్తర మీమాంసల అంశం. ఆ పదాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" అలయక వేదశాస్త్ర సతతాభ్యసన వ్యసన ప్రసంగతిం**
**దెలివి యొకింత కాంచినగతి స్మృతి కెక్కియు వెర్రి దీరెరా**
**కలిదల జుట్టు మన్న క్రియగా నొక కొందరు దాల్తురప్పటిం**
**గలుషపథ ప్రవర్తనమె కర్మపువాసన ;అన్నుగొల్వగన్" క 2-108**

కర్మ వాసనల గురించి యోగశాస్త్రం ఈ విధంగా చెప్తున్నది.

**" తతస్తద్వి పాకాను గుణానామేవాభివ్యక్తిర్వాసనానామ్" ప 2-8**

ఈ త్రివిధ కర్మలనుండి, ఆయాస్థితులకు అనుకూలించే వాసనలే వ్యక్తమవుతుంటాయి. కర్మవాసనలెప్పుడూ తగిన పరిస్థితులలో మాత్రమే వ్యక్తమవుతాయని దీని భావం. ఎన్ని కర్మలు చేసినప్పటికీ కర్మవాసనలు మాత్రం పరిస్థితులకనుకూలంగా ఉంటాయని దర్శనకారుడి మతం.

## 3.10 బ్రహ్మవిదులు

బ్రహ్మమును తెలుసుకున్నవాడు బ్రహ్మవిదుడని చెప్పబడుతున్నాడు. బ్రహ్మమునెవడు తెలుసుకున్నాడో వాడు బ్రహ్మమే అవుతున్నాడు. ఈ విషయాన్ని గురించి మాండూక్యోపనిషత్తు ఇలా చెప్తున్నది.

**" స యొ హ వై పరమం బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి**
**న్యాయాబ్రహ్మవిత్ కులే భవతి**
**తరతి శోకం తరతి పాప్మానం గుహగ్రంధిభ్యో**
**విముక్త మృతో భవతి" మా 3-42**

పై విషయాన్ని కవి క్రింది పద్యంలో ఇలా చెప్పాడు.

**" వినుము గంధర్వనందన? భూతములయందు**
**బ్రాణులుత్తమములు ప్రాణులందు**

**బుద్ధిజీవులు మేలు బుద్ధిజీవులయందు**

**మనుజులు శ్రేష్టులు మనుజులందు**

**బ్రాహ్మణులధికులు బ్రాహ్మణులందు వి**

**ద్వాంసులు ఘనులు విద్వాంసులందు**

**విదితార్థ కృతలోల హృదయులు ముఖ్యులు**

**విదితార్థ కృతిలోల హృదయులందు**

**గర్తలెంతయు బూజ్యులు కర్తలందు**

**బ్రహ్మవిదులెక్కుడామీద బరమ మొకటి**

**గలుగదనుచును మున్ను దాబలికె మనువు**

**ధర్మ శాస్త్ర ప్రసంగ వర్తన వేళ" క 2-109**

కవి అభిప్రాయం ప్రకారం భూతములన్నింటిలోను ప్రాణులుత్తమమైనవి. ప్రాణులలో బుద్ధిజీవులు, బుద్ధిజీవులలో మనుషులు, మనుషులలో బ్రాహ్మణులు, బ్రాహ్మణులలో విద్వాంసులు, విద్వాంసులలో నిత్య కర్మానుష్టానము చేయువారు, వారిలో బ్రహ్మవిదులు గొప్పవారు. ఇక్కడ బ్రాహ్మణాధిక్యత వ్యక్తమవుతున్నది. బ్రహ్మమును తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతున్నాడనేది అద్వైతమతం. కవి ఈ మతాన్ని అంగీకరించడు. అందుకే బ్రహ్మమును తెలుసుకున్నవాడికి గొప్పస్థానాన్నిచ్చాడు తప్ప బ్రహ్మస్థానాన్నివ్వలేదు.

## 3.11 పరమతమును అంగీకరించకుండుట

ద్వైతాద్వైత విశిష్టాద్వైతులు ఒకరినొకరు అంగీకరించరు. ఎవరి అభిప్రాయం వారిదిగా నిలబడి ఉంటారు. సూరన విశిష్టాద్వైతి. అందుకే విష్ణువే సర్వమనే భావనను, ఇతరములనిత్యములనే భావనను కింది పద్యంలో ప్రతిపాదించాడు.

**" నీవిధ మారయం బరిగణించినయప్పటి తారతమ్యపుం**

**ద్రోవ కరంబు దూరముగ ద్రొక్కినవాడవు నిక్కువంబు ల**

**క్ష్మీ వరనిత్య సన్నిధి విశేష మాహత్మ్యమెరింగినంతనే**

**యా విభవంబు గాంచుటకు నాస యొనర్చితిగాన నిమ్మెయిన్" క 2-110**

లక్ష్మీవరుడైన విష్ణువును తెలుసుకున్నవారే గొప్పవారు. ఇతరేతర దేవతల పట్ల మొగ్గు చూపెడివారు అధములని ఇక్కడి ధ్వని.

## 3.12 కర్మ సిద్ధాంతం

ఉత్తరమీమాంసానుసారం మనుషి కర్మలను భగవదర్పితములుగా చేయాలి. ఫలమును కోరరాదు. భగవద్గీత కర్మను గురించి ఇలా చెపుతున్నది.

**" కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**

**మా కర్మఫలహేతుర్భూమాతే సంగోస్త్వకర్మణి"** భ 2– 47

ఇదే అర్థం వచ్చేటట్లు కవి తన పద్యాన్ని రాసాడు.

**" తనశక్తికొలది సత్కర్మముల్ఫలవాంఛ**

**మాని కృష్ణార్పణమతి జరుపుట"** క 2–14

తర్వాతి పాదాలల్లో విష్ణుభక్తిని మళ్ళీ ఇలా ప్రతిపాదిస్తున్నాడు.

**" ప్రసిద్ధకర్మంబు పరిహరించుట విష్ణు**

**భక్తి పై క్రమమున బాదుకొనుట**

**తద్భక్తి గల పుణ్యమతుల సంసర్గంబు**

**దుర్జలున్నట్టి త్రోవ జనమి**

**విష్ణుసన్నిధికళావిఖ్యాత వివిధ ది**

**వ్యక్షేత్ర తీర్థయాత్రాచరణము"** క 2–14

## 3.13 బ్రహ్మచర్యం, తపస్సు, వైరాగ్యం

మరల యోగశాస్త్ర సంబంధమైన బ్రహ్మచర్యతపవైరాగ్యాల గురించి ఇలా చెప్తున్నాడు.

**" బ్రహ్మచర్యంబు దపము వైరాగ్యగుణము**

**వలయు వైకుంఠమున గోరువారికెల్ల**

**వీనిలోపలంగొన్ని గావింపగనిన**

**వృథ చనవుచేర్చు గ్రమమున విష్ణుపథము"** క 2–114

వైకుంఠాన్ని కోరేవారు బ్రహ్మచర్యం, తపస్సు, వైరాగ్యము కలిగి ఉండాలని ఇక్కడ భావం. బ్రహ్మచర్యాన్ని గురించి యోగం ఇలా చెపుతున్నది.

**" బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః"** ప 2–9

బ్రహ్మచర్యాన్ని పాటించడం వల్ల బ్రహ్మవర్చస్సు లభిస్తుందని సూత్రార్థం. తపస్సును గురించి పతంజలి **" కాయేంద్రియసిద్ధిరశుద్ధక్షయాత్తపసః"** అని నిర్వచించాడు.

వైరాగ్యమును గూర్చి ఈ క్రింది విధంగా చెప్పాడు.

**"దృష్టానుశ్రవిక విషయయతృష్ణస్య వశీకార సంజ్ఞ వైరాగ్యమ్" ప 1-15**

ఇహమునందు పరమునందు అనుభవించదగ్గ సుఖముల పట్ల కోరిక లేకపోవడం వైరాగ్యం అని దీని భావం. వైకుంఠాన్ని కోరేవారు ఈ మూడు యోగమార్గాలను ఆచరించాలని కవిభావన.

## 3.14 పంచభూతాలు

సృష్టి నడవటానికి ఆధారం పంచభూతాలు. వీటిని కవి ఒకే పద్యంలో కూర్చి ఇలా చెప్పాడు.

**" మణిమయ ప్రాకార మండప గోపురో**
**దీర్ఘ కాంతులచేత దేజమునకు**
**జారునదీహస్త చామరవీజన**
**వ్యాపారములచేత వాయువునకు**
**నారాధనార్థ యాతాయాతజన విభూ**
**షారజోవృష్టిచే ధారుణికిని**
**హృద్యచతుర్విధవాద్యస్వనయో**
**గప్రవర్తనముచే గగనమునకు**
**నిజనవాగరు ధూపజ నీరవాహ**
**జనన సంబంధ మహిమచే సలిలమునకు**
**భావనత్వంబు గలుగంగ బరగు వేంక**
**టేశునగరు దాజేరి యింపెసక మెసగ" క 2-130**

పై పద్యంలో వర్ణితమయిన పంచభూతములను షడ్దర్శనములు అంగీకరించినవి. అయితే ఈ పంచభూతములు మానవ శరీరంలో కూడ కలవని, ప్రాణమున్నంతవరకూ జీవునిలోపల అవి నివాసముంటాయని ప్రాణంతో పాటుగా అవి గూడా జీవుని విడిచిపోతాయని వేదమునందు ఉక్తమైనది. ఈ విషయం భాగవతంలోని పృథుమహారాజు వృత్తాంతం ద్వార తెలియవస్తున్నది. పృథువు కుండలినీ యోగము ద్వార కుండలినీ శక్తిని సహస్రారం దాక తీసుకెల్లి, షట్ చక్రాలను ప్రేరేపించాడు. తర్వాత తన శరీరంలోని పంచభూతాలను పంచభూతాలలో కలిపేశాదని భాగవతం చెపుతున్నది.

## 3.15 సంయమము

యోగశాస్త్రమున సిద్ధుల కొరకు చెప్పబడిన యోగము సంయమము. సంయమమును గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" దివ్య సంయమిమనస్థిత బొల్చు మత్కుల**
**దైవంబు పదముల దలపు జేర్తు**
**నఖిలలోకస్రష్ట యగు బ్రహ్మ గన్నమ**
**త్ప్రాణ బంధువు నాభి నాత్మ జేర్తు**
**దైతేయ కంఠనిర్దముళనంబులైన నా**
**స్వామి హస్తముల భావంబు జేర్తు**
**లక్ష్మి చన్గవకు నలంకారమైన నా**
**తండ్రి పక్షమున జిత్తంబు జేర్తు**
**నుల్లము నకును జూడ్కికి వెల్లి గొలుపు**
**నావరదు మోమునందు మనంబు జేర్తు**
**ననుచు గీతరూపములుగా నాశుకవిత**
**నుతుల రచియించి పొగడు నతడు గొలిచె" క 2-154**

పతంజలి తన యోగ సూత్రములలో సంయమమునకు అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. సంయమాన్ని పతంజలి ఈ క్రింది విధంగా నిర్వచించాడు.

**" త్రయమేకత్ర సంయమః" ప 3-4**

ఒకే విషయములో ధ్యానము, ధారణ, సమాధి మూడింటిని కలిపి ఉంచదము సంయమమని చెప్పబడుతున్నది. సంయమం వలన అనేక సిద్ధులు చేకూరుతాయని పతంజలి అభిప్రాయం. వీటన్నింటి గురించి విభూతి పాదంలో పతంజలి వివరించారు.

## 3.16 నామసంకీర్తన

నామసంకీర్తన విశేష మాహాత్మ్యం గలది. నామసంకీర్తన గురించి కవి ఇలా చెప్పాడు.

**" పరమంబగు మీనామము**
**కర మామ్నాయములు తారక బ్రహ్మముగా**
**నిరతి న్వినుతింపగ నా**

**తరమే మిము నభినుతింప! దశరథరామా!" క 2-161**

వేదాలు మొదలుకొని ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, సంకీర్తనలు అన్నింటిలోనూ నామసంకీర్తన మాహాత్మ్యం చెప్పబడింది. పతంజలి కూడ స్వాధ్యాయమనే పేరుతో ఇష్టదేవతాస్తుతిని గూర్చి చెప్పాడు.

**" తేజోసి తేజో మయిధేహిః**

**వీర్యమసి వీర్యం మహిదేహిః**

**బలమసి బలంమయి దేహిః**

**ఓజోసోజో మయి దేహిః" య 19-9**

ఓ పరమేశ్వర నీవు తేజమువు. నాకు తేజమును ప్రసాదింపుము. నువ్వు వీర్యరూపానివి. నాకు వీర్యమును ప్రసాదింపుము. నీవు బలమువు. నాకు బలాన్ని ప్రసాదింపుము. నీవు ఓజస్సువు నాకు ఓజస్సును ప్రసాదింపుము అని దీని భావం.

## 3.17 పద్మాసనం

ఆసనములలో యోగులందరూ సర్వసాధారణంగా వేసే ఆసనం పద్మాసనం. పతంజలి తన యోగ సూత్రాలలో ఆసనాన్ని ఇలా నిర్వచించాడు,

**" సుఖం స్థిరమ్ ఆసనమ్" ప 1-12**

ఏ ప్రదేశంలోనైతే స్థిరంగా, సుఖంగా నిలువగలుగతామో అదియే ఆసనమని దీని భావం. కవి తన కావ్యంలో పద్మాసన ప్రస్తావన ఇలా తీసుకువచ్చాడు.

**" అని యా దిక్కునకు విలో**

**కనములు నిగుడించి యదె నిగాఢపు బద్మా**

**సనమున గూర్చున్నాడో**

**వనిత! యిపుడు దృఢసమాధివర్తన మీరన్" క 2-165**

ఈ ఆసనము సాధనకు సానుకూలమైనది. ధ్యానము, ప్రాణాయమము ఈ ఆసనంలోనే చేస్తారు.

## 3.18 మంత్రములు

కవి మొత్తం కళాపూర్ణోదయంలో రెండు సార్లు మంత్రాల గురించి ఇలా ప్రస్తావించాడు.

**" నీవు గడగి యమ్మునీంద్ర శార్దూలత**

**పోమహత్త్వ దర్పమును హరించి**

**కీరవాణి! యతని గ్రీడామృగంబుగా**

**జేయవలయు గుసుమ సాయకునకు**" క 2–182

" **మననాత్ త్రాయతే ఇతి మంత్రః**" అని మంత్ర నిర్వచనం. మననం చేయడం వలన కాపాడేది కావున అది మంత్రము అనబడుతున్నది. వేదవేదాంతముల యందు చెప్పబడినవన్నియు మంత్రములే. మంత్రాలలో ఓంకార పూర్వకమైన పంచాక్షరీ, అష్టాక్షరీ మంత్రములు ఉత్తమమైనవిగా జ్ఞానులు అభిప్రాయపడతారు.

## 3.19 యోగితత్వం

యోగి తనదైన మార్గాన్ని ఎంచుకుని, తనకు తెలిసిన రీతిలో సాధన కొనసాగిస్తాడు. సర్వసిద్ధులు సముపార్జించి మోక్షసాధనే తర్వాతి సోపానంగా కలిగిన యోగిని సూరన ఇలా వర్ణించాడు.

" **ప్రత్యక్షమైనట్టి పావనత్వంబునా**

**బుంజీభవించిన పుణ్యమనగ**

**సాక్షత్కరించిన శాంతరసంబునా**

**గరుడుగట్టిన తపోగరిమయనగ**

**గురువున బోసిన పరమసత్వంబునా**

**రాశియై యున్నవైరాగ్యమనగ**

**గరచరణాదులు గలయోగవిద్యనా**

**బూదెగట్టిన తత్వబోధమనగ**

**బరగు నమ్మౌని గనిరి తచ్చరణ నఖర**

**చంద్ర చంద్రికా ముకుళిత చారుహస్త**

**నళినసంగ భృంగాయమాణ భ్రమరక**

**నికర లగుచు నావేలుపు నెలతలంత**" క 3–12

కవి పైన చెప్పిన తపస్సు, వైరాగ్యము, యాగము, సత్వము అను పదములు యోగశాస్త్ర సంబంధమైనవి. వైరాగ్యమనగా రాగము లేకపోవడం. మమకారం లేకపోవడం. ఇది యోగికుండవలిసిన ప్రథమ లక్షణం. సత్వమనునది త్రిగుణాలలో ఒకటి. సత్వరజస్తమములు

త్రిగుణాలు. ప్రపంచమంతయు ఈ త్రిగుణాలతోనే నిండి ఉన్నదని తత్వవేత్తల భావన. సాంఖ్య శాస్త్రములోని 25 తత్వములలో ఈ త్రిగుణములు కూడ ఉన్నవి.

## 3.20 రాగము

యోగశాస్త్రము పంచక్లేశములను ఉపదేశించినది. వాటిలో ప్రధానమైనది రాగము. సూరన కవి రాగమును ఈ క్రింది వచనంలో ప్రస్తుతించాడు.

**" ఇత్తెరుంగున బద్ధానురాగుండగుచు మణికంథరుం డాగంధగజ గమనయాకార రేఖా విలాసంబు లెంతయుం బరికించి" క 3-24**

రాగాన్ని పతంజలి ఇలా నిర్వచించాడు.

**" సుఖానుశయీ రాగః" ప 2-7**

ప్రపంచమునందున్న సుఖాలు తెలిసినవాడికి, ఆ సుఖాలు నిరంతతం జ్ఞాపకానికి వస్తాయి. అలా జ్ఞాపకానికి వచ్చి యోగి సాధనకు భంగం కలిగిస్తాయి. ఇలా సాధనకు అడ్డు తగిలే దాన్నే రాగమంటారు.

## 3.21 జితేంద్రియత్వం

మనిషి ఐదు జ్ఞానేంద్రియాలను, ఐదు కర్మేంద్రియాలను కలిగి ఉన్నాడు. వీటిని అదుపులో ఉంచుకోవడమే జితేంద్రియత్వం అనబడుతున్నది

**జితేంద్రియత్వంబు తనదైనట్టు బరగి క 2-25**

దీన్ని గురించి పతంజలి యోగసూత్రాలలో ఇలా చెప్పాడు.

**" గ్రహణ – స్వరూపాస్మితన్వయార్థ వత్త్వ సంయమాదింద్రియ జయః" ప 3-48**

ఇంద్రియాల బాహ్యవృత్తిలో, అస్మిత లో సంయమం చేస్తే ఇంద్రియజయం కలుగుతుందని పతంజలి భావం.

## 3.22 యమనియమాసనాలు

సూరన యోగమునకు తన కావ్యంలో ప్రాధాన్యత ఎక్కువగా ఇచ్చాడు. అవసరమైన చోట్ల యోగశాస్త్ర రహస్యాలను సాంకేతిక పదాలలో వివరించాడు. అలాంటిదే ఈ క్రింది పద్యం.

**"అంత క్రమంబున నాసరోజాక్షి సం**
**సార స్వభావ విచారమహిమ**
**వలన దద్దుఃఖంబు వారించుకొని దాన**
**దాను భోగార్థ చింతనమున వదలి**
**దేవి సత్కృప బ్రసాదించినయట్టి జ**
**వ్వనపు సత్యము వృథా చనకయుండ**
**యోగవిద్యాభ్యసనోపయోగంబున**
**దగపెదగా కంచు విడువకెపుడు**
**యమనియమ వర్తనములతో నాసనా**
**లభ్యసింపగ దొడగె నత్యాదరమున**
**దాను మును విన్నభంగులు దావుగాగ**
**నచటి శక్తిని గురువుగా నాత్మనునిచి" క 3-132**

యమనియమాసనప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యానసమాధులు అష్టాంగాలు. అవి సోపానాలు. సోపానాలు అధిరోహించేటప్పుడు ఎలాగైతే ఒకదాని పిదప ఒకటి అధిరోహిస్తామో వీటిని కూడ అలాగే అధిరోహించాలి. వీటిలో యమనియమాసనాలను కవి తన పద్యంలో ఉంచాడు. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అనేవి యమమలు. సౌచము, సంతోషము, తపః, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అనేవి నియమాలు. సాధన చేయదలిచిన వ్యక్తి ఈ రెండింటిని తప్పక పాటించాలి. తర్వాత ఆసనాల ద్వార శరీరాన్ని, అభ్యాసవైరాగ్యాల ద్వార మనసును వశపరుచుకోవాలి. ఇవే పై పద్యమున చెప్పబడ్డాయి.

## 3.23 దర్శనకారుల ప్రస్తావన

షడ్దర్శన కర్తలందరినీ ఒకే పద్యంలో కవి ఇలా చెప్పాడు.

**" అంతముగాగ గౌతమ కణాద మతంబుల బేధవాది సి**
**ద్ధాంతము జైమినీయ మురగాది శాస్త్రము గాపిలంబు న**
**త్యంతము నాకలించి యవి యాత్మల మెచ్చని పాంచరాత్ర రా**
**ద్ధాంత విధాసమర్థన సమర్థకృతార్థమతి ప్రదీప్తులన్" క 4-33**

పై పద్యంలో చెప్పబడిన గౌతముడు న్యాయదర్శనకర్త. కణాదుడు వైశేషిక సిద్ధాంతప్రతిపాదకుడు. జైమినీయమనగా పూర్వమీమాంస. దీని కర్తయే జైమినీ. ఉరగశాస్త్రమనగా యోగశాస్త్రము. పతంజలి చాల చోట్ల పాము రూపంలో దర్శనమిచ్చాడు. అందుకే యోగమిచ్చట ఉరగశాస్త్రమని చెప్పబడింది. కాపిలమనగా కపిలమహర్షి కృతమైన సాంఖ్యము. పాంచరాత్రాగమమనగా విశిష్టాద్వైతమత సంబంధమైనది. భగవంతుడైన విష్ణువు ఐదు రోజుల పాటు అనంతుడు, గరుత్మంతుడు, విశ్వక్షేణుడు, చతుర్ముఖబ్రహ్మ, పరమేశ్వరుడు అనే ఐదుగురికి ఉపదేశించినవి కావున దీనికి పాంచరాత్రం అనే పేరు వచ్చింది. ఇది విశిష్టాద్వైతమత సంబంధమైనది. అందుకే దానినే కవి పై పద్యమున సమర్థించాడు.

## 3.24 శృతులు, స్మృతులు

శృతులనగా వేదములు. స్మృతులనగా ధర్మశాస్త్రములు. ఈ రెండింటిని కవి ఇలా వర్ణించాడు.

**" నకళంక శీలుర నకులశ్రుతి స్మృతి**
**శాస్త్ర పురాణ విజ్ఞానఘనుల" క 4-34**

వేదములకు అపౌరుషేయములని పేరు. అవి ఒకరు రాసినవి కావు. ఒకరు చెప్పగా విని, ఇంకొకరు నేర్చుకున్నవి. అందుకే వాటికి శ్రుతులని పేరు కలిగినది.

## 3.25 ప్రకృతి – పురుషులు

షడ్దర్శనములలో ఎక్కువ చర్చ ప్రకృతి పురుషులకు సంబంధించి జరిగినది. వైషేషికము ఈశ్వరత్వమును అంగీకరించినది. సాంఖ్యము, యోగము చాలవరకు సమానములే అయినప్పటికీ సాంఖ్యము పురుషుని అంగీకరించదు. యోగము అంగీకరిస్తుంది. విశిష్టాద్వైతం భగవంతునికి, జీవునకు మధ్య బేధమున్నదని వాదిస్తుంది. జీవునకు, ఈశ్వరునకు అబేధమని ఎప్పుడూ అంగీకరించదు. విష్ణువునే సర్వజ్ఞుడుగా, సర్వవ్యాపకునిగా భావిస్తుంది. అదే విషయాన్ని కవి ఇలా చెప్తున్నాడు.

**" ప్రకృతి పూరుషులందు బహిరంతరముల నె**
**ప్పుడు జలింపక పరిపూర్ణు డగుచు**
**దనకు నాదియును మధ్యంబు నంతము సమా**
**నుడు నధికుండు నెందును గలువక**

**సర్వజ్ఞుడై సర్వశక్తియై సర్వని**

**యంతయై సర్వాత్ముడై వెలయుచు**

**సర్వంబు తనకు శేషముగ సర్వమునకు**

**శేషి దానగుచు లక్ష్మియును దాను**

**రుచియి రవియు జంద్రికయు జంద్రుడు వోలె**

**నయుత సిద్ధత్వ మొప్పంగ నాది మిథున**

**మనగ సకలవేదాంత వేద్యత దనర్చుచు**

**పరమపదనాథు బొగడు నీ ప్రౌఢికొలది" క 4-37**

పై పద్యంలో కవి భగవంతుని అన్ని రూపాల్లోను చూడగలుగుతున్నాడు. పైగా లక్ష్మీదేవిని కూడ భగవంతునితో సమానురాలిగా భావిస్తున్నాడు. కానీ నీవేనేను అనే విషయాన్ని మాత్రం వ్యక్తపరచడం లేదు. ఇదియే విశిష్టాద్వైతమతం. ఇందులో జీవునకు, ఈశ్వరునకు భేదం ఉన్నది.

## 3.26 చతుర్వేదాలు

వేదాలు పూర్వమీమాంస దర్శనం లోకి వస్తాయి. వాటిని గురించి కవి ఇలా చెప్పాడు.

**" ఋగ్వేద ఘోషామృద్ధి పెంపొకచోట**

**నొకచోట యాజుషాభ్యుదయ మహిమ**

**సామగానధ్యాన చాతుర్య మొకచోట**

**నొకచోట నాథర్వణోక్తిగరిమ**

**గృహ్యసూత్రనిపాఠ ఖేలనం బొకచోట**

**నొకచోట శబ్ద తంత్రోపచయము**

**జ్యోతిషసిద్ధాంత సంఘర్ష మొకచోట**

**నొకచోట ధర్మశాస్త్రకలనంబు" క 4-41**

వేదాలు మనిషి చేయవలిసిన కర్మలనుపదేశిస్తాయి. ప్రతివాదము చివర ఉపనిషత్తులుంటాయి. అందుకే అవి వేదాంతములయినాయి. సూరన ఒకే పద్యంలో నాలుగు వేదాలను కలిపి చెప్పడం ఇక్కడ విశేషం. ఇది చదివినపుడు వేదపాఠశాల, అందలి బోధనలు, తిరిగి ఉచ్చరిస్తున్న శిష్యులు మొత్తం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి.

## 3.27 బ్రహ్మచర్యం, ఉదాత్తాది బేధములు

వేదపాఠశాల వర్ణనలో కవి బ్రహ్మచర్యం, ఉదాత్తాది బేధాలను ఇలా వర్ణించాడు.

**" పదవర్ణ సౌష్టవ ప్రకటనం బెంతయు**
**నింపు మీరంగ రువ్విచ్చి యిచ్చి**
**తగ నుదాత్తాది బేధములు గెంటక పర్వ**
**గనుబొమ్మ చేష్టల గరపి కరపి**
**యొడనెడల గవళ్ళ దడబడకుండంగ**
**గురుతులు మది బాదుకొలిపి కొలిపి**
**నిజశిక్షలో బుద్ధి నిలక విస్వరములు**
**పలికిన బుగ్గలు నులిమి నులిమి**
**యొక్క మండపమున నుజ్జ్వలబ్రహ్మవ**
**ర్చసముతోడ బ్రహ్మచారులకును**
**బరమ నియమవృత్తి పరత వేదము జెప్ప**
**చున్నయట్టి యొక్క యొజ్జగంటి" క 4-42**

బ్రహ్మచర్యం నాలుగాశ్రమాల్లో మొదటిది. ఉపనయన సంస్కారం జరిగిన తర్వాత నుండి వివాహం జరిగినంతవరకు మనిషి బ్రహ్మచారి కింద పరిగణించబడతాడు. ఈ జీవితం నియమనిష్టలతో కూడినది. సంధ్యావందనం, గురుసేవ లాంటివి ఈ ఆశ్రమంలో చేయదగ్గ విదులు. " **బ్రహ్మచర్యాత్ వీర్యలాభః**" అని పతంజలి బ్రహ్మచర్యం వలన కలిగే లాభాన్ని గురించి చెప్పాడు. తర్వాత ఉదాత్తాది బేధాలను వర్ణించాడు. ఉదాత్త, అనుదాత్త, స్వరితములనేవి ఉచ్చారణ బేధాలు. వేదం పలికేటప్పుడు వీటిని తప్పక అనుసరించాలి. వీటి వలన మాత్రమే వేదము కలగాపులగం కాకుండా సుస్వరంగా పాడబడుతున్నది.

## 3.28 వేదాంత శాస్త్రం, యోగశాస్త్రం

కవి వేదాంతశాస్త్రమును, యోగశాస్త్రమును ఈ క్రింది పద్యంలో ఇలా వివరించడు.

**" దేవి నాలీల బ్రార్థించుచుండగ వచ్చె**
**నరలు నాకప్పుడె నాథు సేవ**
**యొక్కడి దీవాణి యెటు సేసె నట్లుగా**

నిమ్మదియని విరాగమ్ము పొడమ
వేదాంతశాస్త్ర కోవిదుల గోష్ఠిని గొంత
యోగశాస్త్రజ్ఞులయొద్ద గొంత
పొద్దు వుచ్చుచు యోగములకు సంగములైన
యాసనాదులకు సమర్థమైన
ప్రాయ ముడివోవుటకు వెతపడుచు నుంటి
నాకపుడు సుముఖాసత్తి నామ మొదవె
సుముఖు లన శాస్త్రవిదులు నిత్యమును దత్స
మీపవర్తన గలిగియే మెగుచునికి" క 4-149

సుగాత్రి కొంతకాలం విరాగం కలిగేటట్లు కొంతకాలం వేదాంత కోవిదుల మధ్య కాలం గడిపింది. యోగశాస్త్ర కోవిదుల వద్ద కొంతకాలం ఆసనాలను అభ్యసించింది.

## 3.29 జితేంద్రియత్వం, అష్టాంగయోగములు

సూరన జితేంద్రియత్వాన్ని, అష్టాంగములని ఇలా ప్రస్తావించాడు.

" తగ సుముఖాసత్తి తనకు శుశ్రూష సే
యగ మణిస్తంభుండు నమ్మృగేంద్ర
వాహనదేవినివాసంబునంద య
త్యంత జితేంద్రియత్వంబు మెరసి
యష్టాంగయోగవిద్యాభ్యాసనప్రౌఢి
దనరె నజ్జలజనేత్రయును బతికి
వలసినపరిచర్య సలిపినతుద దదా
జ్ఞను దాను మునుపటి తనదుయోగ
వర్తనంబు ప్రేమ వదలక తత్పరి
శీలనంబు నెపుడు జేయిచుండు
దదనిశప్రయత్నతాత్పర్యమున నల
బ్ధావకాశుడగుచు నతనుడుడుగ" క 4-194

కవి మణిస్తంభుని యోగాభ్యాసాన్ని గురించి ఇక్కడ వర్ణించాడు. పై పద్యంలో చెప్పబడిన జితేంద్రియత్వం ను పతంజలి ఇలా నిర్వచించారు.

**" గ్రహణ స్వరూపాస్మితాన్వయార్థ వత్త్వ సంయమాదింద్రియ జయః"** క 3-48

ఇంద్రియాలు మనస్సును వదలి విషయాల వైపు వెళతాయి. వెంటనే విషయాల జ్ఞానం కలుగుతుంది. ఈ వ్యాపారంలో అహంకారం చేరియుంది. వీటిలో మిగిలిన రెంటిలో క్రమంగా సంయమం చేస్తే యోగి ఇంద్రియాలను జయిస్తాడు అని దీని భావం. తర్వాతి పాదంలో అష్టాంగయోగవిద్య అనే పదాన్ని కవి ప్రయోగించాడు. యమనియమాసనప్రాణాయామప్రత్యాహారధారణధ్యాన సమాధులనేవి అష్టాంగములు. యోగంలో ఇవే ప్రధానములు.

## 3.30 జీవాత్మ, పరమాత్మ

జీవుడు భగవంతుడి స్వరూపము. భగవంతుని తేజమే జీవుని రూపంలో ఇహలోకంలో తిరుగాడుతున్నది. భగవంతునిలోపల ఏ శక్తి ఉన్నదో అదే జీవుని లోనూ ఉన్నది. దానిని తెలుసుకోవడం కోసం జీవుడు నిరంతర సాధన చేయాలి. సాధనవల్ల జీవుడు తనలోని పరమాత్మను తెలుసుకోగలడు. ఈ జీవాత్మ పరమాత్మల సంబంధాన్ని కవి ఇలా చెప్తున్నాడు.

**" విమలాత్మక వినుము ప్రశ**
**స్తము జీవాత్మ పరమాత్మ సంయోగము యో**
**గమన దదంగము లెనిమిది**
**క్రమమున వినిపింతు దత్ప్రకారము దెలియన్"** క 5-142

మధురలాలన స్వభావసిద్ధుని చరితం తో పాటుగా ఈ మాటలను చెపుతున్నది. ఇక్కడి నుండి కవి యోగశాస్త్రం ప్రారంభించాడు. తనదైన పద్ధతిలో మొత్తం యోగశాస్త్రాన్ని తెలుగు చేసాడు. ఇంత సవిస్తరంగా యోగశాస్త్రమును వివరించిన ప్రబంధము లేదని ఘంటాపథం గా చెప్పవచ్చును. మొదట యమనియమాలను ఈక్రింది వచనంలో చెప్పాడు.

**" ఆయోగంబులు యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణధ్యాన సమాధులనం బ్రసిద్ధంబులై యుండు నందు నొక్కొక్కటి యనేక భేదంబు లగునవియెరిగించెదవినుము"** క 5-143

వీటిని పతంజలి తన యోగసూత్రాలలో ఇలా చెప్పాడు.

**" యమనియమాసనప్రాణాయామప్రత్యాహారధారణా ధ్యానసమాధయోష్టావంగాని"**

ప 2-29

తర్వాతి పద్యంలో యమాలను చెప్పి వాటివివరణ ఇలా ఇచ్చాడు.

**" యమముల్ సత్యదయాక్షమాధృమితి తాహారార్జవబ్రహ్మచ**
**ర్యములస్తేయ మహింస శౌచ మననొప్పారున్ ధరిత్రీసురో**
**త్తమ! యందుం దశభంగులై పరుల బాధంబెట్ట కింపారు బొం**
**కమి సత్యంబు పరార్తి కోర్వమి దయాఖ్యం బెంపుమీరుంగడున్" క 5-144**

ఇవి పతంజలి చెప్పిన యమముల కంటే పూర్తి భిన్నమైనవి. పతంజలి యమాలను గురించి ఇలా చెప్పాడు.

**" అహింస సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహాయమాః" క 2-30**

సూరన పతంజలి చెప్పిన యమాలను చెప్తూనే దయ, క్షమ, ధృతి, మితాహారం, ఆర్జవం అనే మరో ఐదు కొత్త యమాలను చెప్పాడు. వీటిని ప్రత్యేక పద్యాలలో నిర్వచించాడు కూడా. పతంజలి నియమాలలో చెప్పిన సౌచాన్ని కవి యమాలలో చెప్పాడు.

## 3.31 బ్రహ్మచర్యం

బ్రహ్మచర్యాన్ని గురించి కవి ఇలా చెప్పాడు.

**" సన్యాసికిని బ్రహ్మచారికిని నైష్ఠికుం**
**దగువస్థునకు నోయనఘచరిత**
**స్త్రీసంగమంబును ద్రికరణంబులయందు**
**నొకయప్పుడును జేయకునికి బ్రహ్మ**
**చర్యంబు ఋతుకాలభార్యాభిగమనంబు**
**దక్క దక్కినచోట్ల దద్విహార**
**మును మానుటయు గృహస్థునకును బ్రహ్మచ**
**ర్యం బింక నస్తేయ మనగ నెందు**
**ఔర్య మెరుగమి యెపుడు నేజంతువులకు**
**నెన్గొనర్పక యునికి యహింస యనగ**
**శౌచమును రెండు దెరగులై శాస్త్రములకు**
**బాహ్యమును నాంతరంబు నాబ్రణతి కెక్కె" క 5-148**

బ్రహ్మచర్యము, అస్తేయము పై పద్యమున చెప్పబడినవి. శౌచమును పతంజలి ఇలా చెప్పాడు.

**" శౌచాత్స్వాంగజుగుప్సా పరైరసంసర్గః" ప 2-40**

శౌచం స్థిరంగా ఏర్పడగానే శరీరంపై అసహ్యం, ఇతరులతో సంసర్గరాహిత్యం కలుగుతాయని ఇక్కడభావం. సూరన శౌచాన్ని రెండు భాగాలుగా చేశాడు. ఒకటి బాహ్యశౌచము, రెండు అంతః శౌచము. ఈ విషయాన్ని పద్యం ద్వార ఇలా చెప్పాడు.

**" అందు బాహ్యశౌచ మనగ మృజ్జలముల**
**జేయబడినది ప్రసిద్ధి కెక్కు**
**నాంతరంబనంగ ననఘ! ధర్మమున న**
**ధ్యాత్మవిద్యచేత నయనశుద్ధి" క 5-149**

అంతర శౌచము వలన నయనశుద్ధి కలుగుతుందని దీని భావం. ఇది మాత్రమే కాక నియమాలను కూడ పదింటిని చెప్పాడు సూరన. సూరన చెప్పిన పది నియమాలు ఇవి.

**" విను నియమంబులు పది తప**
**మును సంతోషాస్తికత్వములు దానేశా**
**ర్చన సిద్ధాంతశ్రవణము**
**లును హ్రీయును మతి జపంబులును వ్రతము ననన్" క 5 -150**

సూరన చెప్పిన నియమాలకు, పతంజలి చెప్పిన నియమాలకు మధ్య చాల వ్యత్యాసం ఉన్నది. పతంజలి కేవలం ఐదు నియమాలను మాత్రమే చెప్పాడు.

**" శౌచ సంతోష తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః" ప 2-32**

సూరన శౌచాన్ని నియమాలలో చెప్పాడు. సూరన తన నియమాలలో స్వాధ్యాయాన్ని చెప్పలేదు. ఆస్తికత్వం, దానం, సిద్ధాంత శ్రవణం, హ్రీయములనే కొత్తనియమాలు చెప్పాడు. వీటిని నిర్వచించాడు కూడ.

## 3.32 ప్రాణాయామం

పతంజలి అష్టాంగయోగములో అత్యంత ప్రధానమైనది ప్రాణాయమము. ఆసనాదుల ద్వార సిద్ధులు లభిస్తాయి. సిద్ధత్వసాధన తర్వాత యోగి చేయవలిసిన పని ప్రాణచలనాన్ని నిరోధించడం. ప్రాణచలనాన్ని, గతిని ప్రాణాయామం ద్వార నిరోధించవచ్చు. ప్రాణాయామాన్ని సూరన ఇలా నిర్వచించాడు.

**" ఈ యమనియమంబులు గల**
**ధీయుతుడధికారి వసుమతీసురవర! ని**

**శ్రేయపకరాసనప్రా**

**ణాయామాద్యుత్తర ప్రయత్నంబులకున్ క 5-156**

యమనియమాల ద్వార శరీరాన్ని అదుపులో ఉంచినతర్వాత చేయవలిసింది ప్రాణాయామం అని దీని భావం. సూరన ఆసనాలను ప్రాణాయామం తర్వాత చేయదగ్గ పనిగా భావించాడు. తర్వాత వరుసగా స్వస్తిక, గోముఖ, పద్మ, వీర, సింహ, భద్ర, ముక్త, గుప్త, మయూర ఆసనాలను ఎలా చేయాలో ఒక్కో పద్యంలో వివరిస్తూ చెప్పాడు.

## 3.33 ఆసనోపయోగములు

ఆసనాలన్నింటిని వివరించిన తర్వాత ఆసనాలవల్ల ఏం చేకూరుతుందో పద్యరూపంలో ఇలా ఉపదేశించాడు.

**" ఈ ఆసనములు మిక్కిలి**

**కాయలఘుత్వమును సకల గదనాశనముం**

**జేయుచు బాపనికాయము**

**పాయం దోలుచును బరగు భవ్యచరిత్రా" క 5-169**

ఆసనాల వల్ల కేవలం శారీరిక దారుఢ్యం మాత్రమే లభిస్తుందని పతంజలి చెప్పగా, పాపములు కూడా తొలుగుతాయని సూరన చెప్పాడు.

## 3.34 షట్కర్మలు

ధౌతి, వస్తి, నేతి, త్రాటకం, నౌలి,కపాలభాతి అనేవి షట్కర్మలు. వీటిని గురించి ఘేరండ సంహితలో ఇలా చెప్పబడింది.

**" ధౌతిర్వస్తి స్తథా నేతిర్లౌలికీ త్రాటకం తథా!**

**కపాలభాతిశ్చైతాని షట్కర్మాణి సమాచరేత్!! " ఘే 1-12**

ఈ షట్కర్మలు దేహంలోని మేద, శ్లేష్మములను దూరం చేస్తాయి. శరీర దారుఢ్యం కలిగినవారు ఈ షట్కర్మలను ఆచరించనవసరం లేదని ఘేరండ సంహితలో చెప్పారు. ఈ షట్కర్మలను గురించి సూరన ఇలా చెప్పాడు.

**" ధౌతి నేతి కపాలభాతి వస్త్రిత్రాట**

**కములు నౌలియు నాగ నమరు యోగ**

**షట్కర్మముల దేహసంసిద్ధకలితుడై**

**పరగి యీ చెప్పిన భద్రసింహ" క 5-170**

వీటిని సూరన విధిగా ఆచరించాలని చెప్పాడు. షట్కర్మలు, ఆసనాలు, ప్రాణాయామం చేయడం వల్ల శరీరంలోని నాడులు ఉత్తేజితమవుతాయని కవి అభిప్రాయపడ్డాడు.

## 3.35 పంచభూతములు

మానవశరీరం పంచభూతాత్మకమైనది. శరీరంలో గల పృథివ్యాదులను కవి ఇలా వర్ణించాడు.

**" పాదాదిగా జాను పర్యంతమూర్వి యు**

**ర్వ్యాదిగా బాయుపర్యంత ముదక**

**ముదకాదిగా మరి హృదయాబ్జ పర్యంత**

**మగ్ని యగ్న్యాదిగా నందు మీగ**

**భృూమధ్య పర్యంతము మరుత్తు మరుదాది**

**గామూర్థపర్యంతమో మహాత్మ!**

**నుభయ వర్తిల్లు దానకము లీయైదు వి**

**వేకింప వేర్వేరు విహితగతిని " క 5-175**

పంచభూతములు మానవ శరీరంలో ఏఏ ప్రాంతంలో ఉండి ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తాయో కవి ఈ పద్యంలో వివరించాడు.

## 3.36 ప్రణవం

ఓంకారం ప్రణవం అనబడుతుంది. పతంజలి తన యోగ సూత్రంలో " తస్య వాచకః ప్రణవః" అని భగవంతుని తెలిపేది ఓంకారమన్నాడు. సూరన ఓంకారాన్ని ఇలా ప్రస్తావించాడు.

**" ధాతృ విష్ణు రుద్రేశ సదాశివాఖ్య**

**దైవతముల బృథివ్యాది తత్వపంచ**

**కమున ధారణ మునరింపగావలయును**

**బ్రణవమునను బ్రాణాయామభంగు లమర" క 5-175**

ఓంకార మాహాత్మ్యం ముండకోపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**" ప్రణవో ధనుః శరో హ్యాత్మాబ్రహ్మ తల్లక్ష్యముచ్యతే!**

**అప్రమత్తేణ వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్"   ము 2-4**

ఓంకారమంత్రం ధనస్సు, ఆత్మయే బాణం, పరమాత్మే లక్ష్యం అని చెప్పబడుతోంది. బాణం ఎక్కుపెట్టినవాడు ఏకాగ్రతతో ఎక్కుపెట్టి లక్ష్యాన్ని చేదించినట్లుగా పరమాత్మతో మమేకం కావాలి అని భావం.

## 3.37 ప్రత్యాహారం

ఇంద్రియాలు తమ విషయాలను విసర్జించి, చిత్తస్వరూపాన్ని పొందటమే ప్రత్యాహారం. పతంజలి ప్రత్యాహారాన్ని గురించి యోగసూత్రాలలో ఇలా చెప్పాడు.

**" స్వవిషయాసంప్రయోగే చిత్తస్వరూపానుకార ఇవేంద్రియాణాం ప్రత్యాహారః" క 2-54**

సూరన ప్రత్యాహారాన్ని తన గ్రంథంలో ఇలా చెప్పాడు.

**" ఇంద్రియార్థములందు నింద్రియంబుల బ్రవ**
**ర్తిలనీక కుజియించి త్రిప్పుటొకటి**
**యవి యెందు జరియించె నది సమస్తంబు నా**
**త్మయ కాగ మనసులో దలచు డొకటి**
**నిత్యకర్మంబులంతయు నాత్మనందు సం**
**తతము చిత్తముచే నొనర్చుటొకటి**
**తనువునం గలపదు నెనిమిది మర్మసీ**
**మల గ్రమంబున గాడ్పు నిలుపుటొకటి**
**యోగశాస్త్ర శీలయుతులు ప్రత్యాహార**
**బేధరీతులనుచు నాదరమున**
**సాంప్రదాయకముగ జలుపుచు నుండుదు**
**రోవసుంధరాసు రావసంత!" క 5-174**

సూరన కేవలం ప్రత్యాహారాన్ని నిర్వచించి విడిచి పెట్టకుండా అందులో నాలుగు బేధాలను కూడ చెప్పాడు. ఇంద్రియాలను అదుపులో పెట్టడం మొదటిది. మనసు ద్వార వాటిని నియంత్రించడం రెండవది. నిత్యకర్మలను ఆత్మ ద్వార నిరంతరం చేయడం మూడవది. తనువులో ఉండే 18 మర్మసీమలలో ప్రాణాయామం చేయడం నాల్గవది.

## 3.38 ధారణ

ఏదో ఒకచోట చిత్తాన్ని నిలపటమే ధారణ. శరీరంలో గాని, బాహ్యంలో గానీ ఒకానొక ఆలంబనాన్ని ఆశ్రయించి మనస్సు నిలకడ చెంది ఉండటమే ధారణ. దారణను పతంజలి ఇలా నిర్వచించారు.

**" దేశబంధశ్చిత్తస్య ధారణా "** ప 3-1

సూరన ధారణను ఇలా నిర్వచించాడు.

**" ధాతృ విష్ణు రుద్రేశ సదాశివాఖ్య**

**దైవతముల బృధివ్యాదితత్వపంచ**

**కమున ధారణ మొనరింపగావలయు**

**బ్రణవముననను బ్రాణాయామ భంగులమర"** క 5-174

బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో ఎవరో ఒకరి మీద మనసు లగ్నం చేయడాన్నే ధారణగా సూరన చెప్పాడు. ఇవి మాత్రమే గాక పృథివ్యాదుల మీద కూడ మనసు నిలపవచ్చన్నాడు.

## 3.39 ధ్యానం

ధారణకు ధ్యానమునకు సంబంధమున్నది. ధారణద్వార మనసును ఒక ప్రదేశంలో లగ్నం చేస్తారు. అలాంటి అవలంబనంలో ఏకభావ ప్రవాహజ్ఞానమే ధ్యానం. శిరస్సు పైభాగంలోగాని, హృదయం మొదలైన వాటిలో గానీ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, శరీరంలోని మరేతర భాగం నుండి గాక లక్ష్యభాగం నుండి మాత్రమే స్పర్శానుభవాన్ని పొందగలిగితే అదే ధ్యానం. ధ్యానాన్ని పతంజలి ఇలా నిర్వచించాడు.

**" తత్ర ప్రత్యైకతానతా ధ్యానమ్ "** ప 3-2

ధ్యానాన్ని సూరన ఇలా నిర్వచించాడు.

**" అప్రతిమముగ విజాతీ**

**యప్రత్యయవాసనాని రాసావిచ్చి**

**న్న ప్రవహదురు సజాతీయ**

**యప్రత్యయరూప మగుచు ధ్యానము వెలయున్"** క 5-178

ఇది పతంజలి అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నది. ఇక్కడితో సూరన ఆగలేదు. ధ్యానాన్ని సగుణధ్యానము, నిర్గుణధ్యానము అని రెండు భాగాలుగా విభజించాడు. వాటి ద్వార లక్ష్యసాధనకు ప్రయత్నం చేయమన్నాడు.

## 3.40 సమాధి

రూపాలను వదిలి అర్థాన్ని మాత్రమే భాసింపచేయటమే సమాధి అని పతంజలి భావించాడు. అయితే సూరన విష్ణుతత్వాన్ని ఇక్కడ కూడ విడిచి పెట్టలేదు. మనస్సులో విష్ణువును నిలపడమే సమాధి అని అన్నాడు.

**" మానసము విష్ణునందున్**

**లీనమగుచు నించుక యు జలింపక యుండం**

**బూనుట సమాధి యగు వి**

**ద్యానిరతా! యేకరూప మది భావింపన్." క 5-181**

ఇక్కడ కూడ సూరన విశిష్టాద్వైతమత తత్వాన్ని, సారాన్ని విడువకుండా అనుసరించాడు. ఇక్కడితో సూరన యోగశాస్త్రం పూర్తయింది. పతంజలి యోగసూత్రములను మాత్రమే అనుసరించకుండా తనదైన రీతిలో యోగశాస్త్ర రహస్యాలను చెప్పడం సూరనకే చెల్లింది.

## 3.41 ఓంకారం

తత్వశాస్త్రంలో అత్యంత ప్రాధాన్యత గల పదం ఓం. సూరన ఓంకారాన్ని ఇలా ప్రస్తావించాడు.

**" ఓమన్యథా యంచు నొరయు విద్వాంసుల**

**గోష్టి కెన్నడు గడగురుతులేదు" క 7-19**

నాదబిందూపనిషత్తు ఋగ్వేద సంబంధితమైన యోగసిద్ధాంతాన్ని వెల్లడి చేస్తుంది. అత్యుత్తమమైన ఈ ఉపనిషత్తులో ఓం యొక్క ప్రాధాన్యత ఇలా వివరించబడింది.

**" ఓం అకారో దక్షిణః ప్రక్ష ఉకార స్సూత్తరః స్మృతః**

**మకారం పుచ్ఛమిత్యాహురర్థ మాత్రాతుమస్తకమ్**

**పాదాదికం గుణాస్తస్య శరీరం తత్వముచ్యతే**

**ధర్మోస్య దక్షిణం చక్షురధర్మోథో పరఃస్మృతః" నా 4-7**

ఈ ఆత్మ పక్షియై ఉన్నది. ఓంకారంలో ఉన్న అకారం ఈ పక్షికి కుడి రెక్కయై ఉన్నది. ఉకారం ఎడమరెక్కయై ఉన్నది. మకారం తోకయై ఉన్నది అని దీని భావం. పక్షి తోక రెక్కలు లేకుండా ఎలాగైతే ఎగరలేదో అలాగే ఆత్మకూడ ఓంకారం లేకుండా మోక్షాన్ని పొందలేదు. పతంజలి తన యోగశాస్త్రంలో " తస్య వాచకః ప్రణవః " అని ఓంకార ప్రాముఖ్యతను వివరించాడు. భగవంతుని చెప్పునది ఓంకారమని దీని భావం.

## 3.42 పూర్వజన్మ

పూర్వజన్మను వేదాలు అంగీకరించాయి. ఉపనిషత్తులు పూర్వజన్మను సమర్ధించాయి. సూరన తన కళాపూర్ణోదయంలో పూర్వజన్మ ప్రస్తావన ఇలా చేసాడు.

**" దనపూర్వజన్మ గాంధర్వ విద్యా గుర**

**గను గొను నట్టి భాగ్యంబు తనకు "** క 8-114

ముండకోపనిషత్తు పూర్వజన్మ గురించి ఇలా చెప్తున్నది.

**" మనోమయః ప్రాణశరీరనేతా**

**ప్రతిష్టితోన్నే హృదయం సన్నిధాయ!**

**తద్విజ్ఞానేన పరిపశ్యన్తి ధీరాః**

**ఆనందరూపమమృతం యద్విభాతి!!"** ము 2-8

పునర్జన్మ దాత జీవాత్మగా అన్నమయ కోశంలో ఉన్న హృదయంలో నెలకొని ఉన్నాడు. ఈ ఏకాత్మ జ్ఞానం పొందిన ధీరుడు పరమాత్మ ఆనందరూపముగా, శాశ్వతంగా ప్రకాశిస్తున్నాడని దీని భావం.

## 3.43 బ్రహ్మతత్వము

బ్రహ్మమును నిర్వచించడం అత్యంత కష్టతరమైన విషయం. బ్రహ్మమును నిర్వచించడానికి ఉపనిషత్తులు చాల ప్రయత్నాలు చేసాయి. ముండకోపనిషత్తు బ్రహ్మాన్ని గురించి ఇలా చెప్పింది.

**" యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**

**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్!**

**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం**

**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః"** ము 2-6

బ్రహ్మము జ్ఞానేంద్రియాలకు, కర్మేంద్రియాలకు అందదు. దానికి చావు పుట్టుకలు లేవు. బ్రహ్మమునకు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు లేవు. అది శాస్వతం. సర్వవ్యాపకం. అర్థచేసుకోవటం కష్టం. బ్రహ్మ నుంచే ఈ జగత్తు ఉద్భవించి అనేక నామరూపాలతో భాసిల్లుతుంది. ఈ విషయాలను సాధన చతుష్టయ సంపన్నుడు తెలుసుకోగలడని భావం. ఈ బ్రహ్మతత్వాన్ని సూరన ఇలా చెప్పాడు.

**" అమృతపూరాశ్చర్యతమవిరజానది**

**సీమావరుద్ధసంస్కృతికథంబు**

**పరగణనాతిబ్రహ్మాండ బుద్బుద**

ప్రకృతి పాథోధిపారాయితంబు
సూర్యచంద్రాగ్ని తేజోనిరపేక్షణా
ప్రాకృత స్వప్రభాభాస్వరంబు
స్వేచ్ఛాగృహీతసమిద్ధవిశుద్ధస
త్వశరీరనిత్యముక్తవ్రజంబు
నగుచు బెంపొందు నిఖిలవేదాంతసిద్ధ
పరమకళ్యాణగుణచణ బ్రహ్మతత్త్వ
నతతసాక్షాత్క్రియావిభూషిత నిజాను
భవసుఖితకోవిదము శౌరిపరమపదము " క 8 –207

పైన చెప్పబడిన లక్షణములకు సూరన చెప్పిన ఈ పద్యం లక్ష్యం అన్నట్లుగా భాసిస్తోంది.

## 3.44 దర్శనములు – విమర్శ

దర్శనములలోని మొదటి ఐదు దర్శనములు విమర్శకు గురయ్యాయి. కేవలం పూర్వమీమాంస మాత్రమే పరీక్షలకు తట్టుకొని నిలబడింది. సూరన కూడ దర్శనాలను ఈ క్రింది పద్యంలో విమర్శించాడు.

" ఘటమంచు బటమంచు గారుయుక్తుల నెంచు
దుష్టతార్కికులకు దూరమగుచు
శ్రుతియంచుస్మృతులంచు శుష్కకర్మములెంచు
మీమాంసకుల కప్రేమమయ మగుచు
ఝరి యంచు ఖరి యంచు జనులవీనుల నొంచు
శబ్దైకరతుల కసాధ్యమగుచు
మృష యంచు గిషయంచు విషయోక్తి గలహించు
నద్వైతపరుల కప్రాప్య మగుచు
గృష్ణ విష్ణో హృషీ కేశ కేశవ యను
భక్తుల కొకప్పుడు దుర్లభంబు గాక
పరుగు బ్రకృతివికార దుస్పర్శతరము
గురుతరానందఝరము వైకుంఠపురము" క 8–218

ఘటపటవాదములు వైశేషిక, యోగశాస్త్రములలో జరిగినవి. వీటిని కారుయుక్తులుగా కవి భావించాడు. పూర్వమీమాంసకులకి శ్రుతులు, స్మృతులు ఆధారం. వీటిని ఆధారంగా చేసుకుని చర్చోపచర్చలు ఈ శాస్త్రంలో జరుగుతాయి. శబ్దైకరతులనగా వైయాకరుణులు. వారు శబ్దాన్ని ఆధారంగా చేసుకుని చర్చలు చేస్తారు. మృషలు ఎక్కువగా అద్వైతశాస్త్రంలో ఉంటాయి. అద్వైతులు ప్రతిదానిలోని ఏకత్వాన్ని దర్శిస్తారు. వీటన్నింటిని లెక్కలోకి తీసుకోగూడదని కవి భావన. వీటన్నింటినీ కాదని కవి విశిష్టాద్వైతమతస్థాపన కోసం ప్రయత్నం చేస్తున్నాడు. కృష్ణ, విష్ణు, హృషీకేశ అని అనమని సాధకులకు సూచిస్తున్నాడు. పై పద్యంలో సూరన కేవలం విష్ణువు రూపాలను మాత్రమే చెప్పాడు. దీనిని బట్టి సూరన విశిష్టాద్వైతమత స్థాపనకు ఎంత గట్టి ప్రయత్నం చేస్తున్నాడో తెలియవచ్చును. మొత్తం మీద కళాపూర్ణోదయం విశిష్టాద్వైతమత ప్రాధాన్యమై, యోగదర్శనమునకు ఆలవాలమై , షడ్దర్శన సంబంధబంధమై భాసిల్లుతున్నది.

## 4. పాండురంగమాహాత్మ్యం – షడ్దర్శన ప్రభావం

పాండురంగమాహాత్మ్యం భక్తి రసప్రధానమైనది. ఇది ప్రౌఢప్రబంధం. దీని కర్త తెనాలి రామకృష్ణుడు. ఇతని రచన సంస్కృత సమాసభూయిష్టమై, సర్వాలంకార సమ్మిలతమై శ్రవణశుభగంగా ఉంటుంది. ఈ ప్రబంధాన్ని షడ్దర్శనపరంగా చూసినట్లయితే కళాపూర్ణోదయం కంటే ఒక మెట్టు క్రింద, ఆముక్తమాల్యద కంటే ఒక మెట్టు పైన ఉంటుంది. ఈ ప్రబంధంలో ఎక్కడ వాదోపవాదాలు జరగలేదు కాబట్టి దర్శనఖండనలు కూడాలేవు. కథలో భాగంగా, అన్యాపదేశంగా దర్శనాలను ప్రస్తావించిన ఘనత రామకృష్ణుల వారికే చెల్లుతుంది. ఈ ప్రస్తావన కథాగమనానికి ఎంతగానో సహకరిస్తుంది. అయితే షడ్దర్శనములు అన్న పదాన్ని ఎక్కువగా వినియోగించిన కవి మాత్రం ఇతడే.

## 4.1 విశిష్టాద్వైతం

రాయలవారు, పెద్దనతిమ్మనాదులు విశిష్టాద్వైతమతానుయాయులు. అందుకే తమ కావ్యాలలో ఆ మతానికే ప్రాధాన్యతనిచ్చి, ఆ సంప్రదాయములనే గొప్పవిగా ఎంచి కావ్యరచన సాగించారు. రామకృష్ణుని మార్గం ఇందుకు కొంత భిన్నమైనది. ఇతడు మొదట శైవుడు. అప్పుడతని నామధేయం తెనాలి రామలింగడుగా ఉండేది. తర్వాత వైష్ణవుడుగా మారాడు. అప్పుడతని పేరు రామకృష్ణుడిగా మారింది. ఇతడు కూడా పెద్దనాదులవలె విశిష్టాద్వైతమునకే పెద్దపీట వేశాడు. అయినా అతనిని పూర్వమతవాసనలు విడువలేదు. అందుకే చాలచోట్ల శివాత్మకమైన స్తుతులు కనబడతాయి. విశిష్టాద్వైతమతమును అనుసరించువారు విష్ణువునకెంత ప్రాధాన్యతనిస్తారో, లక్ష్మీదేవికి అంతే ప్రాధాన్యతనిస్తారు. అందుకే కవి ప్రథమ పద్యంలో లక్ష్మి సమేతుడయిన నారాయణుని ఇలా స్తుతించాడు.

**శ్రీకాంతమణి గన్మొరంగి మది ధాత్రి మంచిన దద్రుచి**
**శ్రీకాదంబిని మీది కుబ్బె ననగా శ్రీ వత్సముందాల్చి ము**
**ల్లోకంబుల్ పొదలించు కృష్ణుడు దయాలుండేలు శ్రీవైష్ణవ**
**స్వీకారార్హు విరూరిపట్టణపతి వేదాద్రి మంత్రీశునిన్ పా 1-1**

తర్వాతి పద్యాలలో విష్ణువునకు అనుయాయులైన విశ్వక్షేనాణాదులను, జయవిజయులను, పంచాయుధములను స్తుతించాడు. ఇది కూడా విశిష్టాద్వైత మతసంప్రదాయమే. ఇదే సంప్రదాయాన్ని రాయలవారు,పెద్దన, తిమ్మన కూడా పాటించారు.

## 4.2 షడ్దర్శనములు

కవి కందాళ అప్పలాచార్యులను స్తుతిస్తూ ఈ క్రింది పద్యాన్ని రాశాడు.

**" వేదమార్గ ప్రతిష్టాదైవతజ్యేష్ట,**
**డభ్యస్తషడ్దర్శనార్థరాశి**
**యతిరాజరచిత భాష్యగ్రంథ నిర్ణేత**
**యఖిల పురేణేతిహాసకర్త**
**బంధురదివ్య ప్రబంధాను సంధాత**
**పంచసంస్కార ప్రపంచచణుడు**
**వధూలమునిచంద్ర వంశవర్ధనమూర్తి**
**సకలదేశాచార్య నికర గురువు**
**పట్టపేనుంగు శ్రీరంగపతికి నణ్ణ**
**గారి గర్భాంబురాశి నీహారరశ్మి**
**సరససాహిత్య సాహిత్యశయ్య నేటి**
**యాళువందారు కందాళయప్పగారు"** పా 1-77

ఈ పద్యమున ప్రథమపాదంలో **"షడ్దర్శనరాశి"** అని ప్రయోగమున్నది. ఇది అప్పళాచార్యునికి వాడిన విశేషణాలలో ఒకటి. ఇక్కడ షడ్దర్శనములనగా సాంఖ్య, యోగ, న్యాయవైశేషిక పూర్వోత్తర మీమాంసలు. నాటి కాలంలో ఈ దర్శనాలను అభ్యసించడం ఒక విధిగా జరిగేది. ఈ దర్శనముల పైనే తత్వచర్చలు జరిగేవి. అందుకే కందాళ అప్పలాచార్యునికి కూడా కవి ఈ విశేషణం వాడాడు. తర్వాత ప్రబంధాను సంధాత అనే విశేషణాన్ని వాడాడు కవి . తముళ సంప్రదాయంలో పన్నిద్దరు ఆళ్వార్లున్నారు. వారి చేత రచింపబడి పాడబడేవే ఈ ప్రబంధాలు. విశిష్టాద్వైతంలో వీటికి మిక్కిలి ప్రాధాన్యత ఉన్నది.

## 4.3 పంచసంస్కారములు

**"పంచసంస్కార ప్రపంచచణుడు**
**వధూలమునిచంద్ర వంశవర్ధనమూర్తి"** పా 1-77

పై పద్యంలో కవి పంచసంస్కారములు అనే పదప్రయోగం చేశాడు. ఈ మాట విశిష్టాద్వైతమత సంబంధమైనది. ఈ పంచసంస్కారముల ద్వార ఎవరైన విశిష్టాద్వైతులు కావచ్చును.

దీనికి జాతి, మత, కులాలు అడ్డురావు. మోక్షము నందు కాంక్ష కలిగినవారెవరైన ఈ పంచ సంస్కారాలను పొందవచ్చును. తాపము, పుండ్రము, నామము, మంత్రము, యాగము అనునవి పంచసంస్కారములు.**(తాపః పుండ్రః తథా నామః మంత్రో యాగశ్చ పంచమః)** అగ్ని లో కాల్చిన శంఖచక్రలాంచనములను భుజములపై ముద్రించుట తాపము. దేహమునందు 12 ఊర్ధ్వపుండ్రములను ధరించుట పుండ్రమనుబడుతున్నది. ఒక దాస్యనామం ఆచార్యునిచే దాసునికి అనుగ్రహింపబడుతుంది. ఇది నామమనబడును. తర్వాతిది మంత్రం ఇది ఆచార్యుడు రహస్యంగా చెవిలో ఉపదేశిస్తాడు. తర్వాతిది యజ్ఞం. గృహమున చేయవలిసిన విధి. ఈ ఐదు విశిష్టాద్వైతంలో చెప్పబడిన పంచసంస్కారాలు.

## 4 .4 శమసంపద

షట్ సంపత్తులలో ఒకటైన శమమును గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" చలువలపుట్టినిండ్లు శమసంపద యిక్కలు, పుణ్యలక్ష్మికిన్**
**మొదలి దివాణముల్, సురసమూహమునాకటిపంట లంచితా**
**భ్యుదయ నిసర్గబంధువులు, ప్రోడతనంబులు తాణముల్, పురిన్**
**బొదలెడు భూసురోత్తములు భూరి పవిత్రశరీరవల్లరుల్ " పా 1-109**

ఈ శమము షట్ సంపత్తులలో ఒకటి. శమము, దమము, సమాధానము, శ్రద్ధ, ఉపరతి, తితీక్ష అనేవి షట్ సంపత్తులు. ఈ సంపత్తులు సాధకుడికి ఎంతగానో ఉపకరిస్తాయి. వీటి ద్వారానే సాధకుడు సమాధిని చేరుకోగలుగుతాడు.

## 4.5 చాతుర్వర్ణాలు

వేదసంప్రదాయము వృత్తులననుసరించి సమాజాన్ని నాలుగు భాగాలుగా విభజించింది. ఈ వ్యవస్థ మనిషి చేసినది కాదని, భగవత్కృతమని గీత చెప్తున్నది.

**" చాతుర్వర్ణ్యం మయాసృష్టమ్**
**గుణ కర్మ విభాగసః**
**తస్య కర్తారం అపి మం**
**విధి అకర్తారం అవ్యయం " భ 4-13**

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనబడే వారు నాలుగు వర్ణాలు. ఈ వర్ణ సంప్రదాయాన్ని నన్నయ మొదలుకొని చిన్నయ దాక అందరూ వర్ణించారు. తమ కావ్యాలలో వర్ణవ్యవస్థకు అనుకూలమైన వ్యాఖ్యలు చేసారు. ప్రబంధ కర్తలు ప్రత్యేకవర్ణాన్ని, అవి రాజిల్లుతున్న తీరును, ప్రత్యేక పద్యంలో వర్ణించారు. పాండు రంగ మాహాత్మ్యం వర్ణవ్యవస్థను గురించి ఇలా చెప్తున్నది.

**బ్రాహ్మణుల వర్ణన**

**"చదువుల పుట్టినిండ్లు శమసంపద యిక్కలు, పుణ్యలక్ష్మికిన్**
**మొదలి దివాణముల్, సురసమూహమునాకటిపంట లంచితా**
**భ్యుదయ, నిసర్గబంధువులు, ప్రోడతనంబుల ఠాణముల్, పురిన్**
**బొదలెడు భూసురోత్తముల భూరిపవిత్ర శరీరవల్లరుల్" పా 1-109**

**క్షత్రియుల వర్ణన**

**"కెరలక క్రమ్మరింప నడుగెంటనె నిల్చునొకింత నూకినన్**
**శరనిధు లేడుదాటు మెయి చాచి చివుక్కున నక్కు మీరి సం**
**గరమున గాయమైన పతిగాచు జలింపక తత్పురీహరుల్**
**హరిహయమావు మున్ డిగిన యంబుధి రేవున వచ్చెనోసుమీ!" పా 1-114**

తర్వాత వరుసగా వైశ్యశూద్ర వర్ణాలను, వాటి ప్రాముఖ్యతను వర్ణించారు.

## 4.6 తారకబ్రహ్మవిద్య

పూర్వం విద్యలు రెండు రకాలుగా ఉండేవి. ఒకటి పరావిద్య. రెండు అపరావిద్య. ఈ రెండింటిని గురించి ముండకోపనిషత్తు ఇలా చెప్తున్నది.

**"తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోథర్వవేదః శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషమితి! అథ పరా మాయాతదక్షరమధిగమ్యతే!!" ము 1-05**

నాలుగువేదాలు, వేదాంగాలు అపరావిద్యలోకి వస్తాయి. అక్షరం బ్రహ్మని ఏ జ్ఞానం చేత పొందుతారో అది అపరావిద్య అనబడుతున్నది. బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకోవడమే బ్రహ్మవిద్య అన్నమాట. ఈ బ్రహ్మవిద్యని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఏవంవిధఖ్యాతి నెసగు శ్రీవారణసీపట్టణంబున, సిద్ధతటిని**
**పొంత సిద్ధాశ్రమంబు ఘటించి యందులోపాముద్రయను దాను బ్రభయుదరణి**
**యునుబోలె, బాయనియనుకూలదాంపత్యమున బొల్చి మునికోటి తను భజింప**
**దారకబ్రహ్మవిద్యారహస్యజ్ఞాతచళుకింతాంభోరాశి, కలశసూతి " పా 1-120**

కవి అగస్త్యుని గొప్పతనాన్ని వివరిస్తూ " తారకబ్రహ్మవిద్య" ను ఎరిగినవాడిగా చెప్పాడు.

## 4.7 బ్రహ్మచర్యం

బ్రహ్మమునందు చరించడము బ్రహ్మచర్యమనబడుతున్నది. దీనిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" లివె శబ్దసహ మృగయువయుగంబులు**

**చలకాకపక్షమస్తకులు బ్రహ్మ**

**చారులునిజహోమసార భేయీతర్ణ"** పా 1-131

బ్రహ్మచర్యము చతుర్విథ ఆశ్రమాల్లో ఒకటి. ఉపనయన సంస్కారం జరిగిన దగ్గర నుండి ఈ ఆశ్రమంలోనికి వ్యక్తి ప్రవేశిస్తాడు. ఇతరములైన సాంసారిక లంపటముల జోలికి పోకుండా, గురు శుశ్రూష చేసుకుంటూ విద్యనేర్చుకోవడం ఈ ఆశ్రమంలో ఉన్నవారి ప్రధానవిధి. పతంజలి తన యోగసూత్రాలలో బ్రహ్మచర్యం వలన వీర్యలాభం కలుగుతుందని చెప్పాడు.

## 4.8 కణాదుడు

కణాదుడు షడ్దర్శనములలో ఒకటైన వైశేషికశాస్త్రకర్త. ఇతనిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఓ లలితాంగి! యిందు సుఖముండు మృకండుకణాదగాధివా**

**ధూలముఖారిత్తచరితుండు, మతంగమహాతపస్వి, ని"** పా 1-133

పైన చెప్పబడిన మునులలో ఒకడు కణాదుడు. ఇతనికే కణభుక్, ఉలూక అనే ఇతర నామాలున్నాయి. క్రీ,,ప,, నాల్గవశతాబ్దానికి చెందినవానిగా ఇతనిని చరిత్రకారులు భావిస్తారు. అణువుల ద్వారానే సర్వప్రపంచము నిండి ఉన్నదని, అణువులు కలవడం వల్లనే ప్రపంచోద్భవము జరిగినదని, అవి వేరైనప్పుడు ప్రపంచమే నశిస్తుందని ఇతను చెప్పాడు. భౌతికశాస్త్ర సిద్ధాంతాలితని కణసిద్ధాంతం తో సరితూగుతాయని కొందరి అభిప్రాయం.

## 4.9 హోమధూమం

పూర్వమీమాంస కర్మానుష్టానమును చెప్పుచున్నది. మానవమాత్రుడు నిరంతరం పంచవిధయజ్ఞములు, హోమములు చేయవలెనని ఈదర్శనకారుని అభిప్రాయం పాండురంగమాహాత్మ్యంలో హోమధూమ ప్రస్తావన ఇలా ఉన్నది.

**" హోమధూమాసితప్రభ నీమహాత్మ్మ**

**నా(శమం బొప్పు నీయద్రియంతికమున**
**వలుదయై మించు నప్పంటవలతి వెలది**
**చంటికడనంటు మృగనాభిచర్చవోలె "  పా 1-134**

హోమధూమము వలన కొండలు ప్రకాశితమవుతున్నవని కవిభావం.

## 4.10 సత్వగుణం

సత్వరజస్తమాలనేవి త్రిగుణాలు. ఈ త్రిగుణాలతో ప్రపంచమంతా నిండి ఉన్నది. ఈ గుణములలోకెల్ల ఉత్తమమైనది సత్వగుణము. దీనిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" భూరితరాభ్రవిభ్రమము పుష్కరరమ్యకరంబు దానల**
**క్ష్మీరుచిరంబు సత్వగుణకీర్తిమూర్తియు, వాలిసాలసం"  పా 1-135**

వేదాంతం ప్రకారం ఈ మూడు గుణాలు మనిషిలో ఉండరాదు. మనిషి నిర్గుణుడు కావాలని వేదాంత భావం.

## 4.11 తాపత్రయాలు

సాధారణంగా వేదాంతమనగానే ఏదో తెలియని విషయాల గురించి మాట్లాడుతుందని అందరూ అభిప్రాయపడుతుంటారు. నిజానికి వేదాంతం మనకు తెలిసిన విషయాలనే తెలియని మాటల్లో చెప్తుంది. వేదాంతము మనిషికి వచ్చే కష్టాలను మూడు రకాలుగా విభజించింది. వాటికే తాపత్రయాలని పేరు పెట్టింది. తాపత్రయాలను కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఓపును భూపరిధింగల**
**యాపగలవి బాహ్యతాప మాపగ, నీవే**
**యోపుదుగాయంతర్గత**
**తాపత్రయమడపనోయుదన్వన్మహిళా! " పా 1-40**

అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికములనేవి తాపత్రయాలు. వీటిలో మొదటిది మన కారణంగానే మనకు సంభవించేది. అనగా ఈ దుఃఖమునకు మనమే కారణం. రెండవది అధిభౌతికము. ఇది ప్రకృతివలన మనకు సంభవించునది. దీనిలో మనప్రమేయముండదు. మూడవది అధిదైవికము. ఇది భగవంతుని వలన మనకు సంభవించునది. మన ప్రమేయము వలననే ఇది మనకు కలుగుతుంది.

## 4.12 తపము

కవి తపస్సును తన కావ్యంలో ఇలా ప్రస్తావించాడు.

**" ఘోరతముల హరుదక్కగొన్నవారు**
**కరటిదై తేయకుంముక్తాలలామ**
**హారితభుజమధ్యములవా,రుదారయశులు**
**ప్రమథవీరులుగొలిచిరాబాహులేయ " పా 1-165**

తపస్సు యోగదర్శన సంబంధమైన విషయం. పతంజలి తపస్సును ఇలా చెప్పాడు.

**" కాయేన్ద్రియాసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః " ప 3-43**

మనసు లోపలి మాలిన్యమును తొలగించి, జ్ఞానేంద్రియాలకు, కర్మేంద్రియాలకు అద్భుతమైన శక్తినిచ్చేది తపస్సు.

## 4.13 యోగరహస్యాలు

కవి ఒకే ఒక్క సీసపద్యంలో అష్టాంగయోగమును, కుండలినీయోగమును ఇలా చెప్పాడు.

**"మొదలుగామక్రోధములుబరీబరి చేసి సత్య వాఙ్నియమంబు సంఘటించి**
**సాత్వికస్వల్పభోజనలబ్ధి గ్రొవ్వాగి యంగాష్టకాసక్తి హవణుపరచి**
**తరచి ముప్పది రెండు తత్త్వంబులూహించి మది సత్వసంపద మస్తరించి**
**తెలిసి ముద్రాసనంబుల మేని పనిగొని పాపపూరుషు బటాపంచు జేసి**
**యతడు మూలాలవాల గహ్వరకరండ**
**కుండలినీస్థానగోకర్ణకులకలాప**
**తత్త్వదర్శన వర్ణాధిదైవతదళ**
**నిర్ణయం బెంత యంతయు నిజము గాంచి " పా 2-18**

ఇక్కడ సాధకుడు అధిరోహించవలిసిన సోపానములను కవి వివరించాడు. సాధకుడు మొదట అరిషడ్వర్గాలను జయించాలి. యమనియమాసనప్రాణాయామప్రత్యాహారధారణధ్యానసమాధులను సాధన చేయాలి. తర్వాత ప్రకృతి, మహత్తు, అహంకారం, ఇంద్రియములు, పంచభూతములు, పంచవిషయములు, జీవుడు, పరమాత్మ, షట్చక్రములు అను 32 తత్వాలను గ్రహించాలి. తర్వాత కుండలినీయోగము చేయాలని కవి చెపుతున్నాడు.

## 4.14 కుండలినీయోగము

క్రింది పద్యమున కుండలినీ యోగము ఇలా చెప్పబడింది.

**కుండలినీస్థానగోకర్ణకులకలాప**

**తత్త్వదర్శన వర్ణాధిదైవతదళ**

**నిర్ణయం బెంత యంతయు నిజము గాంచి " పా 2-18**

యోగశాస్త్రం ప్రకారం మానవశరీరమునందు మూలాధార, స్వాధిష్టాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞ అనే ఆరు చక్రములన్నవి. కుండలినీ అనగా పాము. ఇది ఒక శక్తి. ఇది మూలాధార చక్రమునందు మూడున్నర చుట్టలు చుట్టుకొని నిద్రాణమై ఉంటుంది. మానవుడు సాధన ద్వార ఆ శక్తిని జాగృతం చేయాలి. తర్వాత ఒక్కొక్క చక్రాన్ని దాని ద్వార భేదింప చేయాలి. ఒక్కో చక్రమును భేదించునపుడు ఒకో రకమైన సిద్ధులు కలుగుతాయి. సాధకుడు సిద్ధులకు పొంగకుండా సాధన కొనసాగించాలి. సాధన వల్ల కుండలిని ఆరు చక్రములను భేదించి సహస్రారం లో ఉన్న పరమాత్మలో ఐక్యం అవుతుంది. అపుడు సహస్రారం నుండి అమృతవృష్టి కురుస్తుంది. దీని కారణంగా యోగి యొక్క 72000 నాడులు ఈ వృష్టిలో తడుస్తాయి. యోగి పరమాత్మ స్వరూపుడవుతాడు. ఇదియే కుండలినీ యోగమనబడుతున్నది.

## 4.15 హఠయోగము, రాజయోగము

రామకృష్ణుడు హఠరాజయోగముల ప్రస్తావన ఇలా చేసాడు.

**" మును హఠరాజయోగముల మర్మమెరింగి తదర్థసిద్ధి నె**

**మ్మనము దలిర్ప హృజ్జల జమాసర సౌరభషట్పదంబు న**

**ర్జునరథ భూషణంబు వెలిజూడని నిద్ధపునిట్టచూపునన్**

**మునుకొని చొక్క లోన నిజమూర్ధగళత్సుధ సేద దేర్పగన్ " పా 2-19**

భగవంతుని చేరుటకు అనేక యోగములు ఉపదేశింపబడినవి. హఠయోగము, రాజయోగము, భక్తి యోగము, జ్ఞానయోగము మొదలైనవి. పైన హఠరాజయోగములు చెప్పబడినవి. హఠయోగమును గూర్చి హఠ రత్నావళి లో ఇలా చెప్పబడింది.

**" హకారేణోచ్యతే సూర్యః**

**రకారశ్చంద్ర సూచకః**

**చంద్రసూర్య సమాభూతో**

**హఠయోగోభిధీయతే "  హ 1-8**

ప్రపంచ స్థితికి ముఖ్యకారకులైన సూర్యచంద్రుల స్వరూపమే హఠయోగము. మనిషి కుడి నాశిక యందున్న నాడిని సూర్యనాడి లేద పింగళ నాడి అంటారు. ఎడమ నాశికారంధ్రమునందున్న నాడిని చంద్రనాడి లేదా ఇడానాడి అంటారు. ఈ నాడుల ద్వార మానవశరీరంలో ఉన్న శీతోష్ణశక్తులను సమన్వయ పరచడమే హఠయోగము. ఇక్కడ చెప్పబడిన మరొకయోగం రాజయోగం. ఆత్మ పరమాత్మల సమ్మేళనమే రాజయోగము. జీవుడు పరమాత్మతో కలిసి ఏకంగా భాసిల్లడమే రాజయోగము.

## 4.16 నాస్తికుడు

నాస్తికుని గురించి కవి ఇలా చెప్పాడు.

**" శఠమతికి నాస్తికునకు భాషండునకునుగర్మము గురించి యాచించు గర్వితునకును**

**నీపరమగోప్యమోపుత్ర! యోపురంధ్రి! తప్పిదారియు నెరిగింప దగవుగాదు"**

**పా 1-211**

సాధారణంగా నాస్తికుడనగానే భగవంతుని నమ్మనివాడు అనే అర్థం స్ఫురణకు వస్తుంది. కాని ఇది నిజమైన నాస్తికత్వం కాదు. వేదప్రామాణ్యాన్ని నమ్మకపోవడమే నిజమైన నాస్తికత్వం. ఆస్తిక దర్శనాలని చెప్పబడే వైశేషికం, సాంఖ్యం, యోగం ఈశ్వరత్వాన్ని అంగీకరించవు. కాని అవి వేదాన్ని అంగీకరిస్తాయి. అందుకే అవి ఆస్తిక దర్శనాలయినాయి. జైనము, బౌద్ధము ఈశ్వరుని అంగీకరించినా, వేదమునంగీకరించవు. అందుకే అవి నాస్తికదర్శనాలయినాయి. కాబట్టి వేదమును అంగీకరించకపోవడమే నాస్తికత్వం.

## 4.17 యోగీంద్రుడు

ఈ పదము యోగదర్శన సంబంధమైనది. కవి ఈ పదాన్ని ఇలా ప్రయోగించాడు.

**"హరిభక్తియి నురుభక్తియు, నురురక్తియుబుటముగాగ యోగీంద్రశిఖా**

**భరణము ముక్తామయతా, స్ఫురణము భువనప్రశస్తముగ జిగి మీరెన్" పా 2-24**

యమనియమాదులననుసరించి సాధన చేయడం యోగమనబడుతున్నది. చాల మంది సాధకులు కొన్ని సిద్ధులు కలిగిన పిమ్మట యోగమును విడిచిపెడతారు. కాని కవి చేత చెప్పబడుతున్న సాధకుడు

అలాంటి వాడు కాడు. యోగులలో మణివంటివాడు, కుండలినీ శక్తిని సహస్రారం దాక తీసుకెళ్ళనిదే అతడు విశ్రమించడు. అందుకే అతడు యోగీంద్రశిఖాభరణమైనాడు.

## 4.18 సమాధి

అష్టాంగములలో చివరిది సమాధి. సమాధిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" నియమాంతంబున సత్యా**
**ప్రియరూపముతోడ గూడబెనచిన యంత**
**ర్నయనము నడలిచి పితృపా**
**దయుగార్భాధీనబుద్ధి దహతహ వెరుగన్" పా 2-34**

నియమాంతమనగా సమాధి. సమాధిని పతంజలి ఇలా నిర్వచించాడు.

**" తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః" ప 3-3**

రూపాలను వదలి అర్థాన్ని మాత్రమే భాసింపచేస్తుంటే, దాన్ని సమాధి అంటారు. ధ్యానంలో ధ్యేయరూప బాహ్యభాగాన్ని విసర్జించినప్పుడు సమాధి ఏర్పడుతుంది. ఎలా అంటారా, నేను ఒక పుస్తకాన్ని భావిస్తూ దాని మీద మనసును ఏకాగ్రం చేయగలిగాననుకోండి. అప్పుడు బాహ్యంగా ఉన్న రూపం అదృశ్యమై అర్థం మాత్రం భాసించే స్థితియే సమాధి. ఈ సమాధి పలు రకాలుగా ఉన్నది.

## 4.19 పితృణం

ప్రతి మనిషి పుట్టుకతో ఐదుఋణాలను కలిగి ఉంటాడు. వాటిలో ఒకటైన పితృణం గురించి ఇక్కడ చర్చింపబడింది.

**" ప్రేయసివలన బ్రబోధవి**
**ధేయమతుల సుతుల గాంచి తీర్చె బితృణం**
**బాయయ్య తదీయం బగు**
**ప్రాయపు బ్రౌఢ్దంత గొంత పడమర దిరిగెన్" పా 2-27**

దేవఋణం, ఋషిఋణం, పితృణం, భూత ఋణం, మానుషఋణం అనేవి పంచఋణాలు. వీటిలో పితృణం పైన చెప్పబడింది. మనకు తనువును వంశమును ప్రసాదించిన మన పితరులకు మనం ఉండే ఋణం పితృణం. తర్వాతి తరం వారు  సంతానమును కని, వంశాభివృద్ధి గావించడం వల్ల ఋణవిముక్తి కలుగుతుంది.

## 4.20 యోగసిద్ధులు

యోగంలో సంయమం చెప్పబడింది. ఈ  సంయమాన్ని ఒక్కో చోట చేస్తే ఒక్కో రకమైన శక్తులు వస్తాయని పతంజలి విభూతిపాదంలో చెప్పాడు. ఇందులో ఒక సిద్ధి గురించి కవి ఇలా ప్రస్తావిస్తున్నాడు.

**" మిసిమింతు దునుగాక వసియించు గుత్తుకబంటినీరను బుండు వంటి చలిని**
**మోముదమ్మికి దేటి మొత్తమై పొగపర్వవేలు గ్రిందలుగాగ వృక్ష శాఖ**
**వేరు వెల్లకి కాయగూర పండని కోరుకుద రాగ్ని గాడ్పుచే నుజ్జగించు**
**నేచి యీ చెవిగాడు పాచెవి బోవంగ నుబ్బి లింగమువోలె నుండు నెండ**
**నంతరాయాంధకారంబు లలమికొనిన**
**నడుచు నిజధైర్య సూర్యోదయంబు చేత**
**దానవారిని గురిచేసి తనకు బోదు**
**నాకుబోదని నమ్మి సుశ్లోకుడగుచు" పా 2-29**

ధారణ, ధ్యాన, సమాధులను సంయమమంటారు.  ఈ సంయమాన్ని ఇక్కో ప్రదేశంలో చేయడం వలన ఒక్కో రకమైన సిద్ధులు కలుగుతాయి. ఉదాహరణకు సూర్యునిలో సంయమం చేస్తే 14 లోకాలకు సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. చంద్రునిలో సంయమం చేస్తే నక్షత్ర జ్ఞానం కలుగుతుంది. అలాగే కంఠము నందు సంయమం చేస్తే ఆకలిదప్పులు లేకుండా పోతాయి. ఈ విషయాన్ని పతంజలి ఇలా చెప్పాడు.

**" కంఠకూపే క్షుత్పిపాసావివృత్తిః" ప 4-31**

కంఠంలోపలి భాగంలో సంయమం చేస్తే ఆకలిదప్పులు లేకుండా పోతాయని దీని భావం.

## 4.21 ఉత్పత్తి, స్థితి, విలయాలు

ఈ మూడింటిని గురించి కవి ఇలా చెప్పాడు.

**" ఉత్పత్తిస్థితివిలయార్థోత్పాదక! విట్టలాహ్వయోన్నత! సత్రా**
**జిత్పుత్రికాసతృష్ణ, దృగుత్పిబసు ఖదాపఘనపయోదరశాలీ!" పా 2-45**

పై పద్యమున పరబ్రహ్మతత్వమున్నది. పరబ్రహ్మము నశించునది కాదు. సృష్టింపబడేది కాదు. అది ఇతరములైన ప్రపంచాన్ని సృష్టిస్తుంది. దాన్ని సాగిస్తుంది. లయం చేస్తుంది కూడా. ఇదే విషయాన్ని కవి పై పద్యమున వివరించాడు.

## 4.22 అధ్యాత్మవాసన

కవి తర్వాతి పద్యంలో అధ్యాత్మ వాసనలనబడే కర్మవాసనలను గురించి ఇలా వివరించాడు.

**" దొరకు జన్మమునకు బరమ భైషజ్యమౌ మాతృశుశ్రూషాసమాధి యొకటి**
**చిలువాయునపు వేల్పు గొలము గొల్వక వాసుదేవు నారాధించు తెలివి యొకటి**
**దుర్వాసనల బెట్టు దొసగులు విడదన్ని యధ్యాత్మ వాసన నలరు టొకటి**
**యుర్వి జీవులకెల్ల నుదయించి యుదయించి తుది మర్త్యుడై పుట్టు పదవియొకటి**
**కాలమున వచ్చునర్థుల కాంక్ష యెరిగి**
**తృప్తి నొందింపగలుగంగదిరుగు టొకటి**
**దుర్లభంబెట్టులట్లతి దుర్లభంబు**
**మగువ! తత్ క్షేత్రవాసంబు మానవులకు" పా 2-85**

మనిషికి మూడు రకాల తాపములుంటాయి. ఇవి కర్మల వలన సంక్రమిస్తాయి. వాటిని ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికములనే పేర్లతో పిలుస్తారు. వీటిని కర్మవాసనలనే పేరుతో కవి చెప్పాడు. పతంజలి కర్మవాసనల గురించి ఇలా చెప్పాడు.

**" జాతి దేశ కాల వ్యవహితానామప్యానంతర్యం స్మృతి సంస్కారయోరేకరూపత్వాత్ " ప 4-9**

స్మృతి సంస్కారం ఏకరూపాన్ని పొందియుండటం వలన జాతి, దేశ, కాలాలతో వేరుచేసిన వాసనలకు అనంతర్యం కలుగుతుంది. అనగా అవి మనకు సిద్ధిస్తాయని భావం. ఇదే పద్యంలో సమాధి కూడ చెప్పబడింది. పతంజలి సమాధిని ఇలా చెప్పాడు.

**" తదేవార్థ నిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః" ప 3-3**

రూపాలను వదలి అర్థాలను మాత్రమే భాసింపచేస్తుంటే అది సమాధి. మన సంస్కృతి వేదసంస్కృతి. వేదం పునర్జన్మను విశ్వశిస్తుంది. అందుకే శంకరాచార్య భజగోవిందంలో పునరపి జననం పునరపి మరణం అన్నారు. పూర్వజన్మ గురించి కవి పైన ప్రస్తావించాడు.

## 4.23 హ్రీంకారం

ఓం హ్రీం మొదలైన మంత్రాలను బీజాక్షరాలుగా చెపుతారు. దీన్నే భువనేశ్వరి మంత్రం, శక్తి బీజాక్షర మంత్రం, మహామాయా మంత్రం అనే పేరుతో పిలుస్తారు. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" మరలగబట్ట గట్టగ సమస్త మరుత్కరిదన్ను గూర్చి యొ**
**చ్చరిక ధరింపబోలుననశాతముఖాంకుశపాశముల్ విక**

**స్వరరుచి దాల్చి పశ్చిమపు వాకిట హ్రీంకృతి మంత్రరూపభా**

**స్వర భువనాధినాయిక లసద్రస నాయిక యొప్పెనెప్పుడున్" పా 2–97**

హకార, రకార ఈకారములు కలిసి హ్రీం మంత్రంగా మారాయి. హ కారము శివుని సూచిస్తుంది. ఇది అణిమాది సిద్ధులను కలిగిస్తుంది. ర కారం సూర్యుని సూచిస్తున్నది. ఇది అగ్నిబీజం. ఇది జీవులకు సంతోషాన్ని కలుగజేస్తుంది. ఈకారం అనునది మాయకు అధిదేవత. వశీకరణమునకు ఇది ఉపకరిస్తుంది.

## 4.24 ఇహపరాలు

భూలోకమును ఇహలోకమని దానికి పైన ఏడులోకాలు, క్రింద ఏడులోకాలు కలవని వేదమంగీకరించినది. పైన ఉండే లోకాలను పరలోకమని కూడ అంటారు. ఈ లోకముల ప్రస్తావన కవి ఇలా చేసాడు.

**" ప్రణుతమతి నర్హపూజా ర్హణమునదత్తీర్థమూర్తి భజియించు సుధీ**

**మణులకు నభిముఖమతి బర్హి ణబర్హకల్పుడొసగు నిహముం బరమున్ " పా 2–106**

ఈ లోకాలను గురించిన ప్రస్తావన ప్రతి పూజలోనూ ఉంటుంది. అందుకే మంత్రాలలో ఓంభూః, ఓంభువః, అని ఉంటుంది.

## 4.25 పురుషార్థములు

ధర్మార్థకామమోక్షములనేవి పురుషార్థములు. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" పురుషార్థసంపదతోడ గూడంగ బుధరక్ష తిన్న గా బూనువారు" పా 2–121**

ఈ పురుషార్థాలు వేదము చేత ప్రతిపాదితములు. ప్రతిమనిషి ధర్మబద్ధముగా అర్థమును, అర్థముద్వార కామమును, తద్వార మోక్షమును పొందవలెనని ఇక్కడ భావం.

## 4.26 తపస్సు

తపస్సు యోగదర్శన సంబంధమైనది. తపస్సును కవి ఇలా ప్రస్తావించాడు.

**"గోపిక యోర్తుతల్లి హరిగూర్చి తపం బొనరింప దానిని" పా 2–128**

**" ఇట్లు ఋణత్రయమోచన హేతువగు నాఋణ విమోచన తీర్థంబునం దపంబు సేసి"**

**"అనవుడు నట్ల యిచ్చి కమలాసునుడా శమశాలి బల్కు నో పా4–45**

**మునివర! నీవు సేయు తపమున్ జపమున్ బెరరేప నెల్లినే" పా 4-61**

పతంజలి తపసును ఇలా వివరించాడు.

" **కాయేన్ద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః"** కాయమును ఇంద్రియాలను శుద్ధి చేసి, వాటికి శక్తిని చేకూర్చేదే తపస్సు. యోగి నిరంతరం తపస్సును ఆచరించి తీరాలి.

## 4.27 క్లేశాలు

క్లేశం అనే పదం యోగశాస్త్ర సంబంధమైనది. కవి క్లేశ ప్రస్తావన ఇలా చేసాడు.

**" క్లేశపాశంబుతోగూడ గేశపాశ" పా 2-87**

**" భక్తుండెవ్వడు ముక్తికైశిక బయఃపానంబు గావించి వి**

**నిర్ముక్తక్లేశ ముక్తకేశికి" పా 2-155**

క్లేశమును పతంజలి ఇలా నిర్వచించాడు.

**" సమాధి భావనార్థః క్లేశ తనూకరణార్థశ్చ" ప 2-2**

మనోనిగ్రహం అనేది మనలో చాల మందికి ఉండదు. వారు మనస్సును యథేచ్ఛగా వదలి వేస్తారు. చివరకు వారు ఎందుకు కొరగారు. మనోనిగ్రహం లేకపోవటం వలన కలిగే ఆటంకాలను క్లేశాలంటారు. ఇవి ఐదు రకాలు

**" అవిద్యాస్మితారాగద్వేషాభినివేశాః క్లేశాః" ప 2-3**

అవిద్య, అస్మిత, రాగం, ద్వేషం, అభినివేశం అనేవి ఐదు క్లేశాలు. వీటిని గురించి కవి పైన ప్రస్తావించాడు.

## 4.28 బ్రహ్మవిద్య

బ్రహ్మవిద్యను కవి ఇలా ప్రస్తావించాడు.

**" దానికి దక్శిణాశ వసుధాధరనందన! యొప్పు బ్రహ్మవి**

**ద్యానిధి సేవితంబు నవహస్తమితంబగు చక్రతీర్థమ**

**చ్చోనలవోకయంబలె విశుద్ధజలంబుల గ్రుంకి మాధవ**

**ధ్యానము సేయు మౌనులకు నబ్రములే యపవర్గదుర్గముల్" పా 2-84**

బ్రహ్మవిద్యను గురించి ముండకోపనిషత్తు ఇలా ప్రస్తావిస్తున్నది.

**" యదర్చిమద్ యదణుభ్యోఽణుచ**

**యస్మిన్ లోకా నిహితా లోకినశ్చ**

**తదేతదక్షరం బ్రహ్మ స ప్రాణస్తదువాఙ్మనః**

**తదేతత్సత్యం తదమృతం తద్వేద్ధవ్యం సోమ్యవిద్ధిః" ము 2-2**

ఓ సౌమ్యుడా ప్రకాశించే ఆత్మ చైతన్యమే బ్రహ్మ. ఇది అక్షరబ్రహ్మ. ఇదే సత్యం. ఇదే శాశ్వతం. ఈ బ్రహ్మలోనే లోకాలు, జీవులు నివసిస్తున్నాయి. ఈ బ్రహ్మే లోకంలోనూ, ప్రాణంలోనూ మనసులోనూ ఉన్నది. ఈ బ్రహ్మను తెలుసుకోవటమే బ్రహ్మజ్ఞానము

## 4.29 దమనిధి

దమము షట్ సంపత్తులలో ఒకటి. దీనిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" దమనిధి విట్టలేశ్వరుండు దైవరత్నము జైమినితీర్థర" పా 3-166**

శమము, దమము, శ్రద్ధ, సమాధాన, తితీక్ష, ఉపరతి అనేవి షట్ సంపత్తులు. వీటిని సాధకుడు కలిగి ఉండాలి. దమమనగా ఇంద్రియములను అదుపులో ఉంచడము. ఇది సాధకునికి ప్రధానమైనది. కవి అందుకే ఇక్కడి యోగిని దమనిధి అని సంబోధించాడు.

## 4.30 త్రిగుణాలు

రాయలు మొదలుకొని రామభద్రుని వరకూ ఎవరూ త్రిగుణాలను రామకృష్ణుడి లాగ వివరంగా చెప్పలేదు. ఈ క్రింది పద్యాన్ని గమనిస్తే ఆ విషయం జ్ఞాతం అవుతుంది.

**" మును పుట్టెం బ్రకృతిం దమంబును రజంబున్ సత్త్వము న్నాగ నం**

**దునిలింపారులు తామసాత్మకులు మర్త్యుల్ రాజసుల్ సాత్వికుల్**

**దనుజద్వేషణు లందు బూజ్యులు నితాంతఖ్యాతి నానిర్జరుల్**

**ఘనుడందింద్రు డతీంద్రుడీశు డమరుల్ గారెవ్వరుం దత్సముల్" పా 2-183**

సత్వరజస్తమాత్మకమైనది ఈ ప్రపంచం. ఈ సత్వరజస్తమాలు సాంఖ్యయోగమున చెప్పబడిన 24 తత్వాలలోనివి. అయితే భగవంతుడు గుణాతీతుడు. నిర్గుణుడు. ఈ విషయం గీత యందిట్లు చెప్పబడింది.

**" త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రై గుణ్యోభవార్జున!**

**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్!!" భ 2-45**

వేదముల యొక్క పూర్వభాగంలో కర్మకాండలు, స్తోత్రములు చెప్పబడ్డాయి. సత్వరజస్తమోగుణములు వాటి కలయిక వలన చేయబడే కార్యములు, వచ్చే భోగములు వీటన్నింటి గురించి వేదములలో ఉన్నది. వేదములలో చెప్పబడే ఈ కర్మకాండలు ఈ మూడు గుణములలో వర్తించువారికే గాని నీకు కావని భావం.

## 4.31 సంధ్య, హోమం

కవి గుణనిధి గుణవర్ణన చేస్తు ఈ క్రింది పద్యం చెప్పాడు.

**" ఉష్వాని హోమాగ్ని యూద నొల్లడుగాని వెచ్చనూర్చు**
**సంధ్యకు బ్రార్థనాంజలి ఘటింపడుగాని యెరగు నీర్భ్యాకషాయితల కర్థి" పా 3-12**

పై పద్యమున హోమాగ్ని చెప్పబడింది. హోమములు నిత్యకృత్యములలోనివి. సంధ్య అనగా సంధ్యావందనం అని అర్థం. గుణనిధి కనీసం నిత్యానుష్టానమైన సంధ్యావందనం గూడా చేయటం లేదని కవి భావం.

## 4.32 పూర్వజన్మ

పూర్వజన్మను మన సంస్కృతి సమర్థిస్తుంది. దాని గురించి కవి ఇలా చెప్పాడు.

**" చేరువ చేరువై కడు బచేళిమమై తను డాయు పూర్వసం**
**స్కారతపఃఫలంబున భజద్వృజనావళీకృన్నకం**
**ఠీరవదేవ నిత్యసదనీకృతసంగమతీర్థరాజవా**
**ర్థారల నాడి తత్పరమధామపతిన్ బలుమారు జూచుచున్" పా3-101**

పై పద్యమున పూర్వజన్మకృతపుణ్యము చెప్పబడింది. దీని ప్రకారము పూర్వజన్మలో మనం చేసిన పాప పుణ్యాలు మన వెంట వస్తాయని తెలుస్తున్నది. ఈ జన్మమున మనం అనుభవిస్తున్న భోగభాగ్యాలు, సుఖసౌఖ్యాలు పూర్వజన్మ కారణంగానే మనకు లభించినవి.

## 4.33 కైవల్యం

కైవల్యం అనగా ముక్తి. భగవంతునిలో లీనం కావడం. దాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" యనగ దత్తక్రియలయందు నలతలేక**
**భూరికైవల్య సామ్రాజ్య భోగకాంక్ష**

**బాధనిష్టానురక్తి దపం బొనర్చు**

**గుదిసి ముల్లోకములును గగ్గోలుపడగ" పా 3-133**

కైవల్యమును గురించి పతంజలి ఇలా చెప్పారు.

**" తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్" ప 3-51**

**" గైవల్యసిద్ధి యగునన,నీవల సతిశుద్ధమతుల నేటికి నెన్నన్" పా 5-19**

యోగం వలన కొన్ని సిద్ధులు కలుగుతాయి. యోగి ఈ సిద్ధులను లెక్కలోనికి తీసుకోగూడదు. వాటిని విసర్జించాలి. విసర్జన వలన కైవల్యం సిద్ధిస్తుందని పతంజలి భావం.

## 4.34 ప్రణవం

కవి ఈ క్రింది పద్యంలో ఓం బీజాక్షరాన్ని గురించి ఇలా చెప్పాడు.

**" ఆద్యుబ్రణవస్వరూపు వేదాంతవేద్యు**

**మోక్షవిద్యోపదేష్ట నిర్ముక్తజనను**

**విష్ణు బ్రభవిష్ణు నిత్యవర్ధిష్ణు గాంచి**

**మ్రొక్కె నారీజనోచితంబగు ధరిత్రీ" పా 3-163**

పై పద్యమున కవి భగవంతుని ప్రణవ స్వరూపుడిగా భావన చేసాడు. ప్రణవం కేవలం నాదం మాత్రమే. దానికొక రూపముండదు. భగవంతుడు నిరాకారుడని చెప్పడం ఇక్కడ రహస్యం. అందుకే తర్వాతి విశేషణం వేదాంతవేద్యుడు అని చెప్పబడింది. వేదాంతం భగవంతుని నిర్గుణునిగా, నిరాకారునిగా చెప్పింది.

## 4.35 పదార్థానుమానము

పదార్థానుమానమనునది న్యాయశాస్త్రమున పదార్థనిర్ణయమును చేయుటకు నియమితమైన ప్రత్యేక సిద్ధాంతం. దీన్ని గురించి కవి ఇలా ప్రస్తవించాడు.

**"నవ్యకాలగరూద్వర్తనముల సతుల**

**చన్నుగొండల నూష్మాగ్ని సంభవించె**

**మతసమగ్రులు ధూమానుమానకలన**

**నగ్ని సాధింతురచలంబులందు నెపుడు" పా 4-7**

కొత్త కస్తూరి పూతవలన కొండలబోలు స్త్రీల చన్నులమీద వేడిమియను అగ్ని కలిగెనట. బుద్ధిమంతులు, పండితులు పొగ యొక్క అనుమానము వలన కొండలపయి అగ్నిని నిశ్చయింతురు కదా! పర్వతముల పయి వ్యాపించి ఉన్న పొగను చూచి తార్కికులు ఆ పర్వతముపయి అగ్ని యుండి తీరుననియే ఊహించిరి. ఆ సిద్ధాంతం రాధ విషయంలో రూపకమూలంగా సిద్ధించింది. న్యాయశాస్త్రంలో చెప్పబడిన ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణం, ఉపనయం, నిగమం అనేవి చెప్పబడ్డాయి. అయితే అగ్ని ఉన్నదో లేదో తెలుసుకోవడానికి ధూమాదులు, ఉపనయాదులు అక్కర లేదని కవి భావం.

## 4.36 వైశేషికం – పరమాణుతత్వం

వైశేషికం పరమాణువుల గురించి ఉపదేశిస్తుంది. పరమాణువుల కలయిక వల్లనే ఈ ప్రపంచం పుట్టినదనీ, విడువడటం వలనే నాశనం అవుతుందని చెపుతున్నది. దీని గురించి ఇలా ప్రస్తావించాడు కవి

**" తరుణిలయానంతరమున**
**గర మమరు దిగంతములను ఖద్యోతంబుల్**
**మరలగ దైజన సృష్టికి**
**బరమాణుచయము గూడబడుచండమునన్" పా 4-30**

సూర్యాస్తమయం తర్వాత తిరుగుతున్న మిణుగురు పురుగుల వెలుగులో కవికి ప్రకృతిని సృష్టించడానికి పూనుకున్న పరమాణువులు కనబడ్డాయి. వీటిని వైశేషికంలో సృష్టికి కారణమైనవిగా కణాదుడు చెప్పాడు.

## 4.37 ఆసనాలు

ఏ ప్రదేశంలోనైతే సుఖంగా, స్థిరంగా సాధన చేయగలమో అదియే ఆసనమని పతంజలి అభిప్రాయపడ్డాడు. పాండురంగమాహాత్మ్యం లో బద్ధ పద్మాసన ప్రస్తావన ఇలా ఉన్నది

**"మూడవవాడుయథాకాలప్రబుద్ధుండైపూర్వాశ్రితసిద్ధాశ్రమంబునబద్ధపద్మాసనుండై" పా 4-67**

## 4.38 సహస్రారం

షట్ చక్రములు దాటిన తర్వాత కుండలినీ శక్తి చేరుకోవలసిన ప్రదేశం సహస్రారం. దాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఇంతకు నూర్ధ్వమై శిరము నిక్క నధోముఖమూర్తి బొల్చి య**
**త్యంత వికాసశాలియంబు యాద్యశివాశ్రయమై సహస్ర ప**
**త్రాంతర చిత్సుధార సమహా ఝరదుర్దిన మాచరించు న**
**ద్వొంతరపుష్పనం గలుగు తోరపుగంపలు పెంపుమీరగన్" పా 4-74**

ఈ సహస్రారంలో ఉన్న బ్రహ్మమును కుండలినీ శక్తి చేరుకోగానే సుధావృష్టి కురుస్తుంది. ఈ వృష్టిలో 72000 నాడులు తడిసి ముద్దవుతాయి. జీవుడు జీవన్ముక్తుడవుతాడు.

## 4.39 వైరాగ్యం

రాగము లేకపోవడం వైరాగ్యమనబడుతున్నది. వైరాగ్యాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" భాగ్యమనై యిహపరపరి, భోగ్యార్థమునై యగణ్యపుణ్యమునై వై**
**రాగ్యజ్ఞానోన్నతులగు, యోగ్యతపములపాల వాలియుండుదు జుమ్మీ!" పా 4-108**

**"పురుష శ్రేష్ఠుల కొందరాత్మచరితంబుల్ జ్ఞానవైరాగ్య భా" పా 4-277**

**"మధురోష్ఠములురాగమహితంబులగునైన,భావముల్వైరాగ్యబంధురములు"పా4-180**

వైరాగ్యమును పతంజలి ఇలా నిర్వచించాడు.

**" దృష్టానుశ్రవిక విషయ వితృష్ణస్య వశీకార సంజ్ఞా వైరాగ్యమ్" ప 1-15**

ఇహపరాల్లో అనుభవించదగ్గ విషయాల్లో ఆశలేని వానికి విషయాలు తనకు వశమైనాయని తెలియడమే వైరాగ్యం. సాధారణంగా మనుషులు రెండు రకాలుగా పనులు చేస్తుంటారు. ఒకటి ప్రత్యక్ష స్వానుభవం. రెండు ఇతరుల అనుభవం. వీటి ప్రాబల్యంతో చిత్తంలో రకరకాల వృత్తితరంగాలు కలుగుతుంటాయి. ఈ వృత్తులతో పోరాడి, మనస్సును నిగ్రహించే సామర్థ్యమే వైరాగ్యం.

## 4.40 గోచరబ్రహ్మము

పరమాత్మ రెండు రకాలుగా తన రూపాన్ని కలిగి ఉంటాడు. ఒకటి కరచరణాదులతో తిరుగాడే పరమాత్మ. రెండు జ్ఞానేంద్రియములకు గోచరము కాని పరమాత్మ. వీటిలో మొదటి దానిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" రౌరవంబులడింది పారంబులేక**
**వనరుదురుగాని విజ్ఞానవంతులైన**
**వారు శిలగాగదలచ రెవ్వారు దృష్టి**
**గోచరబ్రహ్మమని చూచి కొలిచి యునికి" పా 5-206**

గోచర బ్రహ్మమనగా సగుణబ్రహ్మము. కరచరణాదులు కలిగి జ్ఞానేంద్రియముల ద్వార చూడదగ్గ పరమాత్మ అని భావం.

## 4.41 బ్రహ్మచర్యం

బ్రహ్మచర్యమును కవి ఇలా ప్రస్తావించాడు.

**" విషనిభంబులైన విషయాభిలాపంబు**
**లెల్ల సల్లబెట్టి యేను బ్రహ్మ**
**చర్యధుర్యవృత్తి నవరించుచున్నాడ**
**నుగ్రతపము మోక్షమొందు కోర్కి" పా 5-208**

బ్రహ్మచర్యం చతుర్విధ ఆశ్రమాల్లో మొదటిది. ఇందు నియమనిష్టలను తప్పక పాటించాలి. వ్యక్తి పెళ్ళైన తర్వాత కూడా కేవలము రాత్రి మాత్రమే సంభోగం చేస్తే బ్రహ్మచర్యంలో ఉన్నట్టుగానే పరిగణించాలి. బ్రహ్మచర్యమునవలంబించడం వల్ల భగవద్దర్శనం కలుగుతుందని కఠోపనిషత్తు చెప్తున్నది.

**" సర్వే వేదాయత్పదమానన్తి**
**తపాగ్ంసిసర్వాణిచ యద్వదన్తి యదచ్ఛన్తో**
**బ్రహ్మచర్యం చరన్తితత్తేపదగ్ం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్" క 1-15**

బ్రహ్మచర్యం భగవంతుని చేరుటకుపకరిస్తుందని యముడు పై మంత్రమున చెప్తున్నాడు.

## 4.42 గృహస్థాశ్రమం

చతుర్విధ ఆశ్రమాల్లో గృహస్థాశ్రమమే ఉన్నతమైనదిగా వేదాలు మొదలుకొని అందరూ అంగీకరించారు. పెద్దన కూడా మనుచరిత్రలో సిద్ధుని ముఖంగా గృహస్థాశ్రమ ఔన్నత్యాన్ని చెప్పాడు. గృహస్థాశ్రమాన్ని గురించి కవి ఇలా చెప్పాడు.

**" మీ గ్రుగును గృహస్థధర్మము**
**మేరకు దలమీరి చనక మిత్రామాత్యో**
**దారహిత దారదారక**
**వారకములతోడ దీర్ఘవాసనపరులై" పా 4-282**

**"హరివిచార! నీ వనినయట్ల పురాకృతపుణ్యసంపదన్**
**వారల కావహిల్లె మునివల్లభమయ్యు నయ్యమ**
**ర్యార్తి విదారి మేన గలయంగల పూనిక వారయేల? యె**
**వ్వారు గృహస్థ ధర్మవశవర్తుల వారల సొమ్ము ముక్తికిన్" పా 4-165**

గృహస్థాశ్రమం గురించి, దాని ఔన్నత్యాన్ని గురించి బృహదారన్యకోపనిషత్తు ఇలా చెప్తున్నది.

**" అథో అయం వా ఆత్మా సర్వేషాం భూతానాం లోకః స యజ్జుహోతి యద్యజతేతేన దేవానాం లోకోథ యదను బ్రూతే తేన ఋషినామథ యత్పితృభ్యో విపృణాతి యత్ ప్రజామిచ్ఛతే తేన పితృణామథ యన్మనుష్యా న్వాసయతే యదేభ్యో శనం దదాతి తేన మనుష్యాణాం అథయత్ప శుభ్యః తృణోదకం విన్దతి తేన పశూనాం యదస్య గృహేషు శ్వాపదా వయాగ్ం స్యా పిపీలి కాభ్య ఉపజీవన్తి తేన తేషాంలోకే యథా  హవై స్వాయ లోకాయారి ష్టి మిచ్ఛే దేవగ్ం హైవంవిదే సర్వాణి భూతస్య రిష్టి మిచ్ఛన్తి ఏదతద్విదితం మీమాంసితమ్" బృ 1-16**

గృహస్థుడైనవాడు కర్మచేత సర్వభూతములకు ఉపకారం చేయుచున్నాడు. ఎలా అంటే యజ్ఞ కర్మచేత దేవతలకు, స్వాధ్యాయాధ్యాయమున ఋషులకు, పిండోదకాదులను ఇచ్చుటచేత పితృ దేవతలకు, గృహమునందతిథులగువారికి అన్నమునిచ్చుట చేత మనుష్యులకు, గడ్డిని, ఉదకమును ఇచ్చుటచేత పశువులకు, బలి, బాండక్షాలనము మొదలైన కర్మలచేత విపీలికముల్తో గూడ శ్వానము మొదలైన జీవులకు, కాకాది పక్షులు మొదలైన వాటికి, యజ్ఞానియై కర్మయందధికృతుడైన జీవునకు ఉపకారం చేయుచున్నాడు. పై కారణముల మూలమున గృహస్థాశ్రమం మిగిలిన ఆశ్రమములకంటే ఉన్నతమై ఉన్నది.

## 4.43 షడ్దర్శనములు

కవి కృతిభర్త అయిన విరూరి వేదాద్రి మంత్రిని షడ్దర్శనముల యందు పాండిత్యం కలిగిన వానిగా ఎంచి ఆశ్వాసాంత గద్యమున ఇలా చెప్తున్నాడు.

**" షడ్దనసారగ! కవి రాద్ధత్తానుగ్రహాభిరమ్య!మదాంధ**

**ద్విడ్దంతిసింహ! మహిత, త్విడ్దశశతకిరణ! హృదయ ధృతహరిచరణా!"**

పై పద్యమున చెప్పబడిన దర్శనములు సాంఖ్యయోగ న్యాయవైశేషిక పూర్వోత్తరమీమాంసములు. వీటియందు పాండిత్యము సంపాదించినవాడా! అని కవి విరూరి వేదాద్రి మంత్రిని కొనియాడుతున్నాడు. ఈ విధంగా పాండురంగ మాహాత్మ్యం పై పూర్వోత్తరమీమాంసల ప్రభావం ఎక్కువగాను, మిగిలిన దర్శనముల ప్రభావం నామమాత్రంగాను ఉన్నది.

## 5. రామాభ్యుదయం – షడ్దర్శన ప్రభావం

ప్రబంధాలలోని కథ సాధారణంగా ప్రఖ్యాతమై ఉంటుంది. అనగా పురాణేతిహాసాలనుండి గ్రాహ్యమై ఉంటుంది. రామాభ్యుదయం మాత్రం ఇందుకు భిన్నమైనది. ఇందులోని కథ పురాణేతిహాసాల నుండి గ్రహించింది కాక కేవల రామాయణమై ఉన్నది. కవి మొత్తం రామాయణాన్నే తన కథగా గ్రహించాడు. ఇలా గ్రహించిన ఏకైక కవి రామభద్రుడు. రామాభ్యుదయం మొత్తం ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధం. ఇందులో మొదటి ఐదు ఆశ్వాసాల్లో ప్రబంధ విషయాలు కనబడతాయి. తర్వాతి మూడు ఆశ్వాసాలు దర్శన శూన్యమై కథాగమనమే లక్ష్యంగా సాగినవి. ఇతర ఏ విషయాలు ఇందు లేవు. రామభద్రుడు దర్శన విషయాలను తక్కువగానే ప్రస్తావించినా, ప్రస్తావించినపుడు మాత్రం క్షుణ్ణమైన విషయావగాహనతో ప్రస్తావించాడు. దర్శనాంశాలను లోతుగా స్పృశించాడు.

## 5.1 విశిష్టాద్వైతం

ధూర్జటి దక్క మిగిలిన ప్రబంధ కవులందరూ విశిష్టాద్వైతులే. వీరందరూ తమ మతాన్ని ప్రచారం చేయడానికి తమ కావ్యాలను ఆయుధాలుగా వాడుకున్నారు. రాయలవారు, సూరన, పెద్దన ఈ ప్రయత్నాన్ని మరింత ధృఢంగా చేశారు. రాయల వారి కావ్యలక్ష్యమే విశిష్టాద్వైతమతస్థాపన దిశగా సాగింది. రామభద్రుడు విశిష్టాద్వైతియే. కాని కావ్యారంభమున మాత్రమే మతసంబంధ సంప్రదాయాలను పాటించి, తర్వాత విడిచిపెట్టాడు. కథ వరకూ వాటిని వెంటబెట్టుకు రాలేదు. విశిష్టాద్వైతం లక్ష్మీసమేత నారాయణుణ్ణు అంగీకరిస్తుంది. ఈ మతంలో వారిరువురికి అభేదం. అందుకే కవి మంగళపద్యంలో ఇలా వర్ణించాడు.

**" శ్రీరామా కుచహార నాయక మణి శ్రీ జేయు సాకార శృం**
**గారంబై తగు మచ్చ వక్షమున భూకాంతస్థితిన్ దెల్ప సౌ**
**ఖ్యారూఢి న్విలసిల్లు వేంకటనగాధ్యక్షుండు రక్షించు గొ**
**బ్బూరి తిమ్మనృపాల సింహు నరసింహోర్వీశ చూడామణిన్" రా 1-1**

పై పద్యం రాయలవారి మంగళపద్యం తో సరిపోలుతుంది. విశిష్టాద్వైతం లో భగవంతునితో సమానమైనవి పంచాయుధములు. అందుకే వాటిని తర్వాతి పద్యంలో కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఆయతధర్మభోదము నిరంతరశాస్త్ర వివేకమున్ జగ**
**ద్గేయ పటు ప్రతాపమును గీర్తియు నూర్జితబాహు శక్తియున్**

**బాయక యుండ జేసి నిరపాయముగా గరుణించి విష్ణుపం**

**చాయుధి యేలు గావుత మహామహు గొబ్బూరి నారసింహునిన్" రా 1-3**

విశిష్టాద్వైతమున ఇవి మాత్రమేగాక గరుత్మంతుడు, ఆదిశేషుడు, విశ్వక్షేణుడు తదితరులందరూ దేవుళ్ళే. అందుకే వారిని కూడా కవి మంగళ పద్యాలలో ప్రస్తావించాడు.

## 5.2 వాదములు

న్యాయశాస్త్రం లో అత్యంత ప్రధానమైన విషయం వాదం. ఇది ఏది సత్యం? ఏది అసత్యం? తేల్చడానికి ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ చర్చలను గురించి కవి పలు తావులలో ప్రస్తావించాడు. పూర్వోత్తరమీమాంసలలో కూడా ఈ వాదం ఉన్నది. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఒక చక్కిన్ నిరవద్య హృద్యకవితాసూక్తి ప్రసంగంబు లొం**

**డొకచో దార్కికతర్క శాస్త్ర బహుధాయుక్త్యక్తి వాదంబుల్**

**కకడ వైణికపాణికంబు ముఖరైక శ్రావ్యవీణారవం**

**బొకట ఘూర్ణిల రీవి నా దశరథుం డొడ్డోలగం బుండగ" రా 2-4**

న్యాయశాస్త్రం పదహారు పదార్థాలను ప్రస్తావిస్తున్నది. ప్రమాణ, ప్రమేయ, సంశయ, ప్రయోజన, దృష్టాంత, సిద్ధాంత, అవయవ, తర్క, నిర్ణయ, వాద, జల్ప, వితండ, హేవభాస, ఛల, జాతి, నిగ్రహస్థానం అనేవి పదహారు పదార్థాలు. వాదం, జల్పం, వితండం అనేవి ఇక్కడ ప్రధానమైనవి. పైన వాదం చెప్పబడింది. వాదము ఇలా నిర్వచింపబడినది.

**" ప్రమాణ తర్కసాధన ఉపాలంబమ్" న్యా 2-21**

ప్రమాణ తర్కముల ద్వార సాధించునది వాదమని చెప్పబడుతున్నది.

## 5.3 జగత్రయం

జగత్రయమును కవి ఇలా ప్రస్తావించాడు.

**" మిత్రబ్రహ్మము పొల్చు జ**

**గత్త్రయనయనమ్ము జిత్ప్రకాశకమును మూ**

**ర్తిత్రిత యాన్వితమును సమ**

**యత్రయ కారణ మహా మహత్త్వము నగుచున్" రా 2-15**

మూడు లోకములను గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" త్రయోలోకా ఏత ఏవ వాగేవాయం లోకో**

**మనోన్తరిక్షలోకః ప్రాణోసౌ లోకః" బృ 2-4**

భూలోక, భువర్లోక, సువర్లోకములు మూడును వాఙ్మనః ప్రాణములే. ఈ భూలోకమే వాక్కు. భువర్లోకమే మనస్సు. సువర్లోకమే ప్రాణము అని ఉపనిషద్వాక్యం. ఈ మూడు లోకములను కవి చాల చోట్ల ప్రస్తావించాడు.

## 5.4 తపస్సు

తపస్సు యోగదర్శన సంబంధ విషయం. తపస్సును కవి ఇలా ప్రస్తావించాడు.

**" ప్రభురత్నంబగు తిమ్మభూవిభు తపః ప్రారబ్ధపుణ్యోదయం**

**బభిరామాకృతి నొందె నొక్కొ యనగా నా యోబమాబ్జాసనా**

**శుభగర్భాబ్ధి జనించి రా నరసరాజున్ జగ్గభూభర్త కౌ**

**స్తు భ చింతామణులుంబలెన్ సహజతేజోదాన ధారేయులై" రా 1-81**

**" ఉల్లాసాతిశయంబు నొందె జడలేరుల్లోలకల్లోలమై**

**ముల్లోకంబులు నోలలాడె బ్రమదాంబోధిన్ దిశల్ వొల్చె రా**

**జిల్లెన్ మౌనుల జన్నముల్ జపతపశ్శీలంబు లారాజయో**

**షిల్లోకాగ్రణి యప్పుడప్రతిహత శ్రీధాము రాముని గన" రా 3-109**

పతంజలి తన యోగశాస్త్రంలో " కాయేన్ద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః" అని తపస్సును నిర్వచించాడు. తపస్సు చేయడం వలన ఇంద్రియములు, కాయము చక్కబడతాయని, శక్తిని పెంపొందించుకుంటాయని భావం.

## 5.5 ధ్యానం

ధ్యానం యోగశాస్త్ర సంబంధమైన విషయం. ధ్యానాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" అనిశంబున్ బురిహాలికుల్ పయిరు సేయం గొంద్ర నేల్పందు నూ**

**తనధ్యానంబులు రాశికెక్కి తను జెందం గందబృందంబు దా**

**క్కొని యాయొప్పల కుప్పంగని చెలంగున్ నింగిముట్టన్ ఘనుల్**

**మును దార్ వెంచినవారి వంగడముపై మోహంబు వాటింపరే" రా 1-8**

ధ్యానాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" యథాభిమత ధ్యానా ద్వా" పా 2-39**

యోగి తనకభిమతమైన ఏదైనా విషయాన్ని ధ్యానించడం వల్ల స్థిరచిత్తత ఏర్పడుతుందని దీని భావం. ఇలా ధ్యానించే యోగి చిత్తానికి పరమాణువు మొదలుకొని, అనంతత్వం వరకూ అన్ని వశమై ఉంటాయని తర్వాతి సూత్రంలో పతంజలి చెప్పారు.

## 5.6 చాతుర్వర్ణవ్యవస్థ

ప్రబంధకవులందరూ నాలుగు వర్ణాలను పురవర్ణన చేసేటప్పుడు వర్ణించారు. నాలుగు వర్ణముల ప్రజలు సుఖసౌఖ్యాలతో వర్ధిల్లుతున్నారని చెప్పడం కవి ఉద్దేశ్యం. రామభద్రుడు నాలుగు వర్ణాలను ఇలా వర్ణించాడు.

**" అల హరియాననాంబుజమునందు జనించుట జేసి మేము ము**
**ఖ్యులము తదీయనాభి కమలోద్భవు డావిధి మాకు నెవ్విధిన్**
**దెలిపిన నీడుగాగలడె దిగ్గడు మాకని గ్రేణి సేయుచుం**
**బొలుతురు విప్రపుంగవులు ప్రోలున వేదరహస్యవేదులై" రా 1-20**

**"అనయము నిజప్రచారం**
**బనయముగాకుండ నచట నతిసౌర్యమునన్**
**మనసరియే కేశరి యని**
**మనసరి రాకొమరు మూక మను మనురీతిన్" రా 1-21**

పై విధంగా కవి బ్రాహ్మణక్షత్రియ వర్ణములను వర్ణించాడు. తర్వాతి రెండు వర్ణాలను వర్ణించలేదు. వాటిస్థానంలో వేశ్యాస్త్రీలను, పుష్పలావికలను వర్ణించాడు. చాతుర్వర్ణముల పుట్టుకను గురించి బృహదారణ్యకోపనిషత్తు లో చెప్పబడింది. ఈ ఉపనిషత్తు ప్రకారం ఈ ప్రపంచంలో మొదటి నుండి ఉన్నది బ్రాహ్మణ వర్ణం. బ్రాహ్మణవర్ణం నుండి క్షత్రియవర్ణం పుట్టిందని ఈ ఉపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**" బ్రహ్మవా ఇదమగ్ర అసీదేకగ్ం తదేకగ్ం సన్న వ్యభవత్ తచ్ఛ్రేయోరూప మత్య సృజత క్షత్రం యాన్యేతాని దేవత్రా క్షత్రాణీన్ద్రో వరుణః సోమో రుద్రః, పర్జన్యో యమో మృత్యురీశాన ఇతి, తస్మాత్రాత్పరం నాస్తి తస్మాద్బ్రాహ్మణః, క్షత్రియ మధ స్తాదుపాస్తే రాజసూయే క్షత్ర ఏవ తద్యశో దధాతి సై షా క్షత్రస్య యోనిర్య ద్బృహ్మ, తస్మాద్యద్యపి రాజా పరమతాం గచ్ఛతి బ్రహ్మైవాన్తత ఉపసిశ్రయతి స్వాం యోనిం య ఉ ఏనగ్ం హినస్తి స్వాగ్ం స యోని మృచ్ఛ్యతి స పాపీయాన్ భవతి యథా శ్రేయాగ్ం సగ్ం హిగ్ంసిత్వా" బృ 1-11**

ఈ క్షత్రాది జాతము, పూర్వము అభిన్నముగా అగ్నిస్వరూపమును పొందియున్న బ్రహ్మముగానే ఉండెను. ఆ బ్రహ్మం ఒక్కటిగా ఉన్నందున కర్మలు చేయడానికి సమర్థం కాకపోయినది. అప్పుడు బ్రహ్మ క్షత్రమను ప్రసిద్ధరూపమును ఉత్పన్నము జేసెను. దేవతలయందు ఇంద్ర, వరుణ, సోమ, రుద్ర, పర్జన్య, ఋతు , మృత్యు, ఈశాన ఇత్యాది క్షత్రియులను ఉత్పన్నం చేసెను. అందువల్లనే క్షత్రియుల కంటెను ఎక్కువయిన దేమియును లేదు. కాబట్టి రాజసూయము నందు బ్రాహ్మణులు క్రింద నిలిచి క్షత్రియుని ఉపాసన జేతురు. అతడు అనగా బ్రహ్మము తన యశస్సును క్షత్రియుని యందు స్థాపించును. బ్రహ్మమే క్షత్రియునకు యోని కాబట్టి రాజు శ్రేష్టత్వమును పొందినను చివరకు బ్రహ్మము నాశ్రయించును. అది యతని ఉత్పత్తి స్థానం. కర్మ సమాప్తి యందు తనదియగు ఉత్పత్తిస్థానమైన, బ్రాహ్మణుని తిరస్కారభావముతో జూచుచున్నాడో, అతడు తన సంబంధమగు ఉత్పత్తి స్థానమును నశింపజేయుచున్నాడు. వాడు ఈ లోకమునందు మిక్కిలి ప్రశస్తమైన వానిని హింసించి పాపాత్ముడు అగుచున్నాడు. తర్వాత వైశ్యవర్ణమును గురించి ఇలా చెప్పబడింది.

**" సనైవ వ్యభవత్ స విశమ సృజత యాన్యేతాని దేవజాతాని గుణశ ఆఖ్యాయ న్తే పసవో రుద్రా ఆదిత్యా విశ్వే దేవా మరుత ఇతి" బృ 1–12**

ఆ పురుషుడు క్షత్రియులను కలుగజేసినను, వివిధ కర్మలు చేయు బ్రహ్మము శక్తివంతము కాలేదు. అందువలన నతడు వైశ్యుని సృష్టించెను. గణశః లేక గణములని చెప్పబడు దేవతలందు వసు, రుద్ర, ఆదిత్య, విశ్వవేదాది దేవతలను అనగా వైశ్యదేవతలను సృష్టించెను. తర్వాత శూద్ర వర్ణమును గురించి కవి ఇలా చెప్పాడు.

**" స నైవ వ్యభవత్ స శౌద్రం పర్ణ మసృజత పూషణ మియం వై పూషే యగ్ం హీదగ్ం సర్వం పుష్యతి యదిదం కించ" బృ 1–13**

ఆ పురుషుడు అన్ని పనులు చేయుటకు శక్తుడు కాలేదు. అందువలన అప్పుడు శూద్ర వర్ణమును సృష్టించెను. పురుషుడే శూద్రుడు. అనగా పృథివి అంతయు పూషయని చెప్పబడెను. ఎందుకనగా భూమియే సర్వమును పోషించునదై ఉన్నది.

## 5.7 యత్ర ధూమస్తత్రాగ్ని

ఎక్కడ ధూమమున్నదో అక్కడ అగ్ని ఉంటుందని భావం. ఇది న్యాయశాస్త్రంలో పదార్థనిరూపణ కు ఉదాహరణగా ఉపకరించు వాక్యం. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ప్రియయందు ధూమగతి జెం**

**దు యథావిధి దేంట్లు యత్రధూమస్తత్రా**

**గ్ని యనన్వినుటకు నిచ్చో**

**నె యగంబుల ననల రుచుల నిగిడెం గంటే" రా 1-58**

ఇది అనుమాన ప్రమాణాన్ని నిరూపించునది. పదార్థం కనబడనప్పుడు సూక్ష్మరూపమున ఉన్నపుడు ఈ ప్రమాణాన్ని వినియోగిస్తారు. అంటే ఇక్కడ పదార్థ నిరూపణ అనుమాన ప్రమాణం వల్ల జరుగుతున్నది. పర్వతములయందు అగ్ని కలదని అనుమానం కలుగుతున్నది. దాని వల్ల పర్వతమును చూచునపుడు వహ్నిపదార్థము అను భావం కలుగును. దీన్ని నిరూపించడానికి న్యాయం లో పంచ అవయవాలను వినియోగిస్తారు. ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణం, ఉపనయం, నిగమనం అనేవి పంచావయవాలు. వీటి ద్వార పదార్థనిరూపణ ఇలా చేస్తారు.

**ప్రతిజ్ఞ – పర్వతో వహ్నిమాన్ ( పర్వతము అగ్నిని కలుగుతున్నది)**

**హేతువు – ధూమము ఉండుట వలన**

**ఉదాహరణం – ఎక్కడ ఎక్కడ ధూమమున్నదో అక్కడ అక్కడ అగ్ని ఉంటుంది.**

**ఉపనయవాక్యం – పర్వతమున ధూమముండుట వలన వహ్ని కలదని భావన చేయవలెను.**

**నిగమనం – ధూమం ఉండుట వలన పర్వతము నందు అగ్ని కలదని భావన చేయవలెను.**

**ఈ విధంగా అనుమాన ప్రమాణం నిరూపింపబడినది.**

## 5.8 యోగిచందం

యోగి అంతర్ముఖుడయి తనను తాను తెలుసుకోవడానికి తీవ్ర ప్రయత్నం సాగిస్తాడు. కవి యోగిని చెట్టుతో ఇలా పోల్చాడు.

**" ప్రబలె నీపాదపంబు నీ పాదమాన**

**సాంద్ర సుమనః ప్రసాదంబు సంఘటిల్ల**

**దన్నెరుంగుచు యోగిచందంబు దాల్చె**

**నిది యశోకంబె యగునిందు నిందువదన" రా 1-78**

యోగి తనను తాను తెలుసుకుంటాడని, అశోకం కూడా అట్టిదేయని. అది కూడా తనను తాను తెలుసుకున్నట్టుందని కవి భావం.

## 5.9 ఆత్మవిద్య

బ్రహ్మవిద్యకే మరొక పేరు ఆత్మవిద్య. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఆ సమయంబునందు దమసాపగ దాపసపుత్త్రుడాత్మ వి**

**ద్యాసముదగ్రులైన తలిదండ్రులు దూపిలియుండ వారలన్**

**గాసిలకుండ గుండ నుదకంబుల మంపగ నా ధరావరా**

**గ్రేసరుడేసె నాధ్వని కరిధ్వనియంచు విచారశూన్యుడై" రా 1-36**

పరమాత్మయైన బ్రహ్మమును తెలుసుకోవడమే బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యను ప్రతిపాదించునదే వేదాంతం. కేనోపనిషత్తు ప్రకారం బ్రహ్మవిద్యను ఈశ్వరుడే బ్రహ్మకు ఉపదేశం చేశాడు. వేదాంతం బ్రహ్మవిద్యను గురించి ఇలా చెప్తున్నది.

**" అథాధ్యాత్మంయదేతగ్గచ్ఛతీవచమనోనేనచైతదుపస్మరత్యభీక్ష్ణంసంకల్పః " కే 1-5-30**

అధిదైవితము దేవతలకు సంబంధించిన ఉపదేశమునకు తరువాత దేహాంతర్గత విషయము చెప్పబడుచున్నది. ఈ మనస్సు – అంతఃకరణము బ్రహ్మమును గూర్చి వెళ్ళుచున్నట్లు ధ్యానము చేయవలెను. మరియు మనస్సుతో అతి సమీపముగా బ్రహ్మను స్మరింపవలెను. సంకల్పమును మాటిమాటికి బ్రహ్మచింతనతో ఉంచవలెను. బ్రహ్మను " తద్వనం" అని ధ్యానించాలని కేనోపనిషత్తు చెప్పినిది. ఇలా ధ్యానించడమే ఆత్మవిద్య అనబడుతున్నది.

## 5.10 కర్మసిద్ధాంతం

కర్మ అనగా చేసిన పని. దీని ఫలితం మన జీవితాలలో ప్రతిబింబించడమే కర్మ సిద్ధాంతం. అయితే ఈ కర్మల ఫలితం రాబోయే జన్మలలో కూడ అనుభవించవలసి ఉంటుందని ఈ సిద్ధాంతం చెపుతున్నది. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" కృతపుణ్య పాపఫలములు**

**వితథములై చనునె యనుభవింపక యేలా**

**మతి నాకు వగవ మును మ**

**త్పితృజనులపిపాస మాన్పు పృథుతరకీర్తిన్" రా 1-45**

దశరథుని దృష్టిలో ఉంచుకుని కవి చెప్పిన విషయం ఈ కర్మసిద్ధాంతం. దశరథుడు ముని కుమారుణ్ణి ఏనుగు అనే భ్రమలో అంతమొందించాడు. దాని వల్ల అతని తలిదండ్రులు దశరథుడ్ని శపించారు. అందువల్ల దశరథుడు కూడా శాపానికి గురై మరణించవలిసిన అగత్యం ఏర్పడింది. ఈ సంఘటన కర్మసిద్ధాంతానికి ప్రబలోదాహరణం.

## 5.11 అహింస

అహింస యోగదర్శన సంబంధమైన విషయం. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" భానుకుల ప్రసూతులు కృపాపరులంట యవధ్యహింసకున్**
**బూననిపుణ్యులపంట గుణభూషణులంట యథాపరాధ దం**
**డానుపమానశౌర్యనిధులంట మునిప్రియులంట నేడయో**
**కానక కన్న మాసుతు బొంకారిచి యిన్నియు మిథ్య చేసితే?" రా 2–52**

యమనియమాలలో మొదటిది అహింస. అహింసను పతంజలి ఇలా నిర్వచించాడు.

**" అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" ప 2–35**

అహింసలో నెలకొనియున్నవాని సాన్నిధ్యంలో వైరాలు తొలగుతాయని దీని భావం. యోగులు అహింసను సాధన చేయడం వల్ల తమ చుట్టుపక్కల ఉండే జంతువులు తమ కౄర ప్రవర్తన విడిచి, సక్రమంగా సాధుభావంతో మెలగుతాయి. ఇది అరణ్యాలలో సంచరించే యోగులకు అత్యవసరమైనది.

## 5.12 అగ్ని సంస్కారం

మనిషి పుట్టిన దగ్గర నుండి చనిపోయినంతవరకూ అతనికి పదహారు సంస్కారాలు చేయబడతాయి. వీటిని గురించి ఋగ్వేదం చెప్తున్నది. వీటిలో చివరిది దహనసంస్కారం. దీన్ని గురించి ఇలా చెప్పబడింది.

**" అని పలవరించి విరించి గురించి దూరి దూరి యామ్రేడితోదీరిత నిజ కుమారగుణకథనంబగు పంచత్వంబు నొందినం గనుంగొని మూర్ఛిల్లి లేచి యుల్లంబుదల్లడిల్ల బెల్లు వగల వగచి యథావిధి దదీయాగ్ని సంస్కారవిధులు నిర్వర్తించి" రా 2–54**

ఈ సంస్కారానికే అంత్యేష్టి అని మరొకపేరు. ఒక హిందువు తన జీవితాన్ని వివిధ దశల్లో వివిధ సంస్కారాల ద్వారా పవిత్రం చేసుకున్న తర్వాత మరణానంతరం అతడి వారసులు అతడి ఆత్మకు శాంతి, సద్గతులు కలగాలని కోరుతూ చేసేవి అంతిమ సంస్కారాలు లేదా అంత్యేష్టి. మరణాసన్నమైన వ్యక్తి తన కుటుంబసభ్యులను, బంధువులను, ఆత్మీయులను పిలిపించుకుని కన్నుమూసే ముందు అందరినీ ఒకసారి చివరిసారిగా చూసుకుని, వారికి, ప్రపంచానికి వీడ్కోలు పలుకుతాడు. వారు తృప్తిగా కన్ను మూయడానికి, మరణానంతరం వారు సంతోషంగా ఉండడానికి వీలుగా వారి పేరు మీద, వీలైతే వారి చేతులు మీదగా దానధర్మాలు జరుగుతాయి. వారు జీవితపర్యంతం రగిలించిన

పవిత్రాగ్నిలోకి ఆహుతులు సమర్పిస్తారు. దగ్గరివారు చనిపోతున్న వారి నోటిలో తులసి తీర్థం, గంగాజలం పోస్తారు. శవాన్ని అంత్యక్రియలు జరిగేచోటికి తీసుకెళ్ళడానికి ఏడుకట్లతో ప్రత్యేకంగా తయారుచేసిన పొడవాటి నిర్మాణం చేస్తారు. శవాన్ని దాని మీదకి చేరుస్తారు. జీవితసాగరాన్ని దాటి అవతలికి వెళ్ళేటప్పుడు సహాయకారిగా ఉంటుందనే నమ్మకంతో హిందువులు పవిత్రంగా భావించే గోవును మరణించిన వ్యక్తి తరపున దానంగా ఇస్తారు. దీన్ని " అనుస్తరణి " అంటారు. తర్వాత దహనం, ఉదకకర్మ, ఓదార్పు, అశౌచం, అస్థిసంచయనం, శాంతికర్మ, స్మారకం, శ్రాద్ధం లాంటి కార్యక్రమాలు వరుసగా జరుగుతాయి.

## 5.13 పున్నామనరకం

పుత్రులు లేనివారు పున్నామ నరకాన్ని చేరుతారని వేదం చెప్తున్నది. ఈ విషయాన్ని కవి ఇలా చెప్పాడు.

**" విస్తుల రాజ్య శ్రీలం**
**భూస్తుతి గన నేమిఫల "మపుత్రస్య గతి**
**ర్నాస్తి" యని పలుకుగాదె స**
**మస్తాగమచయము ననుచు మది దలపోయన్" రా 2-63**

పై వాక్యం దేవీభాగవతం నుండి గ్రహించబడినది. దేవీ భాగవతంలో ఈ విషయం ఇలా చెప్పబడింది.

**" అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గే గన్తు పరన్తప**
**యేన కేనాప్యుపాయేన పుత్రస్య జననం చరేత్" దే,, భా 2-6-46**

పుత్రులు కలగడం వల్ల గోత్రాలు నిలబడతాయి. వంశం నిలబడుతుంది. పితరులకు ఉత్తమ గతులు కలుగుతాయని వేదం అభిప్రాయపడుతున్నది

## 5.14 శృతియోగ్యశబ్దములు

**" శృతియోగ్యసంహతు లుచ్చరింతుము**
**వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.**
**మార సంజ్ఞారూఢి ధీర! చూడు**
**మతనుశాస్త్రాయాసగతి యెరిగింతుము**
**మము గటాక్షించు సంయమి వరేణ్య**
**యనురక్తి గూడుమా యాష్టాంగయోగవై**
**ఖరి గాఢముగ జూపగలము ధన్య**

**ప్రౌఢి బరీక్షించు పంచాంగులీన్యాస**

**రచనా విధాన మోయచలహృదయ**

**చదివితిమి పెక్కువిటయోగచర్యలెల్ల**

**దెలియమీ మా ఘనాగమకళల యందు**

**గలుగు భేదంబు లెన్నైన దెలుపగలము**

**మీరహస్యంబు లెరిగింపుమీ మునీంద్ర" రా 3-126**

శృతియోగ్యశబ్దంబులనగా వేదములు. వేదములను ఉచ్చరించగలమని, మతానుశాస్త్రంగా పలకగలమని, అష్టాంగయోగమార్గము తెలిసినవారమని వారకాంతలు ఋష్యశృంగునితో చెపుతున్న సందర్భంలోనిది ఈ పద్యం. యమనియమాసన ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధులనేవి అష్టాంగములు. ఇదియే అష్టాంగయోగము. ఇది తమకు బాగ తెలుసునని జారకాంతలు ఋష్యశృంగునితో చెపుతున్నారు.

## 5.15 ఆసనం – సమాధి

ఈ రెండు యోగదర్శన సంబంధమైన విషయాలు. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఆసనబంధబంధుర సమాధియు నింద్రియనిగ్రహైక వి**

**ద్యాసుముఖత్వమున్ బవనధారణ శక్తియు మాకు నేర్పర**

**దా? సకలంబు మీరతిరహస్యముగా భవదంఘ్రి సేవ వి**

**చ్ఛాసముదగ్రతం బరమసౌఖ్యము గాంచెద మో తపోధన!" రా 2-127**

పతంజలి అభిప్రాయాలే ఇక్కడ తారుమారుగా చెప్పబడ్డాయి. ఆసనం ముందు చెప్పబడింది. ఇది అష్టాంగాలలో మూడవది. తర్వాత సమాధి చెప్పబడింది. ఇది అష్టాంగాలలో ఎనిమిదవది. తర్వాత ప్రాణాయామం చెప్పబడింది. ఇది అష్టాంగాలలో నాల్గవది. పతంజలి ఈ మూడింటినీ ఇలా నిర్వచించాడు.

**ఆసనం – సుఖం స్థిరమాసనమ్ ప 2-46**

**ప్రాణాయామం – తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయోర్గతివిచ్ఛేదః ప్రాణాయామః ప 2-49**

**సమాధి – తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః ప 2-3**

అయితే అష్టాంగయోగము లోని విషయాలను తారు మారుగా చెప్పడం వల్ల జారకాంతల తెలివితక్కువతనం ఇక్కడ అవగతమవుతున్నది.

## 5.16 సంయమం

సంయమం యోగ సంబంధమైన విషయం. ధారణ, ధ్యానము, సమాధి మూడింటిని కలిపి సంయమం అని అంటారు. దీన్ని కవి పలు చోట్ల ఇలా ప్రస్తావించాడు.

**" గురునాజ్ఞ నంత రాఘవు**
**లరిభీకరులనుసరించి రా సంయమి శే**
**ఖరు శమదమములు యోగము**
**నిరుపమ విజయోదయములు నీతింబోలెన్" రా 4-17**

**" ఆనళినాప్త వంశమణి యచ్చట గౌతమ సంయమీంద్రస**
**న్మానము గాంచి యమ్మునిజన ప్రభు వీడ్కొనిపోయి గాధిపు**
**త్రానుగుడై నదీదనగాదులు దాటి జయేందిరావశా**
**లానము జేరవచ్చె మిధిలానగరంబు గరంబు వేడుకన్" రా 4-58**

సంయమం యోగంలో చాల ఉన్నతమైనది. దీనివల్ల అతీంద్రియ శక్తులు సిద్ధిస్తాయని పతింజలి తన యోగసూత్రాలలో చెప్పాడు. ఈ సంయమాన్ని  త్వరపడి సాధించరాదు. ఓర్పుగా సాధించాలి. దీని వల్ల పంచభూతాల్లో ఇంద్రియాల్లో  కలిగే ధర్మపరిణామం, అవస్థా పరిణామం విశదమౌతాయి. పరుల శరీరంలోని లక్షణాలపై సంయమం చేయటం వల్ల వారి చిత్తాన్ని గూర్చిన జ్ఞానం కలుగుతుంది. శరీర రూపంలో సంయమం చేస్తే రూపగ్రాహ్యశక్తి ప్రతిబంధిత మవుతుంది. దానివల్ల నేత్రేంద్రియంలోని ప్రకాశకశక్తి వేరవటం వల్ల యోగి శరీరం అదృశ్యం అవుతుంది. కర్మం సోపక్రమం నిరుపక్రమం అని రెండు రకాలు. వీటిలో సంయమం చేయటం వల్ల మరణం కలుగుతుందని తెలుస్తుంది. మైత్రి, కరుణ మొదలైన గుణాల్లో సంయమం చేస్తే ఆ గుణాలు వృద్ధి పొందుతాయి. ఏనుగు సింహం మొదలైనవాటి బలంలో సంయమం చేస్తే ఆ బలాలు యోగికి కలుగుతాయి. దివ్యజ్యోతి మీద సంయమం చేస్తే సూక్ష్మాలైన, ప్రతిబంధితాలైన, అతిదూరస్థాలైన వస్తువుల జ్ఞానం కలుగుతుంది. సూర్యునిలో సంయమం చేస్తే లోకాల జ్ఞానం కలుగుతుంది. చంద్రునిలో సంయమం చేస్తే నక్షత్ర సమూహ జ్ఞానం కలుగుతుంది. ధ్రువునిలో సంయమం చేస్తే గ్రహనక్షత్రాల సంచారజ్ఞానం కలుగుతుంది. నాభిచక్రంలో సంయమం చేస్తే శరీర పరిస్థితి జ్ఞానం కలుగుతుంది. కంఠం లోపలి భాగంలో సంయమం చేస్తే ఆకలిదప్పులు నివారణమౌతాయి. కూర్మనాడిలో సంయమం చేస్తే శరీరస్థైరం సాధన సమయంలో నశించదు. శిరస్సు నుండి వెలువడే తేజస్సులో సంయమం చేస్తే సిద్ధపురుషదర్శనం కలుగుతుంది.  దీనివల్ల కలిగే ప్రతిభాశక్తితో

సమస్తజ్ఞానం యోగికి కలుగుతుంది. హృదయంలో సంయమం చేయడం వల్ల మనస్సుల గూర్చి జ్ఞానం కలుగుతుంది. శ్రోత్రానికి, ఆకాశానికి గల సంబంధంలో సంయమం చేస్తే దివ్య శ్రవణశక్తి అలవడుతుంది. శరీరాకాశాల సంబంధంలో సంయమం చేస్తే శరీరం పత్తిలా తేలికయై యోగి ఆకాశంలో సంచరిస్తాడు. శరీరం వెలుపల మహావిదేహమనే యథార్థ చిత్తవృత్తిలో సంయమం చేస్తే ప్రకాశ ఆవరణం తొలగిపోతుంది. స్థూలస్వరూపాలు మొదలుకొని సూక్ష్మతన్మాత్రల వరకూ ఉన్న భూతాల్లో సంయమం చేస్తే పంచభూతాల జయం కలుగుతుంది. దానివల్ల అణిమాది అష్టసిద్ధులు, శరీర సంబంధ సంపదలు దేహరూపాదులకు వినాశనం లేకుండటం కలుగుతాయి. ఆత్మానుభవం అనే ఇంద్రియ ప్రయోజనం లో సంయమం చేస్తే ఇంద్రియజయం కలుగుతుంది. సత్త్వం పురుషుడు వేరు వేరు అనే జ్ఞానం మీద సంయమం చేస్తే సర్వశక్తిత్వం, సర్వేంగితజ్ఞత్వం కలుగుతాయి. క్షణంలో దాని ముందటి క్షణంలో సంయమం చేస్తే వివేకజనిత జ్ఞానం కలుగుతుంది. జాతి, లక్షణ దేశాలతో విభజన కాని సమానంగా ఉండే వస్తువులు సైతం వేరు వేరు అనే జ్ఞానం పై సంయమం వల్ల కలుగుతుంది. ఇలా వేరు వేరు చోట్ల సంయమం వల్ల వేరు వేరు సిద్ధులు కలుగుతాయి.

## 5.17 యజ్ఞం, హోమాగ్ని

యజ్ఞమును గురించి, హోమం గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" అని కొనియాడి యాత్మ నిలయంబున నొక్కడ మౌని నుంచి మం**
**తనమునబుత్త్రకామసవన క్రియకున్ దగుయత్నముల్ ప్రధా**
**నున కట దెల్పి యమ్ముని యనుజ్ఞ నయజ్ఞుడు యజ్ఞకర్మక**
**ల్పనమతి నమ్మహీపతిలలాముడు పొల్చె మహోత్సవంబున్" రా 3-13**

**" అంత యాగాంతము నను హోమాగ్ని నుండి**
**దివ్యపూరుషు డొకరు దేతెంచి నిలిచి**
**చారుచరు పూర్ణకనకభాజనము దెచ్చి**
**సదయుడై యిచ్చె నాదశస్యందనునకు" రా 3-75**

వేదనిహిత కర్మలయందు హోమము ఆరవది. ప్రతినిత్యముదయమందు స్నానసంధ్యలు, జపములు చేసి హోమం చేయవలెను. అగ్నిహోత్రమందు వహ్యకవ్యాదులు హోమం చేయడం ఇక్కడ ప్రధానం. మూడాశ్రమాలలో ఉండువారికి హోమం చేయటం నిత్యకర్మవిధి. దేవతల గురించి చేయు హోమహవ్యంతో, పితరులను గురించి చేయు హోమం కవ్యముచే స్వాధాకారము జేయబడును.

వషట్కారము యజ్ఞములందుపయోగింతురు. స్వాహాకారాలైదు బ్రహ్మకు నామధేయాలు. అవి స్వాహాకార, స్వధాకార, వషట్కార, ఓంకార, నమస్కారాలు స్వాహాకారాలు. ఉపనయన సంస్కారాలలో, నవగ్రహహోమాలలో, ఔపనయనాగ్నియందు, నిత్యాగ్ని హోమం యందు స్వాహాకారాన్ని వినియోగిస్తారు. పైతృకకర్మలకు స్వాధాకారాన్ని వినియోగిస్తారు. శ్రౌతాగ్ని హోత్రమందు వషట్కారమున హోమమగును.

## 5.18 తాపత్రయాలు

అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికములనునవి తాపత్రయాలు. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" నెవ్వ దెరువరి చల్లని నీడమ్రాకు**
**రోగి వెజ్జును బోలె మరుద్గణంబు**
**కోరి తాపత్రయవిదూరకారి శౌరి**
**నాద్యు భవరోగవైద్యు డాయంగ జనిరి" రా 3-32**

ఇందులో మొదటిది మనుష్యునకు అతను చేసిన కర్మల కారణంగా ప్రాప్తమవుతున్నది. రెండవది లోకం వల్ల ప్రాప్తమవుతుంది. మూడవది భగవంతుడి వల్ల వ్యక్తికి లభించే తాపం.

## 5.19 పూర్వజన్మ

మన సంస్కృతి సంప్రదాయాలు పూర్వజన్మను విశ్వసిస్తాయి. వేదం కూడ పూర్వజన్మను పేర్కొన్నది. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" చరువు గైకొని నృపతి యచ్చెరువు నొంది**
**యిది మదీయ తపఃఫలం బిది యఖర్వ**
**పూర్వజన్మకృతాగణ్యపుణ్యసార**
**మౌర నేడిట్లు గోచరంబయ్యెననుచు" రా 3-77**

ప్రస్థానత్రయం లో చివరిదైన, వేదవేదాంత సారమైన భగవద్గీత పూర్వజన్మను గురించి ఇలా చెప్తున్నది.

**" జాతస్య హి ధృవో మృత్యుః**
**ధృవం జన్మ మృతస్య చ**
**తస్మాదపరి హార్యేర్థే**

**న త్వం శోచితుమర్హ సి" భ 2-27**

భగవద్గీతానుసారం మరణించినవాడు మరల తప్పక జన్మిస్తాడు. జన్మించినవాడు తప్పక మరణిస్తాడు. మరణం పాంచభౌతికమైన శరీరమునకే గాని ఆత్మకు కాదు. ఆత్మకు నాశనం లేదు. దాన్ని నీరు తడుపలేదు. అగ్ని కాల్చలేదు.

## 5.20 ఋణత్రయం

వేదమునసరించి మనిషి పుట్టుకతో మూడు ఋణాలు కలిగి ఉన్నాడు. అవి పితృ, దేవత, ఋషి ఋణాలు. వాటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" దైవతమౌనికార్యపరతంత్రుల బుత్రుల గాంచెగాన నా**

**నా విధపుణ్యదానకలనన్ బితృతృప్తివిధాయియై జగ**

**త్పావనుడై ఋణత్రయము బాపుకొనెన్ భశి మేదినీసుధాం**

**ధోవిభుమూర్తి యాదశరథుండు మనోరథసిద్ధి సంధిలన్" రా 3-123**

పుత్రులను కనడం వల్ల పితౄణం తీరుతుంది. యజ్ఞముల ద్వార దేవఋణం తీరుతుంది. ఋషి సంస్కారముల వల్ల ఋషిఋణం తీరుతుంది.

## 5.21 జాతకర్మ, సంస్కారములు

మనిషికి వేదం విధించిన షోడశ సంస్కారములలో జాతకర్మ ఒకటి. దాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" అలఘుల నరుంధతీశా**

**దుల మౌనుల గూర్చి సుతచతుష్టయమునకున్**

**జెలగి యొనరించె నా రా**

**జలలాముడు జాతకర్మసంస్కరణాదుల్" రా 3-126**

బొడ్డుతాడు కోసిన తర్వాత చేసే సంస్కారాలలో ఇది ఒకటి. ఇందులో భాగంగా చేసే తంతులు అనేకం ఉన్నాయి. బలానికి, తెలివికి ప్రతీకలైన నెయ్యి, తేనెలను ఒక సన్నని బంగారు దారంతో శిశువు నోటికందిస్తారు. దీన్ని పిల్లల పట్ల తాము నెరవేర్చవలసిన మొట్టమొదటి బాధ్యతగా వారు భావిస్తారు. దీన్ని మేధాజనన తంతు అంటారు. తర్వాత దీర్ఘాయుస్సును కలిగించే ఋషులను, పితృదేవతలను, అగ్ని సోములను ఆవాహన చేసే మంత్రాలను శిశువు ముందు చదువుతారు. దీన్ని ఆయుష్య అంటారు. ఇలా జాతకర్మలో భాగమైన కర్మలు అనేకం ఉన్నాయి.

## 5.22 వేదాంతవేద్యుడు

వేదాంతమనగా ఉపనిషత్తులు. వేదముల అంతములో ఉండటం వల్ల వీటిని వేదాంతం అంటారు. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" వేదాంతవేద్యు డీవిశ్వంభరాదీశు**

**శుద్ధాంతకాంతల జోలజొక్కె" రా 3-137**

ఉపనిషత్తులు కొన్ని దేవీ సంబంధమైనవి. కొన్ని విష్ణుసంబంధమైనవి. కొన్ని శివ సంబంధమైనవి. అయితే ఇవన్నీ భగవంతుని రూపరహితునిగా భావించాయి. కాబట్టి భగవంతునికి రూపం లేదు, కవి ఉద్దేశ్యం ప్రకారం ఇక్కడ విష్ణుమూర్తియే ప్రస్తావింపబడ్డాడు.

## 5.23 శమదమాలు

యోగి సాధించ వలసిన షట్ సంపత్తులలో శమదమాలు ఒకటి. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" వచ్చి నికట ప్రదేశంబున గొంత ప్రొద్దు నిలిచి కౌశిక మునీంద్రుండమ్మిథిల కధినాయకుండగు జనక భూమండలేశ్వరుని వంశాభిజాత్య సత్య సౌజన్య శమదమాదిగుణకలాపంబు రామ చంద్రునకుం బ్రశంగవశంబున నెరిగింపుచు మరియు నిట్లనియె" రా 4-59**

ఈ షట్ సంపత్తులు యోగి సాధనకు ఎంతగానో ఉపకరిస్తాయి. వీటి వల్ల యోగి భగవంతుని కనుగొనగలుగుతాడు.

## 6. పారిజాతాపహరణం – షడ్దర్శన ప్రభావం

తెలుగు ప్రబంధాలన్నింటికంటే తక్కువ దర్శనప్రభావం కలిగిన ప్రబంధం పారిజాతాపహరణం. ఇందులో వాదోపవాదాలు లేవు. ఋషివర్ణనలు లేవు. ఆమ్నాయ ప్రస్తావన లేదు. ఖండనమండనలు లేవు. కనీసం పెద్దనాదుల వలె చతుర్విధ ఆశ్రమాలను కూడా కవి ఎక్కడ ప్రస్తావన చేయలేదు. ఇలా షడ్దర్శన శూన్యమై ఉన్నది పారిజాతాపహరణం. తిమ్మన తన వర్ణనలన్నీ ఆలంకారికంగా చేసాడు. అన్యాపదేశమన్నమాటే లేదు. కావ్యగమనానికి కథాగమనానికి ఇచ్చిన ప్రాధాన్యత వర్ణనలకివ్వలేదు. కథలో కవి శృంగారమునకు, శృతిశుభగతకు, సౌకుమార్యానికి అగ్రతాంబూలం ఇచ్చాడు. ఉపకథలు లేక ప్రధానకథయే లక్ష్యంగా ఉండడం వల్ల ఈ అభావం ఏర్పడి ఉండవచ్చు. లేదా ఇతరములైన వర్ణనలు చేర్చడం వల్ల తాపీగా, సరదాగా సాగే కథ దెబ్బతింటుందని కవి భావించి ఉండవచ్చు.

## 6.1 విశిష్టాద్వైతం

పెద్దన, రాయలు, రామకృష్ణుడు, సూరన వీరంతా ఒకే కోవకు చెందినవారు. విశిష్టాద్వైత మతస్థాపన వీరి లక్ష్యం. మతావలంబన వీరి ప్రాణం. విశిష్టాద్వైతం వీరి కావ్యాలకు ఆత్మ. ఆందుకే వీరందరూ లక్ష్మీ సమేత నారాయణుని వర్ణనతో కావ్యాన్ని ఆరంభించారు. తిమ్మన కూడ ఇందుకు అతీతుడు కాడు. అతను కూడా శ్రీమన్నారాయణుని వర్ణన ఇలా చేశాడు.

**" శ్రీమదికిం బ్రియంబెసగ జేర్చినయయ్యెలలీల వైజయం**
**తీమిళితాచ్ఛ కౌస్తుభము నిద్దపుగాంతి దనర్చి యాత్మవ**
**క్షోమణి వేది బొల్పెసగ జూడ్కులపండువు సేయ వేంకట**
**స్వామి కృతార్థు జేయు నరలక్ష్మితినాథునికృష్ణరాయని " పా 1-1**

తర్వాత గరుడ విశ్వక్షేణాదులను, పంచాయుధములను వర్ణించాడు. ప్రార్థన లో మాత్రమే గాక కథలో కూడ అనేక మంది విష్ణునుయాయులను వర్ణించాడు.

## 6.2 మాయ

వేదాంతం ఈ ప్రపంచాన్ని మాయగా భావించింది. మాయను కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఏయే వేళల నే సరోజముఖి యేయేలీలలం గోరు దా**
**నాయావేళల నాసరోజముఖి నాయాలీలలం దేల్చి యే**

**చాయం జూచిన దానయై మెలగుచు నౌఖ్యాబ్ధినోలారు భో**

**గాయత్తుండయి పెక్కు రూపముల మాయాకల్పనాచాతురి" పా 1-40**

వివేకచూడామణి లో మాయను గురించి ఇలా చెప్పబడింది.

**"శ్లోకార్ధేన ప్రవక్ష్యామి**

**యదుక్తం జ్ఞానికోటిభిః**

**బ్రహ్మసత్యం జగన్మిథ్య**

**జీవో బ్రహ్మైవ న అపరః" వి, చూ, -20**

ఈ ప్రపంచమంతయు మాయామయమని, బ్రహ్మమే సత్యమని పై శ్లోకమున చెప్పబడింది.

## ప్రణవం

ప్రణవమనగా ఓంకారము. ఉపనిషత్తులు ఓంకార ప్రాముఖ్యతను పలు రకాలుగా చెప్పాయి. ఓంకారమును కవి ఇలా ప్రస్తావించాడు.

**" సరిగమపధనిస సంజ్ఞస్వరంబుల**

**మహతి నభోవాయునిహతి మొరయ**

**భాగీరథీపయఃపరిపూర్ణ మణికమం**

**డలువు హస్తంబున జెలువు మిగులఁ**

**బ్రణవమంత్రావృత్తి పావనస్ఫటికాక్ష**

**వలయంబు కర్ణశష్కులిక వ్రేల**

**సమర నృత్యోచిత చమతవాలంబున**

**గక్షపాలయు భుజాగ్రమున మెరయ**

**దేహకాంతులకాలచంద్రికల నీన**

**జడలు మోక్షద్రుపల్ల వశంక సేయ**

**గగనముననుండి వచ్చె నాకస్మికముగ**

**నారివేరంపుదపసి దైత్యారికడకు" పా 1-44**

ఓంకారమంత్ర ప్రాధాన్యము తైత్తరీయోపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**" యశ్చన్దసామృషభోవిశ్వరూపఃఛన్దోభ్యోధ్యమృతాత్సంబభూవ! సమేన్ద్రో మేధయాస్పృణోతు! అమృతస్య దేవధారణో భూయాసమ్! శరీరం మే విచర్షణమ్! " తై 4-1**

మేధాకామునకు శ్రీకామునకు మేధయు సంపదయు పొందుటకు సాధనములైన జపహోమములు చెప్పబడుచున్నవి. అమృతస్వరూపమగు వేదముల వలన పుట్టి వేదములతో శ్రేష్టమైన సర్వస్వరూపమగు ఓ ప్రణవమా! నన్ను స్పృశించుము అని దీని భావం.

## 6.3 సంయమం

పతంజలి ధారణ, ధ్యాన, సమాధులు మూడింటిని కలిపి సంయమంగా చెప్పాడు. సంయమమును కవి ఇలా ప్రస్తావించాడు.

**" సంతసంబున వచ్చి ఆ సంయమీంద్రు"  పా 2-22**

**" అని వినయంబుతోడ గలహాశన సంయమి" పా 2-29**

ఈ సంయమము అనేక సిద్ధులకు మూలము. వేరు వేరు ప్రదేశాలలో సంయమం చేయడం వల్ల అనేక సిద్ధులు కలుగుతాయని పతంజలి విభూతి పాదంలో వివరించారు.

## 6.4 జగత్రయం

కవి జగత్రయమును ఇలా ప్రస్తావించాడు.

**" అడిగినయంతలోన సరసాన్నముల న్సమకూర్చు నాకట**
**న్నడలిక జెందనీక యశుభంబు లడంచు జగత్త్రయంబునం" పా 1-62**

ముల్లోకాల గురించి బృహదారణ్యకోపనిషత్తులో ఇలా చెప్పబడింది,

**" త్రయోలోకో ఏత ఏవ వాగేవాయం లోకో**
**మనోన్తరిక్షలోకఃప్రాణోసౌలోకః" బృ 1-4**

భూలోకము, భువర్లోకము, సువర్లోకము అనునవి త్రిలోకాలు. వీటినే మనం స్వర్గము, నరకం భూలోకం అని అంటాము. ఈ మూడు వాక్కునకు, మనసునకు, ప్రాణమునకు ఆధారమని కవి చెప్తున్నాడు.

## 6.5 పూర్వజన్మ

పూర్వజన్మను ఆర్షధర్మమంగీకరిస్తుంది. కవి పూర్వజన్మను ఇలా ప్రస్తావించాడు.

**" కలకాల మొక్క గతి బూ**
**సలలో దారంబు మాడ్కి సతిమదిలోన**

**మెలగెడు పురుహులు గలుగుట**

**గొలిజన్మమునోముఫలముతో యజనేత్రా" పా 1-66**

భారతీయ సంప్రదాయం ప్రకారం దేహము మనము కాదు. దేహమునందు కనబడకుండా ఆత్మ అను పదార్థముండును. ఆత్మ శాస్వతమయినది. దానికి చావు లేదు. దేహమునకు మాత్రమే చావు పుట్టుకలుంటాయి. ఆత్మ శరీరము నశించిన పిమ్మట వేరొక శరీరాన్ని చేరుతుంది. పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాల ఆధారంగా కొత్తజన్మ జీవునకు లభ్యం అవుతున్నది. కనుక మరణమునకు వెరవవలసిన అవసరం లేదని తత్త్వశాస్త్రము బోధిస్తున్నది.

## 6.6 స్వర్గలోకం

స్వర్గలోకమును తిమ్మన మూడు పద్యాలలో వర్ణించాడు. ఈ పద్యాలలో ఒకటి ఉపనిషద్విషయముతో సరిపోలుతున్నది

**" మరలక జన్యభూమి నణుమాత్ర భయంబును లేనివీరుల**

**ధ్వరము లనేకము ల్విధియుతంబుగ జేసిన భూసురేంద్ర లు**

**ద్ధురభవపాశబంధముల ద్రుంచిన యోగికులావతంశు లీ**

**సురపురకామినీవదనచుంబన మాత్రకృతార్థమానముల్ " పా 1-99**

స్వర్గలోక సుఖములు పైన వర్ణితములు. యజ్ఞాదుల వలన స్వర్గలోకం ప్రాప్తమగునని కవి అభిప్రాయం. దీన్నే కఠోపనిషత్తులో ఇలా చెప్పారు.

**" స్వర్గేలోకే నభయం కించనాస్తి నతత్ర త్వం నజరయా భిభేతి!**

**ఉభేతీర్త్వాశనాయా పిపాసే శోకాతిగో మోదతే స్వర్గలోకే!"**

జీవుడు ఆకలిదప్పులు, జరామరణములు లేక సమస్త దుఃఖాతీతుడై స్వర్గములో ఆనందించుచున్నాడు. అచట ఎటువంటి భయములేదు. బాహ్యామానసిక శోకములు లేవని దీని భావం.

## 6.7 కామరూపధారులు

యోగులు పరమేశ్వరుని యందు మనస్సునుంచి సాధన చేస్తారు. క్షీరసాగరమథనంలో అమృతం రావడానికి ముందు చంద్రుడు, లక్ష్మి మొదలైన విలువైన వ్యక్తులు లభించినట్లుగా సాధకుడికి మోక్షమునకు ముందు అనేక రకాలైన సిద్ధులు లభిస్తాయి. ఈ సిద్ధులను పొందిన యోగి వాటికి వశవర్తి కారాదని వేదాంతం చెప్తున్నది. ఆ సిద్ధులను విడనాడి, ఎవడైతే ఇంకా ఉన్నతమైన

సాధన కొనసాగిస్తాడో వాడే పరమాత్మను తెలుసుకోవడానికి యోగ్యుడవుతున్నాడు. ఈ సిద్ధులలో కామరూపధారణ ఒకటి. యోగి చనిపోయిన  జంతువు, లేదా మనిషి శరీరం లోనికి ప్రవేశించి ఆ శరీరాన్ని కదిలేలా చేయగలడు. శంకరాచార్యులు ఇలాంటి సిద్ధిని పొందినవారని శంకరచరితము చెపుతున్నది. కామరూపధారణ గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" భీమాకారులు కామరూపధరు లాభీలక్రియాపార గో**

**ద్దాము ల్పుణ్యజనుల్భజింప గుముదస్తంబేరమం బగ్రతో**

**భూమిం బల్లనగట్టి రా నసిరుచిస్ఫూర్తు ల్విజృంభింప సం**

**గ్రామేచ్ఛం బలలాశి యేగె మనుజస్కంధాంతరారూఢుడై "  పా 4-80**

ఈ కామరూప సిద్ధిని పతంజలి తన యోగ సూత్రాలలో ఇలా చెప్పాడు.

**"బంధకారణ శైథిల్యాత్ ప్రచార సంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః" ప 3-39**

బంధకారణం సడలిపోవడం వల్ల, ఇంద్రియాల ద్వార విషయాల్లో ప్రసరించే జ్ఞానం కలిగియుండుట వల్ల యోగి మరొకని శరీరంలో ప్రవేశిస్తాడు. స్వయంగా తాను ఒక శరీరంలో వర్తిస్తున్నా, మరొకని శరీరంలో ప్రవేశించి, అది కదిలేలా చేయగలడు. లేదా ఒక సజీవశరీరంలో ప్రవేశించి, ఆ శరీర మనస్సును, ఇంద్రియాలను నిరోధించి, తాత్కాలికంగా ఆ శరీరం ద్వార వర్తించగలడు. ప్రకృతి పురుష వివేకాన్ని సాధించిన యోగే దీనికి సమర్థుడు. యోగుల ననుసరించి ఆత్మయేకాక, మనస్సు కూడా సర్వగతం కావటం వల్ల ఆతను మరొకని శరీరంలో ప్రవేశించాలనుకుంటే ఆ శరీరంపై సంయమం చేసి దానిలో ప్రవేశిస్తాడు. ఇది యోగికుండే కామరూపధారణ సిద్ధి వల్ల సాధ్యం అవుతున్నది.

## 6.8 వేదములు

కవి వేదముల ప్రస్తావన ఇలా చేశాడు.

**" కోదండ ద్రోణునకును**

**వేదార్థస్థాపన ప్రవీణునకుసమి**

**న్నేదిష్ఠ విమత తరసా**

**స్వాదనవశ తుందపరిమృజ కృపాణునకు" పా 1-29**

పైన కవి రామచంద్రుని స్తుతిస్తున్నాడు. వేదమున చెప్పబడిన నియమములను అనుసరిస్తూ తత్ప్రకారముగ వర్తిస్తూ, వేదార్థమును స్థాపన చేయువానికి నమస్కరిస్తున్నానని కవి భావం. రాముని

జీవితం వేదమయం. అతడు వేదము చెప్పిన విధంగా వర్తిల్లిన ఏకైక పురుషుడు. అందుకే అతడు కవి దృష్టిలో వేదార్థ స్థాపన ప్రవీణుడైనాడు. మరోచోట కవి వేదప్రస్తావన ఇలా చేసాడు.

**" సత్యముగ నిన్ను నిప్పుడు**

**సత్యావతి మాకు నిచ్చె సకలామ్నాయా**

**స్తుత్యా" పా 5-85**

వేదములు భగవంతుని కీర్తించునవి. అతని గుణములు పొగుడునవి. అందుకే కవి భగవంతుని సకలామ్నాయ స్తుత్యా అని సంబోధించాడు.

## 6.9 ఉపనిషత్తులు

ఉపనిషత్తులకు వేదాంతమని పేరు. వేదముల యొక్క అంతములో ఉండటం వల్ల వాటికా నామం కలిగినది. వాటి ప్రస్తావన కవి ఇలా చేసాడు.

**" నిగమాంత ప్రతిపాద్యు నాద్యు నభవు న్నిత్యున్గుణాతీతు వి**

**శ్వగురు జిన్మయు నవ్యయుం బరమ నిశ్శంక బనుల్గొంచు మౌ**

**నిగరిష్ఠుండు కృతార్థు డయ్యె నన సందేహింపగా నేల భ**

**క్తగణాధీసు డనంగ నవ్విభుడు లోక ఖ్యాతి బెంపొందడే. " పా 5-87**

కవి మొట్టమొదటి విశేషణం వేదాంతములచే చెప్పబడువాడు అని వేశాడు. పై విషయమును గూర్చి ఉపనిషత్తులు ఇలా ప్రస్తావిస్తున్నవి.

**" తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి" బృ 1-18**

ఉపనిషత్తులకు మూలమైన పురుషుని అడుగుతున్ననని దీని భావం. ఉపనిషత్తులు ఈ ప్రపంచమునకు ఆద్యుడు పరమాత్మయే అని, అసలు పరమాత్మ ఆద్యాంత రహితుడని చెప్పుచున్నవి. అందుకే కవి ఆద్య అని ప్రయోగించాడు.

**"స దేవసోమ్యేదమగ్ర ఆసీ దేకమే వాద్వితీయం బ్రహ్మ" ఛా 4-6**

**"బ్రహ్మవా ఇదమగ్ర ఆసీత్తదాత్మానమేవావైత్" బృ 8-17**

పై ఉపనిషత్తులు బ్రహ్మనే ఆద్యునిగా చెపుతున్నవి. తర్వాతి విశేషణం అభవు అని చెప్పబడింది. అభవు అనగా పుట్టుక లేనివాడు అని అర్థం.

**" సవా ఏష మహానజ ఆత్మాజరో నురో మృతో భయో బ్రహ్మాభయంవై" బృ 5-8**

**" అజోనిత్యశ్శాశ్వతోయం పురాణః " భ 5-7**

తర్వాత కవి నిత్య అని ప్రయోగించాడు. భగవంతుని నిత్యత్వం శ్వేతకేతోపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**" నిత్యోనిత్యానాం చేతన శ్చేతనానా**

**మేకో నిత్యానాం యో విదధాతి కామా**

**తత్కారణం సాంఖ్యయోగాధిగమ్యం**

**జ్ఞాత్వాదేవం ముచ్యతే సర్వపాపైః" శ్వే 6-5**

పై పద్యం భగవంతుని నిత్యునిగా చెప్తున్నది. తర్వాత కవి భగవంతుని గుణాతీతునిగా చెప్తున్నాడు. భగవంతుని గుణాతీతునిగా శ్వేతకేతోపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**"ఏకో దేవ స్సర్వభూతేషు గూఢ స్సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా**

**కర్మాధ్యక్ష స్సర్వభూతాధివాస స్సాక్షీచేతా కేవలో నిర్గుణశ్చ" శ్వే 3-7**

ఒక దేవుడే సర్వభూతాలలో గూఢంగా, వ్యాప్తమై, సర్వభూతాత్మగా ఉన్నాడని దీని భావం. తర్వాత కవి భగవంతుని విశ్వగురువని, చిన్మయుడని, అవ్యయుడని చెప్పాడు. ఈ మాటలు కూడ ఉపనిషద్వాక్యాలతో ఏకీభవిస్తాయి. ఇలా పారిజాతాపహరణం పై పూర్వోత్తరమీమాంసల ప్రభావం ఎక్కువగాను, మిగిలిన దర్శనాల ప్రభావం తక్కువగాను ఉన్నది. మిగిలిన ప్రబంధాలన్నింటితో పోల్చుకుంటే పారిజాతాపహరణంపై దర్శనప్రభావం చాల తక్కువగా ఉన్నది.

# 7. ఆముక్తమాల్యద – షడ్దర్శన ప్రభావం

కృష్ణదేవరాయలు శుద్ధవైష్ణవుడు. ఆముక్తమాల్యద రచనకు తను పూనుకోవడానికిగల ప్రధాన కారణాలలో ఒకటి స్వమతప్రచారం. రాయలు విశిష్టాద్వైతవాది. విశిష్టాద్వైతులు కేవల నారాయణుని అంగీకరంచరు. వీరికి ఆరాధ్యుడైన నారాయణుడు లక్ష్మీసమేతుడయి ఉంటాడు. విశిష్టాద్వైతవాదాన్ని కొంత తెలుసుకుంటే గాని రాయలవారి వర్ణనలు అవగతం కావు. ఈ మతం ప్రకారం జీవుడు భగవంతునికి శరీరం. జీవునకు ప్రకృతి శరీరం. రెంటికి ఆత్మ శ్రీమన్నారాయణుడు. ఇది శరీరాత్మ సంబంధము. ఆత్మ లేనిదే శరీరం లేదు. ఈ రెండు పరమేశ్వరుడి నుండి వేరుపడవు. ఇందు ద్రవ్యము జడము, అజడము అని రెండు విధములు. ఈ మతం ప్రకారం నారాయణుడు మాత్రమే కాక అతని అనుయాయులైన అనంతగరుడవిశ్వక్షేణాదులు నిత్యులు. వీరికి సంసారబంధము లేదు. వీరు పరిశుద్ధులు. భగవదనుగ్రహము పొందినవారు. భగవంతునివలె సర్వశక్తి సంపన్నులు. నిరంతరము భగవంతునికి కైంకర్యం చేస్తూ ఉంటారు. భగవంతునివలెనే వీరికి అవతారములుండవచ్చును. వీరు గాక ముక్తులని చెప్పబడువారు వేరుగా ఉన్నారు. వీరు నిరంతరము భగవన్నామ సంకీర్తన చేస్తూ, నిత్యనైమిత్తిక కర్మలను ఆచరిస్తూ ఉంటారు. మిగిలినవారు బద్ధులు. వీరు దేహాత్మభ్రాంతిలో మనిగి తేలుతుంటారు. వీరికి పరమేశ్వరబావన ఉండదు. విశిష్టాద్వైతం ప్రకారం ఈశ్వరుడు నియంత. శేషి. సర్వశక్తిసంపన్నుడు. సర్వకార్యములకు ప్రధానహేతువు. ఫలప్రదాత. చిదచిత్తులు ఈశ్వరునిచే నియమింపబడినవి. ప్రళయకాలంలో నాశనమైన విశ్వమును మరల పుట్టించేవాడు ఇతడే. అయితే విశిష్టాద్వైతం రెండు సంప్రదాయాల కూడలి. అవి శ్రీ వైష్ణవము. వేదోపనిషన్మార్గము. ఈ రెండింటి కలయికే విశిష్టాద్వైతం.

## 7.1 సమన్వయం

ఈ కావ్యంలోని ప్రతి విషయము మతపరంగా సమన్వయం అవుతుంది. ఉదాహరణకు మనుచరిత్ర లో స్వారోచి తపఃఫలంగా సాక్షాత్కరించిన నారాయణుని వర్ణించు పద్యం ఒకటున్నది.

**“ నీలిమేఘముడాలు డీలు సేయుగజాలు**

**మెరుగు జామనచాయ మేనితోడ” ఆ 1–5**

ఈ పద్యమునే రాయలు తనకు స్వప్నమున దర్శనమిచ్చిన తెలుగురాయని వర్ణించుటకు స్వీకరించి ఎత్తుగీతి మార్చెను.

**"తమ్మి కేలుండ బెర కేల దండయిచ్చు**

**లేములుడిపెడి లే జూపు లేమతోడ" ఆ 1–18**

భగవంతుడు దర్శణం ఇచ్చినట్లుగా వర్ణించాడు. పెద్దనగారి పద్యమంతా గ్రహించి ఎత్తుగీతి మార్చడంలో అర్థమేమిటంటే శ్రీవైష్ణవుల దృష్టిలో నారాయణుడు శ్రీమన్నారాయణుడు. ఆయన శ్రీ లేక లేడు. ఆయనను విడిచి శ్రీ లేదు. దీన్నే సశ్రీకవాదము అనే పేరుతో పిలుస్తారు. నారాయణుని పంచకమంతా అతడు శ్రీమన్నారాయణుడే. ఈ మతమున నారాయణుడు దక్క మిగిలినవారంత జీవులే. ఇదే విషయాన్ని కవి క్రింది పద్యంద్వారా చెప్తున్నాడు.

**"వనజజరుద్రాదులు మ**

**త్తనువుల తత్పూజనంబు తథ్యము మత్పూ**

**జనము తపీప్సితఫలదా**

**తను నేనట్లైనగలవు తరతమవృత్తుల్"     ఆ.4–5**

బ్రహ్మ నుండి తృణము వరకు సర్వులును జీవులే. బ్రహ్మాఫాలము నుండి పుట్టినవాడు రుద్రుడు. అతడును జీవకోటిలోనివాడే. నారాయణునకు శరీరము, ఆత్మ వేరుగా లేవు. అతడే శరీరము. శరీరి. ఆత్మ. అన్ని జీవులయందలి ఇతర క్రియలను నిర్వర్తించునది నారాయణుడే. కావ్యంలో ఇష్టదేవతా స్తుతి అనే ఒక సంప్రదాయమున్నది. రాయలు దీన్ని భిన్నమైన పద్ధతిలో చేసాడు. ఈ స్తుతిలో మొదట శ్రీమన్నారాయణుని కీర్తించి తర్వాత భూదేవి సమేత నారాయణుని తర్వాత ఆదిశేషుని, గరుడుని, విశ్వక్షేణుని, పాంచజన్యమును, నందకాన్ని, కౌమోదకిని, సుదర్శనమును పన్నిద్దరాళ్వార్లను స్తుతించాడు. ఈ వర్ణన వైష్ణవమత సంప్రదాయమైన నిత్యులు, ముక్తులు, బద్ధులు అను దానికి ప్రబల ఉదాహరణ. ఇది శ్రీవైష్ణవసిద్ధాంతం. స్తోత్రరత్నంలో యామునాచార్యులు కూడా ఫణిరాజు ఖగరాజులనె వర్ణించాడు. తర్వాత విశ్వక్షేణుని పిదప నిత్యసూరులను వర్ణించాడు. ఈ క్రమాన్నే రాయలు కూడా అనుసరించాడు. విశ్వక్షేణుని తర్వాత పంచాయుధ వర్ణన చేసాడు. ఇవి కూడా జీవకోటి లోనివే. నిత్యసూరుల తెగలోనివే. నిత్యసూరులకు నారాయణునకు బేధము లేదు. వీరికి

సృష్ట్యాదులందు ప్రమేయం లేదు. వారికి కూడా స్వయం ప్రతిపత్తిలేదు. వైష్ణవమతం ప్రకారం జీవులకు కరణకర్తృత్వం లేదు. అందుకే కావ్య సృష్టికి ప్రేరణ నారాయణుడి నుండి లభించినట్లుగా కవి వర్ణించాడు. ఇతరకవులందరూ ఏదో ఒక కావ్యం రాయాలనే ఉద్దేశ్యంతో నిద్రపోగా వారికి భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. కాని రాయలవారికి అలా కాదు. సంకల్పం కూడా భగవంతుడిదే. తనది కాదు. విశిష్టాద్వైతమున నిత్యవిభూతి, లీలావిభూతి అను రెండు సిద్ధాంతములు కలవు. నిత్యవిభూతి భగవంతుడు. లీలావిభూతి జీవుడు. నిత్యవిభూతి యందు లీలావిభూతి సూక్ష్మావస్థలో ఉంటుంది. దీన్ని బట్టి నాయకుడు కూడా జీవుడే. అతడు భగవంతుని సంకల్పం ప్రకారమే నడుస్తాడు. నిజానికి కావ్యంలో ప్రధాన నాయకుడు మన్నారు స్వామి. అర్చామూర్తి. అతని కదలికయే కావ్యం. విష్ణుచిత్తాదులు కేవల జీవులు మాత్రమె. మన్నారుస్వామియే నాయకుడు కనుక అతడే విష్ణుచిత్తుని పాండీ సభకి పంపించినాడు. బద్ధజీవులని చెప్పబడిన మొదటి రెండవ పాండ్య చక్రవర్తులు, రాక్షసుడు కావ్యంలో ఉద్ధరింపబడినారు. ఈ విధంగా బద్ధజీవులు ముక్తుల వలన ఉద్ధరింపబడతారని చెప్పడమే కావ్యసారం. భగవంతుని కృపామూర్తిగా చూడటంలో శ్రీవైష్ణవులు ముందుంటారు. ప్రళయం, మరణం కూడా భగవంతుని కృపే అని వారి ప్రగాడ విశ్వాసం. ఈ కావ్యంలో విష్ణుచిత్తాదులు ముక్తులు. ప్రథమ పాండ్యుడు ద్వితీయ పాండ్యుడు, దానవుడు బద్ధులు. వీరు బభుక్షులు మముక్షులు అని రెండు రకాలు. మముక్షులలో దేవతాంతరపరులు, భగవత్పరులని రెండు బేధములు. ఈ భగవత్పరులలో ఆప్తులు మొదలైనవారున్నారు. ప్రథమ పాండ్యరాజుని మముక్షువుగా పరిగణించవచ్చును.

**"అపవర్గదుడే వేల్పెరగి వాని భజింతన్"  ఆ 2-82**

అని ఆ రాజనడంలో అతని మోక్షేచ్ఛ అవగతం అవుతున్నది. అందువల్ల కృపామూర్తి అయన భగవంతడు విష్ణుచిత్తుని రూపంలో వచ్చి మోక్షమను గూర్చి వివరించాడు. రెండవ పాండ్యుడు దేవతాంతపరుడు. "ముకుందుడి కంటే అన్యదేవతల యందు భక్తి కలవాడు" దేవతాంత పరుడని చెప్పబడతాడు. యామునాచార్యుడు వెళ్లి అతనిని వైష్ణవునిగా చేసాడు. రాక్షసుడు భ్రష్టైశ్వర్యకామి. అతడు తను కోల్పోయిన బ్రాహ్మణజన్మను తిరిగి అర్థించాడు. భగవంతుడు అది మాత్రమే కాక భాగవతసంపద కూడా అనుగ్రహించాడు. మొదటిరాజు మోక్షాన్ని పొందాడు. రెండోరాజు, రాక్షసుడు భాగవతులయ్యారు. వైష్ణవం భక్తి కంటే ప్రపత్తినే ఎక్కువ చేసి చెప్పింది. భక్తి అనగా అష్టాంగయోగమార్గము తెలిసి భగవద్భావన అవిశ్రాంతంగా కలిగి ఉండడం. ప్రపన్నులు సర్వాత్మ

నారాయణునికి తనను తాను అర్పించుకున్నవారు. భక్తులు భగవత్ప్రీతి కలవారు. ప్రపన్నులు భగవంతుని నిరంతరం పూజించేవారు. గోదాదేవి ప్రపన్నురాలు. భగవంతుని కైంకర్యమే గొప్పదనే విధంగా ఆమె ప్రపన్నత కొనసాగింది. ఆమె చేసే ధనుర్మాసపు నోము భక్తి కాదు. భగవత్కైంకర్యం. ఆమె తండ్రి ప్రపన్నభక్తిలో శిరోమణి. ఆమె కూడా అంతే. రాయలవారి ప్రకృతి వర్ణనలలో కూడా విశిష్టాద్వైతం దాగి ఉంది. రాయల వారి ప్రకారం ప్రకృతి కేవలం మిథ్య కాదు. దానికి కూడా ప్రాధాన్యత ఉన్నది. వైష్ణవం వాసుదేవుని ఎంత సర్వాంగ సుందరంగా దర్శిస్తుందో ఆతని సృష్టియైన ప్రకృతిని కూడా అంతే సుందరంగా దర్శిస్తుంది. ప్రకృతి భగవంతుని చేత నిర్మితం కాబట్టి దానిలో కూడా భగవంతుడు దాగి ఉన్నాడని వారు భావిస్తారు. ఆముక్తమాల్యద ప్రకృతి వర్ణణలకు ఆటపట్టు. మొత్తం ప్రబంధంలో తొమ్మిది వందలు పద్యాలుండగా వాటిలో నాల్గవ భాగం ప్రకృతి వర్ణనలే ఉన్నాయి. దీనికి గల కారణం వైష్ణవం ప్రకృతిని అంగీకరించడం. విశిష్టాద్వైతం ప్రకారం ప్రకృతి గమనానికి సాధనం కాలం. కాలమే షడ్రుతువుల రూపంలో ఉన్నది. షడ్రుతువుల వర్ణన అనగా ప్రకృతి వర్ణనే. విలిపుత్తూరు వర్ణనలను కూడా మనం ప్రకృతి వర్ణనలగానే భావించాలి. ఆ నగర పరిసర ప్రాంతాలు, చేలు, తోటలు, దిగుడుబావులు, చెరువులు, బాతులు, హంసలు, ఒకటేమిటి అన్నీ మధురాతిమధుర భావనలు నింపుతాయి. ప్రకృతి అంటే గడ్డి మొదలుకొని బ్రహ్మ పర్యంతము వ్యాపించి ఉన్నది. పంచభూతములు, తన్మాత్రలు అన్ని ప్రకృతిలోనివే. రాయలవారి వర్ణనల్లో ఆకాశము, జలము, నదులు, ఇత్యాది పంచభూతాలు వర్ణితమయ్యాయి. జంగమ స్థావరాలు కూడా వర్ణింపబడ్డాయి. ఈ ప్రకృతికి యింత అందం స్వామి నుండే వచ్చినదని, ప్రకృతిలోని ప్రతి ద్రవ్యం పరమేశ్వర సౌందర్యానికి ప్రతిరూపమె అని వైష్ణవుల భావన.

**"యోగనిద్రనుండి స్వామి మేల్కాంచి భూమిపై కాలుమోపెను**

**భార్య పుల్కరించెను, ఆ పుల్కలే పరుషకంటక శాలిమంజరులు" ఆ 4-139**

**"వండు పులు పైదేలగా కంకణంపు మోతలతో పర్వెత్తు**

**వార్షుక స్రవంతులు ఉరుములు మ్రోతకై భీతిజెందిన భూదేవి నిద్రించు**

**పతిశరీరమును కౌగలొంచుటకై సాచి హస్తము " ఆ 4-101**

"సాంద్ర మకరంద దృష్టి రసాతలంబు

దొరగు పువ్వుల భువియు బూధూళి నభము

నీక్రమత్రయీ మాధవు డాక్రమించె

నురువిరోచన జనిత మహోష్మమడగ"   ఆ 5-136

చెరువులు, బాతులు, హంసలు లాంటి సామాన్య వస్తువులను కవితావస్తువులుగా స్వీకరించడానికి గల ప్రధాన కారణం ఇదే. ప్రతి వస్తువు భగవంతుని వరప్రసాదమే అని కవి భావన. ఈ విధంగా ప్రకృతి రాయల వారికి సాక్షాత్కరించింది. సౌందర్యం రెండు రకాలు. బహిరంతర్భేదములతో. కేవల యదార్థవాది భౌతిక సౌందర్యాన్ని మాత్రమె చూస్తాడు. ఇది పాశ్చాత్యుల సంప్రదాయం. అలా కాకుండా సౌందర్యం భగవంతుని ద్వార ఇవ్వబడిందిగా భావించువాడు శుద్ధవైష్ణవుడు. విశిష్టాద్వైతిదృష్టిలో బహిరంతస్సౌందర్యాలు రెండు సత్యాలే. ప్రకృతి జీవులకు భోగస్థానం. పరమేశ్వరుడికి లీలావిభూతి. క్రీడాస్థానం. ప్రకృతి అతడిని సేవించడానికే పుట్టినది. పంచభూతములు, జీవులు అనగా దేవమనుష్యులు తిర్యక్కులు, సర్వము అతడినే సేవిస్తున్నాయి. తెలిసి సేవించుట ముక్తిని కలిగిస్తుంది. తెలియక సౌందర్యాన్ని భౌతికంగా సేవించడం బంధానికి కారణం అవుతుంది. శ్రీవిలిపుత్తూరు వర్ణన అంతా కవి తెలిసి కావాలని చేసినదే. మధురను విలిపుత్తూరును వర్ణించినట్లుగా కవి వర్ణించలేదు. దానికి కారణం భగవంతుని కృపకు మధుర నోచుకోకపోవడమే. విష్ణుచిత్తుని రాకతో మధుర వర్ణనకు నోచుకున్నది. దీనికి కూడా భగవంతుని కృపయే కారణం. ఇది మాత్రమేకాక రాయలు తన రచనలలో ద్రవిడ సంప్రదాయాన్ని ఉంచే ప్రయత్నం విధిగా చేసాడు. అందుకే ద్రవిడ స్త్రీలను, ఆరెకులను అదే పనిగా వర్ణించాడు. ఈ వర్ణనలన్నీ కవి ఆళ్వార్ల పాశురాల నుండే గ్రహించినాడని చెప్పవచ్చును. ఆముక్తమాల్యద అనే నామాన్ని ఈ కావ్యానికి ఉంచడంలో రాయలవారికి ప్రత్యేక ఉద్ధేశ్యమున్నది. ఆముక్తమాల్యద అనగా భూదేవి. భూదేవి అనగా లక్ష్మియే. వారిరువురికి అబేధము. కావ్యమెప్పుడు లక్ష్మిదేవి పేరుతో విలసిల్లిందో అప్పుడు తప్పకుండా భర్త శ్రీమన్నారాయణుడు అయి తీరుతాడు. భగవంతుడు తన కావ్యానికి కృతిపతి కావాలనే ఉద్దేశ్యంతోనే కవి తన కావ్యానికి ఆముక్తమాల్యద అనే నామకరణం చేసాడు.

## 7.2 విశిష్టాద్వైతం వడగలై – తెంగలై శాఖలు

శ్రీరామనుజులు గతించిన తర్వాత విశిష్టాద్వైతం వడగలై – తెంగలై శాఖలుగా విడిపోయింది. రాయలు ఈ రెండు శాఖలు విడువడిన తర్వాత వచ్చినవాడు. అతను ఏ శాఖకు చెందిన వ్యక్తి అని పలువురి సందేహం. ఈ రెండు శాఖలకు కొన్ని ప్రధాన బేధములున్నవి. స్వామి కృపయే మోక్షాన్ని ప్రసాదిస్తుందని తెంగళుల వాదన. కాదు భక్త్యాదులే హేతువులని వడగళుల అబిమతం. శ్రీదేవి కూడా జీవులన్నింటి వలె సామాన్యురాలని దీని బావన. ఆ తల్లి అన్నిట స్వామి వంటిదే అని వడగళుల భావన. ఇద్దరు కలిసి ఒకటే తత్వమని వడగళులనుకుంటారు. అయితే రాయలు స్వామిది సహేతుక కృపయే అని నిరూపించే ప్రయత్నం చేశాడు. మొదటి పాండ్యరాజు విరక్తుడైన తర్వాతగాని స్వామి చిత్తుడిని ఆదేశించలేదు. ఇక్కడ స్వామి కృప సహేతుకమని అవగతం చేసుకోవాలి. రెండవ పాండ్యరాజు బాగుపడటానికిగల ప్రధానకారణం అతని పత్ని. రాజధర్మము. మొదటి పాండ్యరాజు ముక్తికోసం విలపించాడు. రెండో పాండ్యరాజు జన్మలో విష్ణునామస్మరణ చేసి ఎరుగడు. రాక్షసుడు దుఃఖార్తుడై విలపించినగాని పోయిన జన్మ లభించలేదు. కాబట్టి భగవత్కృప సహేతుకమేయని అనిపిస్తుంది. మొదటి రాజు భాగవతులలో ప్రధానుడు కాగా మిగిలినవారు కేవల భాగవతులైరి. ఈ బేధము కవి నిరూపించినాడు. కాబట్టి భగవంతుని కృపకు కావలిసిన అర్హత భక్తుడు సంపాదించవలెనని తేలుతున్నది. అయితే కవి వడగళుల మార్గాన్నే అంగీకరించాడని చెప్పవచ్చును. దీనికి అతడు కావ్యారంభంలో చేసిన భగవత్ స్తుతియే సాక్ష్యం. కవి ఈ స్తుతిలో నారాయణ ద్వంద్వమును స్తుతించాడు. ఈ ద్వంద్వమనాది నుండి కొనసాగుతున్నది. ఒకరియందున్న భావనే ఇంకొకరిలోనూ కలదని కవి నిరూపించాడు. ఇది విడదీయుటకు శక్యం కానిదని కవి వర్ణించాడు. అది ఒకే తత్వము. అదే శ్రీ వేంకటేశ్వరతత్వము. అది ఏకత్వమందు ద్వంద్వము. ద్వంద్వమందు ఏకత్వము. ఇది నిజమైన వడగళుల విచారణ.

## 7.3 ఆముక్తమాల్యాద – యోగదర్శన ప్రభావము

ప్రాచీన కవులందరికీ ఈ దర్శనముతో పరిచయమున్నట్లు సర్వులకు విదితము. కాని రాయలవారు ఈ శాస్త్రంలో అపారమైన ప్రతిభ కలిగి ఉన్నారు. ఈ ప్రతిభ మిగిలిన కవులకంటే కాస్త ఎక్కువనే చెప్పాలి. ఖాండిక్య కేశిధ్వజి సంవాదంలో ఈ ప్రతిభ మరింత ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. ఉదాహరణకు

**"ఆ కేశిధ్వజు డంత నా నృపునిరాజ్యం బెల్ల జేర న్ఫలం**

**బాకాక్షింపక గెల్తు మృత్యువు నవిద్య న్భుట్టకుందుం దుదన్**

**జాకుందు న్వడి నంచు యోగనియతిం జ్ఞానాశ్రయుం డై మఖా**

**నీకంబు ల్రచయించు చం దొకటికిం దీక్షించి తా నున్న చోన్" ఆ 3-18**

పై పద్యంలో కవి యోగశాస్త్రసంబంధమైన అవిద్య అనే పదాన్ని ఉటంకించాడు. " వృత్తి సారూప్యమిత్యత్ర " అనే సూత్రం ద్వార పతంజలి అవిద్య గురించి వివరించాడు. యోగమునందు మనసు లేని పురుషుడు ఇతర భౌతికవిషయాలపై మనసును సారిస్తాడు అని దీని అర్థం.

**కంధర నీలవర్ణ! మధు కైటభనాగ సుపర్ణ! యోగి హృ**

**ద్గ్రంథి భిదోత్థ భోగి వనితాస్వనవచ్ఛ్వసన స్రవచ్చిర**

**స్సంధి వసన్నిశాపతీ రసస్రుతీ దుగ్ధపయోధి వీచికా**

**మంధర కెళికాదర! సమాశ్రితపంక్తి శిరోధి సోదరా!**

**5 వ ఆశ్వాసాంతము**

**ష్మంజనియించు అంజ సమాను వాయుగణమంతయు ఖంజిత చిక్కనజ్జవో**

**చిక్కని సమానపు వాయువులో నొకండు గ**

**ల్మింజనియించు దుర్యశము మేల్కని లేహనవేళ వాజు**

**లూర్పంజెడు మాణిబంధముకురంబులు కాళిమ పేర గార్కొనున్**

**ఆ 2-28**

పై పద్యాలలోని యోగశాస్త్ర విషయమగాధము. దుగ్ధాంబోధి మహాగృహోత్సకుడు అనడంలో ఆంతర్యం వేరుగ ఉన్నది. ఈ బ్రహ్మాండంలో ఏదో ఒక చోట పాలసముద్రం ఉండటం నిజమే అయినప్పటికీ అదే క్షీరసముద్రము మనలోనూ ఉన్నదని, ఆ మహావిష్ణువు మనలోనూ వశించుచున్నాడని కవి భావన. ఇక్కడే కవి పిండాండ బ్రహ్మాండములకు అబేధము చెప్తున్నాడు.

కుండలిని అనబడే శక్తి యోగి హృదయగ్రంథులను బేధించి బుసులు కొడుతుంది. దాని కంపన మూలంగా స్రవిస్తున్నటువంటి చంద్రరసస్రావణమనే క్షీరసముద్రంలో కేళీలోలుడై ఉన్నవాడా! అని దీని అర్థం. ఇది యోగశాస్త్ర విషయం. పద్యంలో చెప్పిన గ్రంథి, కుండలిని, విశాపతి, రసస్రుతి, శిరస్సంధి లాంటి శబ్దాలు యోగశాస్త్ర సాంకేతికపదాలు. యోగశాస్త్రం ప్రకారం మానవ శరీరంలో మూడు గ్రంథులున్నవి. 1.బ్రహ్మగ్రంథి 2. విష్ణుగ్రంథి 3.రుద్రగ్రంథి అలాగే శరీరంలో ఆజ్ఞ, విశుద్ధ, అనాహత, మణిపూర, స్వాధిష్టాన, మూలాధార అనబడే ఆరు చక్రములున్నవి. ప్రతి రెండు చక్రములకు ఒక గ్రంథి విభక్తమై ఉన్నది. మూలాధార స్వాధిష్టానముల మధ్య బ్రహ్మగ్రంథి,

మణిపూర, అనాహత, విశుద్ధములకు మధ్య విష్ణుగ్రంథి, ఆజ్ఞ చక్రమునకు పైన రుద్రగ్రంథి కలవు. ఈ మూడు గ్రంధులలో మొదటిది అన్నమయ కోశము, రెండవది ప్రాణమయ కోశము, మూడవది మనోమయ కోశము. ఈ విధంగా ఈ గ్రంధులు త్రివిధ జీవాకృతులై స్థూల సూక్ష్మ కారణ శరీర మూర్తులై ఉన్నవి. ఈ గ్రంధులు, చక్రములు బేధింపబడినపుడే భగవంతుడు దర్శనమిస్తాడు. ఈ బేధనకు యోగమే శరణ్యం. యోగానుష్టానము వలన మనలో నిద్రావస్థలో ఉన్న కుండలినీ శక్తి జాగృదావస్థకు చేరుకుని షట్చక్రములను, గ్రంథిత్రయమును బేధించి సహస్రారంలోని చంద్రకళామృతాన్ని శ్రవింపచేస్తుంది. సహస్రారమందలి చంద్రకళామృతమే సుధాసింధువు. ఇది స్రవించడం వలననే మోక్షం కలుగును. దీనినే ఆదిశంకరులు సుధాసింధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే అని దేవీ స్థానంగా కీర్తించారు. మరోచోట రాయలవారు పరుగిడుతున్న గుఱ్ఱాలను వర్ణిస్తూ ఇలా అన్నారు

**" మధురానగరమందలి యశ్వము లొక్క యంగలోనే సమానవాయుగణమును జయించెను. సమానమను పేరు గల వాయువొక్కటి మాత్రము జితము కాక కడుపులోనే చిక్కెను. దానివల్ల గుఱ్ఱాలకపయశస్సు కలిగినది. " ఆ 1-45**

ఈ వచనంలో సమాన వాయుగణమన్న మాట ఉన్నది. ఈ వాయువులు యోగశాస్త్ర ప్రసిద్ధములు. యోగశాస్త్రం ప్రకారం మానవ శరీరంలో 5 ముఖ్యవాయువులు, 5 ఉపవాయువులు ఉంటాయి. అవి నాగ, కూర్మ, కృకర, ధనంజయ, దేవదత్తములు. ఇవి శరీరంలోని పలుస్థానాల్లో నివాసముంటాయి. ప్రాణవాయువు హృదయంలోనూ, అపానవాయువు గుదస్థానమందు, వ్యానవాయువు మూపులయందు, ఉదానవాయువు పాదహస్తములయందు, సమానవాయువు సర్వశరీరమందు అమరి ఉంటాయి. గుఱ్ఱాలు సామాన్యమైన గాలిని ఓడించగలిగాయి. గాని తమ శరీరమంతటా ఇమిడి ఉన్న సమానవాయువును ఓడించలేకపోయాయి. తమ లోని ఉన్న సమానవాయువును ఓడించాలంటే అవి మానుషజన్మమెత్తి, యమనియమాదులతో కూడిన యోగసాధన చేయాలి. లేనిచో వాటికాశక్తి లభించదు. తిర్యక్కులు ఆ విధంగా చేయలేవు. కాబట్టి గుఱ్ఱములకు సమానవాయువును గెల్చుట అసాధ్యమని కవిభావం. మధురలోని చాతుర్వర్ణాలను గురించి చెపుతు రాయలవారు పంచ యమాలలో ఒకటైన అపరిగ్రహం గురించి వివరించారు.

**చిరసముపార్జితాగ్ని తడిజెంది నశించు నటంచునో, కృతా**
**ధ్వరత దదగ్ని మై నునికి దాన నొకంగము తాచు చేతనో**
**పురధరణీశుల్నిగమ భూధరము ల్జపయజ్ఞ శీలు రా**

**హరి ధనదాదులైన వలహస్తము సాచరు దానధారకున్ ఆ 2–34**

మధురాపురములో గల బ్రాహ్మణులు ఎవరి నుండి దానము గ్రహించరని దీని భావం. ఈ విధంగా ఎవరి దగ్గర నుండి ఏమి గ్రహించకుండా ఉండడాన్ని యోగశాస్త్రంలో అపరిగ్రహం అంటారు. పతంజలి అపరిగ్రహం గురించి చెప్తూ

**" అపరిగ్రహస్థైర్యే జన్మకథాంత సంబోధః" ప 2–39**

అని నిర్వచించాడు. దానధర్మాలు గ్రహించకుండ అపరిగ్రహంలో సుస్థిరుడై ఉండే వ్యక్తికి పూర్వజన్మకు సంబంధించిన ఎరుక కలుగుతుందని పతంజలి ఉద్ధేశ్యం. ఈ సిద్ధిని పొందటంకోసం ఆ పురములోని బ్రాహ్మణులు దానధారకు వలహస్తము సాచరు. ఇదే పద్యంలో వేదప్రోక్తమయిన విషయమున్నది. మన పూర్వులు అగ్నికి ప్రాధాన్యతనిచ్చారు. అగ్ని అనగా వారి ఉద్ధేశ్యం ప్రకారం కేవలం నిత్యావసరములకు వినియోగపడేది మాత్రమే కాదు. ఇది భగవంతుని స్వరూపం. భగవంతుని భక్తుడిని హోమక్రియ ద్వార దగ్గర చేసేది. ఇక్కడ అగ్ని అనే పదానికి అర్థం వేరుగా ఉన్నది. చాలకాలం పాటు జపతపహోమాలు చేసి సంపాదించుకున్న పుణ్యం అనే అర్థంలో అగ్ని అనే పదం ప్రయుక్తమైనది. ఈ పుణ్యం ఎక్కడ దూరమవుతుందో అని అక్కడి బ్రాహ్మణులు దానం గ్రహించరని కవి భావం. ద్వితీయాశ్వాసంలో రాయలవారు పరదేశి విప్రుని గురించి వర్ణిస్తూ అనుష్టాన మాహాత్మ్యాన్ని ఇలా వివరించారు.

**"సేవించి పోవుతరి మధు**

**రా విభవము చూడ వచ్చిశ్రాంతిమెయిన్ మా**

**పావైఘనీట ఘృతసం**

**ధ్యావిధి నృపాపురోహితావసమునన్" ఆ 2– 72**

ఈ పద్యంలో బ్రాహ్మణులు నిత్యం ఆచరించవలిసిన సంధ్యావిధి గురించి చెప్పబడింది. సంధ్య అనగా సూర్యాస్తమయం నుండి సూర్యోదయానికి, సూర్యోదయం నుండి సూర్యాస్తమయానికి మధ్య ఉండే కాలము. ఈ కాలం భగవదుపాసనకు తప్ప మరే ఇతర కార్యక్రమములకు అనుకూలమైనది కాదు. ఈ సమయంలో దైవీశక్తి ప్రబలంగా ఉంటుంది. ఈ సంధ్యావందనం ప్రాతఃకాల, మాధ్యాహ్మిక, సాయం సమయాల్లో నిర్వహిస్తారు. ఈ మూడు సంధ్యా వందనాలలోను గాయత్రిదేవినే గాయత్రి మహామంత్రం ద్వార ఉపాసిస్తారు. ఒక్కో వేదవిభాగానికి చెందినవారికి ఒక్కో రకమైన సంధ్యావందనం ఉంటుంది. ఇది బ్రాహ్మణులు తప్పక చేయవలిసిన పని. రాయలవారు

ద్వితీయాశ్వాసంలో యోగోత్తర మీమాంసల విషయమైన వైరాగ్య చర్చ చేసారు. ఆ వైరాగ్యాన్ని ఈ క్రింది పద్యంలో చూడవచ్చు.

**" ఎక్కడి రాజ్యవైభవము? లెక్కడి భోగము? లేటి సంభ్రమం?**
**బక్కట! బుద్బుద ప్రతిమమైన శరీరము నమ్మి మోక్షపుం**
**జక్కి గణింపకుంటి, యుగ సంధుల నిల్చియు గాలు చేతిబల్**
**త్రొక్కుల నమ్మను ప్రభృతులున్ దుద రూపరకుండ నేర్చిరే" ఆ 2-78**

అసలు వైరాగ్యమనగా ఏమిటి? రాగం లేకుండా ఉండటమే వైరాగ్యం. రాగమనగా ప్రేమ, అభిమానం, నాది అను భావన. ఈ భావన లేకపోవడమే వైరాగ్యం. లౌకికమైన వస్తువుల పట్ల, సంపదల పట్ల రాగం కోల్పోయి, భగవత్ప్రాప్తి కోసం అర్రులు చాచడమె వైరాగ్యం. ఈ వైరాగ్యమే మత్స్యధ్వజుని మనసును ఆక్రమించినది. మత్స్యధ్వజుడు రాజ్యభోగముల పట్ల శరీర సుఖాలపట్ల, విరాగుడైనాడు. ఈ వైరాగ్యభావనను వేదాంతమొకరకంగా, యోగదర్శనం ఒకరకంగా చెప్పాయి. పూర్వమీమాంస ప్రకారం వైరాగ్యభావనకు గల కారణం " బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అను భావన. ఇది కలగడం వలననే జీవుడు మిథ్యారూపమైన ప్రపంచాన్ని విడిచి, సత్యమైన బ్రహ్మమును చేరుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. యోగశాస్త్రం ఇదే విషయాన్ని మరొకరకంగా చెప్పింది.

**"దృష్టానుశ్రవికవిషయ వితృష్ణస్య వశీకారసంజ్ఞ వైరాగ్యం" ప 2- 15**

ఇహపరాల్లో అనుభవించదగ్గ విషయాల్లో ఆశలేనివారికి విషయాలు తమకుతాము వశమైనాయని తెలియటమే వైరాగ్యం. ఇదే మత్స్యధ్వజునిలో జనించినది. మత్స్యధ్వజుని చుట్టూ కావలిసినన్ని భోగాలున్నాయి. కాని మత్స్యధ్వజుడు వాటికి వశపడి లేదు. అవి అశాస్వతమైనవనే భావనలో ఉన్నాడు. ఇదే వైరాగ్యమని యోగం చెప్పింది.

## 7.4 న్యాయశాస్త్రం – తద్దూషణ, పరమత స్థాపనములు

రాయలవారు విష్ణుచిత్తుని వాదనాప్రతిభను వివరిస్తూ న్యాయశాస్త్ర సంబంధమైన పూర్వపక్షోపన్యాస తద్దూషణ స్వమతస్థాపనములను వివరించారు.

**" అందులో నొకమేటి కభిముఖుండై యాత**
**డనిన వన్నియును మున్ననువదించి**
**తొడగి యన్నిటి కన్ని దూషణంబులు వేగ**
**పడక తత్సభ యొడబడగ బల్కి**

**ప్రక్కమాటల నేన్న నొక్కొక్కమాటనే**

**నిగ్రహస్థానమనుగ్రహించి**

**క్రందగా రేగినం గలగ కందర దీర్చి**

**నిలిపి యమ్మొదలి వానికిని మగిడి**

**మరి శ్రుతి స్మృతి సూత్ర సమాజమునకు**

**నైకకంఠ్యంబు గల్పించి యాత్మమతము**

**జగమెరుంగగా రాద్ధాంతముగా నొనర్చి**

**విజితుగావించి దయవాని విడిచిపెట్టి. ఆ 3-6**

విష్ణుచిత్తుడు వాదులలో ఒక వాది చెప్పిన విషయాన్ని మరల యథాప్రకారం చెప్పినాడు. తిరిగి చెప్పడం స్పష్టతకోసం. మరల ప్రారంభించి అతడు చెప్పిన అన్ని విషయాలలో గల దోషాలను వివరించి చెప్పాడు. దీన్నే తర్కశాస్త్రంలో పూర్వపక్షం గావించడం అంటారు. ఇద్దరు పండితులు వాదించుకుంటున్నప్పుడు మధ్యలో కొంతమంది లేనిపోని మాటలు మాటాడుకుంటారు. అలాంటి వారి మాటలను విష్ణుచిత్తుడు సరుకుగా గొనలేదు. ఇది ఉత్తమవాది లక్షణం. అతడు వారి వాదాలను ఖండించి, వారు ఓటమిని పొందారనే విషయాన్ని సూక్ష్మంగా, సున్నితంగా చెప్పాడు. వాదుల సమూహమంతా ఒకే సారి వాదింపదలిచిన అతడు కలవర పడలేదు. అందరినీ సమాధానపరచి ఊరకుండేట్లు చేసాడు. అందరూ ఇదే సరైనది అనుకునే విధంగా తన మతాన్ని ఆవిష్కరించాడు. దీనినే స్వమతస్థాపనం అంటారు. విష్ణుచిత్తుడు చేసినవాదం వేదములకు, ధర్మసూత్రములకు, బ్రహ్మసూత్రములకు, పురాణములకు అనుకూలమైనదిగా, వాటి అభిప్రాయాలతో ఏకీభవించేదిగా ఉన్నది. ఈ పద్ధతి అంతా న్యాయశాస్త్రానుకూలమైనది.

## 7.5 దర్శనఖండన

రాయలవారు ఏకంగా నాలుగు దర్శనాలను తమ శాస్త్రపాండిత్యంతో ఖండించారు.

**" జగదుద్గతికిని బీజము ప్రధానమన నీ**

**క్షత్యాది వీశు నశబ్దవాది**

**బొరి నీశుడేన నా భోగమాత్రే త్యాద్యు**

**దాహృతి స్ఫూర్తి మాయావివాది**

**ఫలియించు క్రియయు నాఫలమత యిత్యాది**

**సర్వేశు గౌనని యపుర్వవాది**

**శాస్త్రయోనిత్వాది సరణి నీశ్వరుణి దె**

**ల్పెడు ననుమానమన్నీలువాది**

**నిత్యులందెల్ల నిత్యున్మృత్యురోక్తి**

**క్షణిక సర్వజ్ఞ తేషి సౌగతవివాది**

**ననుపత్తేర్న యను సూత్ర మాది యైన**

**వాణి నృపతీశు బ్రత్యక్షవాది గెలిచె" ఆ 2-23**

పై పద్యంలో దర్శన ఖండన ఉన్నది. ఏయే శాస్త్రవాదులను విష్ణుచిత్తుడు ఏ విధంగా ఓడించాడన్నది ఇక్కడ ప్రధానం. జగదుద్గతి బీజము ప్రధానమనె సాంఖ్యులను

**"ఈక్షతేర్న శబ్దం"** బ్ర - 1;1,5

అనే సూత్రాల ద్వార ఓడించాడని కవి చెప్పాడు. సాంఖ్యులు ప్రకృతినే సర్వంగా భావిస్తారు. ఈశ్వరుని అస్తిత్వాన్ని అంగీకరించరు. సాంఖ్యం లో 24 తత్వాలు చెప్పబడ్డాయి. సాంఖ్యులు సృష్టి అంతా ఈక్షణ క్రియ వలననే జరిగినదని భావిస్తారు. అచేతనమైన ప్రకృతికి ఈక్షణ క్రియ సాధ్యపడదు. కాబట్టి ఈ శాస్త్రప్రతిపాదన సరైనది కాదని విష్ణుచిత్తుడు చెప్పాడు. రెండో పాదంలో అద్వైతమతాన్ని విష్ణుచిత్తుడు ఖండించాడు. ఈశుడేన(అహం బ్రహ్మాస్మి 1-4-10 యజుర్వేదం) అనే భావం సరైనది కాదని వాదించాడు. **"భోగసూత్ర సామ్యలింగాశ్చ"** అనే సూత్రం ద్వార గెల్చాడు. తర్వాతి పాదంలో కర్మయే ప్రధానమని వాదించే పూర్వమీమాంసకుని కవి ఖండించాడు. కర్మఫలం భగవంతుడి నుండి ప్రసాదితమైనపుడు కర్మకు ప్రాధాన్యత ఎక్కడుందని కవి ఈ వాదాన్ని ఖండించాడు. పరమాణు సంయోగక్రమమే జగత్తు అని వాదించే వైశేషికుని శాస్త్రయోనిత్వాది సూత్రములచేత కవి గెలిచాడు. ఇదే విధంగా విష్ణుచిత్తుడు బౌద్ధమతాన్ని కూడా ఖండించాడు. ఒకే సీసపద్యంలో ఆరుమతాలను ఖండించిన ఘనత రాయలవారికే చెల్లును.

## 7.6 అవిద్య

ఈ క్రింది పద్యం లో రాయలవారు యోగశాస్త్ర విషయమైన అవిద్యను ప్రస్తావించారు.

**" ఆ కేశిధ్వజుడంత నా నృపురాజ్యం బెల్ల జేర, నృలం**

**బాకాక్షింపక గెల్తు మృత్యువు నవిద్య, న్బట్టకుందుం,దుదన్**

**జా కుందున్వడి నంచు యోగనియతిం బ్రహ్మాజ్ఞానాశ్రయుండై మఖా**

**నీకంబు బ్రచియించి చందొకటికిం దీక్షించి తానున్నచోన్"** ఆ 3-18

కేశిధ్వజుడు తాను మృత్యువును, అవిద్యను గెలుస్తానని చెప్తున్న సందర్భంలోనిది ఈ పద్యం. అవిద్య ను గెలవటం అంటే అవిద్య లేకుండా చేసుకోవడం. పతంజలి యోగశాస్త్రంలో అవిద్యను గురించి ఈ సూత్రాన్ని రచించాడు.

**" అనిత్యాశుచి దుఃఖానాత్మసునిత్యాశుచి సుఖాత్మఖ్యాతిరవిద్య"** ప 2-5

అనిత్యాలైన వస్తువులందు నిత్యత్వాన్ని, అపరిశుద్ధమైన దేహాదులందు శుచిత్వాన్ని దుఃఖభాజనమైన ప్రపంచమందు సుఖాన్ని పొందగోరడమే అవిద్య అని పతంజలి సూత్రార్థం. ఇలాంటి అవిద్య నాలో లేకుండా చేసుకుని శాస్వతమైనదాన్ని ఎన్నుకుంటానని కేశిధ్వజుని భావం. ఈ విషయమే ఉత్తరమీమాంస ప్రకారం ఇలా చెప్పబడింది.

**"ద్యాంచావిద్యాంచ యస్తద్వే దోభయగ్ సహ**

**అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృత మశ్నుతే"** ఈ ఉ 1-6-14

అవిద్య వలన అశాస్వతమైన సుఖదుఃఖాలు కలుగుతాయని విద్య వలన శాస్వతమైన అమృతత్వం లబిస్తుందని ఉపనిషద్వాక్యోద్దేశ్యం. ఈ విధంగా ఆముక్తమాల్యద సర్వదర్శన సంగ్రహమై, యోగదర్శనమునకు ఆటపట్టై, న్యాయదర్శనమునకు నెలవై, వేదాంతదర్శనమునకు కొలువై ఉన్నది. అయితే ఈ కవికి దర్శనముల పట్ల ఉన్న అవగాహన ఇతర ఏ కవులకూ లేదని తెలుస్తున్నది.

## 8. శ్రీకాళహస్తి మాహాత్మ్యం – షడ్దర్శన ప్రభావం

మిగిలిన ప్రబంధములతో పోలిస్తే శ్రీకాళహస్తిమాహాత్మ్యము భిన్నమయినది. ధూర్జటి కూడ భిన్నుడే. ధూర్జటి దక్క మిగిలిన ప్రబంధ కర్తలందరూ విశిష్టాద్వైతులు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం తప్ప మిగిలిన ప్రబంధములన్ని విశిష్టద్వైతమునే ప్రబోధిస్తున్నవి. ధూర్జటి అద్వైతి. "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అనునది అతని మతము. ఇంకా కొంచెం లోతుగా వెళ్ళి పరిశీలన చేస్తే అతడు వీరశైవుడు కూడ అవుతున్నాడు. వీరశైవము, అద్వైతం రెండు ఒకే రకమైన తత్త్వాన్ని చెపుతాయి. అద్వైతమున అంతా భగవత్ మయమే. వీరశైవమున కూడ అంతే. అద్వైతమున అన్ని భగవత్ స్వరూపములే. వీరశైవము దీనికి వ్యతిరేకము. వీరశైవము శివుని దక్క వేరొకరిని దేవునిగా అంగీకరించదు. అయితే వీరశైవము అద్వైతం వలె వర్ణాశ్రమాలను అంగీకరించదు. వీరశైవం కొండొకచో వేదప్రామాణ్యాన్ని కూడా తిరస్కరించగలదు. ధూర్జటి వీరశైవమతావలంబి కాకపోయినప్పటికీ పెక్కు చోట్ల ఆ మతమును సమర్థించినాడని కావ్యాధారముగా చెప్పనగును. కన్నప్ప ఎంగిలి కూడును పరమేశ్వరునికి అర్పణ చేయడం, మిండజంగము వేశ్యతో సమాగమమునొందడం లాంటివి ఇందుకు ప్రబలోదాహరణములు. ఇవి వేదవిరుద్ధ కర్మలు. వీరశైవమత సమర్థనీయములు. ఇలా ధూర్జటి వీరశైవమును ప్రోత్సహిస్తూ, మరో ప్రక్క అద్వైతం అనుసరణీయమని బోధించాడు. ద్వైతవిశిష్టాద్వైతాలను ఖండించాడు కూడా. అద్వైతమునే కాక సాంఖ్య యోగములను కూడ కవి సమర్థించాడు. మిగిలిన వైశేషిక న్యాయములను చాలచోట్ల ఖండన చేశాడు.

### 8.1 బ్రహ్మవిద్య

ఉపనిషత్తులన్ని బ్రహ్మవిద్యనే ఉపదేశిస్తున్నవి. బ్రహ్మమును గురించి తెలుపునదే బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యను కవి రెండు చోట్ల ప్రస్తావన చేశాడు.

**" శ్రీ విద్యానిధియై మహామహిమచే జెన్నైవసిష్టాజలూ**
**తావావాశన సామజాటవిక గోత్రాదేవనత్కీరరా**
**జీవాక్షీయుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా**
**ర్యావామాంగముదివ్యలింగము మదీయాభిష్టముల్సల్పెడున్" శ్రీ 1–1**

పైన చెప్పబడిన శ్రీవిద్య బ్రహ్మజ్ఞానమే. తర్వాతి పద్యమునందు కవి బ్రహ్మవిద్యను ప్రస్తావన చేశాడు

**"ఆది గృహస్థ శేఖరుడవైన నినున్ భవతాపన క్షుధా**
**వేదనచేదపః కుతపవేళా గనుంగొన గల్గె బ్రహ్మవిద్యాదనభిక్ష"  శ్రీ 1–83**

పైన చెప్పబడిన బ్రహ్మజ్ఞానము వేదాంతమున చాల చోట్ల ప్రతిపాదితమైనది. దీనిని గురించి బృహదారణ్యకోపనిషత్తు ఇలా ప్రతిపాదించింది.

**"యత్ర హిద్వైతమివ భవతి తదితర ఇతరం పశ్యతి తదితర ఇతరం జిఘ్రతి, తదితర ఇతరగ్ం శృణోతి, తదితర ఇతర మభివదతి, తదితర ఇతరం మనుతే, తదితర ఇతరం విజానాతి, యత్ర వా అస్య సర్వమాత్మైవ భూత్తత్కేన కం జిఘ్రేతత్కేన కం పశ్యేత్తత్కేన కగ్ం శృణు యాత్తత్కేన కమభివదేత్తత్కేన కం మన్వీత, తత్కేన కం విజా నీయాత్, యేనేదగ్ం సర్వం విజానాతి తం కేన విజానీయాత్, విజ్ఞాతారమరే కేన విజానీయాదితి"**

ఓ మైత్రేయి ఇదేయే బ్రహ్మజ్ఞానం. మనం లోకమును చూచునప్పుడు దేహేంద్రియ కారణంగా నేను వాడు వీడను ద్వైతజ్ఞానం కలుగుతున్నది. బ్రహ్మజ్ఞానం చేత దేహేంద్రియాది సంబంధం వల్ల కలిగిన జీవభావం నశించునప్పుడు ద్వైతభావం నశించి అద్వైతభావం ఏర్పడుతున్నది. ఇదియే బ్రహ్మజ్ఞానం. బ్రహ్మవేత్తకు బ్రహ్మ జ్ఞానం చేత సర్వం ఆత్మమాత్రమగుతున్నది. అప్పుడు నేను చూచుచున్నాను. వినుచున్నాను, ఆఘ్రూనించుచున్నానను భావం నశించి బ్రహ్మము చూచుచున్నది. వినుచున్నది. ఆఘ్రూణించుచున్నదను భావం కలుగును.

## 8.2 సన్యాసి బేధములు

సర్వమును త్యజించినవాడు, రాగము లేనివాడు సన్యాసి అనబడుతున్నాడు. ఈ సన్యాశాస్రమమున గల పరమహంస బేధమును కవి ఇలా ప్రస్తావించాడు.

**"హిమధరాధర మండలేశ్వర కులపాలి**
**కామణితను వల్లికా ప్రసూన**
**మసితకుందర సింధురాజి నాంబర ఘూర**
**గంధబంధనకరగంధలహరి**
**సంతతశివ శక్తి సామరస్య జ్ఞాన**
**సారమరంద నిష్యంద ధార**
**పరమహంసోత్తం సాఖావభృంగవ్రాత**
**తన్మయావస్థా ప్రదానకేళి"** శ్రీ 1-2

సన్యాసి బేధములను గురించి శబ్దకల్పద్రుమం ఇలా చెపుతున్నది.

**" సతుచతుర్విధః కుటీచరః బహూదకః హంసః పరమహంసః"** శ 5-7

పై బేధములలో ఉత్తమమైన పరమహంస బేధము కవి చేత ఉక్తమైనది.

## 8.3 సృష్టిస్థితిలయలు

ఈ ప్రపంచమునందు గల ప్రతి వస్తువు పై మూడు అవస్థలలో ఏదో ఒక అవస్థలో తప్పక ఉండును. నిజానికి ఈ ప్రపంచమే స్థితియను అవస్థయందున్నది. ఇది వేదవేదాంత విషయం . దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" సర్గస్థిత్యపహార కర్మనవదీక్షావేళా బ్రహ్మస్వభూ**
**భరుల్ " శ్రీ 1-5**

ఈ ప్రపంచమున పుట్టిన ప్రతి వస్తువునూ నశించునదే. నిజానికి ప్రపంచమే నాశనస్వభావము కలది. ఈ ప్రపంచమును సృజియించువాడు బ్రహ్మ. నడిపించువాడు విష్ణువు. లయము చేయువాడు మహేశ్వరుడు.

## 8.4 అద్వైతం

అద్వైతమనగా రెండు కానిదని భావం. నిజానికి ఏకమ్ అని చెప్పినచో ఇదే అర్థం వచ్చును. కాని పండితులు అద్వైతమను పదమునే వినియోగింతురు. దీనికి నిమిత్తం కలదు. ఈ ప్రపంచమున గల జీవునకు పరమాత్మ వేరుగా కనబడుతున్నాడు. కాన జీవుడు పరమాత్మను తనకంటే భిన్నమైన వాడిగా భావిస్తున్నాడు. జీవాత్మ పరమాత్మలు వేరుగా లేవని, కనపడుతున్న రెండూ ఒకటే అని బోధిస్తున్నది అద్వైతం. అందుకే ఏకమ్ అను పదమునకు బదులుగ అద్వైతపదము ప్రయుక్తమయ్యెను. ఈ పదమును కవి ఇలా ప్రయోగించాడు.

**" వాగర్థంబులు శోతృవక్తలు జగద్వంద్యుండు నద్వైతవి" శ్రీ 1-7**

**" స్వానుభవంబున దథ్యము**
**గానంబడు గాని మీయఖండాద్వైత" శ్రీ 1-80**

ఈ అద్వైతమునకు శంకరులు రచించిన వివేక చూడామణిలోని ఈ శ్లోకం ప్రాణం.

**"శ్లోకార్థేన ప్రవక్ష్యామి**
**యద్యుక్తం జ్ఞానికోటిభిః**
**బ్రహ్మసత్యం జగన్మిథ్య**
**జీవో బ్రహ్మైవ న అపరః" వి 5-5**

బ్రహ్మమే సత్యము. జగత్తంతయు మాయయే అని తెలుపునది అద్వైతం.

## 8.5 నాదబిందుకళలు

ఈ క్రింది పద్యంలో యోగశాస్త్రమును, బ్రహ్మ లక్షణమును ఇలా చెప్పబడినవి.

**" ఏతత్కళ్యాణగుణో**

**పేతునకఖిల ప్రపంచభిన్నాభిన్న**

**జ్యోతికిని నాదబిందు క**

**ళాతీతేశునకు గాళ హస్తీశునకున్" శ్రీ 1-11**

పై పద్యమున భగవంతుని లక్షణము విదితము. భగవంతుడు ప్రపంచముకంటే భిన్నమైనవాడు. అదే సమయమున అతనికి ప్రపంచమునకు సంబంధము కూడ ఉన్నదను వేదాంత తత్వము ఇక్కడ చెప్పబడింది. నాదబిందు కళ అనగా యోగశాస్త్రము. ఇక్కడ నాదమనగా ఓంకారం. ఓంకారమును ఉచ్చారణ చేస్తూ యోగసాధన సాగుతుంది. అందుకే ఇది నాదబిందుకళ అయినది. ఈ విషయం సీతారామాంజనేయ సంవాదమున ఇలా చెప్పబడింది.

**" ప్రతను ప్రాణమనోగ్ర, స్థితబుద్ధి యెబిందు వందు జెలగెడి యాత్మ ప్రతిబింబమె కళ పవనో,**

**న్నత ఘూషమె సుమ్మ ప్రణవనాదము వత్సా!" సీతారా శ్రీ 1-164**

## 8.6 త్రిగుణములు

సత్వరజస్తమములు త్రిగుణములు. ఈ మూడింటిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" సతత త్రైగుణ్యవశా" శ్రీ 1-15**

**" పాశక్లేశ గుణైషణేంద్రియ " శ్రీ 1-162**

**" సితఃసత్వగుణఃలోహితోరజోగుణఃపీతకోరజస్తమోవ్యామిశ్రః అసితః తమోగుణః" నీల7-2**

ఈ గుణములలో సత్వము సితవర్ణము కలది. రజోగుణము లోహిత(ఎరుపు) వర్ణము కలది.తమోగుణము అసిత( నలుపు) వర్ణము కలది. సత్వగుణము బ్రాహ్మణులయందు, రజోగుణము వైశ్యులయందు, తమోగుణము శూద్రులయందు ఉండునని దీని భావం. భగవంతుడు నిర్గుణుడని వేదము చెప్పుచున్నది. అతనికి ఈ గుణములు అంటవు. ఈగుణ స్వభావములతనిలో ఉండవు.

## 8.7 మాయ

మాయను కవి ఇలా ప్రస్తావించాడు.

**" అతులైశ్వర్య పరంపరావిలసితంబైనట్టి పరంపరావిలసితంబైనట్టి తత్పట్టన**
**ప్రతిబం బగు చంద్రకాంతరచిత ప్రాకార మొప్పారు న**
**ద్భుత మాయా బహువిభ్రమభ్రమిత వస్తువ్రాతలోకోదయ**
**స్థితిలో గొన్న శివుండనంగ హృదయాచింత్యప్రభావంబునన్" శ్రీ 1–19**

బ్రహ్మస్వరూపము యొక్క అజ్ఞానము మాయ. ఇది తన ఆవరణ శక్తి చేత ప్రాణులనావహించి మోహింపజేయును. మాయవలన అనగా బ్రహ్మస్వరూపము యొక్క యజ్ఞానము వలన బ్రహ్మమునందు జగద్భ్రాంతి కలుగును. జగద్భ్రాంతి కలుగుటకు హేతువగు పరబ్రహ్మము జగత్తునకు వివర్తోపాదాన కారణము. వివర్తమనగా తన స్వరూపమును విడువక అన్యముగా భాసిల్లునది. పరబ్రహ్మము జగత్తుగా బరిణమించుటకు హేతువగుటచే బరిణామ్యుపాదాన కారణమనబడును. మాయ నివర్తించినచో బ్రహ్మమే ఉండును. ఇదియే బ్రహ్మసత్యం జగన్మిథ్య. మాయ పరమేశ్వరుని అధీనంలో ఉండునది. ఈ మాయనే కవి పై పద్యమున చెప్పియున్నాడు.

## 8.8 యోగాసనాలు

యోగాసనాల గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఎలతోటల్ వనముల్వధూకుచముల ద్రీంద్రంబులాకంటికిన్**
**ఫలముల్ వాతెరలంగమకళాబంధంబు లిచ్చాసనం**
**బులు కోపంబున బాయుటల్ తపము సంభోగంబు కైవల్యమ**
**దుల లీలారతి నుండు మానవుల కెందుం గాన మీచిత్రముల్" శ్రీ 1–21**

యోగశాస్త్రమున చెప్పబడిన అష్టాంగములలో మూడవది ఆసనం. పతంజలి ఆసనమును ఇలా నిర్వచించినాడు.

**" సుఖం స్థిరమాసనమ్" ప 3–46**

స్థిరంగా సుఖంగా ఉండేదే ఆసనమని దీని భావం. చాల కాలం అభ్యాసం చేసిన తర్వాత సాధకుడు ఆసనాల మీద పట్టు సాధిస్తాడు. ఏ ఆసనమునందైన ఎక్కువకాలం శరీరాన్ని ఉంచగలుగుతాడు. ఇలాంటి ఆసనసిద్ధి కలిగినపుడు మాత్రమే సాధకుడు ప్రాణాయామాదులను సాధన

చేయగలుగుతాడు. అందుకే కవి ఆసనం చెప్పిన తర్వాత తపమును, కైవల్యమును చెప్పినాడు. ఇవి సోపానక్రమంలో మాత్రమే సాధన చేయదగ్గవి.

## 8.9 బ్రహ్మార్పణం

భగవద్గీత యందు ఇలా చెప్పబడింది.

**"బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం**

**బ్రహ్మైవతేన గంతవ్యమ్ బ్రహ్మకర్మసమాధినః" భ 4-24**

పై శ్లోకమున కర్మ సిద్ధాంతం ప్రతిపాదించబడింది. మనిషి కర్మలను చేస్తూ ఉంటాడు. ఆ కర్మల కారణంగా సుఖదుఃఖాలను పొందుతూ ఉంటాడు. కొన్నిసార్లు తెలిసి తెలిసి తప్పక దుష్కర్మలు చేయవలసి వస్తుంది. కొన్నిసార్లు సత్కర్మలు చేసినా రావలిసిన ఫలితం రాదు. ఇలాంటి పరిస్థితిని అధిగమించడానికి భగవద్గీత చూపిన మార్గమే బ్రహ్మార్పణం. దీని ప్రకారం మానవుడు ఏ పని చేసిన భగవంతునికి అర్పన చేసి చేయాలి. అలా చేసినచో అందలి పుణ్యాపుణ్యములు భగవంతునికే చెల్లుతాయి. తప్ప మనుష్యునకంటవు. ఈ భావాన్ని కవి ఇలా ప్రతిపాదన చేసాడు.

**" నైజంబులగు నిత్యనైమిత్తకంబుల**
**నడుపుచో బ్రహ్మార్పణంబు సేసి**
**సంగరరహిత బుద్ధి శాంతనవస్ఫూర్తి**
**వైరివర్గంబు సంహారమాడి**
**ప్రబల మహార్థ ప్రభాసమానస్థితి**
**గోశంబులనెడి కొలదులరసి**
**యాతపశీత వాతాదుల సమముగా**
**నాత్మ ప్రయత్నంబులందు దలచి**
**సంచరింతురు బ్రాహ్మణక్షత్రవైశ్య**
**శూద్రలవ్వీట సంతత భయహృదయ**
**నిరుపమానంద విహరణోన్నిద్రులగుచు**
**రాజయోగైక సామ్రాజ్యరతులభంగి" శ్రీ 1-23**

ఈ పద్యంలో కవి మొదటి పాదమున పూర్వమీమాంస విషయమైన నిత్యనైమిత్తికకర్మలను చెప్పాడు. మూడవ పాదంలో యోగదర్శనానికి సంబంధించిన పంచకోశములను గురించి, ఆటవెలదిలో

రాజయోగమును గూర్చి ప్రస్తావించాడు.మొదటిపాదంలో చెప్పబడిన నిత్యనైమిత్తిక కర్మలను ఆ ఊరి బ్రాహ్మణులు బ్రహ్మార్పణ మతితో చేస్తారని భావం. ఆచరించట్లయితే ప్రత్యవాయము కలిగే కర్మలు నిత్యకర్మలు. ఇవియే పంచయజ్ఞములను పేర పిలవబడుతున్నవి. వీటిని మనుధర్మశాస్త్రంలో ఇలా చెప్పారు.

**" అధ్యాపనం బ్రహ్మయజ్ఞః, పితృయజ్ఞాస్తుతతర్పణమ్**

**హోమోదైవో బలిర్భౌతో, నృయజ్ఞోతిథి పూజనమ్" మ, స్మృ 2-12**

అధ్యాపనము, బ్రహ్మయజ్ఞము, పితృయజ్ఞము, తర్పణము, హోమము మొదలైనవి నిత్యకర్మలని కవి భావం. ఆయానిమిత్తములచే చేయదగిన శుభకర్మలు నిత్యకర్మలు.

## నైమిత్తిక కర్మలు

కారణములతో చేయబడిన శుభకర్మలు నైమిత్తికములనబడును. ఈ కర్మలను గురించి మార్కండేయ పురాణం ఇలా చెప్తున్నది.

**" నిత్యం నైమిత్తికంచైవ, నిత్యనైమిత్తికం తథా**

**గృహస్థత్రిధా కర్మ, తన్నిశామయ పుత్రక!**

**పంచయజ్ఞాశ్రితం నిత్యం యదేతత్కథితం తవ**

**నైమిత్తికంతథాచాన్యత్, పుత్రజన్మక్రియాదికమ్**

**నిత్యనైమిత్తికం జ్ఞేయం, పర్వశ్రాద్ధాది పండితై" మా 3-170**

## కోశములు

మూడవ పాదమున పంచకోశములు చెప్పబడినవి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములను పంచకోశములందురు.

**అన్నమయకోశము – స్థూలశరీరం, మరణము దీనికే సంభవించును.**

**ప్రాణమయకోశం – పంచకర్మేంద్రియాలతో గూడిన ప్రాణపంచకం**

**మనోమయకోశము – పంచ జ్ఞానేంద్రియాలతో కూడిన మనస్సు మనోమయ కోశము.**

**విజ్ఞానమయకోశము – పంచజ్ఞానేంద్రియాలతో గూడిన బుద్ధి.**

**ఆనందమయకోశం – అహంకారాత్మకము లేదా అవిద్యాత్మకం.**

## 8.10 రాజయోగములు

చివరి ఆటవెలదిలో రాజయోగము చెప్పబడినది. యోగము స్థూలముగా ద్వివిధము. ఒకటి హఠయోగము, రెండు రాజయోగము. హఠయోగము ప్రాణాయామాది క్రియావిశేషసాధ్యము. రాజయోగము భావనావిశేషసాధ్యము. ఈ విషయం వాచస్పతీయమున ఇలా చెప్పబడినది.

**" యోగశ్చద్వివిధః హఠయోగఃరాజయోగశ్చ,తత్ర హఠయోగః ప్రాణాయామాది క్రియవిశేషసాధ్యః హఠయోగదీపికా దావుక్తప్రకారః రాజయోగస్తు భావనావిశేషసాధ్యః పాతంజలా వుక్తః" వాచ 3-21**

## 8.11 ఓంకారం

కవి ఓంకారమును ఇలా ప్రస్తావించాడు.

**" ఓయమురోదనంబోంకారమనువుగా" శ్రీ 1-51**

అకార, ఉకార, మకారముల కలయిక ఓంకారమనబడుతున్నది. ఉపనిషత్తులు చాల చోట్ల ఓంకార ప్రాశస్త్యమును చెప్పినవి. ఛాందోగ్యోపనిషత్తు ఓంకారమాహాత్మ్యమును ఇట్లు చెప్పుచున్నది.

**" కతమా కత మర్కతమత్కతమమత్సామ కతమః కతమ ఉద్గీథ విమృష్టం భవతి. తదేవ న్మిథునమో మిత్యేతస్మిన్నక్షరే సంసృజ్యతే, యదావై మిథునౌ సమాగచ్ఛత అవయతో వైతా వన్యోన్యస్య కామం"ఛాం 1-6**

వాక్కే ఋక్కు. ప్రాణమే సామము. ఓంకారమే ఉద్గీథము. అదే మిథునము. ఓంకారం లో ఈ మిథునం జరుగుట వలన ప్రకృతిపురుషులు సమాగమములై పరస్పరేచ్ఛ పూర్ణమగును.

**" ఆపయితా హవై కామానాం భవతి య ఏతదేవం విద్యా నక్షర ముద్గీథ ముపాస్తే. తద్వా ఏతదనుజ్ఞాక్షరం యద్ధి కించానుజానృతో మిత్యేవ తదాహ ఏషో ఏవ సమృద్ధి ర్యదనుజ్ఞా సమర్థయితాహవైకామానాంభవతియఏతదేవంవిద్యానక్షరముద్గీతముపాస్తే" ఛాం1- 7,8**

ఈ విధంగా తెలిసి ఓంకార ఉపాసన చేసినవాడు సర్వకామములను పొందినవాడగును. లోకంలో దేనికైన అనుజ్ఞ, అనుమతిని ఓంకారం ఒసగుటవలన దీనికి అనుజ్ఞాక్షరమని పేరు. అనుజ్ఞను ఒసగునపుడు మనిషి ఓం అని అనును. దాని వల్ల వృద్ధి కలుగును. అందువలన ఓంకారమునకు సంవృద్ధి అని పేరు. ఈ రీతిగా గ్రహించి ఏ విధ్వాంసుడు ఓంకారమును ఉపాసన చేయునో, అలాంటి వాడికి సర్వవాంఛలు నెరవేరుతున్నవి.

## 8.12 జీవన్ముక్తి

జీవన్ముక్తి అద్వైతమతమునకు ప్రాణప్రదమైన సిద్ధాంతం. దీనిని గురించి కవి ఇలా చెప్పాడు.

**" ఓ వెర్రీ! సుతులందరుందెగిన నయ్యో! దుఃఖివై యీగతిన్**
**జావంబుట్టువు దీరునే? మనములో సంసారమున్ రోసినన్**
**దేవోత్తంసుని బార్వతీరమణు భక్తిం గొల్వుమీ! చేకురున్**
**జీవన్ముక్తి యటంచు ధాత్రియుపదేశింపం బ్రమోదంబునన్" శ్రీ 1-69**

కొడుకులందరూ మరణించారని ఏడ్చి, ఏడ్చి మరణించినమాత్రమున జననమరణ రూపమగు సంసారమాగదని, ప్రాపంచిక వ్యామోహమును ఏవగించుకున్నచో పరమేశ్వరుని సేవింపుమని దాని వలన జీవన్ముక్తి లభించునని భూదేవి వశిష్టునకు చెప్పుచున్నది. జీవునకు జగత్తంతయు నిజమైనదని భ్రమముండను. దాని కారణముగా దుఃఖము కలుగును. దుఃఖభాజనమైన ప్రపంచమశాస్వతమని, పరమాత్మ శాశ్వతుడని, జీవాత్మ పరమాత్మలు వేరు కావని తెలుసుకొనిన మరుక్షణం జీవుడు జీవన్ముక్తుడవుతున్నాడు. ఆ క్షణమున శరీరమున్నను దానినతడు లెక్కచేయడు. దానికి గలుగు సుఖదుఃఖములను సరుకుగొనడు. శరీరము వేరు తాను వేరన్న భావనయే దీనికి మూలము. ఇదియే జీవన్ముక్తి స్థితి. ద్వైతవిశిష్టాద్వితములు దీనిని అంగీకరించవు.

## 8.13 బ్రహ్మతేజం

బ్రహ్మతేజమును కవి ఇలా ప్రస్తావించాడు.

**" నానాముఖివాసనలకు**
**దానకమగుచున్న హృదయతామరసముమా**
**జానికి నర్పించి తపో**
**ధీనుండై యతడు బ్రహ్మతేజము మెరయన్" శ్రీ 1-70**

బ్రాహ్మణుడు నిత్యము వేదమును పఠించుట వలన అతనికి కలుగు తేజమే బ్రహ్మతేజము. దీనిని గురించి బ్రహ్మస్తోకమున ఇలా చెప్పబడింది.

**" బ్రహ్మణా వేదాధ్యయేన తదనుష్ఠానేనచ కృతం వర్చః తేజః" శ 4-29**

బ్రాహ్మణునికి వేదాధ్యయనం వల్ల, అనుష్టాన కర్మలవల్ల తేజస్సు కలుగునని దీని భావం.

## 8.14 పంచావయవములు

ఈ క్రింది వచనమున కవి పంచభూతములను, పంచేంద్రియములను, పంచవిషయములను, పంచక్లేశములను, పంచకోశములను ఇలా చెప్పాడు.

**" మనోదృష్టి దురభివేశ నిరవ కాశీకృత దశదిశా ప్రదేశంబగు దివ్య ప్రకాశంబును పంచభూత పంచేంద్రియ, పంచవిషయ పంచక్లేశ పంచకోశాది పంచవర్గప్రాయ ప్రపంచంబు బంచుకొని భక్షింపంబాలువడిన పంచముఖంబులతోడి ముక్తకంచుకాకారంబున పంచశరభంజనుండు పరమ శివలింగరూపంబున బశ్చిమాభి ముఖుండై" శ్రీ 1-75**

పంచభూతములన పృథివ్యప్తేజోవాయురాకాశములు. ఇవి సర్వదర్శనములందు నిరూపితములు. అంగీకృతములు. తర్వాత వరుసగా పంచ జ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు చెప్పబడినవి. తర్వాత పృథివ్యాదుల గుణములైన పంచ విషయములు చెప్పబడినవి. వీటిని గురించి శబ్దకల్పద్రుమంలో ఇలా చెప్పబడింది.

**" శబ్దస్పర్శస్తథారూపం రసో గంధశ్చపంచమః**
**ఏతేపంచగుణాభూమేర్విజ్ఞేయాద్విజసత్తమాః" శబ్దక 2-12**

**పంచక్లేశములను గురించి పతంజలి ఇలా చెప్పాడు.**

**" అవిద్యాస్మితారాగద్వేషాభినివేశాః" ప 2-5**

అన్నమయ, మనోమయ, ప్రాణమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనునవి పంచకోశములు. పైన చెప్పబడిన పంచావయవములు వాటి గుణములు న్యాయశాస్త్ర సంబంధమైనవి. కోశములు, వాటి లక్షణములు యోగశాస్త్ర సంబంధమైనవి.

## 8.15 24 తత్త్వాలు

సాంఖ్యమునకు ప్రాణప్రదమైనవి చతుర్వింశతి తత్త్వాలు. వీటిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఇరువది నాలుగుతత్త్వము**
**లరయగ నీయందు పుట్టి యణగునన జగ**
**త్పరి పూర్ణుడవన దృశ్యే**
**తరమూర్తివనంగ విందు దత్త్వ జ్ఞులచేన్" శ్రీ 1-79**

ఈ 24 తత్త్వాలు సాంఖ్యమున ఇలా చెప్పబడ్డవి.

1. మూలప్రకృతి

2. మహత్తత్త్వం

3. అహంకారం

4. శబ్దతన్మాత్రలు

5. ఆకాశం

6. స్పర్శతన్మాత్రము

7. వాయువు

8. రూపతన్మాత్రము

9. అగ్ని

10. రసతన్మాత్రము

11. జలము

12. గంధతన్మాత్రము

13. పృథివి

14. నేత్రములు

15. నాశిక

16. జిహ్వ

17. కర్ణములు

18. త్వక్కు

19. హస్తములు

20. పాదములు

21. ముఖము

22. పాయువు

23. లింగము

24. మనసు

ఇవి సాంఖ్యం చెప్పిన 24 తత్త్వాలు. మొత్తం సృష్టి అంతా ఈ 24 తత్త్వాలలోనే ఇమిడి ఉన్నదని సాంఖ్యం చెపుతున్నది.

## 8.16 అహంబ్రహ్మాస్మి

అద్వైతమునకు మూలమైన భావన ఇది. దీన్ని గురించి కవి ఇలా చెప్పాడు.

**" తన్నులోనుగజుట్టుకున్నవటచ్ఛాయ**
**నిజదీప్తిమొగలునా నింగిబర్వ**
**బ్రహ్మసంహననామరద్రుమపల్లవ శిఖా**
**చ్ఛటలునాగురుచకెంజడలు దనర**
**నీశ్వరోహమ్మను నీరహస్యము దెల్పు**
**మురువున సుజ్ఞాన ముద్రమెరయ"1-86**

ఈశ్వరోహం అనగా అర్థము "అహం బ్రహ్మాస్మి" అని. ఇది బృహదారణ్యక ఉపనిషత్తుకు సంబంధించిన వాక్యం.

**"ఓమిత్యేవం ధ్యాయథ**
**సత్యం,జ్ఞానం,అనంతం, బ్రహ్మ**
**అహం బ్రహ్మాస్మి**
**అయమాత్మబ్రహ్మ" బృ 1-4-10**

నేనే బ్రహ్మనను భావం ఇక్కడ ప్రతిపాదితం. ఇది అద్వైతమునకు మూలం. జీవుడు తనలో ఉన్న పరమాత్మను తెలుసుకొని "అహం బ్రహ్మాస్మి" అని భావన చేయడమే మోక్షము. తర్వాత కవి యోగశాస్త్ర సంబంధమైన జ్ఞానముద్రను చెప్పాడు. ఈ ముద్రను గురించి శబ్దకల్పద్రుమం ఇలా చెప్పుచున్నది.

**" తర్జన్యంగుష్ఠకౌసక్తావగ్రతో విన్యసేద్హృది**
**వామహస్తాంబుజంవామజాను మూర్ధనివిన్యసేత్**
**జ్ఞానముద్రాభవేదేషా" శబ్దక 4-1**

కుడిచేతి బొటన వ్రేలి కొనను చూపుడు వ్రేలి కొనను ఒక్కటిగా జేర్చి రొమ్ముపై నుంచి యెడమ చేతిని ఎడమ మోకాలి చిప్పపయి నిడునట్టి ఒక ముద్రయే జ్ఞానముద్ర.

## 8.17 అష్టసిద్ధులు

కవి అష్టసిద్ధుల గురించి ఎక్కువ చోట్ల ప్రస్తావించాడు. నిజానికి అష్టసిద్ధుల గురించి ఇంతలా చెప్పిన ప్రబంధకవి మరొకడులేడు. ఇవి యోగశాస్త్ర సంబంధమైనవి. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" అణిమాదిప్రదమై పురాణకథితంబై మోక్షదంబైన ద**
**క్షిణకైలాసము మీది కూరిమి వితర్కింపన్ శివాజానికిన్" శ్రీ 1-97**

**"కనుగొని యారణీ తటిని గాయము దోచి తదీయసైకతా**
**వనిభవున్ భజించియ పవర్గరమావిభు వాలి పూజచే**
**సిన శివలింగముం గొలిచి సిద్ధులకయ్యణి మాది సిద్ధులి**
**చ్చిన వభైరవున్ దలచి చిత్తము లోపల దన్మహత్త్వమున్" శ్రీ 1-70**

**"ఇతితీర్థోత్తమ మిందునాడిన నరుండీ ఘూర సంసారదుః**
**ఖిదవాగ్నివ్యథ బాయుబంకరు హదృక్కంజాత గర్భాదిక**
**త్రిదశుల్ గూడిచరింతురిందు నణిమాది ప్రాప్తి యౌ భైరవా" శ్రీ 1-82**

అణిమ, గరిమ, లఘిమ, మహిమ, ఇసిత, వసిత, ప్రాప్తి, ప్రకామ్య అనునవి అష్టసిద్ధులు. ఇవి యోగశాస్త్రం నందు చెప్పబడిన సంయమం చేయడం వల్ల లభ్యమవుతాయి. వీటిని గురించి పతంజలి ఇలా చెప్పాడు.

**" తతోణిమాది ప్రాదుర్భావః కాయసంపత్రద్ధర్మానభి ఘాతశ్చ" ప 3-46**

భూతదయ వల్ల అణిమాది అష్టసిద్ధులు, శరీర సంబంధ సంపదలు, దేహరూపాదులకు వినాశనం లేకుండట కలుగుతాయని పతంజలి భావం. అయితే ఈ సిద్ధులను లెక్కచేయకుండా యోగి తన సాధన కొనసాగించాలి. లేదా బ్రహ్మానందాదిరాజ్యపదవీచ్యుతుడవుతాడు.

## 8.18 సమాధి

సమాధి అష్టాంగములలో ఉన్నతమైనది.చివరిది. దీన్ని అవలంబించినచో కైవల్యమే కలుగును. దీనిని గురించి పతంజలి ఇలా చెపుతున్నాడు.

**" తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః" ప 3-3**

రూపాలను వదలి, అర్థాలను మాత్రం భాసింపచేయటం సమాధి అని దీని భావం. ధ్యానంలో ధ్యేయరూప బాహ్యభాగాన్ని విసర్జించినపుడు సమాధి ఏర్పడుతుంది. ఇలాంటి సమాధిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" నీ సునంద నీయందు గలభావము సమాధి" శ్రీ 3-82**

ఈ సమాధి అష్టాంగములలో చివరిది.

## 8.19 తపము

తపస్సు యోగశాస్త్ర సంబంధమైన విషయం. తపస్సును కవి ఇలా ప్రస్తావించాడు.

**" శివు బూజింపగ వచ్చి బిల్వవిటప శ్రేణి సనాళాబ్జభే**
**దవిలీనాంగమ దివ్యలింగము సఖేదస్వాంతమై చూచి నా**
**దివృథా జన్మము గాదె? నా తపము భక్తింబాడు గాకున్నె? యే**
**వవిచారింపగ నెల్లియున్ వ్రతము కొల్లంబోయినంజూచెదన్" శ్రీ 1-115**

పతంజలి తపస్సును ఇలా నిర్వచించాడు.

**" కాయేన్ద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః" ప 2-43**

తపస్సు వలన మాలిన్యం నశిస్తుంది. దానితో శరీరానికి ఇంద్రియాలకు సిద్ధులు కలుగుతాయి. తపస్సువలన కొన్నిసమయాల్లో దూరశ్రవణం దూరదృష్టి వంటి సిద్ధులు కలుగుతాయి.

## 8.20 పంచక్లేశాలు

ఇవి యోగశాస్త సంబంధమైనవి. ఈ క్లేశాలను కవి చాల సార్లు ప్రస్తావన చేసాడు.

**" పాశక్లేశగుణైషణేంద్రియ తను ప్రత్యర్థి తాషోర్మికా**
**కోశాదివ్యతిరిక్తమూర్తి!త్రిజగత్కూలంకషాకార! మా" శ్రీ 1-162**

పై పద్యమున కవి క్లేశాలను, త్రిగుణాలను, పంచకోశాలను ప్రస్తావన చేశాడు. క్లేశాలు సమాధి సిద్ధికి ప్రతిబంధకాలు. సమాధి సిద్ధి కావాలంటే తప్పక క్లేశాలను విడిచి పెట్టాలి.

**" అవిద్యాస్మితారాగ ద్వేషాభినివేశాః క్లేశాః" ప 2-3**

అవిద్య, అస్మిత, రాగం, ద్వేషం, అభినివేశం అనేవి ఐదు క్లేశాలు. ఐదు క్లేశాలు ఏర్పడటానికి అవిద్యయే కారణం. ఈ క్లేశాలు జీవునకు సంసారబంధాన్ని కల్పించే పంచపాశాలు. ఇవి కొన్ని సమయాల్లో పైకి కనిపించక నిద్రాణమై ఉంటాయి.

## 8.21 సంయమం

సాధారణంగా ఋషులకు, మునులకు ఈ పదాన్ని కవులు వినియోగిస్తారు. ధూర్జటి ఈ పదాన్ని అగస్త్యునికి వాడి పదసార్ధకత సాధించినాడు.

**" అంతర్ధానము సేసి, సంయమికులాధ్యక్షుండు సంతోషిత**

**స్వాంతుండయ్యె వహించెనగ్గిరి యగస్త్య గ్రావ విఖ్యాతి నా" శ్రీ 1-141**

అష్టాంగములలో గొప్పవనదగ్గ ధారణ, ధ్యాన, సమాధులను కలిపి ఒకే చోట నిలపడం సంయమమవుతున్నది. దీనివల్ల అష్టసిద్ధులు ప్రాప్తమవుతాయి. ఈ సిద్ధుల మూలమున సాధారణ వ్యక్తులు చేయలేని కార్యాలను సాధకుడు సాధిస్తాడు. పంచభూతాలను అదుపులో ఉంచగలుగుతాడు. ఇతర దేహములోనికి తన ఆత్మను ప్రవేశింప చేయగలడు. నీటి మీద నడవగలడు. గాలిలో తేలగలడు. కేవలం గాలిని మాత్రమే భుజిస్తూ చాలకాలం జీవితాన్ని గడపగలడు.

## 8.22 దండకం – భగవత్తత్వం, దర్శనఖండన, వీరశైవమతస్థాపన

ధూర్జటి ప్రథమాశ్వాసంలో ఒక దండకాన్ని రచించాడు. అందులో అనేక యోగశాస్త్ర రహస్యాలు ఇలా వివరిం చాడు.

**"శ్రీమన్మాహాదేవ! దేవాదిదేవా!నిమగ్నీకృతాజాండభాండ ప్రకాశా! మహేశా! మహాయోగిపుంయోగ నిద్రాసమున్నిద్రితానందరూపా! భావార్లొనిధా నాంత రాపన్న తర్నాంత రీపా! జగద్దీప! నిర్లేప!బ్రహ్మాండపిండాండ బాహ్యాంతరాళంబులం బూర్ణమై సూక్ష్మ సూక్ష్మార్థమై స్వార్థమై యున్న నిన్నున్ మహామాయచే జీవునింజేసి మహ్యాది తత్త్వాత్మ కంచైన దేహంబు గేహంబుగా నిల్పి త్రైగుణ్యమున్ గణ్యమున్ బుద్ధ్యహంకార చిత్తంబులన్ జ్ఞాన కర్మేంద్రియంబుల్ షడంతర్విరోధముల్ ఘనక్లేశముల్ పాశముల్ కోశముల్ జన్మనాశాద్యవస్థల్ వృథా నీకు గల్పించి సత్కర్మ దుష్కర్మ బంధంబులంజిక్కి లామైహికాముష్మికానంద దుఃఖంబులం బొంది నిన్నాత్మ భావించునో నన్నియున్ లేమి యూహింపగా లేకలోకుల్ తమోంధీకృతా లోకులై పోవబోవం గృపామూర్తివై కాలదిగ్భాగ కైలాస శైలంబులన్ దివ్య లింగా కృతిన్ భూమి ప్రత్యక్షమై వేద వేదాంత విద్యాది తర్కోక్తులన్ గంతశోషంబుగా వాదముల్ సేయుచున్ బుద్ధి వైదగ్థి వేదదర్శనంబిచ్చకున్వచ్చు దానింబ్రతిష్ఠించు చున్ మంత్ర శాస్త్రార్థ చింతా పరిశ్రాంతమై గొంత కాలంబు నానావిధారాధనల్ సేయుచున్**

**సిద్ధనీరేజకూర్మాసనాభ్యాసనాడి సదాశోధనాయాసముంబొంది యాధార జాలంధ రౌడ్యాణ బంధంబుల బుట్టుచుంగుండలీ శక్తి వక్త్రం బవక్రంబుగా జేసి షట్చక్రికావీథి జేత స్సమేతంబుగా**

**వాయువున్ గ్రోలుచున్ దన్మనోగంధ వాహంబులన్ బ్రహ్మరంధ్రోపరి వ్యాపకంబైన సంవిన్మయాకాశ దేశాంత రోద్యత్పర బ్రహ్మచంద్రోదయ జ్యోత్స్న దాదాత్మ్యం బొందగా జేయుచుం బుత్రమిత్ర కళత్రంబులన్ శత్రు మిత్రంబులన్ శీతావాతాలపాదివ్యవస్థాది భేదంబు ఖేదంబు మోదంబు కృత్యంబకృత్యంబు హేయంబహేయంబునన్ లేక లోకంబులెల్లం బరబ్రహ్మరూపంబుగా చూచుచున్ స్వేచ్ఛ క్రీడించు వారల్ తుదింబొందు లాభంబు నీవై హరిబ్రహ్మకీటాది జంతు ప్రజంబుల్ వినోదంబుగా నిన్ను దర్శించినన్ ముక్తులన్ జేయుచున్ సత్యమై నిత్యమై జ్ఞానమై జ్ఞేయమై జ్ఞాతవైయున్న నిన్నుం బ్రశంసింప నేనెంత వాడన్? మదీయాపరాధంబు లేపట్టునన్ బట్టకే పూర్ణ బూర్ణకారుణ్య దృష్టిన్ననుం జూడవే భక్తవత్సాను గచ్ఛన్మరున్నైచకీ! భక్తలీలావని కల్పకా! భక్త సంతాన చింతామణీ! భక్త సంతోషవారాసి చంద్రోదయా! భక్తకోటీ విపద్గోత్రవజ్రాయుధా! భక్తసందోహ సంతాపహా! భక్త సంకల్పసంసిద్ధిరూపా! నమస్తే నమస్తే నమః**

ఈ దండకం లో షడ్దర్శనముల సారాన్ని కవి ఇమిడ్చాడు. నిజానికి ఇంత సూక్ష్మంగా భగవత్తత్వాన్ని వేదాంతపరంగా చెప్పిన ప్రబంధకారుడు మరొకడు లేడు. కవి దండకం మొదట కొన్ని సంబోధనలను వాడి భగవత్తత్వాన్ని చెప్పాడు. తర్వాత బ్రహ్మాండపిండాండములు రెండింట నిండినవాడిగా భగవంతుని కీర్తించాడు. ఇది వేదాంత విషయం. బ్రహ్మాండమనగా 14 లోకములు. పిండాండమనగా తల్లి గర్భమున పిండ రూపమున ఉండు శిశువు. ఇక్కడ బ్రహ్మాండ పిండాండములు రెండింటిని చెప్పడం వల్ల కవి భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని నిరూపించాడు. యోగిపుంగవుల యోగనిద్ర ఈతని నిమిత్తమే అని చెప్పి యోగము యొక్క అంతిమ లక్ష్యాన్ని వెల్లడి చేశాడు. తర్వాత భగవంతుని సంగము లేనివానిగా ప్రతిపాదించాడు. ఇది కూడా వేదాంతవిషయమే. అంతటా నిండి ఉన్న పరమాత్మను మాయ కారణంగా జీవుడు తెలుసుకోలేకపోతున్నాడని, నిజానికి భగవంతుడు తనలోనే ఉన్నాడని అభిప్రాయపడ్డాడు. ఈ తత్వం తెలియక జీవుడు పంచభూతములను, త్రిగుణములను, అహంకారమును, నిశ్చయాత్మక వృత్తిగల బుద్ధియను అంతఃకరణ బేధమును, స్వాత్మాభిమానరూపమగు అహంకారమును అంతఃకరణబేధమును, జ్ఞానకర్మేంద్రియాలను, అరిషడ్వర్గాలను, పంచక్లేశాలను, పంచకోశాలను, చావుపుట్టుకలును అనవసరంగా భగవంతునికి ఆపాదించి చూస్తున్నారని కవి భావించాడు. ఇవేవీ అతను కాదని కవి మనస్సు. జీవుడు ఇంతటితో ఆగక ఈశ్వరునికి, అకర్మునికి, సత్కర్మదుష్కర్మలను, బంధాలను అంటగడుతున్నాడని చెప్పాడు. అయితే భగవంతునికి దేనితోనూ సంబంధం లేదని, అతనిని తెలియడానికి వేదవేదాంత చర్చలు

గాని, అనవసరమైన శుష్కమైన తర్కవాదములు గాని, ఇతర దర్శనప్రతిపాదనలుగాని అవసరం లేదని ఖరాఖండిగా చెప్పాడు. నిర్మలమైన మనసుతో, నిష్కల్మషమైన బుద్ధితో అతనిని ధ్యానిస్తే అతని కోసం ప్రార్థన చేస్తే అతని సాయుజ్యం లభిస్తుందని చెప్పాడు. దీనికి సాక్ష్యంగా శ్రీ, కాళ, హస్తులను చూపించాడు. ఇదే దండకంలో కవి షట్చక్రాలను, వాటి ద్వార జాగృతమయ్యే కుండలినీ శక్తిని, తచ్ఛక్తి ద్వార తడిసే ఇడ పింగళాది నాడులను సైతం విమర్శ చేశాడు. ఇలా దండకమనే ఒకే ఒక బాణంతో కవి సర్వదర్శనఖండన చేశాడు. భగవంతుని తెలియడానికి జ్ఞానం అక్కరలేదని తేల్చి చెప్పాడు. నిజానికి ఇది వీరశైవ మార్గం. శ్రుతికి వ్యతిరేకమైనది కూడా.

## 8.23 నామకరణం

వేదము 16 సంస్కారాలను మనిషికి విధించింది. అందులో ఒకటి నామకరణం. అనగా మనిషికి పేరుపెట్టడం. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" ఖండ పరశుండును నఖండిత దయా మండిత వీక్షణంబుల బ్రత్యక్షంబై కమలజ తనూభవునకు ఋభువనెడి నామంబొనరింప" శ్రీ 2-88**

ప్రతిమనిషికి తప్పక జరుగు సంస్కారం ఇది. నిజానికి ఇతర మతాలలో కూడా ఈ సంస్కారమున్నది.

## 8.24 పూర్వజన్మ

వేదవేదాంతములు పునర్జన్మనంగీకరించినవి. పునర్జన్మ గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" కృతయుగ వేళమర్కటక కీటకమొక్కటి పూర్వవాసనా" శ్రీ 2-95**

**" ఆ పసిబిడ్డ లేమి జననాంతర వాసనయో!" శ్రీ 4-18**

**"కనకశలాకలందెగడు కన్యలు గట్టిన బొమ్మరిల్లు శం**
**భుని గుడి, బొమ్మశంకరుడు, బోనము గుజ్జనగూడు వేడ్క జే**
**సిన పనులన్నియున్ శివుని సేవ యొనర్పగ బిడ్డ పాట్లుగా**
**మనమున నూహసేయుదరు మానునె తొల్లిటి జన్మవాసనల్" శ్రీ 4-21**

**"సతత మీ మొగ వేట జలకంబులాడిన**
**బహుజన్మపాప జంబాల మెడలు" శ్రీ 4-117**

**"రారాదు మీకు గర్మములార!నిలుడని**
**పలికెడు గతి జపభాషలెసగ" శ్రీ 4-126**

నిజానికి శ్రీకాళహస్తి మాహాత్మ్యం లో చెప్పబడిన మూడు జంతువులు తన పూర్వజన్మలో చేసిన కర్మ వలననే ఈ జన్మలో మరణమొందినవి. పూర్వజన్మ గురించి వేదం ఇలా చెప్తున్నది.

**" అసునీతే పునరస్మాసుక్షుః**

**పునః ప్రాణమిహనో దేహిబోగమ్**

**జ్యో పశ్యేమ సూర్యముచ్చరంత**

**మనుమతే మృలయానః స్వస్తి" ఋ 10-9-9**

ఓ ప్రాణదాయక! పరమేశ్వర! మేము మరణించి మరొక శరీరాన్ని ధరించినపుడు కూడ మమ్ములను సుఖములు గల వారలుగా చేయుము. సూర్యుడు మిగిలిన దేవతలంతా మమ్మల్ని తర్వాతి జన్మలో కూడ కాపాడుదురుగాక. అని వేదవాక్యము. గజేంద్ర మోక్షమున చెప్పబడిన మొసలి ఏనుగులు. హిరణ్యాక్షహిరణ్యకసిపులు మొదలగువారంత పూర్వజన్మ లో చేసిన పాపం వల్లనే అలాంటి జన్మలెత్తారు. ఇలాంటి పూర్వజన్మసంబంధ కథలు భాగవతాది పురాణాలలో కోకొల్లలుగా కనబడతాయి.

## 8.25 దర్శనముల ప్రస్తావన

చాల సార్లు కవులు నేరుగా తమ కావ్యాలలో షడ్దర్శనాల ప్రస్తావన చేశారు. ధూర్జటి కూడా అనేకసార్లు అన్యాపదేశంగా షడ్దర్శన ప్రస్తావన చేసాడు. దండకంలో కూడా దర్శనఖండన చేసినట్లుగా మనం చూసాం.

**" అనిమిష కోటితామహరహంబునొనర్చు శివార్చనల్ మనం**

**బున నివసింప మౌనులు తపోవిభవంబులు రోయయోగవా**

**సనబడి పొర్లువారు తమ జన్మము దిట్టుకొనంగ నన్యద**

**ర్శన రతులెల్లమాసమయసంగతి చాలునటంచు నెంచగన్" శ్రీ 4-106**

కీటమునకు, పామునకు, ఏనుగుకు పరమేశ్వరుడు సాయుధ్యమొసగిన సమయంలో కవి ఈ పద్యాన్ని చెప్పాడు. మునులు తమ తపస్సులను తామే నిందించుకున్నారట. ఇతర దర్శనములందు ప్రీతి గలవారు తమ సిద్ధాంతముల ప్రసంగమింతతో జాలునని భావించారట. ఇక్కడ ఇతర దర్శనములనగా ఆరు ఆస్తికదర్శనములు, ఆరు నాస్తిక దర్శనములు. సాంఖ్యవైశేషిక న్యాయయోగ పూర్వోత్తర మీమాంసలు ఆస్తికదర్శనములు.

**" పాణినేర్జైమినేశ్చైవ వ్యాసస్యక పిలస్యచ**

**కణాదశ్చాక్షపాదస్య, దర్శనాని షడేవహి" సూ, ని 6-22**

(చార్వకము, బౌద్ధము, జైనము, అర్హతం, దిగంబరం, సౌమములు నాస్తిక దర్శనములు.)

## 8.26 యోగం – హఠయోగం , రాజయోగం, కుండలినీ యోగం

ప్రతి ప్రబంధకవి తప్పక యోగదర్శనం గురించి ప్రస్తావించాడు. చాలమంది హఠరాజకుండలినీ యోగాలను చెప్పారు. ధూర్జటి ఏఏచోట్ల యోగాన్ని చెప్పాడో ముందు చూద్దాం.

**" శిఖితీర్థాశ్రిత యోగీశ్వర మానససంవిత్సుఖి"**

**" హఠయోగార్థాకృతివని కుండలి చేమారుతముధరింతురు" శ్రీ 2-153**

యోగము రాజయోగం, హఠ యోగమని రెండు విధములు. హఠయోగము క్రియావిశేషముల చేత మాత్రమే సాధించదగ్గది. రాజయోగము భావన ద్వార సాధించదగ్గది. ఈ విషయం వాచస్పతీయం లో ఇలా చెప్పబడింది.

**" ప్రాణయామాదిక్రియాభ్యాసజే రాజయోగంవినైవ పరమాత్మ సాక్షాత్కార రూపే చిత్త వృత్తి రోధాత్మకే యోగే యోగశ్చ ద్వివిధః హఠయోగః రాజయోగశ్చ తత్ర హఠయోగః క్రియా విశేషసాధ్యః హఠయోగ దీపికా దావుక్తప్రకారః రాజయోగస్తు భావనావిశేషసాధ్యః పాతంజలా వుక్తః" వాచస్ప 5-22**

తర్వాత ఈ రగడనందు కుండలినీ శక్తి చెప్పబడింది. కుండలినీ అనగా పాము రూపమునందుండు యోగశక్తి. ఇది గుదస్థానమున మూడున్నర చుట్టులు చుట్టుకొని నిద్రాణమై ఉండును. యోగి తన సాధనద్వార దీనిని జాగృతం చేసి, సహస్రారాన్ని చేరుకునే దాక యోగము చేస్తాడు. దీని వల్ల సుధావృష్టి కురిసి 72000 నాడులు తడిసి ముద్దవుతాయి. దీనినే జీవన్ముక్తి అంటారు. దీనిని గురించి వాచస్పతీయం ఇలా చెప్తున్నది.

**" భుజంగాకార రూపేణ, మూలాధారసమస్థితా**

**శక్తిఃకుండలినీ నామ, బిసతంతు నిభాశుభా" వా 3-32**

ఇది అందరూ సాధించదగ్గది కాదు. అందరికి అనుకూలమైనది కాదు. కొందరికి మాత్రమే సాధ్యము. సరైన గురువు దీనికి అవసరం.

## 8.27 ఉపనిషత్తులు

ఉపనిషత్తునకే వేదాంతమని మరొక పేరు. దీన్ని కవి ఇలా చెప్పాడు.

**"సంతోషంబున గాంచె దిన్నడు సమస్త వ్యాపకానంత వే**

**దాంతస్థాపిత చిన్మయాంగము నవిద్యాధ్వాంత సంతాన సం" శ్రీ 1-63**

తిన్నడు సర్వమునందు వ్యాపించిన, అంతము లేనిదనయిన, ఉపనిషత్తులచే స్థాపించబడిన చిన్మయస్వరూపమగు లింగమును దర్శించాడని దీని భావం. ఉపనిషత్తులు చాల చోట్ల భగవంతుని లక్షణాలను చెప్పాయి. కొన్ని ఉపనిషత్తులు శైవసంబంధమైనవి. కొన్ని విష్ణు సంబంధమైనవి. ఐతే భగవంతునికి ఉపనిషత్తులుపయోగించిన ఉపమానములు మాత్రము అన్నింట ఒకే రకముగా ఉన్నవి. ఒక సూర్యుడు తానొక్కక్కడికి ఒక్కో రకంగా కనపడినట్లు ఒక దేవుడినే ఒక్కొక్కరు ఒక్కో రకంగా వీక్షిస్తారని, నిజానికి భగవంతుడు నిర్గుణుడు, నిరాకారుడు అని ఉపనిషత్తులు ప్రతిపాదన చేస్తాయి. భగవంతునికి రూపంగాని, లింగం గాని లేవని చెప్పడానికే లింగోద్భవం జరిగినది. అందుకే వేదాంత ప్రతిపాదిత చిన్మయానంద రూపంగా కవి లింగాన్ని చెప్పాడు.

## 8.28 త్రిపుండ్రములు

విశిష్టాద్వైతులెలా పుండ్రములను ధరిస్తారో అద్వైతులు కూడా అలాగే పుండ్రములను ధరిస్తారు. ఈ విషయాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" పంచాక్షరీ పూత భసిత త్రిపుండ్రాంకి**
**తాంగ భాగములు స్నానార్ద్ర శిఖియు**
**గ్రమ కృత గ్రంథి సూత్ర ప్రోత రుద్రాక్ష**
**భూషణంబులు శైవభాషణములు**
**నాగుల్ఫ లంబమానాంబు శోణంబైన**
**పోత్రంబు నుపవీత సూత్రములును**
**గరగృహీతాభిషేక క్షీర సంపూర్ణ**
**భాండంబుబుష్ప కరండకంబు**
**గుండ బొజ్జయు నొకపాటి గుజ్జురూపు**
**నుత్తరీయంబు దనరంగ యోగి హృదయ**
**గోచరుని గొల్వ శివచిహ్న గోచరాంగు**
**డొకడు వచ్చె శివబ్రాహ్మణోత్తముండు" 3-94**

కవి ఆలయ పూజారిని వర్ణిస్తూ చెప్పిన శ్లోకం ఇది. త్రిపుండ్రములను భస్మముతో దేహావయవములు 15 స్థానములలో ధారణ చేస్తారు అద్వైతులు. దీన్ని గురించి సిద్ధాంతశిఖి గ్రంథంలో ఇలా చెప్పబడింది.

**" త్రిపుండ్రంధారయేన్నిత్యం భస్మనాన సజవేనహి**
**స్థానేషు పంచదశషు, శరీరేసాధకోత్తమః**
**ఉత్తమాంగేలలాటీచ, శ్రవణ ద్వితయే తథా**
**గలే భుజద్వయేనైవ, హృదినాభౌచవృష్ఠకే**
**బాహుయుగ్మే కకుద్దేశే, మణిబంధద్వయేతథా**
**త్రిపుండ్రం భస్మణాధార్యం, మూలమంత్రేణసాధకైః" సిద్ధాం 4-14**

నుదురు, చెవులు, కంఠం, భుజశిఖరములు, హృదయము, నాభి, వీపు, బాహువులు, మూపు, మనికట్టుల యందు త్రిపుండ్రములను ధరించాలని దీని భావం. ఇదే పద్యంలో కవి షోడశ సంస్కారములలో ఒకటైన ఉపవీతాన్ని గురించి కూడా చెప్పారు.

## 8.29 జగన్మిథ్య

అద్వైతులు తమమతంలో" బ్రహ్మసత్యం జగన్మిథ్య" అని చెపుతారు. ఇదే విషయాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" మీ పూర్ణంబగు దివ్యతేజము జగన్మిథ్యాత్మకత్వ ప్రతి**
**ష్ఠాపారీణత జూసి మమ్ము బొదవంజాంచల్య దూరంబులై**
**చూపుంజిత్తము మిన్నకున్నయవి యిచ్చోబాసె దేహంబు పై**
**దీపుంజీకటి యింతకంటె వరమేది? యిట్లుమన్నింపవే" 3-123**

చాల మందికి జగన్మిథ్యత్వం అర్థం కాదు. కంటికి జగత్తు కనబడుతుండగా అది మిథ్య, మాయ ఎలా అవుతుందని ప్రశ్న చేస్తారు. అందుకు అద్వైతం పారమార్థిక సత్యం, వ్యవహారిక సత్యం అనబడు రెండు ప్రతిపాదనలు చేసింది. పారమార్థిక సత్యమనగా నిత్యం ఉండునది. మార్పుచెందనిది. వ్యవహారిక సత్యం అనగా కేవలం వ్యవహారంలోనే ఉండేది. మార్పు చెందే స్వభావం కలది. ఇదియే ప్రపంచమునందున్నది. అందుకే జగన్మిథ్య బ్రహ్మసత్యం.

## 8.30 జీవాత్మ – పరమాత్మ

ధూర్జటి అద్వైతి. చాల చోట్ల ద్వైతవిశిష్టాద్వైతాలను అతడు ఖండించాడు. ద్వైతవిశిష్టాద్వైతులు **" అహం బ్రహ్మాస్మి"** అనే సిద్ధాంతాన్ని అంగీకరించరు. ద్వైతుల మతం ప్రకారం జీవుడు దేవుడు కాడు. కాలేదు. ద్వైతవిశిష్టాద్వైతులు విష్ణువును మాత్రమే దేవునిగా అంగీకరిస్తారు. ఇతరులను అనగా శివబ్రహ్మాదులను కేవల జీవులగానే భావిస్తారు. అద్వైతం విష్ణువును కూడా అంగీకరిస్తుంది. దైవం ఏరూపంలో ఉన్న అద్వైతులకు సంబంధం లేదు. నిజానికి అద్వైతం ప్రకారం దైవానికి రూపమే లేదు. **"నేనే భగవంతుణ్ణి"(అహం బ్రహ్మాస్మి)** అనే భావన అద్వైతం లో ప్రధానమైనది. ఈ భావనను కవి ఇలా ప్రస్తావించాడు.

**" జగములనంతరాత్మయును సాక్షియు నీవనుచున్నిజంబుగా**
**నిగమములాడగా వినియు నేడితరంబుగ మాకభీప్సితం**
**బగు వరమెట్లు వేడ గలమయ్య, భవన్మయమైన పూర్ణచి**
**ద్గగనములో మముంగలిపి క్రమ్మరు బుట్టెడు బాధమాన్పవే" శ్రీ 3-124**

జగములు, అంతరాత్మ, సాక్షి నీవే అని కవి చెపుతున్నాడు. ఛాందోగ్యోపనిషత్తు " తత్త్వమసి" అని అంటున్నది. అనగా అది నీవై ఉన్నావని అర్థము. అది అనగా బ్రహ్మము. పరమాత్మ.

## 8.31 ముక్తిబేధాలు

సాలోక్యసామీప్యసాయుజ్యసారూప్యాలు ముక్తిబేధాలు. వీటిని కవి ఇలా చెప్పాడు.

**" ఆనందామృతవారిని**
**ధానంబున మనము మగ్నతంబొందెవరం**
**బీ బమరినదాదాత్మ్యం**
**బోనిరుపాధికదయాసముజ్జ్వల యీవే" శ్రీ 3-127**

ఇక్కడ చెప్పబడిన తాదాత్మ్యం సాయుజ్యం.

**" వనగార్హస్థ్యం కాళహస్తిపురదైవంబిచ్చెసాయుజ్యము" శ్రీ 3-222**

అద్వైతులు సాయుజ్యాన్ని మాత్రమే అంగీకరిస్తారు గనుక కవి రెండు సార్లు సాయుజ్యాన్నే చెప్పాడు. వీటిని శీధరీయం ఇలా చెప్తున్నది.

**" సాలోక్యం మయా సహ ఏకస్మిన్ లోకే వాసం , స్పార్టి సమానైశ్వర్యమ్, సామీప్యం నికట వర్తిత్వం, సారూప్యం సమాన రూపతామ్, ఏకత్వమ్సాయుజ్యమ్" శ్రీధ 4-52**

**సాలోక్యం** – సమానలోక నివాసం సాలోక్యం. విష్ణుపక్షమున వైకుంఠలోకనివాసం. శివుని పక్షమున కైలాసనివాసం

**స్పార్టి** – సమానైశ్వర్యం కలిగి ఉండడం. విష్ణు పక్షమున విష్ణువుతో సమానైశ్వర్యం కలిగి ఉండటం. శివ పక్షమున శివునితో సమానమైన ఐశ్వర్యం కలిగి ఉండడం.

**సామీప్యం** – విష్ణు సమీప వర్తిత్వం లేదా శివ సమీప వర్తిత్వం.

**సాయుజ్యం** – ఏకత్వం విష్ణుసాయుజ్యం లేద శివసాయుజ్యం.

ఈ మోక్షభేదాలను వైష్ణవులు వైష్ణవపక్షంగాను, శైవులు శైవపక్షంగానూ గ్రహిస్తారు. అద్వైతులు సాయుజ్యాన్ని మాత్రమే మోక్షంగా పరిగణిస్తారు.

## 8.32 ఉభయకర్మలు

ఇవి ఉత్తరమీమాంసకు సంబంధించినవి. వీటిని గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" అనర్గళాపవర్గంబగునప్పురంబునిర్గమించి,కొన్ని పయనంబులుచని, విక్రమసింహనగరాసన్నయగు పెన్నయు దీర్ఘయాత్రా పరులకు సురతరువు కొమ్మయగు గుండ్లకమ్మయు సుకృతీ భూతపాతకశ్రేణీయగుకృష్ణవేణియుగమూలాన లోత్తుంగ సంగతరంగయగు గౌతమీగంగయుగక్కు టేశ్చర పీఠంబగు పీఠికాపురంబునకు సంహోమతంగసింహంబగు సింహాచలంబును, విదళితోభయకర్మంబగు" శ్రీ 4-188**

కర్మలు త్రివిధములు. ఆగామి, సంచిత, ప్రారబ్ధములనునవి. వీనిలో ప్రారబ్ధకర్మము భవము చేత నశించును. నాగామి, సంచిత కర్మలు రెండు శ్రీకూర్మమును దర్శించగానే నశిస్తాయని కవి భావం.

## 8.33 షడ్దర్శనములు

షడ్దర్శనములను కవి ఇలా ప్రస్తావించాడు.

**" సకల వేదామృత జలధి గండూషించి**
**డప్పినంగేక్షవుల్ చప్పి చప్పి**
**నిగమార్థ ధనమాత్మ జగతి నిక్షేపించి**
**న్యాయఫలంబులునమిలినమిలి**
**ధర్మశాస్త్ర మహౌషధములు నూరుక త్రావి**
**బహుళ పురాణ కూపములు ద్రవ్వి**

**యోగార్థ సాధన ఉల్లంబు పాసించి**

**పరమత గాంగేయమెరసి చూచి**

**తపము లొనరించి పుణ్యతీర్థములు దిరిగి**

**వ్రతములన్నియు జేసినవారు శివుని**

**నెరుగరీ చెలదీపామిని భ్రమునెరుకు**

**నెరిగి పూజించి ముక్తులై రెట్లనంగ" శ్రీ 4-137**

పై పద్యం లో కవి మొదటి పాదంలో వేదవేదాంగాలను చెప్పారు. తర్వాతి పద్యంలో న్యాయశాస్త్రాన్ని ప్రస్తావించాడు. తర్వాత షట్తర్కములను పేరుతో సాంఖ్యయోగాది మతాలను చెప్పాడు. అయితే ఇందులో న్యాయమును కవి ముందుగానే చెప్పినాడు. కాన వ్యాకరణం కలిపి షడ్దర్శనములని చెప్పివుండవచ్చు. తర్వాత ధర్మశాస్త్రాలను, పురాణాలను ప్రస్తావించాడు. వీటిన్నింటినీ చదివినప్పటికీ చాలమంది శివుని తెలుసుకోలేకపోతున్నారని కవి భావం.

## 8.34 ద్వైతమతఖండన

పురాతన కాలం నుండి అద్వైతద్వైతవిశిష్టాద్వైతముల మధ్య వాదములు జరుగుతునే ఉన్నవి. వీరిలో ఎవరి మతం వారికి గొప్ప. అద్వైతమతమునకు ప్రాధాన్యతనిచ్చే ధూర్జటి ద్వైతమతాన్ని ఇలా ఖండించాడు.

**" నీవారాగ్ర శిఖాంతచిద్రసమయా! నీవారముష్టింప చా**

**త్మావా నస్థిత దేవ! షట్సమయనాథారూఢ! బేధ ప్రతి**

**ష్ఠావష్టంభ విజృంభితానని కార్యద్వాః కవాటా! మహా**

**దేవా! జన్మహరావిపల్లవ దశాదిక్లేశ సంహారకా! శ్రీ 4-204**

బేధప్రతిష్ఠావష్టంభ విజృంభితానని కార్యద్వాః కవాటా" అనే సమాసానికి జీవేశ్వర బేధస్థాపన గర్వముచేత విజృంభించిన ద్వైతవాదుల నోళ్ళనెడి గృహములకు తలుపయినవాడా అని భావం. ఈ సమాసం ద్వార కవి ద్వైతవిశిష్టాద్వైత మతాలను ఖండించాడు.

## 8.35 తాపత్రయాలు

తాపత్రయాలను కవి ఇలా ప్రస్తావించాడు.

**" బంధత్రయనాశక! భవ**

**బంధాదికబంధరాశి బంధన విద్యా**
**బంధుర! సమస్త భూత**
**స్కంధావారేశ! భక్త కల్పమహీజా!" శ్రీ 4-205**

బంధత్రయాలనగా తాపత్రయాలు. అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికములనేవి తాపత్రయాలు. అధ్యాత్మికతాపం మనిషి చేసే పనులు ద్వార అతనికి కలుగునది. అధిభౌతికము ప్రపంచము వల్ల మనిషికి లభించేది. అధిదైవికం భగవంతుని వల్ల మనిషికి కలుగునది. ఈ విధంగా కవి దర్శనముల ప్రస్తావన చేశాడు. అయితే కవి చాల చోట్ల వేదాలను, వేదాంతమును కూడా వ్యతిరేకించి వీరశైవాన్ని ప్రతిపాదించడానికి ప్రయత్నాలు చేశాడు. సఫలత సాధించాడు కూడ.

## 9. ప్రభావతి ప్రద్యుమ్నం – షడ్దర్శన ప్రభావం

పింగళిసూరన రాసిన రెండవ ప్రబంధం ప్రభావతి ప్రద్యుమ్నం. ప్రభావతి ప్రద్యుమ్నం దర్శన ప్రభావాన్ని పాక్షికంగా కలిగి ఉన్నది. పింగళి సూరన విశిష్టాద్వైతి కావడం వల్ల ఆ ప్రభావం ఆతని రెండు ప్రబంధాలపైన పడింది. సూరన ప్రభావతి ప్రద్యుమ్నంలోని మొదటి పద్యం ఇలా ఉన్నది.

**" శ్రీమ దుమా మహేశు లతిచిత్ర విలాసులు తారు మున్ వియో**
**గామిత చింత నొందురులకై మౌటలు నిచ్చ దెల్పు కాం**
**క్షా మహిమంబుచే జెరి సగంబుగ నొక్క యొడల్ ధరించు స**
**త్ప్రేమపు దంపతుల్ కృతిపతిన్ దనరింతురు గాత గీర్తులన్"** ప్ర 1-1

ఇక్కడ కవి లక్ష్మీ సమేత నారాయణుణ్ణి స్తుతించాడు. ఇది విశిష్టాద్వైత సంప్రదాయం . విశిష్టాద్వైతులు కేవల నారాయణుణ్ణి అంగీకరించరు. నారాయణుడు లక్ష్మీ సమేతుడయినప్పుడే విశిష్టాద్వైతులు అతనిని అంగీకరిస్తారు. అందుకే కవి ఇలా స్తుతించాడు. తర్వాత శంఖచక్రాది పంచాయుధాలను కవి స్తుతించడానికి కూడా విశిష్టాద్వైతమతమే కారణం.

## 9.1 గౌతముడు

గౌతముడు న్యాయదర్శనకర్త. గొప్ప తత్వవేత్త. వాదప్రతివాదనలు ఇతని మతానుసారమే జరుగుతాయి. గౌతమ మునిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" వాదున గెల్వ లేక పురవైరి లలాటము కన్ను సూప దా**
**బాదమునందు గన్ను ప్రతిపక్షత జూపెను. శాస్త్రమున్ బ్రమా**
**ణాది పదార్థ తత్త్వ కథనాత్మకమున్, రచియించె నాత్మ సం**
**వేదనకై, మునుల్ కులపవిత్రుని గౌతము బోల నేర్తురే "** ప్ర 1-12

గోతమ మహర్షికి అక్షపాద అను నామాంతరం ఉన్నది. వాచస్పత్యంలో గోతమునికి సంబంధించిన ఐతిహ్యం ఒకటి ఉన్నది. వ్యాసుడు గోతముని శిష్యుడు. అతడు తన గురువు యొక్క మతమునకు విరుద్ధముగా బ్రహ్మైక్యమును, అనగా అద్వైతమును నిరూపించాడు. అందుకు గోతముడు కోపించి నీ ముఖమును నేను కన్నులతో చూడను. అని నిరాకరించాడు. వ్యాసుడు పలు విధాలుగ వేడుకొనగా ఎట్టకేలకు గోతముడాతని అనుగ్రహించాడు. కాని తన ప్రతినకు భంగం లేకుండా శిష్యుని చూడ తలచి, తన తపోమహిమచే తన పాదమునందొక నేత్రమును సృష్టించి, దానితో వ్యాసుని చూసాడు. అప్పటి నుండి గురువుకు అక్షపాద అను పేరు కలిగెను. గోతముడు రాహుగణ మహర్షి కుమారుడని,

విదేహ రాజైన జనకుని వద్ద పురోహితుడని, శథపథ బ్రాహ్మణంలో ఉన్నది. శ్రీమద్వాల్మీకి రామాయణంలో బాలకాండలో గోతమ ఆశ్రమము వర్ణింపబడినది. అతడే ఈ దర్శనకర్త అని అనవచ్చును. బౌద్ధమత ప్రవర్తకుడైన గోతముడు న్యాయదర్శనకర్త కంటే భిన్నుడు. ఇలాగే జైన మతానుయాయి ఐన గోతముడు కూడా భిన్నుడే. న్యాయదర్శనకర్త వేదప్రామాణ్యాన్ని అంగీకరించినవాడు. పై పద్యమున అక్షపాదుని గురించి వర్ణితమయినది. తర్వాత కవి పదార్థతత్వములను ప్రస్తావించాడు. న్యాయ దర్శనమున పదహారు ప్రమాణాలు చెప్పబడినవి. అవి 1.ప్రమాణం, 2.ప్రమేయం, 3.సంశయం, 4.ప్రయోజనం, 5.దృష్టాంతం, 6.సిద్ధాంతం, 7.అవయవం, 8.తర్కం, 9.నిర్ణయం, 10.వాదం, 11.జల్పం, 12.వితండం, 13.హెత్వాభాసం, 14.ఛలం, 15.జాతి, 16.నిగ్రహస్థానం . తర్వాతి పద్యంలో కవి కృతికర్తకు, గౌతమునికి సమానోపపత్తిని ప్రతిపాదించాడు.

## 9.2 యజ్ఞం

యజ్ఞం వేదం ప్రతిపాదించిన విషయం. ఇది ఒక విశిష్టమైన హిందూ సంప్రదాయం. భారతదేశంలో పురాతన కాలం నుండి అనేక రకాల యజ్ఞాలు కొనసాగాయి. దేవతలకు తృప్తి కలిగించడం ఈ యజ్ఞం లక్ష్యం. దీనిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" అక్షయ్యం బగు పెంపు దాల్చును దపో యజ్ఞ క్రియాదుల్ యదీ**

**య క్షేమంకర నామ సంస్మరణ పుణ్యవ్యాప్తి పుండరీ**

**కాక్షుండచ్యుత డాది పూరుషుడు ప్రత్యక్షాకృతిం దానె సం**

**రక్షింపన్ బెను పొందు యజ్ఞ మునకున్ బ్రాశస్త్య మింకే మునన్" ప్ర 1-100**

దేవతలకు తృప్తి కలిగించడం ఈ యజ్ఞం లక్ష్యం. సాధారణంగా యజ్ఞం అనేది అగ్ని వద్ద వేదమంత్రాల సహితంగా జరుగుతుంది. ఇందుకు అనుబంధంగా అనేక నియమాలు, సంప్రదాయాలు ఉన్నాయి. అగ్నిహోత్రం అనేది యజ్ఞంలో ముఖ్యమైన అంశం. యజ్ఞంలోని అగ్నిలో వ్రేల్చినవి అన్నీ దేవతలకు చేరుతాయి. వైదిక యజ్ఞంలో అధ్వరుడు ప్రధానార్చకుడు. అతని అధ్వర్యంలోనే అన్ని కార్యక్రమాలు జరుగుతాయి. అతనికి సహాయంగా అనేకమంది అర్చకులు, పండితులు ఉంటారు. "హోత" ఆహుతికి పూర్వం మంత్రాలను పఠించి, దేవతలను యజ్ఞభూమికి

తీశుకువస్తాడు. "ఉద్గాత" వేదమంత్రాలను చదువుతాడు. " బ్రహ్మ"గా నియమితుడయిన వ్యక్తి హోతాధ్వర్యుల కార్యక్రమాలను పర్యవేక్షిస్తాడు. యజ్ఞాలు ముఖ్యంగ మూడు రకాలు. అవి

1. పాకయజ్ఞాలు 2. హవిర్యాగాలు 3. సోమసంస్థలు

**పాకయజ్ఞాలు మరల ఏడు విధాలు**

1. ఔపాసన

2.స్థాలీపాకము

3.వైశ్వదేవము

4. అష్టకం

5. మాసశ్రాద్ధము

6. సర్పబలి

7. ఈశానబలి

**హవిర్యాగాలు మరల ఏడు రకాలు**

1. అగ్నిహోత్రాలు

2. దర్శపూర్ణిమాసలు

3. అగ్రయణం

4. చతుర్మాస్యాలు

5. పిండపితృయజ్ఞాలు

6. నిరూఢ పశుబంధం

7. సౌత్రామణి

**సోమసంస్థలు మరల ఏడు రకాలు**

1. అగ్నిష్టోమం

2. అత్యగ్నిష్టోమం

3. ఉక్థము

4. అతిరాత్రం

5. ఆప్తోర్యామం

6. వాజపేయం

7. పౌండరీకం.

ఇవన్నీ ఆయా సందర్భాలలో చేస్తూ మనుష్యుడు తనకు కావలిసిన ధనధాన్యాలను, అన్నపాణాలను, సుఖసౌఖ్యాలను, పుత్రపౌత్రాదులను పొందుతున్నాడు.

## 9.3 భూతపంచకం

ఈ ప్రపంచము, మానవశరీరం పాంచభౌతికం. ఈ పంచ భూతాలను కవి ఇలా ప్రస్తావించాడు.

**" నిఖిల దేశయాత నృపతి భూపాకర్ష**
**రేణు సంపోషిత క్షోణికంబు**
**మహి తావభృథ లాభ మహిమ ధన్యత్వభా**
**గ్జలదర్శి తాపూర్వ సౌష్టవంబు**
**పరమంత్ర తంత్ర హవ్య ద్రవ్య సాద్గుణ్య**
**సంభృతానల నవౌజ్జ్వల్యకంబు**
**సన్నుత సాన్నాయ్య సౌరభ్య సంపదా**
**ధ్యంభవిష్ణు ప్రహూ తానిలంబు**
**హోమధూమానురంజితంబు ద్యోతలంబు**
**నగుచు వసుదేవు నధ్వర మతిశయిల్లె**
**భవ్యలీల మహాభూత పంచకమున**
**కొక్కొక విశేష మొసగుచు నొప్పుమీరి" ప్ర 1-99**

పృథివ్యప్తేజోవాయురాకాశాలు పంచభూతాలు. ఈ పంచభూతాలను ఆరు దర్శనాలు అంగీకరించాయి. అవసరమైన చోట్ల వాటిని ప్రస్తావించాయి. యోగం మన శరీరంలో ఉండే చక్రాలకు పంచభూతాలకు సంబంధం ఉన్నదని చెపుతున్నది. యోగం ప్రకారం మూలాధారచక్రంలో పృథ్వీభావము, స్వాధిష్టాన చక్రంలో జలతత్వం, మణిపూరక చక్రంలో అగ్నితత్వం, అనాహత చక్రంలో వాయుతత్వం, విశుద్ధచక్రంలో ఆకాశతత్వం, అజ్ఞాచక్రంలో ఆకాశతత్వము దాగి ఉన్నవి. న్యాయదర్శనం ఈ పంచభూతములకు వరుసగా శబ్ధస్పర్శరూపరసగంధ గుణములుంటాయని చెప్పింది. పూర్వోత్తరమీమాంసలు మానవ శరీరము పాంచభౌతికమని పలుచోట్ల ప్రస్తావించాయి.

## 9.4 వేదాలు

వేదాలు పూర్వమీమాంస దర్శనంలోనికి వస్తాయి. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" వేద సౌరభములు వెదజల్ల గల శుచి**
**బ్రాహ్మణజాతి కోరకములార!" ప్ర 1-104**

హిందూమతంలో అత్యంత మౌలికమైన ప్రమాణంగా వేదాలను గుర్తిస్తారు. వేదములను శ్రుతులనీ, ఆమ్నాయములనీ అంటారు. "విద్" అనే ధాతువు నుండి వేదం పుట్టినది. విద్ అనగా తెలుసుకోవడం అని అర్థం. వేదాలు ఒకరి చేత రాయబడినవి కావు. బ్రహ్మ ఉచ్చరించగా మునులు వీటిని విని నేర్చుకుని, మరల తమ శిష్యుల దగ్గర చదివారు. వారు వాటిని నేర్చుకుని తమ శిష్యుల దగ్గర చదివారు. ఈ విధంగా వేదం చాల కాలం కేవలం వినడం, చదవడం ద్వారానే వ్యాప్తి చెందింది. తర్వాత తర్వాత లిఖిత రూపం లో అందుబాటులోనికి వచ్చాయి.

## 9.5 శ్రౌతస్మార్తములు

శ్రౌతస్మార్తములను గురించి కవి ఇలా ప్రస్తావించాడు.

**" శ్రౌతస్మార్త పథానువర్తన పరిష్కారాత్మ వర్ణాశ్రమ**
**స్ఫీతాచార పవిత్రమూర్తి, శమ గాంభీర్య క్షమా సత్య ని**
**ష్ఠాతుష్ట్యాది గుణోరుకీర్తి సముదంచ న్నీ తివిద్యా మహా**
**చాతుర్యాపర కావ్య డార్యజనతా సంభావ్య దత్యంతమున్" ప్ర 3-152**

స్మార్తం అనేది ప్రధానమైన వేదశాఖలలో ఒకటి. వేదాలను, శాస్త్రాలను అనుసరించేవారిని స్మార్తులు అంటారు. స్మార్తులు ప్రధానంగా ఆదిశంకరాచార్యులు ప్రవచించిన అద్వైతవేదాంతానికి

ప్రాధాన్యతనిస్తారు. అయితే వీరు ఇతరమతాలని, ఇతర విషయాలను ప్రస్తావించిన, అనుసరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. స్మార్తులు సంధ్యావందనం, జపం, అగ్నిహోత్రం, అమావాస్యతర్పణం, శ్రాద్ధం మొదలైన నిత్యకర్మలను తప్పక ఆచరిస్తారు. సాంప్రదాయకంగా స్మార్తులు కూడా శ్రౌత సంప్రదాయాన్ని అనుసరిస్తారు. ఇదే పద్యంలో కవి వర్ణాశ్రమాలను కూడా ప్రస్తావించాడు. వీటిని కూడా వేదమే ప్రతిపాదించింది.

## 9.6 షడ్దర్శనాలు

కవి ఈ క్రింది పద్యంలో ఆరు దర్శనాలను ఇలా ప్రస్తావించాడు.

**" కాణాదంబును, గౌతమీయమును, సాంఖ్యంబును, భుజంగాగ్రణీ**
**వాణీమార్గము, జైమినీయమతమున్, వ్యాసోక్త శాస్త్రంబు వ**
**క్కాణించెన్, గడు బూర్వపక్షముల జోకన్ బెంచుచున్, బెంచి య**
**క్షీణప్రౌఢి దిరస్కరింపుచు దుదిన్ సిద్ధాంతముల్ నిల్పుచున్" ప్ర 1-61**

**" స్వమతి ప్రౌఢి దృఢానుమానముల సంస్థాపించు, నే వేళ నె**
**ద్ది మతం, బప్పుడు వాని వానికి నుపాదిగ్ర స్తతా వ్యాప్తిభం**
**గ ముఖానేక సుదూషణంబుల వెసం గల్పించు దానన్యశా**
**స్త్రమతస్థాపనవేళ, నవ్విహగి దైత్యశ్రేష్ఠజోహో యనన్" ప్ర 1-62**

శుచిముఖి తన అఖండ పాండిత్యమును ప్రదర్శించి, వజ్రనాభుని మొప్పు పొందే సందర్భంలోనిది ఈ పద్యం. కాణాదమనగా కణాదుని వైశేషికదర్శనం, గౌతమీయం అనగా గౌతముని న్యాయదర్శనం, సాంఖ్యం అనగా కపిలుని సాంఖ్యదర్శనం, భుజంగాగ్రణీ వాణీమార్గమనగా యోగదర్శనం, జైమినీయమనగా పూర్వమీమాంసము, వ్యాసోక్తశాస్త్రమనగా ఉత్తరమీమాంస దర్శనం. శుచిముఖి ఈ ఆరుదర్శనములలోనూ తన పాండిత్యాన్ని ప్రదర్శించి, ఇతరుల వాదాన్ని పూర్వపక్షం చేసింది. తన మతాన్ని, సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అజేయురాలైనదని కవి భావం.

## 9.7 ప్రాణవాయువులు

ప్రాణ, అపాన, ఉదాన, సమాన, వ్యాన అనేవి ప్రాణవాయువులు. వీటిని కవి ఇలా ప్రస్తావించాడు.

**" నీదు లలితోతువుల్ నెమ్మి నొత్తడి యోస**
**నొడలిలో బ్రాణ వాయువులు నా కిందాక" ప్ర 5-155**

ఇవి యోగశాస్త్రసంబంధమైనవి. యోగమున గల ప్రాణాయామంలో ఈ వాయువుల ఉపయోగం అధికం. ఈ వాయువులు మానవ శరీరంలో అనేక చోట్ల విస్తరించి ఉన్నాయి. ఇవికాక ధనంజయ, నాగ, కూర్మ ఉపవాయువులు కూడా యోగమున చెప్పబడ్డవి.

## 9.8 గర్భాదానం

మనిషికి హిందూధర్మం పదహారు సంస్కారాలను విధించింది. ఇవి అత్యంత ప్రధానమైనవి. ప్రాముఖ్యత కలిగినవి. వీటిలో ఒకటైన గర్భాదానాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" రమణ దలిర్పగ ఋతువు రాకలు దక్కె, నొడళ్ళు చిక్కె జి**
**ట్టుము లుదయించె, వేవిళు లనూనత మించె గపోలసీమ బాం**
**డిమ గనుపట్టె జన్మొనల నీలిమ పుట్టె వలగ్నముం గురు**
**త్వము పొరసెన్, వళుల్ విరిసెదానవ కన్యలకున్ గ్రమంబునన్"** ప్ర 5-185

ఇక్కడ ప్రభావతి, చంద్రవతి, గుణవతులు ముప్వురు గర్భము దాల్చారను విషయం అన్యాపదేశంగా చెప్పబడింది. గర్భాదానం షోడశసంస్కారములలో మొదటిది. స్త్రీపురుషుల తొలి సమాగమంలో జరిపే తంతు ఇది. వారిరువురికి మధ్య ఉత్తమ సంతానం కలగాలని మంత్రాలతో పురోహితులు వారిని ఇందులో ఆశీర్వదిస్తారు. ఈ విధంగా ప్రభావతి ప్రద్యుమ్నంపై షడ్దర్శన ప్రభావం నామమాత్రముగా ఉన్నది. కవి తనకు గల దర్శన జ్ఞానాన్నంతటినీ తన మొదటి ప్రబంధమైన కళాపూర్ణోదయంలోనే చూపించెను. ఈ ప్రతిభ ప్రభావతీప్రద్యుమ్నమున అంతగా కానరాదు. సాంఖ్యయోగదర్శనములను సూక్ష్మముగా తన కళాపూర్ణోదయంలో ప్రతిపాదించిన సూరన ప్రభావతి ప్రద్యుమ్నంలో వాటిని పట్టించుకోకపోవడం గమనార్హం.

## 10. వసుచరిత్ర – షడ్దర్శన ప్రభావం

తెలుగు సాహిత్యంలో వసుచరిత్రకు పదగుంభన పరంగా, శ్లేషవైచిత్రి పరంగా ఒక ప్రత్యేక స్థానమున్నది. అయితే ఈ పదగుంభన వలన లోనారసి తెలియవలిసిన విషయములు మరుగున పడినవి. కవి తన పదచమత్కారముతో పాఠకుడికి కొంత విసుగును పుట్టించాడన్న మాట వాస్తవం. పెద్దనాదులు ఇలాంటి ప్రయోగాలు చేసినప్పటికీ అవి ఎక్కడా పాఠకుడికి చిరాకును పుట్టించినవి కావు. భట్టుమూర్తి కవిత్వం నారికేళపాకము కాక పాషణపాకమైపోవుట ఈ విసుగుకు ప్రధానకారణం. అందుకే కొన్ని చాటువులీతని కవిత్వాన్ని చేపలబుట్ల అల్లికతో పోల్చినవి. ఇక ప్రబంధం పై దర్శన ప్రభావం విషయమునాలోచించినట్లయితే దర్శన ప్రభావం తక్కువనే చెప్పాలి. మునులు, యతుల వర్ణనల సందర్భాలలో కూడా కవి ఎక్కడా దర్శనాల ప్రస్తావన చేయలేదు. కృతిభర్త విశిష్టాద్వైతి కావున విశిష్టాద్వైత ప్రభావం ఈ దర్శనం పై కొంత ఉన్నది.

## 10.1 విశిష్టాద్వైతం

వసుచతిత్రలో ఆరంభపద్యం ఇలా ఉన్నది.

**" శ్రీభూపుత్రి వివాహ వేళ నిజమంజీరాగ్రరత్న స్వలీ**
**లాభివ్యక్తి వరాంఘ్రిరేణుభవకన్యాలీల యంచున్ మదిం**
**దా భావింప, శుభక్రమాకలన చే దద్రత్నముం గప్పు సీ**
**తాభామాపతి ప్రోవుతన్ దిరుమలేంద్ర శ్రీమహారాయనిన్" వ 1–1**

పైపద్యమున కవి సీతాసమేత రాముణ్ణి వర్ణించాడు. ఇది విశిష్టాద్వైత సంప్రదాయం. ఈ మతం కేవల పురుషుణ్ణి దేవునిగా అంగీకరించదు. ప్రకృతిపురుషులు ఈ మతంలో కలిసే ఉంటారు. విశిష్టాద్వైతం ప్రకారం వారిరువురికి అబేధం. వీరితో పాటుగా శంఖచక్రగదాది పంచాయుధాలను, విష్ణ్వనుయాయులను వర్ణన చేశాడు. ఇది కూడా విశిష్టాద్వైత సంప్రదాయమే. వీరు కూడా ముక్తులను పేర విశిష్టాద్వైతంలో ప్రధానులు.

## 10.2 రామానుజత్వం

రామానుజుడు విశిష్టాద్వైతమత స్థాపకుడు. ఇతని అభిప్రాయమే రామానుజత్వం. ఈ తత్వాన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" వసుమతీభార ధూర్వహత నెవ్వని యుర్వ**

రావహారంక మర్థము వహించు
గరగతచక్రవిక్రమశక్తి నెవ్వాని
రామానుజత్వంబు రమణకెక్కు
జీర్ణకర్ణాటలక్ష్మి పునస్సృష్టి నె
వ్వాని లోకేశ్వరత్వము పొసంగు
జటుల శార్వర మగ్న సర్వవర్ణోద్ధార
పటిమ నెవ్వని రాజభావ మెసగు
నతడు వీరప్రతాప రాజాధిరాజ
రాజపరమేశ్వరాష్టదిగ్రాజకుల మ
నోభయంకర బిరుద సన్నుత జయాభి
రామగుణహారి, తిరుమలరాయశౌరి." వ 1-13

ఇక్కడ కవి కృతిపతి గుణములు పొగుడుతూ, రామానుజత్వము అనగా విశిష్టాద్వైతం ఈతని వలన వ్యాప్తిచెందుతున్నది అన్నాడు. ఈ రామానుజుడు త్రిమతాచార్యులలో ద్వితీయుడు. ఇతని అసలు పేరు లక్ష్మణఇలయ పెరుమాళ్. క్రీస్తు పూర్వం 1017లో శ్రీ పెరంబదూరులో పుట్టారు. యమునాచార్యులవారు వీరి గురువు. ఇతను జైన, బౌద్ధమతాలను ఖండించారు. వైదికమతాన్ని ప్రోత్సహించారు. ప్రస్థానత్రయాన్ని సాధారణ జనానికి అందుబాటులోనికి తీసుకొచ్చారు. అయితే కొందరు ఈతనికి ముందే విశిష్టాద్వైతం ఉన్నదని, దానిని బహుళవ్యాప్తిలోనికి తెచ్చింది మాత్రం ఈతనేయని అంటారు. తిరుమంత్రాన్ని అందరికీ తెలిసేలా, విష్ణ్వాలయం పైకెక్కి బిగ్గరగా ఉచ్చరించారు. ఈ మంత్రాన్ని ఎవరికి పడితే వారికి ఉపదేశించవద్దని చెప్పిన నంబి మాటలను పెడచెవిన పెట్టారు. రామానుజులు బ్రహ్మసూత్రాలకు శ్రీ భాష్యం, వేదాంతసారం, వేదాంతదీపిక, వేదార్థసంగ్రహం, శ్రీరంగగద్యం, వైకుంఠగద్యం, శరణాగతగద్యం మొదలైన గ్రంథాలని రచించారు. దేశవ్యాప్తంగా విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేయడానికి పలువురు సింహాసనాధిపులను, జియ్యంగార్లను నియమించారు. చాతాద వైష్ణవులు, అయ్యంగార్లు శ్రీవైష్ణవదాసుల కైంకర్యం చేసే సంప్రదాయాలను ఏర్పరిచారు. అస్పృశ్యత లాంటి దురాచారాలను తొలగించడానికి సంస్కరణాత్మక పద్ధతులను ప్రవేశపెట్టారు. తన జీవితంలోని ద్వితీయార్థాన్ని శ్రీరంగంలో గడిపారు. వీరు సుమారు నూట ఇరవై సంవత్సరాలు జీవించి, పుట్టిన సంవత్సరమైన పింగళలోనే జీవితాన్ని విడిచారు. వీరి అనంతరం విశిష్టాద్వైతం తెంగలై, వడగలై అని రెండు శాఖలుగా విడువడింది. దేవుడిని పూజించడం, మోక్షాన్ని

సాధించడం మానవుడిగా పుట్టిన ప్రతి ఒకరి హక్కు. ఆ హక్కుని ఎవరు ధిక్కరించరాదు. దేవుని దృష్టిలో అందరూ సమానమే. ఒక పనివల్ల తనకు కీడు, పదిమందికి మేలు జరిగితే ఆ పనిని తప్పక చేయాలని వీరు అభిప్రాయపడ్డారు.

## 10.3 చాతుర్వర్ణాలు

మన పూర్వులు వర్ణవ్యవస్థను అనుసరించారు. ఈ వర్ణవ్యవస్థ వేదం చేత ప్రతిపాదించబడింది. ఈ వ్యవస్థయందు కొన్ని వర్ణములు గొప్పవిగాను, కొన్ని వర్ణములు తక్కువవిగాను చిత్రింపబడినవి. అయితే రాజుల పాలనలో అన్ని వర్ణముల వారు సుఖసౌఖ్యాలతో ఉన్నారని, వారికి ఎటువంటి ఈతి బాధలు లేవని చెప్పడం ఈ వర్ణనల్లో ప్రధానం. భట్టుమూర్తి నాలుగు వర్ణాలను ఇలా ప్రస్తావించాడు.

**బ్రాహ్మణ వర్ణన**

**" చతురాస్యుల్, పురుషోత్తముల్, బుధగురుల్, సర్వజ్ఞమూర్తుల్, మహా**
**శతమన్యుల్, శుచిధర్మ పుణ్య జనతాశ్లాఘ్యుల్, ప్రచేతుల్, సదా**
**గతు, లక్ష్మీణనవార్థకర్తలు, కళాకాంతుల్, జగద్బంధు, లా**
**క్షితిదేవుల్ పురి దేవతామహిమలం జెన్నొందుటల్ చిత్తమే" 1-97**

**క్షత్రియవర్ణన**

**" పగలైన దెల్వి గోల్పడని రాజులు, శరం**
**బులు చన్న వెలవెల బోని ఘనులు**
**ధనదాశ గేలు మోడ్చని సార్వభౌమాంకు**
**లని వెన్కముందు జూడని కుమారు**
**లరి మెచ్చగరములు నెరపనియిను, లాట**
**మనవాలు మరవని పురుష సింహు**
**లనయంబు నడక తప్పని గోత్రపతు, లెప్పు**
**డును సీదరములేని యనఘుభోగు**
**లౌర వీరన, వీరనమైకపరులు**
**వరలుదురు వీట, పుష్పవద్వంశ్య లగుట**
**కువలయాధార కమలానుగుణవిహార**

**సారసౌజన్యధరులు, రాజన్యవరులు" 1-98**

**" చెలి పులి గూడు మానిపని శ్రీదినిగాదని, మిత్రునక్షయో**
**జ్జ్వలవసు జేయ మిత్రవసు సంపదకైన ఘనావరోధమున్**
**వెలివడ జేయనేర్తురు మణీపణీతపనీయరాశి పే**
**శలరుచి గోటి కోటి విలసద్ధ్వజకోటి బురీకిరాటకుల్" 1-99**

పై విధంగా కవి బ్రాహ్మణక్షత్రియ వర్ణములను వర్ణించాడు. తర్వాతి రెండు వర్ణాలను వర్ణించలేదు. వాటిస్థానంలో వేశ్యాస్త్రీలను, పుష్పలావికలను వర్ణించాడు. చాతుర్వర్ణముల పుట్టుకను గురించి బృహదారణ్యకోపనిషత్తు లో చెప్పబడింది. ఈ ఉపనిషత్తు ప్రకారం ఈ ప్రపంచంలో మొదటి నుండి ఉన్నది బ్రాహ్మణ వర్ణం. బ్రాహ్మణవర్ణం నుండి క్షత్రియవర్ణం పుట్టిందని ఈ ఉపనిషత్తులో ఇలా చెప్పబడింది.

**" బ్రహ్మవా ఇదమగ్ర అసీదేకగ్ం తదేకగ్ం సన్న వ్యభవత్ తచ్ఛ్రేయోరూప మత్య సృజత క్షత్రం యాన్యేతాని దేవత్రా క్షత్రాణీన్ద్రో వరుణః సోమో రుద్రః, పర్జన్యో యమో మృత్యురీశాన ఇతి, తస్మాత్రాత్పరం నాస్తి తస్మాద్బ్రాహ్మణః, క్షత్రియ మధ స్తాదుపాస్తే రాజసూయే క్షత్ర ఏవ తద్యశో దధాతి సై షా క్షత్రస్య యోనిర్య ద్బ్రహ్మ, తస్మాద్యద్యపి రాజా పరమతాం గచ్ఛతి బ్రహ్మైవాన్తత ఉపస్రిశ్రయతి స్వాం యోనిం య ఉ ఏనగ్ం హినస్తి స్వాగ్ం స యోని మృచ్ఛ్యతి స పాపీయాన్ భవతి యథా శ్రేయాగ్ం సగ్ం హిగ్ంసిత్వా" బృ 1-11**

ఈ క్షత్రాది జాతము, పూర్వము అభిన్నముగా అగ్నిస్వరూపమును పొందియున్న బ్రహ్మముగానే ఉండెను. ఆ బ్రహ్మం ఒక్కటిగా ఉన్నందున కర్మలు చేయడానికి సమర్థం కాకపోయినది. అప్పుడు బ్రహ్మ క్షత్రమను ప్రసిద్ధరూపమును ఉత్పన్నము జేసెను. దేవతలయందు ఇంద్ర, వరుణ, సోమ, రుద్ర, పర్జన్య, ఋతు , మృత్యు, ఈశాన ఇత్యాది క్షత్రియులను ఉత్పన్నం చేసెను. అందువల్లనే క్షత్రియుల కంటెను ఎక్కువయిన దేమియును లేదు. కాబట్టి రాజసూయము నందు బ్రాహ్మణులు క్రింద నిలిచి క్షత్రియుని ఉపాసన జేతురు. అతడు అనగా బ్రహ్మము తన యశస్సును క్షత్రియుని యందు స్థాపించును. బ్రహ్మమే క్షత్రియునకు యోని కాబట్టి రాజు శ్రేష్టత్వమును పొందినను చివరకు బ్రహ్మము నాశ్రయించును. అది యతని ఉత్పత్తి స్థానం. కర్మ సమాప్తి యందు తనదియగు ఉత్పత్తిస్థానమైన, బ్రాహ్మణుని తిరస్కారభావముతో జూచుచున్నాడో, అతడు తన సంబంధమగు ఉత్పత్తి స్థానమును నశింపజేయుచున్నారు. వాడు ఈ లోకమునందు

మిక్కిలి ప్రశస్తమైన వానిని హింసించి పాపాత్ముడు అగుచున్నాడు. తర్వాత వైశ్యవర్ణమును గురించి ఇలా చెప్పబడింది.

**" సనైవ వ్యభవత్  స విశమ సృజత యాన్యేతాని దేవజాతాని గుణశ ఆఖ్యాయ న్తే పసవో రుద్రా ఆదిత్యా విశ్వే దేవా మరుత ఇతి" బృ 1–12**

ఆ పురుషుడు క్షత్రియులను కలుగజేసినను, వివిధ కర్మలు చేయు బ్రహ్మము శక్తివంతము కాలేదు. అందువలన నతడు వైశ్యుని సృష్టించెను. గణశః లేక గణములని చెప్పబడు దేవతలందు వసు, రుద్ర, ఆదిత్య, విశ్వవేదాది దేవతలను అనగా వైశ్యదేవతలను సృష్టించెను. తర్వాత శూద్ర వర్ణమును గురించి కవి ఇలా చెప్పాడు.

**" స నైవ వ్యభవత్ స శౌద్రం పర్ణ మసృజత పూషణ మియం వై పూషే యగ్ం హీదగ్ం సర్వం పుష్యతి యదిదం కించ" బృ 1–13**

ఆ పురుషుడు అన్ని పనులు చేయుటకు శక్తుడు కాలేదు. అందువలన అప్పుడు శూద్ర వర్ణమును సృష్టించెను. పురుషుడే శూద్రుడు. అనగా పృథివి అంతయు పూషయని చెప్పబడెను. ఎందుకనగా భూమియే సర్వమును పోషించునదై ఉన్నది.

## 10.4 తపస్సు

తపస్సును కవి ఇలా ప్రస్తావించాడు.

**" నృపమౌళిభవసువర్ణపరాగములు సువ**
**ర్ణపరాగములు నభిన్నత వహించె**
**గమనీయతపనీయ కదళికాపవనంబు**
**కదలికాపపవనంబు కలసి మెలగె" వ 1–149**

పతంజలి తన యోగశాస్త్రంలో " **కాయేన్ద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః**" అని తపస్సును నిర్వచించాడు. తపస్సు చేయడం వలన ఇంద్రియములు, కాయము చక్కబడతాయని, శక్తిని పెంపొందించుకుంటాయని భావం.

## 10.5 ఆనందోబ్రహ్మ

ఇది ఉపనిషద్వాక్యం. పెద్దన ఇదే వాక్యాన్ని యథాతథంగా ప్రస్తావించాడు. భట్టుమూర్తి కూడా అలానే చేసారు.

**" వీనులవిందై, యమృతపు**
**సోనల పొందై యమందసుమచలదళినీ**
**గానము క్రందై. యాస్యన**
**మానందబ్రహ్మ మైన నధిపతి వల్కెన్" వ 1–14**

**"ఆనందో బ్రహ్మేతి విజానాత్, ఆనందాదేవ ఖల్విమాని భూతాని జాయన్తే,ఆనందేనజాతాని జీవంతి, ఆనందం ప్రయస్త్యభిసంవిశంతీతి" తై 5–3**

ఇది తైత్తరీయ ఉపనిషద్వాక్యం. దీన్ని యథాతథంగా కవి రాశాడు. ఆనందమే బ్రహ్మమని దీని భావం. ఆనందం నిజానికి మూడు రకాలు.1.భజనానందం 2. ఆత్మానందం3. విషయానందం కవి యిక్కడ బ్రహ్మానందాన్ని ఉద్దేశించి చెప్పాడు. మనుచరిత్ర లో వరూధిని విషయానందాన్ని గురించి చెప్తున్నది. ఉపనిషత్తులను, పురాణాలను తనకనుకూలంగా మార్చుకుని ప్రవరుని వశపరుచుకోవలని వరూధిని ప్రయత్నించినది. ఇక్కడ గిరకను వర్ణిస్తూ కవి ఆనందమే బ్రహ్మము అని ప్రస్తావించాడు.

## 10.6 అద్వైతం

అద్వైతం ఆదిశంకరుల చేత ప్రతిపాదింపబడిన మతం. దీన్ని కవి ఇలా ప్రస్తావించాడు.

**" వాఙ్మనసగోచరాద్వైతరాగ**
**జలధి నపుడోలి దేలి రాజన్య మౌళి**
**ఘనతరాశ్చర్యశాలియై వనితరూప**
**మనితరాయత్త మగు నాత్మ నభినుతించె" వ 1–69**

అద్వైతమనగా రెండు కానిదని భావం. నిజానికి ఏకమ్ అని చెప్పినచో ఇదే అర్థం వచ్చును. కాని పండితులు అద్వైతమను పదమునే వినియోగింతురు. దీనికి నిమిత్తం కలదు. ఈ ప్రపంచమున గల జీవునకు పరమాత్మ వేరుగా కనబడుతున్నాడు. కాన జీవుడు పరమాత్మను తనకంటే భిన్నమైన వాడిగా భావిస్తున్నాడు. జీవాత్మ పరమాత్మలు వేరుగా లేవని, కనపడుతున్న రెండూ ఒకటే అని బోధిస్తున్నది అద్వైతం. అందుకే ఏకమ్ అను పదమునకు బదులుగ అద్వైతపదము ప్రయుక్తమయ్యెను. ఈ పదమును కవి ఇలా ప్రయోగించాడు. ఈ అద్వైతమునకు శంకరులు రచించిన వివేక చూడామణిలోని ఈ శ్లోకం ప్రాణం.

**"శ్లోకార్థేన ప్రవక్ష్యామి**
**యదుక్తం జ్ఞానికోటిభిః**

**బ్రహ్మసత్యం జగన్మిథ్య**

**జీవో బ్రహ్మైవ న అపరః" వి 5-5**

బ్రహ్మమే సత్యము. జగత్తంతయు మాయయే అని తెలుపునది అద్వైతం.

## 10.7. కావ్యములపై దర్శనముల ప్రభావము– అధ్యయన ప్రయోజనాలు

కావ్యములపై దర్శనముల ప్రభావమును అధ్యయనం చేయడం వల్ల కలుగు ప్రయోజనములు కోకొల్లలు. ఈ అధ్యయనం వలన కవి యొక్క ప్రతిభాపాండిత్యాలు లోకమునకు తెలుస్తాయి. సూరన మంచికవిగా మాత్రమే లోకమునకు తెలుసు. కాని అతనికి యోగశాస్త్రం పైన అపారమైన పట్టు ఉన్నది. పతంజలి చెప్పిన యమనియమాలను పెంచి చెప్పగల ఈతని పాండిత్యం అనితర సాధ్యం. రాయలవారికి గల న్యాయదర్శనపాండిత్యం అధ్యయనం చేసిన గాని తెలియదు. మనుచరిత్రలో దర్శనములను వినియోగించి పెద్దన సాధించిన పరిపుష్టి అంతా ఇంతా కాదు. ధూర్జటి వేదాంతమును వీరశైవ సంప్రదాయ ముఖమున ఎలా చూసాడో అధ్యయనం చేస్తేనే తెలుస్తుంది. ఈ సంప్రదాయం నన్నయ దగ్గర నుండి ఉన్నది. అందుకే ఆతని భారతంలో ధర్మరాజు గాయత్రి తప్పక చేస్తాడు. భీముడు తర్పనలందిస్తాడు. మిగతా పాత్రలన్నీ కర్మకాండలు తప్పక పాటిస్తాయి. తిక్కన దర్శన విషయాలను ప్రస్తావించినప్పటికీ కర్మకాండల విషయంలో నన్నయకున్నంత పట్టు అతనికి లేదనే చెప్పాలి. ఎర్రన వేదాంతమును చాలచోట్ల ప్రస్తావించాడు. పోతన గజేంద్రమోక్షంలో మొసలిని ఒక యోగిగా భావించి, దానికి హఠయోగమును ఆపాదించాడు. కపిలుని సాంఖ్యమంతా ఆతని భాగవతంలోనే అగుపడుతున్నది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక తావులలో దర్శన సంబంధ విషయాలు కనపడతాయి. కవులు వీటిని వినియోగించి, అనేక చోట్ల కావ్యానికి సందర్భ పరిపుష్టిని కూడా సాధించారు. పెద్దన తన ప్రతిభ ద్వార సందర్భాన్ని ఎలా రక్తి కట్టించాడో ఈ కింది పద్యంలో చూడవచ్చు. పెద్దన ప్రవరుని పరిచయం చేసే సందర్భంలో అతని గుణగణాలను పొగుడుతూ యోగదర్శన సంబంధమైన ధ్యానము అనే సాంకేతిక పదాన్ని ఇలా ప్రయోగించాడు.

**" ఆ పురి బాయకుండు మకరాంత శశాంక మనోజ్ఞమూర్తి భా**
**షా పరశేషభోగి వివి ధాధ్వరనిర్మల ధర్మ కర్మ దీ**
**క్షాపరతంత్రు డంబురుహ గర్భ కులాభరణం బనారతా**
**ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యు డలేఖ్యతనూ విలాసుడై" ఆ 1-51**

పై పద్యంలో ప్రవరుని గుణాలు వర్ణించాడు కవి. పెద్దన ప్రకారం అతడు బ్రాహ్మణ వంశమునకు ఆభరణం వంటివాడు. పైగా గృహస్థుడు. అయితే గృహస్థు ఆచరించ వలిసిన కర్మలనేకం ఉన్నాయి. సంధ్యావందనం, అతిథి మర్యాద, పురుషార్థ సాధన మొదలైనవి. వీటన్నింటినీ అతడు వేదం చెప్పినట్లుగా చేస్తున్నాడు. అందుకే పెద్దన ప్రవరుడుని వివిధాదాధ్వరకర్మదీక్షాపరతంత్రదక్షుడు అని సంబోధించాడు. ఇది మాత్రమే కాక నిరంతర ధ్యాన తత్పరుడు అని కూడా సూచించాడు. ఈ ధ్యానము యోగశాస్త్ర విషయము. అష్టాంగములలో ధ్యానము ఏడవది. ధ్యానాన్ని గురించి పతంజలి ఈ క్రింది విధంగా చెప్పారు.

**" తత్ర ప్రత్యైకతానతా ధ్యానమ్" ప 3-2**

చిత్తాన్ని భ్రూమధ్యమునందుగాని, హృదయమునందు గాని నిలిపి సాధన చేయడాన్నే ధ్యానం అంటారు. ఇట్టి ధ్యానమగ్నుడు ప్రవరాఖ్యుడు. ధ్యానము అష్టాంగాలలో ఏడవది. మిగిలిన ఏడు అంగాలను ప్రస్తావించకుండా ఏడవదాన్ని మాత్రమే ప్రస్తావించడంలో అంతరార్థమున్నది. ఈ అష్టాంగములు సోపానములు. ఒక దాని తర్వాత ఒకటి అనుసరించదగినవి. కవి మిగిలిన ఆరు సోపానములనప్రస్తావించకుండాఏడవదాన్నిప్రస్తావించడంవల్లప్రవరుడువాటన్నింటినీఅధిరోహించ నాడని భావం. ఎనిమిదో పాదమైన సమాధిని చేరుకుంటే ఇక సంసారముండదు. అందుకే ప్రవరుని కవి ఏడో పాదం వద్ద మాత్రమే నిలిపినాడు. ఇలాంటి ఉదాహరణలు ప్రబంధాలలో పుంఖానుపుంఖాలుగా ఉన్నాయి. వీటి వల్ల కావ్యం పాఠకునికి మరింత ఆనందాన్నిస్తుంది. కొత్త విషయాల వైపు పాఠకుని మనసును మళ్లిస్తుంది. మొత్తం మీద ప్రబంధాల పై దర్శనాల ప్రభావాన్ని అధ్యయనం చేయడం వల్ల ఈ క్రింది ప్రయోజనాలు కలుగుతాయి.

1. దర్శనాలంటే ఏవో లోకాంతర విషయాలు కావని, నిత్యం గ్రంథాలలో వినియోగించే విషయాలేనని అవగతమవుతుంది.
2. దర్శనాలకు సాహిత్యానికి మధ్య ఉండే సంబంధం అవగతమవుతుంది.
3. సాహిత్యాన్ని పాఠకుడు మరింత బాగా అవగతం చేసుకోగలుగుతాడు.
4. ప్రాచీనకవుల బహుముఖీన ప్రజ్ఞ లోకానికి తెలుస్తుంది.
5. సాహిత్యం ద్వార దర్శనాంశాలను చెప్పడం వల్ల కవులు సాధించిన సందర్భపరిపుష్టి తెలుస్తుంది.

6. నాటి కవులందరూ ఇహలోక సుఖాలకోసం కాకుండా మోక్షసాధనే పరమ లక్ష్యంగా ఉండేవారని, అందుకే కావ్యాలు రాసారని తెలుస్తున్నది.
7. రాజుల ఆస్థానాలలో జరిగే చర్చలు, చర్చలలో వాడే పారిభాషికపదాలు, వాటి అర్థాలు అవగతం అవుతాయి.
8. సూరనకు యోగదర్శనం పై ఉండే అపారమైన పాండిత్యం అవగతమవుతుంది. కొన్నిసార్లు సూరన పతంజలి చెప్పిన విషయాలు మార్చి చెప్పాడని, ఈ మార్పులు నేటి సమాజానికి అనుగుణమైనవని తెలుస్తుంది.
9. కవులందరూ వేదప్రామాణ్యాన్ని అంగీకరించారని, శివకవులు మాత్రం ఇందుకు విరుద్ధమని, ధూర్జటి శివకవుల పోకడలను కొంత వంటబట్టించుకున్నాడని తెలుస్తుంది.
10. కావ్యప్రయోజనాలలో మోక్షాన్ని చేర్చడం వెనుక ఉండే పరమార్థం అవగతం అవుతుంది.

## 10.8 ఉపసంహారం

సాహిత్యం సంద్రసమానం. సంద్రమెట్లు దరిలేనిదై, విశాలమై, నిత్యనూతనమై ఉండునో సాహిత్యమూ అట్లే ఉండును. అందు తరచిన కొద్దీ కొత్త విషయాలు, కొత్తతావులు కనపడుతూనే ఉన్నవి. ఉండును కూడా. నా చదివిన సాహిత్యమున తారసపడిన అపూర్వ విషయములు దర్శనములు. దర్శనములన అర్థముకాని, సమయాతీత విషయములని భావింపతగదు. అది సరికాదు. దర్శనములందున్న విషయములు ఎంత లోతైనవో, అంత సాధారణమైనవి కూడా. నిజానికి ఇవి నిత్యజీవితంలో జరిగే సంఘటనలను, వాదప్రతివాదములను తర్కబద్ధంగా మనకు చూపిస్తాయి. వాస్తవాన్ని వాదన ద్వార ఎలా తెలియాలో చెపుతాయి. భగవంతునిపై గల అనేక సందేహాలకు ఇవి సమాధానాలు. దర్శనాలలో చెప్పబడిన ప్రతివాక్యము నిరూపణకు లోబడి ఉంటుంది. యోగదర్శనం వలన మానవునకు కలుగు లాభం అనంతం. మానవునకు కావలసిన  మానసిక, శారీరిక ధారుఢ్యం ఈ దర్శనం వలన కలుగును. శారీరిక ధారుఢ్యం ఇతర వ్యాయామముల వలన కలుగవచ్చును. కానీ మానసిక ధారుఢ్యం మాత్రం యోగం వలన మాత్రమే లభించును. అందుకే నేటి ప్రపంచమంతా మరల యోగం వైపు తిరిగి చూస్తున్నది. పూర్వమీమాంస నిత్యనైమిత్తిక విషయముల గూర్చి, కర్మకాండల గూర్చి తెలియజేయు అపూర్వశాస్త్రం. ఇందు చెప్పబడిన విషయాలన్నీ చాదస్తాలలాగ కనపడుతున్నప్పటికీ, మానవుని ఆరోగ్యమునకు, ఎదుగుదలకు అవి ఎంతగానో సహకరిస్తవి. ఇందుగల నియమ నిబంధనలు తప్పక పాటిస్తే, కరోనా వంటి రోగాలు సైతం మానవుని తాకజాలవు.

ఉత్తరమీమాంస అనంతమైన ఒక శాస్త్రం. ఇందుగల విషయములు మానవజన్మను సార్థకం చేసుకోవడంలో ఎంతగానో ఉపకరిస్తాయి. మనిషిలోని స్వార్థమును ఇవి తొక్కి చంపుతాయి. అతనిలోని అనంతమైన శక్తిని లాగి బహిర్గతం చేస్తాయి. భగవంతునితో సమానమైన శక్తిని అతనికి ప్రసాదిస్తాయి. మానవుడిని మిథ్యాప్రపంచం నుండి పక్కకు తోసి భగవంతుని మార్గంలో సత్యవంతునిగా, జీవించడానికి తగు సహాయాన్ని ప్రోద్బలమును అందిస్తాయి. కాన దర్శనములందున్న విషయములు ఇతర లోకములకు సంబంధించినవనీ, సమయాతీతములనీ భావింపదగదు. దర్శనములందున్న విషయములు వజ్రసమానములు. నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటవి. వాటి విలువ కూడా వజ్రము విలువ వలె నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. దర్శనములకు సాహిత్యమునకు ఉన్న సంబంధం పూవుకు తావికి ఉన్న సంబంధం వంటిది. తావి వలన పూవుకు మరింత విలువ చేకూరునట్లు, దర్శనవిషయములు సాహిత్యంలో చేర్చడం వల్ల సాహిత్యమునకు మరింత పరిపుష్టి చేకూరుతుంది. మన పూర్వ కవులందరికీ ఈ దర్శనాలపై ఒక అవగాహన ఉండేది. వారిలో కొందరికి వీటిలో పాండిత్యం ఉండేది. వీరు వాదప్రతివాదములలో పాల్గొనేవారు. వాదములు జరుగునపుడు వీక్షించేవారు. నిరంతరము పెద్దలవద్ద దర్శన విషయములు అభ్యసించేవారు. తమ శిష్యులకు దర్శన విషయములు బోధించేవారు. తద్వార గ్రహించినదర్శన విషయములను తమతమ గ్రంథాలలో సందర్భ పరిపుష్టికోసం వినియోగించుకున్నారు. తద్వార లోకమునకు ఉత్తమ సందేశాన్ని ఇచ్చేవారు. లోకులకు మార్గదర్శనం చేసేవారు. ఈ సంప్రదాయం నన్నయ నుండి చిన్నయ వరకూ సాగింది.

## ఉపయుక్త గ్రంథసూచి


1. అప్పారావు, ఆళ్ళ. **నాయనార్లు – శివభక్తులు**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2017
2. అన్నారావు,పి. **నిత్యానుసంధానమ్**,తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 1951
3. ఆదిశంకరాచార్య, **వివేకచూడామణి**.ఏర్పేడు: శ్రీ పరాశరప్రెస్. 2013
4. కపిలమహర్షి, **సాంఖ్యదర్శనం**. విజయవాడ: గోపాలస్వామిప్రింటర్స్. 2012
5. కాంతలక్ష్మి,ఐ.వి. **ధూర్జటివంశ కవుల సాహిత్యసేవ**, హైదరాబాదు: విశాలాంధ్రబుక్ హౌస్, 1999
6. కోటేశ్వరరావు, తుమ్మపూడి. **ఆముక్తమాల్యద – సౌందర్యలహరీ వ్యాఖ్యానం**, హైదరాబాదు: మలయకూట పబ్లికేషన్స్, 2001
7. కృష్ణదేవరాయలు, **ఆముక్తమాల్యద**. హైదరాబాదు: ఎమెస్కోప్రచురణలు,2004
8. గోపదేవ్, పండిత. **వేదతత్త్వప్రకాశిక**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 1967
9. చంద్రశేఖరశర్మ. మూలపల్లి. **మహాభారత విజ్ఞానసర్వస్వం**, హైదరాబాదు: రాజపబ్లికేషన్స్, 2004
10. చంద్రశేఖరరెడ్డి, డి. **శ్రీకృష్ణదేవరాయల వైభవం**, హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 2008
11. జైమిని. **మీమాంసదర్శనం**, మహాప్రభులాల్ గోస్వామి ( సంపాదకులు), వారణాసి:తార ప్రింటింగ్ వర్క్స్, 1984
12. తిమ్మన, నంది. **పారిజాతాపహరణం**. కుప్పం: ద్రవిడవిశ్వవిద్యాలయం, 2006
13. దంగమణి, పి. **ప్రబంధసాహిత్యవికాసం**, హైదరాబాదు: రాజశేఖర పబ్లికేషన్స్, 1985
14. దేవీప్రసాద్,చటోపాధ్యాయ. **భారతీయతత్త్వశాస్త్రంలో భావవాదం**,భౌతికవాదం. హైదరాబాదు: ప్రజాశక్తిబుక్ హౌస్. 2012
15. ధూర్జటి, **శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యం**. హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు, 2004
16. నటరాజ్.డి. **గౌతమబుద్ధుడు**, విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్2012

17. నరసింహారెడ్డి, ఎం.వి. **బ్రహ్మసూత్రాలు**, బద్రి ప్రచురణలు, గుంటూరు, 2014
18. నరసింహారెడ్డి, ఎం.వి. **అమృతోపనిషత్తులు**, బద్రి ప్రచురణలు, గుంటూరు, 2014
19. నరసిహాచార్య, కె.వి యల్. **నిత్యపారాయణపాశురాలు**, తిరుపతి:తిరుమలతిరుపతిదేవస్థానములు 1994
20. నరసిహారెడ్డి, పాపిరెడ్డి. **శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2016
21. నారాయణరెడ్డి, టి.వి. తెలుగు కావ్యాలలో ప్రకృతి చిత్రణ, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2007
22. పెద్దన,అల్లసాని. **మనుచరిత్రము**, హైదరాబాదు. ఎమెస్కోప్రచురణలు. 2004
23. మనువు, **మనుస్మృతి**, విజయవాడ: శ్రీవేంకటేశ్వర బుక్ డిపో, 2001
24. మల్లయశాస్త్రి,బంకురుపల్లి. **వివాహతత్త్వము**, హైదరాబాదు: ఎమెస్కో బుక్స్, 2011
25. రంగాచార్య, దాశరథి. **శ్రీమదాంధ్రవచన అమృత ఉపనిషత్తులు**. హైదరాబాదు: ఎమెస్కో అక్షర భారతి. 2001
26. రవీంద్రనాథ్,ముత్తేవి.**తెనాలిరామకృష్ణకవిశాస్త్రీయపరిశీలన**,హైదరాబాదు:విశాలాంధ్రపబ్లికేషన్స్,2019
27. రఘునందాచార్య,యస్.బి.**ఆర్షవిజ్ఞానసర్వస్వం**,తిరుపతి:తిరుమలతిరుపతిదేవస్థానములు1982
28. రామసుబ్బయ్య, మర్రిబోయిన. **బ్రహ్మజిజ్ఞాస**,తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2004
29. రామకృష్ణుడు, తెనాలి. **పాండురంగమాహాత్మ్యం**. హైదరాబాదు: ఎమెస్కోప్రచురణలు.2004
30. రంగనాయకమ్మ, ముప్పాళ్ల. **తత్త్వశాస్త్రం**, హైదరాబాదు:స్వీట్ హోమ్ పబ్లికేషన్స్,2013
31. రాజకోటిశాస్త్రి, కె. **తిక్కన కావ్యశిల్పం – తత్త్వదర్శనం**, ఉస్మానియావిశ్వవిద్యాలయం, 1960
32. రాజారావు, యం. **తెలుగులో వైష్ణవతత్త్వం,** హైదరాబాదు విశ్వవిద్యాలయం . 1967

33. రాజు, తెన్నేటి.**భారతీయ తత్త్వశాస్త్రం– సమగ్ర పరిశీలన**, హైదరాబాదు; 2001
34. రాజ్యశ్రీ, కస్తూరి. **ముండకోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
35. రాజ్యశ్రీ, కస్తూరి. **కేనోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
36. రాజ్యశ్రీ, కస్తూరి. **ఛాందోగ్యోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
37. రాజ్యశ్రీ, కస్తూరి. **ప్రశ్నోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
38. రాజ్యశ్రీ, కస్తూరి. **ఈశోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
39. రాజ్యశ్రీ, కస్తూరి. **బృహదారణ్యకోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
40. రాజ్యశ్రీ, కస్తూరి.**కటోపనిషత్తు**. హైదరాబాదు: ఆర్షతరంగప్రచురణలు, 2018
41. రాధాకృష్ణ, సర్వేపల్లి. **భారతీయతత్త్వశాస్త్రం** (8 సంపుటాలు), హైదరాబాదు: పిగాగ్ పబ్లికేషన్స్. 2006
42. రాధాకృష్ణ, యస్. **రాయలవారి విశిష్టాద్వైతాభినివేశము**, ఆంధ్రవిశ్వవిద్యాలయం.1990
43. రామమోహనరావు, నండూరి. **విశ్వదర్శనం**(రెండు సంపుటాలు), హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్స్.2013
44. రామరాజభూషణుడు, **వసుచరిత్ర**, హైదరాబాదు, ఎమెస్కో ప్రచురణలు,2004
45. రామరాజు,బిరుదురాజు. **ఆంధ్రయోగులు**, హైదరాబాదు: నవోదయబుక్ హౌస్, 2004
46. రామమూర్తి, ఏటకూరి, **భారతీయతత్త్వశాస్త్రం**, విజయవాడ: విశాలాంధ్ర పబ్లికేషన్స్. 1989
47. రామస్వామి, వావిళ్ళ. **ద్వాదశోపనిషత్తులు**, చెన్నై: వావిళ్ళరామస్వామి, సన్స్,2001
48. లక్ష్మీపతిరావు, వక్కలాన. **పారిజాతాపహరణ సౌందర్యసమీక్ష**, హైదరాబాదు: 1987
49. లక్ష్మణచక్రవర్తి, సి,హెచ్. **పరమయోగివిలాసం – విశిష్టాద్వైతతత్త్వం**, హైదరాబాదు విశ్వవిద్యాలయం.1998
50. విశ్వనాద్, ఆకొండి. **ప్రబంధపరమేశ్వరుడు ఎర్రన మహాకవి**. ఖమ్మం:శివానందలహరీ పబ్లికేషన్లు,1974
51. లక్ష్మీనారాయణశాస్త్రి, చెరువు. **యోగసర్వస్వం**,తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 1999
52. విశ్వేశ్వరశాస్త్రి, కొత్తపల్లి. **రామాభ్యుదయ వైభవము**, విజయవాడ: విక్టరీ పబ్లికేషన్స్, 1985

53. వీరరాఘవరావు, కస్తూరి, తేలికగా తైత్తరీయం,గుంటూరు: ఆర్షతరంగప్రచురణలు, 2013
54. వేదసిద్ధాంతాచార్య,మలహరి.**వేదములయథార్థస్వరూపము**.హైదరాబాదు:వైదికసాహిత్యప్రచురణప్రచార సమితి, 2012
55. వెంకటసోమయాజులు, నోరి. **ఉపనిషద్ దర్శనలు**, మద్రాసు: రామకృష్ణ పబ్లికేషన్స్, 1990
56. వేంకటేశ్వరులు, కొత్త. **ఆముక్తమాల్యద సాహిత్య ఆధ్యాత్మిక సమీక్ష**, విజయవాడ. 2016
57. వేదవ్యాస. **సాధనారహస్యాలు**, గుంటూరు: వ్యాసపబ్లికేషన్లు, 2003
58. శంకరాచార్య. **భజగోవిందం**, జమదగ్నిశర్మ, చెరుకుపల్లి( వ్యాఖ్యానం) తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు, 2010
59. శశిరేఖ, పి. **వేదాంతసారః**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2015
60. సత్యనారాయణగుప్త, గర్రె. **ఉపనిషత్ కల్పతరువు**(నాలుగు సంపుటాలు), విజయవాడ: 2003,
61. సచ్చిదానందమూర్తి, కొత్త.**విజ్ఞానసర్వస్వం (దర్శనములు – మతములు)**, సి.పి బ్రౌన్ అకాడమి, 2009
62. సుందరయ్య.జి, **భారతీయ దర్శనాలు**, హైదరాబాదు: తెలుగు అకాడమీ, 2004
63. సుబ్బారావు, చింతకుంట. **శ్రీమద్భగవద్గీత**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2015
64. సుబ్రహ్మణ్యశర్మ, నండూరి. **గీతాహృదయం – భక్తియోగం**, విజయవాడ: ఆర్షవిజ్ఞానగ్రంథములు, 1980
65. సుబ్రహ్మణ్యశాస్త్రి, నోరి. **గీతారహస్యం**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2003
66. సుమతీదేవి, యస్.బి. **అన్నమయ్య కృతులపై విశిష్టాద్వైత ప్రభావం**, కాకతీయ విశ్వవిద్యాలయం.1998
67. సుబ్రహ్మణ్యశాస్త్రి, వేముల. **ఆంధ్రభాగవతం – విశిష్టాద్వైతపాలనం**, ఆంధ్రవిశ్వవిద్యాలయం.1991
68. సూరన, పింగళి, **కళాపూర్ణోదయం**, చెన్నై: వావిళ్ళరామస్వామి&సన్స్, 2003
69. సూరన, పింగళి**, కళాపూర్ణోదయం**, హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు, 2003

70. సూరన, పింగళి, **ప్రభావతీప్రద్యుమ్నం**, హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు, 2003

71. సూర్యప్రకాశశాస్త్రి, రేమిళ్ళ. **వేదం – జీవననాదం**, తిరుపతి:తిరుమలతిరుపతి దేవస్థానములు 2017

72. దాశరథి. **శ్రీమదాంధ్రవచన అమృత ఉపనిషత్తులు** హైదరాబాదు: ఎమెస్కో అక్షర భారతి. 2001

73. సోమరాజు, ఎన్. **పూర్వమీమాంస దర్శన సమీక్ష**. హైదరాబాదు: ధర్మసింధు పబ్లికేషన్స్,2000

74. హంసరాజు, కత్తిపూడి. **దర్శనపరిచయం**. కొవ్వూరు; అనుపబ్లికేషన్స్, 2002

## నిఘంటువులు

1. అమరసింహుడు. అమరకోశము, విజయవాడ: ఎస్.వి,యస్ పబ్లికేషన్స్,1998
2. రామయ్యపంతులు, జయంతి. సూర్యరాయాంధ్రనిఘంటువు. కాకినాడ: ఆంధ్రసాహిత్యపరిషత్తు, 1939
3. సీతారామాంజనేయశర్మ, బులుసు. శబ్దరత్నాకరం, హైదరాబాదు: విక్టరీ పబ్లికేషన్లు,1872
4. సుబ్రహ్మణ్యశర్మ,పోతుకూరి. అచ్చతెనుగుపదకోశం, తెనాలి: అను పబ్లికేషన్స్, 1979

## సంకేతాక్షర వివరణము

ఆ – ఆముక్తమాల్యద

ఈ – ఈశావాశోపనిషత్తు

ఐ – ఐతరేయోపనిషత్తు

క – కళాపూర్ణోదయం

కే – కేనోపనిషత్తు

ఘే – ఘేరండసంహిత

చా – చాందోగ్యోపనిషత్తు

తై – తైతరీయోపనిషత్తు

నా – నారదోపనిషత్తు

న్యా – న్యాయశాస్త్రసంహిత

ప – పతంజలి యోగసూత్రాలు

పా – పాండురంగమాహాత్మ్యం

ప్ర – ప్రభావతీప్రద్యుమ్నం

బృ – బృహదారణ్యకోపనిషత్తు

మ – మనుచరిత్ర

ము – ముండకోపనిషత్తు

రా – రామాభ్యుదయం

వ – వసుచరిత్ర

శ్రీ – శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యం

శ్వే – శ్వేతకేతోపనిషత్తు

శ్రీధ – శ్రీధరీయవ్యాఖ్య

సి – సిద్ధాంతకౌముది

# అనుబంధం

# రాయలవారి యోగదర్శన పాండిత్యం

– పతివాడ ధనంజయరావు

( ISSN NO 2456 – 4702)

## 1. పరిచయం

తెలుగు వారి కీర్తిని నలుదిశలా చాటిన సాహితీ సమరాంగణా సార్వభౌముడు రాయలు. కవనంలోనైనా, కథనంలోనైన రాయలవారికే వారే సాటి. ఇది చరిత్ర చెపుతున్న సత్యం. అయితే రాయలవారిలో అంతర్గతంగా ఉన్న మరొక అంశం తత్త్వం. ఔను రాయలవారు గొప్పతత్త్వవేత్త. భారతీయ తత్త్వశాస్త్రానికి మూలం అనదగ్గ ఆరు దర్శనాలపైన వారికి అపారమైన పాండిత్యం ఉన్నది. ఈ ప్రజ్ఞ వారి ఆముక్తమాల్యదలో ప్రస్ఫుటంగా కనపడుతున్నది. ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుని వాదనను పురష్కరించుకుని వారు ఆరు దర్శనాలను ఖండించారు. వారికి ప్రియమైన విశిష్టాద్వైతమతాన్ని స్థాపించారు. అయితే రాయలవారికి ఆరు దర్శనాలలోకి ప్రియమైనది యోగదర్శనం. అంతేకాదు వీరు తన దినచర్యలో భాగంగా మల్లయుద్ధము, కత్తిసాము, కర్రసాములతో పాటు యోగము కూడా చేసేవారని మనకు రాయవాచకం ద్వార తెలుస్తున్నది. రాయలవారికి యోగదర్శనం పై ఉండే అధికారం ఆముక్తమాల్యదలో ఇలా కనపడుతుంది.

## 2. ఆముక్తమాల్యాద – యోగదర్శన ప్రభావము

ప్రాచీన కవులందరికీ ఈ దర్శనముతో పరిచయమున్నట్లు సర్వులకు విదితము. కాని రాయలవారు ఈ శాస్త్రంలో అపారమైన ప్రతిభ కలిగి ఉన్నారు. ఈ ప్రతిభ మిగిలిన కవులకంటే కాస్త ఎక్కువనే చెప్పాలి. ఖాండిక్య కేశిధ్వజి సంవాదంలో ఈ ప్రతిభ మరింత ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. ఉదాహరణకు

**"ఆ కేశిధ్వజు డంత నా నృపునిరాజ్యం బెల్ల జేర నృలం**
**బాకాక్షింపక గెల్తు మృత్యువు నవిద్య న్బుట్టకుందుం దుదన్**
**జాకుందు న్వడి నంచు యోగనియతిం జ్ఞానాశ్రయుం డై మఖా**
**నీకంబు లొచయించు చం దొకటికిం దీక్షించి తా నున్న చోన్" ఆ 3–18**

పై పద్యంలో కవి యోగశాస్త్రసంబంధమైన అవిద్య అనే పదాన్ని ఉటంకించాడు. " వృత్తి సారూప్యమిత్యత్ర " అనే సూత్రం ద్వార పతంజలి అవిద్య గురించి వివరించాడు. యోగమునందు మనసు లేని పురుషుడు ఇతర భౌతికవిషయాలపై మనసును సారిస్తాడు అని దీని అర్థం.

**కంధర నీలవర్ణ! మధు కైటభనాగ సుపర్ణ! యోగి హృ**
**ద్గ్రంథి భిదోత్థ భోగి వనితాస్వనవచ్ఛ్వసన స్రవచ్చిర**
**స్సంధి వసన్నిశాపతీ రసస్రుతీ దుగ్ధపయోధి వీచికా**
**మంధర కెళికాదర! సమాశ్రితపంక్తి శిరోధి సోదరా!**

**5 వ ఆశ్వాసాంతము**

**ష్మంజనియించు అంజ సమాను వాయుగణమంతయు ఖంజిత చిక్కనజ్జవో**
**చిక్కని సమానపు వాయువులో నొకండు గ**
**ల్మింజనియించు దుర్యశము మేల్కని లేహనవేళ వాజు**
**లూర్పంజెడు మాణిబంధముకురంబులు కాళిమ పేర గార్కొనున్**

**ఆ 2-28**

పై పద్యాలలోని యోగశాస్త విషయమగాధము. దుగ్ధాంబోధి మహా గృహోత్సకుడు అనడంలో ఆంతర్యం వేరుగ ఉన్నది. ఈ బ్రహ్మండంలో ఏదో ఒక చోట పాలసముద్రం ఉండటం నిజమే అయినప్పటికీ అదే పాల సముద్రము మనలోనూ ఉన్నదని, ఆ మహావిష్ణువు మనలోనూ వశించుచున్నాడని కవి భావన. ఇక్కడే కవి పిండాండ బ్రహ్మండములకు అబేధము చెప్తున్నాడు. కుండలిని అనబడే శక్తి యోగి హృదయ గ్రంథులను బేధించి బుసులు కొడుతుంది. దాని కంపన మూలంగా స్రవిస్తున్నటువంటి చంద్రరసస్రావణమనే క్షీరసముద్రంలో కేళీలోలుడై ఉన్నవాడా అని దీని అర్థం. ఇది యోగశాస్త్ర విషయం. పద్యంలో చెప్పిన గ్రంథి, కుండలిని, విశాపతి, రసస్రుతి, శిరస్సంధి లాంటి శబ్దాలు యోగశాస్త్ర సంకేతికపదాలు. యోగశాస్త్రం ప్రకారం మానవ శరీరంలో మూడు గ్రంధులున్నవి. 1.బ్రహ్మగ్రంథి 2. విష్ణుగ్రంథి 3.రుద్రగ్రంథి అలాగే శరీరంలో ఆజ్ఞ, విశుద్ధ, అనాహత, మణిపూర, స్వాధిష్టాన, మూలాధార అనబడే ఆరు చక్రములున్నవి. ప్రతి రెండు చక్రములకు ఒక గ్రంథి విభక్తమై ఉన్నది. మూలాధార స్వాధిష్టానముల మధ్య బ్రహ్మగ్రంథి, మణిపూర, అనాహత, విశుద్ధములకు మధ్య విష్ణు గ్రంథి, ఆగ్నా చక్రమునకు పైన రుద్రగ్రంథి కలవు. ఈ మూడు గ్రంధులలో మొదటిది అన్నమయ కోశము, రెండవది ప్రాణమయ కోశము, మూడవది మనోమయ కోశము.ఈ విధంగా ఈ గ్రంధులు త్రివిధ జీవాకృతులై స్థూల సూక్ష్మ కారణ శరీర

మూర్తులై ఉన్నవి. ఈ గ్రంధులు, చక్రములు బేధింపబడినపుడే భగవంతుడు దర్శనమిస్తాడు. ఈ బేధనకు యోగమే శరణ్యం. యోగానుష్టానము వలన మనలో నిద్రావస్థలో ఉన్న కుండలినీ శక్తి జాగృదావస్థకు చేరుకుని షట్చక్రములను, గ్రంథిత్రయమును బేధించి సహస్రారంలోని చంద్రకళామృతాన్ని శ్రవింపచేస్తుంది. సహస్రారమందలి చంద్రకళామృతమే సుధాసింధువు. ఇది స్రవించడం వలననే మోక్షం కలుగును. దీనినే ఆదిశంకరులు సుధాసింధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే అని దేవీ స్థానంగా కీర్తించారు. మరోచోట రాయలవారు పరుగిడుతున్న గుర్రాలను వర్ణిస్తూ

**" మధురానగరమందలి యశ్వము లొక్క యంగలోనే సమానవాయుగణమును జయించెను. సమానమను పేరు గల వాయువొక్కటి మాత్రము జితము కాక కడుపులోనే చిక్కెను. దానివల్ల గుర్రాలకపయశస్సు కలిగినది. " ఆ 1-45**

ఈ వచనంలో సమాన వాయుగణమన్న మాట ఉన్నది. ఈ వాయువులు యోగశాస్త్రప్రసిద్ధములు. యోగశాస్త్రం ప్రకారం మానవ శరీరంలో 5 ముఖ్యవాయువులు, 5 ఉపవాయువులు ఉంటాయి. అవి నాగ, కూర్మ, కృకర, ధనంజయ, దేవదత్తములు. ఇవి శరీరంలోని పలుస్థానాల్లో నివాసముంటాయి. ప్రాణవాయువు హృదయంలోనూ, అపానవాయువు గుదస్థానమందు, వ్యానవాయువు మూపులయందు, ఉదానవాయువు పాదహస్తములయందు, సమానవాయువు సర్వశరీరమందు అమరి ఉంటాయి. గుర్రాలు సామాన్యమైనగాలిని ఓడించగలిగాయి గాని తమ శరీరమంతటా ఇమిడి ఉన్న సమానవాయువును ఓడించలేకపోయాయి. తమ లోని ఉన్న సమానవాయును ఓడించాలంటే అవి మానుషజన్మమెత్తి, యమనియమాదులతో కూడిన యోగసాధన చేయాలి. లేనిచో వాటికాశక్తి లభించదు. తిర్యక్కులు ఆ విధంగా చేయలేవు కాబట్టి గుర్రములకు సమానవాయువును గెల్చుట అసాధ్యమని కవిభావం.మధురలోని చాతుర్వర్ణాలను గురించి చెపుతు రాయలవారు పంచ యమాలలో ఒకటైన అపరిగ్రహం గురించి వివరించారు.

**చిరసముపార్జితాగ్ని తడిజెంది నశించు నటంచునో, కృతా**
**ధ్వరత దదగ్ని మై నునికి దాన నొకంగము తాచు చేతనో**
**పురధరణీశుల్నిగమ భూధరము ల్జపయజ్ఞ శీలు రా**
**హరి ధనదాదులైన వలహస్తము సాచరు దానధారకున్ ఆ 2-34**

మధురాపురములో గల బ్రాహ్మణులు ఎవరి నుండి దానము గ్రహించరని దీని భావం. ఈ విధంగా ఎవరి దగ్గర నుండి ఏమి గ్రహించకుండా ఉండడాన్ని యోగశాస్త్రంలో అపరిగ్రహం అంటారు. పతంజలి అపరిగ్రహం గురించి చెప్తూ

" అపరిగ్రహస్థైర్యే జన్మకథాంత సంబోధః" ప 2-39

అని నిర్వచించాడు. దానధర్మాలు గ్రహించకుండే అపరిగ్రహంలో సుస్థిరుడై ఉండే వ్యక్తికి పూర్వజన్మకు సంబంధించిన ఎరుక కలుగుతుందని పతంజలి ఉద్దేశ్యం.ఈ సిద్ధిని పొందటంకోసం ఆ పురములోని బ్రాహ్మణులు దానధారకు వలహస్తము సాచరు. ఇదే పద్యంలో వేదప్రోక్తమయిన విషయమున్నది. మన పూర్వులు అగ్నికి ప్రాధాన్యతనిచ్చారు. అగ్ని అనగా వారి ఉద్ధేశ్యం ప్రకారం కేవలం నిత్యావసరములకు వినియోగపడేది మాత్రమే కాదు. ఇది భగవంతుని స్వరూపం. భగవంతుని భక్తుడిని హోమక్రియ ద్వార దగ్గర చేసేది. ఇక్కడ అగ్ని అనే పదానికి అర్థం వేరుగా ఉన్నది. చాలకాలం పాటు జపతపహోమాలు చేసి సంపాదించుకున్న పుణ్యం అనే అర్థంలో అగ్ని అనే పదం ప్రయుక్తమైనది.ఈ పుణ్యం ఎక్కడ దూరమవుతుందో అని అక్కడి బ్రాహ్మణులు దానం గ్రహించరని కవి భావం. రాయలవారి యోగదర్శన పాండిత్యం ఇంత లోతైనది. ఇన్ని రంగాలలో ఒకే వ్యక్తి ఉండగలగడం అనితర సాధ్యమైన విషయం. అందుకే రాయలవారికి రాయలవారే సాటి.

# ఆంధ్రమహాభాగవతంలో షడ్దర్శనాంశాలు

– పతివాడ ధనంజయరావు

(ISSN NO: 2277-7881)

## 1. పరిచయం

తెలుగులో తనకంటూ ఒక ప్రత్యేకత సాధించుకున్న గ్రంథం పోతన భాగవతం. ఈ నాటికీ తెలుగునాట భాగవత పద్యాలు వినియోగిస్తున్నారంటే అది పోతన గొప్పతనమే తప్ప మరొకటికాదు. పోతన తన పద్యాలలో అంతుచిక్కని మాధుర్యంతో పాటు గహనమైన తాత్వికతను కూడా ఇమిడ్చాడు. పోతన తన భాగవతంలో చాల చోట్ల దర్శనాంశాలను అన్యాపదేశంగా చెప్పాడు. ఇదంతా వ్యాసులవారి గొప్పతనం అనుకుంటే అది పొరపాటే అవుతుంది. చాల సందర్భాలలో పోతన వ్యాసుడు చెప్పిన విషయాలను పెంచి రాసాడు. తన భాగవతంలో వేదాల సారాన్ని ఇమిడ్చే ప్రయత్నం చేసాడు. అందుకే **నిగమకల్పతరోర్గలితంఫలం** అన్న పదం వ్యాసభాగవతం కన్న పోతన భాగవతానికే ఎక్కువ సరిపోతుందంటారు ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం. భాగవతాంశాలు  వేదంతో ఇలా ఏకీభవిస్తున్నాయి.

## 2. వేదము – భాగవతము

వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు మొదలైన గ్రంథాలను ప్రాచీనమైన వాటిగాను, భాగవాతాన్ని అర్వాచీనగ్రంథంగాను లోకంలో భావిస్తున్నారు. కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే వేదం ఏ విషయాలను చెపుతున్నదో భాగవతం అదే విషయాలను చెపుతున్నది. భాగవతంలో చెప్పబడిన నవవిధ భక్తిమార్గాలు వేదమునందిలా చెప్పబడ్డవి.

**1. శ్రవణం – భద్రం శ్లోకం శ్రూయాసం – అథర్వ 16–2**

**2. కీర్తనం – విష్ణోర్నుకం వీర్యాణి ప్రోవోచమ్ – ఋగ్వేద 1–24–1**

**3. స్మరణం – మనామహే చారు దేశ్యనామ – ఋగ్వేద 1–514–1**

**4. పాదసేవనం – జుషాణ ఇంద్ర సప్తభిన్న ఆగహి – ఋగ్వేద 8–‘13–13**

**5. అర్చనం – అర్చాచక్రాయ శాకినే – ఋగ్వేద 1–54–2**

**6. వందనం – వందామహే త్వా – ఋగ్వేద 3–8–9**

**7. దాస్యం – వైశ్వానరస్య సమతౌ శ్యామ – ఋగ్వేద 3–8–9**

**8. సఖ్యం – మరుత్వంత్వం సఖ్యాయ హవామహే – ఋగ్వేద 1–101–6**

**9.ఆత్మనివేదనం- భర్గో దేవస్య ధీమహి - ఋగ్వేద 3-62-10**

పై విధంగా భాగవతం వేదంతో ఏకీభవిస్తున్నది. కాబట్టి భాగవతం పూర్వమీమాంస దర్శన సంబంధమైనది. భాగవతంలోని తృతీయస్కంధంలో సాంఖ్యదర్శనకర్తయిన కపిలమహర్షి ద్వార భక్తియోగం ఇలా చెప్పబడింది. ఇలా చెప్పబడింది.

**" తామస రాజస సాత్త్వక బేధములంభక్తి త్రివిధంబై యుండు. అందు దామస భక్తి ప్రకారం బెట్టిదనిన" భా - 953**

**" సతత హింసాతిదంభ మాత్సర్య రోష**
**తపములన్ఉ జేయుచును బేధర్శి యగుచు**
**బరగ నాయందు గావించు భక్తిదలప**
**దామసం బనదగు వాడు తామసుండు " భా 2-954**

**" ఘన విషయ ప్రావీణ్యము**
**లను సుమహైశ్వర్యయశములను బూజార్య**
**ర్థుని నను వర్ధి భుజించుట**
**చను రాజస యోగమన రాజన్య వీధి" భా 955**

**" మనుసుత మద్గుణ శ్రవణమాత్ర లభియించినయట్టి భక్తి చే**
**ననఘుడ సర్వశోభన గుణాశ్రయుంబరమేశ్వరుండవై**
**తనరివ నన్ను జెందిన యుదాత్తమనోగతు లవ్యయంబులై**
**జన హితకారియై వెగడ సాత్వికయోగమనంగ జొప్పడున్" భా2- 956**

ఈ మూడు పద్యాలలోను సత్వరజస్తమో భక్తులు చెప్పబడ్డాయి. ఇవి మొదట మూడు రకాల గుణాలు. తర్వాత ఇవి భక్తి యోగంలో త్రివిధభక్తులుగా చెప్పబడ్డాయి. ఇవి కపిల సాంఖ్యంలో చెప్పబడ్డాయి.

### 3. పోతన భాగవతం - యోగం

పోతనగారు తన భాగవతంలో యోగదర్శనానికి సంబంధించిన ధ్యానాన్ని ఇలా ప్రస్తావించారు.

**" విమలమై పైశుద్ధమై తగు మనో విజ్ఞాన తత్త్వప్రబో**
**ధ మతిన్ నిల్పి, తదీయమూర్తి విభవధ్యానంబు గావించి చి**
**త్తము సర్వాంగ విమర్శన క్రియలకుం దార్కొల్పి ప్రత్యంగమున్**
**సుమహాధ్యానము చేయగా వలయుబోశుద్ధాంతరంగంబున్" భా 2-927**

ఇక్కడ చెప్పబడిన ధ్యానం పతంజలి యోగదర్శనానికి సంబంధించింది. పతంజలి తన యోగదర్శనంలో ధ్యానాన్ని ఇలా ప్రస్తావించారు.

**" యథాభిమత ధ్యానా ద్వాః" పా 2-39**

యోగి తనకభిమతమైన ఏదైనా విషయాన్ని ధ్యానించడం వల్ల స్థిరచిత్తత ఏర్పడుతుందని దీని భావం. ఇలా ధ్యానించే యోగి చిత్తానికి పరమాణువు మొదలుకొని, అనంతత్వం వరకూ అన్ని వశమై ఉంటాయని తర్వాతి సూత్రంలో పతంజలి చెప్పారు. పోతన గజేంద్రమోక్షంలోని ఈ క్రింది పద్యంలో హఠయోగాన్ని ఇలా చెప్పారు.

**" పాదద్వంద్వము నేల మోపి పవనున్ బంధించి పంచేంద్రియో**
**న్మాదంబు బరిమార్చి బుద్ధిలతకున్ మారాకు హత్తించి ని**
**ష్ఖేద బ్రహ్మ పదావలంబన రతిన్ క్రీడించు యోగీంద్రు మ**
**ర్యాదన్ నక్రము విక్రమించె కరి పాదాక్రాంత నిర్వక్రమై" భా 2 -65**

ఇక్కడ కవి మొసలిని హఠయోగము సాధన చేస్తున్న సాధకునితో పోల్చాడు. హఠయోగమనగా గంభీతమైన ధ్యానస్థితి. సాధకుడు సాధన చేసేటపుడు అతని మనసు పలు రకాల ఆలోచనలకు గురవుతుంది. అయిన దానిని బలవంతంగా తీసుకువచ్చి సాధనలో నిమగ్నం చేయించడమే హఠయోగం. ఇక్కడ మొసలి హఠయోగి వల్ల తన బలాన్ని మనస్సును అంతటినీ ఏనుగు శరీరం మీద నిమగ్నం చేసి ఉంచిందని చెప్పడం కవి ఉద్దేశ్యం. తర్వాతి పద్యంలో కవి యోగదర్శనంలో ప్రధానమైన చక్రాలను, పృథుమహారాజు సాధనను ఇలా చెప్పాడు.

**" కోరి మడమలచే గుదపీడనము సేసి పూని ముక్తాసనాసీనుడగుచు**
**దనరు మూలాధారమున నుండి వాయువు నొయ్యన వెగయించి యొనర నాభి**
**కలితంబు గావించి క్రమమున హృద్వత్ప కంఠ శిరః కోష్ఠకముల జేర్చి**
**కైకొని మూర్ధభాగములకు నెగయించి ప్రాణముల్ విడిచి యాపవను బవను**
**నందు నాకాశ మాకాశమందు దేజ**
**మందు దేజంబు ముదకంబునందుముదక**
**మర్ది గాయంబు మేదినియందుగలిపె**
**బూనివాని యథోచిత స్థానములన్" భా 4-653**

దీనినే కుండలినీయోగమని కూడా అంటారు.యోగశాస్త్రం ప్రకారం మానవశరీరమునందు మూలాధార, స్వాధిష్టాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞ అనే ఆరు చక్రములన్నవి. కుండలినీ

అనగా పాము. ఇది ఒక శక్తి. ఇది మూలాధార చక్రమునందు మూడున్నర చుట్టలు చుట్టుకొని నిద్రాణమై ఉంటుంది. మానవుడు సాధన ద్వార ఆ శక్తిని జాగృతం చేయాలి. తర్వాత ఒక్కొక్క చక్రాన్ని దాని ద్వార భేదింప చేయాలి. ఒక్కోచక్రమును భేదించునపుడు ఒకో రకమైన సిద్ధులు కలుగుతాయి. సాధకుడు సిద్ధులకు పొంగకుండా సాధన కొనసాగించాలి. కుండలిని ఆరు చక్రములను భేదించి సహస్రారం లో ఉన్న పరమాత్మలో ఐక్యం అవుతుంది. అపుడు సహస్రారం నుండు అమృతవృష్టి కురుస్తుంది. దీని కారణంగా యోగి యొక్క 72000 నాడులు ఈ వృష్టిలో తడుస్తాయి. యోగి పరమాత్మస్వరూపుడవుతాడు. ఇదియే కుండలినీ యోగమనబడుతున్నది. తర్వాతి వచనంలో అభ్యాసవైరాగ్యాలు ఇలా చెప్పబడ్డాయి.

**" జ్ఞానవైరాగ్యంబులచేత బ్రహ్మనిష్టుండై మాయోపాధిం బాసి ముక్తుండయ్యనని చెప్పి వెండియు ఇట్లనియె" భా 654**

పృథమహారాజు తన శరీరంలోని పంచభూతాలను తమతమస్థానాలలో పునఃప్రతిష్టించి, మహత్తత్వాన్ని ప్రకృతిలో జ్ఞాబ్నవైరాగ్యాల చేత కలిపివేశాడని భావం. జ్ఞానవైరాగ్యాలు మనసును సాధించడానికి ఉపకరిస్తాయని పతంజలి తన యోగశాస్త్రంలో చెప్పాడు.ఇక్కడ కవి ప్రయోగించిన వైరాగ్యం వేదాంత సంబంధమైనది. క్లేశములలో ఒకటిగా చెప్పబడిన రాగము లేకుండడమే వైరాగ్యం. వైరాగ్యం సామాన్యం, ప్రచండం,స్మశానం అని మూడు రకాలు. ఇందులో ప్రచండ వైరాగ్యం ప్రముఖమైనది. ఇదే పృథుమహారాజుకు కలిగినది.

## 2. సాంఖ్యదర్శనం

భాగవతంలో గీతాచార్యుడు ఉద్ధాలకుని ఉద్ధరించాలని చేసిన బోధ సాంఖ్యదర్శనం. ఈ దర్శనమునకు యోగమునకు మధ్య అబేధము. ఆయితే సాంఖ్యము నిరీశ్వరము. యోగము సేశ్వరము (ఈశ్వరప్రణిధానాత్). ఈ సాంఖ్యమత విషయము గీతలోకూడ చెప్పబడినది. భాగవతంలో ఏకాదశ స్కంధంలో ఉద్ధాలకుడు భగవంతుని ఇలా ప్రశ్నించాడు.

**" ధ్యానంబేక్రియ నిలుచును?**
**ధ్యానంబేరీతి దగు? నుదాత్త చరిత్రా!**
**ధ్యానప్రకారమంత య**
**మానంబుగ జెప్పుమయ్య యుర్వీరమణా!"** భా 11-104

ఈ ప్రశ్నను, దాని వెనుక ఉన్న ఆంతర్యాన్ని గమనించిన భగవంతుడు అతనికి ఈ విధంగా సమాధానమిచ్చాడు.

**" అని యడిగిన నయ్యాదవేంద్రుండిట్లని పలుకం దొడంగె దారు మధ్యభాగంబున నవలంబు సూక్ష్మరూపంబున వర్తించు చందంబున నందంబై సకల శరీరులయందు నచ్ఛేద్యుండు, నదాహ్యుండు నశోష్యుండు నైనజీవుండు వశించియుండునని హరికి నుద్ధవుండిట్లనియె. సనకసనందనాది యోగీంద్రులకు యోగమార్గంబేరీతి నానతిచ్చితి. నది యే విధం? బానతీయవే? యని యభ్యర్థించిన నతండిట్లనియె. వారలు చతుర్ముఖు నడిగిన నతండు "నేనును దెలియ నేర" ననిన వారలు విస్మయంబందు చుండ నే నా సమయంబున హంసస్వరూపుడనై వారలకెరిగించిన తెరుంగు వినిమి: పంచేంద్రియంబులకు దృష్టంబయిన పదార్థంబనిత్యంబు.నిత్యదృష్టి బ్రహ్మంబని తెలియవలెను. దేహి కర్మార్జిత దేహుండై సంసారమమతల నిరశించి నిశ్చల జ్ఞాన యుక్తుండై మత్పద ప్రాప్తుండగు. స్వప్న లబ్ధపదార్థంబు నిజంబుగాని క్రియ కర్మానుభవ పర్యంతంబుకళేబరంబు వర్తించునని సాంఖ్య యోగంబున సనకాదుల కెరింగించిన విని బ్రహ్మమొదలైన దేవతలెరింగిరి. వారి వలన భూలోకంబున బ్రసిద్ధంబయ్యె."** భా 11–105

ఇందు సాంఖ్యదర్శ నమున ప్రధాన విషయములనదగిన ప్రకృతి, పురుషుల గురించి చెప్పబడింది. సాంఖ్యం ప్రకారం ప్రకృతి పురుషుల సంయోగం వలన మహత్తత్వం ముందావిర్భవించినది. దీని స్వరూపమధ్యవసాయము అనగా నిశ్చయము. మనుష్యుడు ఇంద్రియాలతో శరీరాన్ని గ్రహించి, సంకల్ప వికల్పాలతో ఒక సంశయానికి వస్తాడు. ఆ నిశ్చయమే బుద్ధి. సత్వబుద్ధి వలన ధర్మం, జ్ఞానము, ఆశ్చర్యం కలుగుతాయి. తమస్సంబంధం వలన అధర్మం, అజ్ఞానం, అనైశ్వర్యం, అవైరాగ్యం కలుగుతాయి. రజస్సు వలన ఇచ్ఛద్వేషప్రయత్నాదులు కలుగుతాయి. వీటిలో సాత్వికధర్మాలు ఉపధేయాలు. తామస ధర్మాలు పరిహరణీయములు. యాగాదుల వలన కలిగిన ధర్మం స్వర్గాభ్యుదయానికి సాధనం. అష్టాంగయోగం వలన కలిగిన ధర్మం మొక్షానికిదారి తీస్తుంది. వీటితోపాటు పాతన న్యాయదర్శనాంశాలను కూడ వాదముల సందర్భంలో ప్రస్తావించాడు. చాల చోట్ల వర్ణాశ్రమాలను, వాటి ప్రాముఖ్యతను, గృహస్థాశ్రమ అవసరాన్ని చాల చోట్ల వివరించాడు. ఈ విధంగా భాగవతంలో అనేక చోట్ల దర్శనాల తావులు కనపడతాయి.

RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 8 Monthly August 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



గురజాడ
అప్పారావు



గిడుగు రామ్మూర్తి






మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 18 - Issue. 8 - August 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు

వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు రామ్మూర్తి పంతులు. బహుబాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, హేతువాది. శిష్ట జన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషి చేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు రామ్మూర్తి 1860 సంవత్సరం ఆగష్టు 29న శ్రీముఖలింగం సమీపంలో ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు వీర్రాజు, వెంకమ్మ. తండ్రి వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేశారు. ఉద్యోగ రీత్యా విజయనగరం జిల్లా చోడవరం బదిలీ అవ్వడంతో గిడుగు విజయనగరం జిల్లా వాసిగా గుర్తింపు పొందారు. పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఓ వైపు ఉన్నత చదువులు అభ్యసిస్తూ చుట్టు ప్రక్కల నివసించే సవరజాతి ప్రజలతో పరిచయాన్ని పెంచుకున్నారు. సవర భాషలో వాచకాలు నిఘంటువులు తయారుచేశారు. నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి విద్యావంతులను చేయటం కోసం బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడారు. ఆయన పోరాట పటిమకు జేజేలు పలుకుతూ 'రావుసాహెబ్' బిరుదుతో సత్కరించారు. అప్పటి జె.ఎ. ఏట్స్ దొర ఆధ్వర్యంలో గురజాడ, గిడుగు, శ్రీనివాస అయ్యంగార్ ఈ నలుగురు ఆలోచనల వలన వ్యావహారిక భాషోద్యమం ప్రారంభమైంది. వీరికి వీరేశలింగం పంతులు ఊతం కూడా లభించింది. 1919-20 సంవత్సరాల మధ్య వ్యాహారిక భాషోద్యమ ప్రచారం కోసం 'తెలుగు' అనే మాస పత్రికను గిడుగు నడిపించాడు. ఈ పత్రికలో తన ఉపన్యాసాలను ప్రచురిస్తూ పోరాటం సాగించాడు. విశాఖ జిల్లా పర్యవేక్షణాధికారికగా వచ్చిన జె.ఎ. ఏట్స్ ఆలోచనలు గిడుగుని శిష్ట వ్యవహారికం వైపు నడిపించాయి.

తెలుగు భాషాభివృద్ధికి సమరశంభం పూరించిన ఆయన భాషలోకి సరళత్వాన్ని సామాన్యుల చెంతకు తీసుకెళ్ళారు. అమ్మ భాషకు కమ్మనైన అర్థంతోపాటు అందలాన్ని ఎక్కించిన భాషా భగీరథుడిగా పేరొందారు. భాషకు జీవం పోసిన గిడుగు భాషలో సరళత్వాన్ని, మాధుర్యాన్ని బయట ప్రపంచానికి చూపారు. అప్పటి వరకు మహా ఉద్దండులు వద్దనే ఉండిపోయిన అమ్మ భాష కమ్మదనం దశదిశలా వ్యాపించింది. ఆధునిక సాహితీ యజ్ఞంతో వాడుకలో అనేక ప్రయోగాలు చేసి తెలుగు జాతికి మార్గనిర్దేశం చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు పుట్టిన రోజునే మనం తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము. తెలుగు భాషకు పునరుజ్జీవనం చేసి గిడుగు 1940 సంవత్సరం జనవరి 20వ తేదీన పరమపదించారు.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | పగటివేషాలు - ప్రదర్శనారీతులు | - డా॥. ఎం. మునిరత్నం | 5 |
| 2. | వెలుగుబాటలో ఆధునిక సాహిత్యం | - డా॥. వి. అనిత | 14 |
| 3. | టెలివిజన్ ప్రసారాలు - భాషా స్వరూపం | - డా॥. వి.గోపాల్ | 18 |
| 4. | ప్రజాకవి సుంకర సత్యనారాయణ గేయ సాహిత్యం | - పాత శ్రీనివాసరావు | 22 |
| 5. | తెలుగు సాహిత్యంలో వ్యవసాయం | - ఆకుల లక్ష్మణ్ | 26 |
| 6. | తెలుగు గజల్ - కవి - కవితాత్మకత | - డా॥. నందిరెడ్డి పురుషోత్తమ రెడ్డి | 29 |
| 7. | నియోగి జీవితం - రచనల వైవిధ్యం | - నాగెల్లి ప్రభాకర్ | 31 |
| 8. | ప్రాంతీయ కథా సంకలనాలు - రచయిత్రుల పాత్ర | - పరుచూరి మౌనిక | 34 |
| 9. | మరుభూమిలో మల్లెతీగలు నవల - వేశ్యా స్త్రీల జీవిత చిత్రణ | - డా॥. కడియాల వెంకటరమణ | 37 |
| 10. | ఆధునిక కథాసాహిత్యం - కవులు, కథానికలు | - వి. వెంకటేశన్ | 42 |
| 11. | రాయలవారి యోగ దర్శన పాండిత్యం | - పతివాడ ధనంజయరావు | 46 |
| 12. | స్నేహలతా కవితాసంఘ ప్రస్తావన | - డా॥. సి. నర్సింహులు | 49 |
| 13. | మహిళా ఔన్నత్య ముకురం - మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ | - డా॥. జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి | 54 |
| 14. | ఆముక్త మాల్యద రాజనీతి | - పెరుగుపల్లి బలరామ్ | 60 |
| 15. | జానపద సంగీతం - ప్రాముఖ్యత | - గాదె చంద్రశేఖర్ | 63 |
| 16. | వేణుసంకోజు సాహిత్యం - పరిశీలన | - డా॥. జి. భాస్కర్ యాదవ్ | 65 |
| 17. | తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భవితవ్యం | - డా॥. చవ్వా వెంకటరెడ్డి | 69 |
| 18. | తెలుగు తమిళ తొలి నవలలు - సమాజం | - డా॥. కె.చంద్రశేఖరరావు | 73 |
| 19. | నన్నయ దేవయాని ఒక పరిశీలన | - మినుకూరి శ్రీనివాస్‌రెడ్డి | 89 |
| 20. | జానపద సామెతల్లో స్త్రీ | - సోనబోయిన సతీష్ | 92 |
| 21. | తెలుగు - వెలుగు | - డా॥. పెండ్యాల లావణ్య & డా॥. బూసి వెంకటస్వామి | 95 |
| 22. | Neglecting Women's Human Rights in Kondapalli... | - Dr. Venkata Ramaiah Gampa | 99 |
| 23. | The Impact of using Social Media on Academic.. | - Dr. Kotaiah Veturi | 103 |
| 24. | Aerobics Dance on Flexibility of High School Boys | - Dr. Jayakumar K. | 113 |
| 25. | Triggering theForest Memories of Kerala... | - Dr. Lekha Pillai | 117 |
| 26. | Pokkali Cultivation in An Environmental ... | - Dr. Sebastian Joseph & - JiyaTharian | 124 |
| 27. | Role of temples in the Social Formation of the .... | - Nisha Ann Jacob | 129 |
| 28. | Problem of TranslatingGoreti Venkanna's Songs ... | S Parsharamulu | 143 |
| 29. | Evolution of Film as a Source of History | - Dr. Sebastian Joseph & - RadhikaLal | 144 |
| 30. | Spoken Histories on Periyar : River, Life World.... | - Thara V M. & - Dr. Sebastian Joseph | 153 |
| 31. | Men in Shashi Deshpande's Roots and Shadows | - Prof. G. Sheela Swarupa Rani | 160 |
| 32. | Pandemics and the Colonial State in India.. | - Lijo Sebastian & - Dr. Sebastian Joseph | 166 |

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# రాయలవారి యోగ దర్శన పాండిత్యం

– పతివాడ ధనంజయరావు , పరిశోధక విద్యార్థి , తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు వారి కీర్తిని నలుదిశలా చాటిన సాహితీ సమరాంగణా సార్వభౌముడు రాయలు. కవనంలోనైనా, కథనంలోనైన రాయలవారికే వారే సాటి. ఇది చరిత్ర చెపుతున్న సత్యం. అయితే రాయలవారిలో అంతర్గతంగా ఉన్న మరొక అంశం తత్త్వం. ఔను రాయలవారు గొప్పతత్త్వవేత్త. భారతీయ తత్త్వశాస్త్రానికి మూలం అనదగ్గ ఆరు దర్శనాలపైన వారికి అపారమైన పాండిత్యం ఉన్నది. ఈ ప్రజ్ఞ వారి ఆముక్తమాల్యదలో ప్రస్ఫుటంగా కనపడుతున్నది. ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుని వాదనను పురష్కరించుకుని వారు ఆరు దర్శనాలను ఖండించారు. వారికి ప్రియమైన విశిష్టాద్వైతమతాన్ని స్థాపించారు. అయితే రాయలవారికి ఆరు దర్శనాలలోకి ప్రియమైనది యోగదర్శనం. అంతేకాదు వీరు తన దినచర్యలో భాగంగా మల్లయుద్ధము, కత్తిసాము, కఱ్ఱ సాములతో పాటు యోగము కూడా చేసేవారని మనకు రాయవాచకం ద్వార తెలుస్తున్నది. రాయలవారికి యోగ దర్శనం పై ఉండే అధికారం ఆముక్తమాల్యదలో ఇలా కనపడుతుంది.

## ఆముక్తమాల్యాద - యోగదర్శన ప్రభావము :

ప్రాచీన కవులందరికీ ఈ దర్శనముతో పరిచయ మున్నట్లు సర్వులకు విదితము. కాని రాయలవారు ఈ శాస్త్రంలో అపారమైన ప్రతిభ కలిగి ఉన్నారు. ఈ ప్రతిభ మిగిలిన కవులకంటే కాస్త ఎక్కువనే చెప్పాలి. ఖాండిక్య కేశిధ్వజి సంవాదంలో ఈ ప్రతిభ మరింత ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. ఉదాహరణకు

"ఆ కేశిధ్వజు డంత నా నృపునిరాజ్యం బెల్ల జేర న్ఫలం
బాకాక్షింపక గెల్తు మృత్యువు నవిద్య న్బుట్టకుందుం
దుదన్
జాకుందు న్వడి నంచు యోగనియతిం జ్ఞానాశ్రయుం
డై మఖా
నీకంబు ల్రచయించు చం దొకటికిం దీక్షించి తా
నున్న చోన్" ఆ 3-18

పై పద్యంలో కవి యోగశాస్త్రసంబంధమైన అవిద్య అనే పదాన్ని ఉటంకించాడు. "వృత్తి సారూప్యమిత్యత్ర" అనే సూత్రం ద్వార పతంజలి అవిద్య గురించి వివరించాడు. యోగమునందు మనసు లేని పురుషుడు ఇతర భౌతికవిషయాలపై మనసును సారిస్తాడు అని దీని అర్థం.

కంధర నీలవర్ణ! మధు కైటభనాగ సుపర్ణ! యోగి హృ
ద్గ్రంథి భిదోత్థ భోగి వనితాస్వనవచ్ఛ్వసన స్రవచ్చిర
స్సంధి వసన్నిశాపతీ రసస్రుతీ దుగ్ధపయోధి వీచికా
మంధర కెళికాదర! సమాశ్రితపంక్తి శిరోధి సోదరా!
5 వ ఆశ్వాసాంతము

ష్మంజనియించు అంజ నమాను వాయుగణ
మంతయు ఖంజిత చిక్కనజ్జవో
చిక్కని సమానపు వాయువులో నొకండు గ
ల్మింజనియించు దుర్యశము మేల్కని లేహనవేళ వాజు
లూర్పంజెడు మాణిబంధముకురంబులు కాళిమ పేర
గార్కొనున్ ఆ 2-28

పై పద్యాలలోని యోగశాస్త విషయమగాధము. దుగ్ధాంబోధి మహా గృహోత్సకుడు అనడంలో ఆంతర్యం వేరుగ ఉన్నది. ఈ బ్రహ్మాండంలో ఏదో ఒక చోట పాల సముద్రం ఉండటం నిజమే అయినప్పటికీ అదే పాల సముద్రము మనలోనూ ఉన్నదని, ఆ మహావిష్ణువు మనలోనూ వశించుచున్నాడని కవి భావన. ఇక్కడే కవి పిండాండ బ్రహ్మాండములకు అభేదము చెప్తున్నాడు. కుండలిని అనబడే శక్తి యోగి హృదయ గ్రంథులను బేధించి బుసులు కొడుతుంది. దాని కంపన మూలంగా స్రవిస్తున్నటువంటి చంద్రరసస్రావణమనే క్షీరసముద్రంలో కేళీలోలుడై ఉన్నవాడా అని దీని అర్థం. ఇది యోగశాస్త్ర

విషయం. పద్యంలో చెప్పిన గ్రంథి, కుండలిని, విశాపతి, రసస్రుతి, శిరస్సంధి లాంటి శబ్దాలు యోగశాస్త్ర సంకేతిక పదాలు. యోగశాస్త్రం ప్రకారం మానవ శరీరంలో మూడు గ్రంధులున్నవి. 1.బ్రహ్మగ్రంథి 2. విష్ణుగ్రంథి 3.రుద్రగ్రంథి అలాగే శరీరంలో ఆగ్న, విశుద్ధ, అనాహత, మణిపూర, స్వాధిష్టాన, మూలాధార అనబడే ఆరు చక్రములున్నవి. ప్రతి రెండు చక్రములకు ఒక గ్రంధి విభక్తమై ఉన్నది. మూలాధార స్వాధిష్టానముల మధ్య బ్రహ్మగ్రంథి, మణి పూర, అనాహత, విశుద్ధములకు మధ్య విష్ణు గ్రంధి, ఆగ్నా చక్రమునకు పైన రుద్రగ్రంధి కలవు. ఈ మూడు గ్రంధులలో మొదటిది అన్నమయ కోశము, రెండవది ప్రాణమయ కోశము, మూడవది మనోమయ కోశము.ఈ విధంగా ఈ గ్రంధులు త్రివిధ జీవాకృతులై స్థూల సూక్ష్మ కారణ శరీర మూర్తులై ఉన్నవి. ఈ గ్రంధులు, చక్రములు బేధింపబడినపుడే భగవంతుడు దర్శనమిస్తాడు. ఈ బేధనకు యోగమే శరణ్యం. యోగానుష్టానము వలన మనలో నిద్రావస్థలో ఉన్న కుండలినీ శక్తి జాగృదావస్థకు చేరుకుని షట్చక్రములను, గ్రంధిత్రయమును బేధించి సహస్రారంలోని చంద్రకళామృతాన్ని శ్రవింపచేస్తుంది. సహస్రారమందలి చంద్రకళామృతమే సుధాసింధువు. ఇది స్రవించడం వలననే మోక్షం కలుగును. దీనినే ఆది శంకరులు సుధాసింధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే అని దేవీ స్థానంగా కీర్తించారు. మరోచోట రాయలవారు పరుగిడుతున్న గుర్రాలను వర్ణిస్తూ

"మధురానగరమందలి యశ్వము లొక్క యంగలోనే సమానవాయుగణమును జయించెను. సమానమను పేరు గల వాయువొక్కటి మాత్రము జితము కాక కడుపులోనే చిక్కెను. దానివల్ల గుర్రాలకపయశస్సు కలిగినది".

ఆ 1-45

ఈ వచనంలో సమాన వాయుగణమన్న మాట ఉన్నది. ఈ వాయువులు యోగశాస్త్రప్రసిద్ధములు. యోగ శాస్త్రం ప్రకారం మానవ శరీరంలో 5 ముఖ్యవాయువులు, 5 ఉపవాయువులు ఉంటాయి. అవి నాగ, కూర్మ, కృకర, ధనంజయు, దేవదత్తములు. ఇవి శరీరంలోని పలుస్థానాల్లో నివాసముంటాయి. ప్రాణవాయువు హృదయంలోనూ, అపానవాయువు గుదస్థానమందు, వ్యానవాయువు మూపులయందు, ఉదానవాయువు పాదహస్తముల యందు, నమానవాయువు నర్వశరీరమందు అమరి ఉంటాయి. గుర్రాలు సామాన్యమైనగాలిని ఓడించ గలిగాయి గాని తమ శరీరమంతటా ఇమిడి ఉన్న సమానవాయువును ఓడించలేకపోయాయి. తమలోని ఉన్న సమానవాయును ఓడించాలంటే అవి మానుషజన్మ మెత్తి, యమనియమాదులతో కూడిన యోగసాధన చేయాలి. లేనిచో వాటికాశక్తి లభించదు. తిర్యక్కులు ఆ విధంగా చేయలేవు కాబట్టి గుర్రములకు సమాన వాయువును గెల్చుట అసాధ్యమని కవిభావం.మధురలోని చాతుర్వర్ణాలను గురించి చెపుతు రాయలవారు పంచ యమాలలో ఒకటైన అపరిగ్రహం గురించి వివరించారు.

చిరసముపార్జితాగ్ని తడిజెంది నశించు నటంచునో, కృతా
ధ్వరత దదగ్ని మై నునికి దాన నొకంగము తాచు చేతనో
పురధరణీశుల్నిగమ భూధరము ల్జపయజ్ఞ శీలు రా
హరి ధనదాదులైన వలహస్తము సాచరు దానధారకున్

ఆ 2-34

మధురాపురములో గల బ్రాహ్మణులు ఎవరి నుండి దానము గ్రహించరని దీని భావం. ఈ విధంగా ఎవరి దగ్గర నుండి ఏమి గ్రహించకుండా ఉండడాన్ని యోగ శాస్త్రంలో అపరిగ్రహం అంటారు. పతంజలి అపరిగ్రహం గురించి చెప్తూ

"అపరిగ్రహస్థైర్యే జన్మకథాంత సంబోధః" ప 2-39

అని నిర్వచించాడు. దానధర్మాలు గ్రహించకుండే అపరిగ్రహంలో సుస్థిరుడై ఉండే వ్యక్తికి పూర్వజన్మకు సంబంధించిన ఎరుక కలుగుతుందని పతంజలి ఉద్దేశ్యం. ఈ సిద్ధిని పొందటంకోసం ఆ పురములోని బ్రాహ్మణులు దానధారకు వలహస్తము సాచరు. ఇదే పద్యంలో వేదప్రోక్తమయిన విషయమున్నది. మన

పూర్వులు అగ్నికి ప్రాధాన్యతనిచ్చారు. అగ్ని అనగా వారి ఉద్దేశ్యం ప్రకారం కేవలం నిత్యావసరములకు వినియోగ పడేది మాత్రమే కాదు. ఇది భగవంతుని స్వరూపం. భగవంతుని భక్తుడిని హెూమక్రియ ద్వార దగ్గర చేసేది. ఇక్కడ అగ్ని అనే పదానికి అర్థం వేరుగా ఉన్నది. చాలకాలం పాటు జపతపహెూమాలు చేసి సంపాదించుకున్న పుణ్యం అనే అర్థంలో అగ్ని అనే పదం ప్రయుక్తమైనది.ఈ పుణ్యం ఎక్కడ దూరమవుతుందో అని అక్కడి బ్రాహ్మణులు దానం గ్రహించరని కవి భావం. రాయలవారి యోగదర్శన పాండిత్యం ఇంత లోతైనది. ఇన్ని రంగాలలో ఒకే వ్యక్తి ఉండగలగడం అనితర సాధ్యమైన విషయం. అందుకే రాయలవారికి రాయలవారే సాటి.

# ANDHRA LOYOLA COLLEGE

(AUTONOMOUS)
VIJAYAWADA - 520008, ANDHRA PRADESH, INDIA
ACCREDITED IN III CYCLE AT A+ GRADE WITH A CGPA OF 3.66/4.00

## DEPARTMENT OF ORIENTAL LANGUAGES

## Certificate of Participation

P. Dhananjay Rao , Ph.D Scholor, Telugu Deprtment of

University of Hyderabad

Participated in a 7 Day Online Faculty Development program on the theme of

**"TELUGU SAHITYA PRAKRIYALU; AADHUNIKA BODHANA, MULYANKANAM"**

from 5th August 2021 to 11th August 2021 Organised in collaboration with Telugu Academy, Govt. A.P.

| Rev.Fr. Dr. G.A.P. Kishore SJ | Dr. Kola Sekhar | Dr. R. Ravindra Bhass |
|---|---|---|
| Principal | H.O.D. of Oriental Languages | Dean of Humanities |

# లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల

ఉప్పల్, హైద్రాబాద్.
తెలుగు శాఖ
2021-2022

## తెలుగు భాషా దినోత్సవం

## ధృవీకరణ పత్రం

శ్రీ /శ్రీమతి /డా./ కుమారి PATHIVADA DHANANJAYA RAO తెలుగు భాషా దినోత్సవం **29 ఆగస్టు 2021**, లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల నిర్వహించిన గిడుగు రామ్మూర్తి గారి జయంతి వేడుకలలో భాగంగా జాతీయ అంతర్జాల సదస్సు లో పాల్గొన్నారు.

Neelima

శ్రీమతి నీలిమ
**తెలుగు శాఖాధిపతి**

డా .వడ్డేపల్లి శ్రీనివాస్ గారు
**నిర్వహణ మార్గదర్శి**

రెవరెండ్ బ్రదర్ విన్సెంట్ రెడ్డి
**ప్రధానాచార్యులు**

# NOT REQUIRED FOR INDAN LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 04